

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 21

శనివారం 13-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



విప్లవ సారథీ.. విజయీభవ

ఇంగ్లిష్ మీడియం.. జగన్ విజన్

యూపీ.. హస్తినకు గేట్‌వే

నేటి నుంచి 'సాక్షి' ఎన్నికల ప్రత్యేక సంచిక మీకోసం..


- వివరాలు I, II, III, IVలో



'కవితే సూత్రధారి, పాత్రధారి'

ఢిల్లీ మద్యం స్కాం కేసులో తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సూత్రధారి, పాత్రధారిగా సీబీఐ పేర్కొంది.

వివరాలు 2లో ▸



త్వరలో రాష్ట్ర హోదా

జమ్మూకశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని, శాసన సభ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు.


వివరాలు 6లో ▸



దాడికి సిద్ధమైన ఇరాన్!

ఇరాన్ వచ్చే 48 గంటల్లో ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడి చేసే అవకాశముందని వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది.

వివరాలు 6లో ▸



రికార్డుల ర్యాలీకి బ్రేక్

దేశీయ స్టాక్ సూచీలు ఒక శాతానికి పైగా పతనమయ్యాయి. సెన్సెక్స్ 793 పాయింట్లు నష్టపోయి 74,245 వద్ద స్థిరపడింది.

వివరాలు 15లో ▸

ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం విడుదల

6 నెలల కాలానికి రూ.45 కోట్ల జమ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మసీదులకు చెందిన ఇమామ్, మౌజన్లకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు గౌరవ వేతనం విడుదల చేసింది. 2023 అక్టోబర్ నుంచి 2024 మార్చి (ఆరు నెలలు) వరకు సంబంధించిన రూ.45 కోట్లను ఆయా మసీదుల ఖాతాలకు ఏపీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు జమ చేసింది. రంజాన్ పండుగ కానుకగా ఇమామ్, మౌజన్లకు 6 నెలల గౌరవ వేతనం ఇవ్వడంపై ఏపీ ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



గుంటూరు శివారు ఏటుకూరు వద్ద జరిగిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

మోసాలు కావాలా? మంచి కొనసాగాలా?

పాలకుడు మోసగాడు అయితే బతుకులు అంధకారం అవుతాయి: సీఎం జగన్

- మీరే నా స్టార్ క్యాంపైనర్లు..
- ప్రతి ఇంటికీ వెళ్లి మంచికి అండగా నిలబడమని కోరాలి
- చంద్రబాబుకు ఓటు వేయడమంటే.. మరోసారి మోసపోవడమే
- ఇంటికొస్తున్న పింఛన్లు ఆపిన వారితో జరుగుతున్న యుద్ధం ఇది
- అబద్ధాల బాబుకు దత్తపుత్రుడు, వదినమ్మ వంత పాట
- ముగ్గురూ కలిసి రోడ్లపై అబద్ధాల బుర్ర కథలు చెబుతున్నారు
- ఏటుకూరు మేమంతా సిద్ధం సభలో సీఎం వైఎస్ జగన్

10 లో

అభిమాన జల్లు

ఉదయం ఎండ.. సాయంత్రం వాన.. తగ్గని జనహోరు
పల్నాడు నుంచి ఏటుకూరు దాకా పోటెత్తిన జనప్రవాహం
తడిసి ముద్దయిన సభా ప్రాంగణం.. చెక్కు చెదరని జనసందోహం.. భోజన విరామం లేకుండా 9 గంటల పాటు సీఎం వైఎస్ జగన్ బస్సుయాత్ర

- వివరాలు 11లో



అమ్మాయిలదే హవా

ఇంటర్ ఫలితాలు విడుదల

- రెండో ఏడాదిలో 81 శాతం, మొదటి ఏడాదిలో 71% మంది బాలికల ఉత్తీర్ణత
- బాలురు, బాలికలు కలిపి మొత్తం 10,02,150 మంది పరీక్షలకు హాజరు
- 6,63,584 మంది ఉత్తీర్ణత
- మొదటి ఏడాది 67 శాతం, రెండో ఏడాది 78 శాతం ఉత్తీర్ణత.. 90 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో కృష్ణా జిల్లా
- 18 నుంచి 24 వరకు రీకౌంటింగ్‌కు అవకాశం.. మే 25 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

2 లో

సాగర్ కుడి కాలువకు మరో 3 టీఎంసీలు



- ప్రకాశం, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల తాగునీటి అవసరాల కోసం..
- కృష్ణా బోర్డుకు త్రిసభ్య కమిటీ సిఫార్సు
- త్వరలో కృష్ణా బోర్డు ఉత్తర్వులు జారీ చేసే అవకాశం

- వివరాలు 3లో

పథకాలన్నీ కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలి..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి,అమరావతి: వలంటీర్లు మళ్లీ ఇంటికే రావాలన్నా.. పథకాలన్నీ కొనసాగాలన్నా.. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి 175కి 175 అసెంబ్లీ స్థానాలు, 25కి 25 ఎంపీ స్థానాల్ని గెలిపించాలని సీఎం వైఎస్ జగన్ కోరారు. ఒక్కటి అంటే ఒక్కటి కూడా తగ్గకూడదంటూ శుక్రవారం ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు చేశారు.

'సాక్షి' ఆధ్వర్యంలో ఈఏపీసెట్, నీట్ విద్యార్థులకు మాక్‌టెస్టులు

- 22వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌లకు అవకాశం
- టెక్నాలజీ పార్ట్నర్‌గా వ్యవహరించనున్న 'మై ర్యాంక్'

సాక్షి ఎడ్యుకేషన్: అధికశాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్‌ను అందించే ఇంజినీరింగ్/మెడికల్ కోర్సుల్లో చేర్పించాలని కోరుకుంటున్నారు. అందుకు ఖర్చులకు వెనుకాడకుండా పిల్లలను కోచింగ్‌లో చేర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్.. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్/అగ్రికల్చర్ తదితర కోర్సుల్లో అడ్మిషన్ కల్పించే ఈఏపీసెట్‌కు లక్షల మంది విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు చేయూతనిచ్చేలా నిపుణుల ఆధ్వర్యంలో ఈఏపీసెట్, నీట్ పరీక్షలకు సాక్షి మాక్‌టెస్టులు నిర్వహించనుంది. టెక్నాలజీ పార్ట్నర్‌గా మై ర్యాంక్ వ్యవహరిస్తున్నది. పరీక్షకు కొద్ది రోజుల ముందు వాస్తవ పరీక్షలాంటి వాతావరణంలో జరిగే సాక్షి మాక్ టెస్టులు రాయడం ద్వారా విద్యార్థులు తమ ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకుని, ప్రిపరేషన్‌ను మరింత మెరుగుపరచుకోవచ్చు. ఆసక్తి గల అభ్యర్థులు https://www.arenaone.-in/mock ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్‌ఫీజు రూ.250. రిజిస్ట్రేషన్‌కు ఏప్రిల్ 22 చివరి తేదీ. రిజిస్టర్ చేసుకున్న ఈమెయిల్‌కు హాల్ టికెట్ నంబర్ వస్తుంది. ఏప్రిల్ 27వ తేదీన నీట్, ఏప్రిల్ 28న ఈఏపీసెట్ అగ్రికల్చర్,ఇంజనీరింగ్ పరీక్షలుంటాయి. ఈ ఆన్‌లైన్ టెస్ట్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఈ సమయంలో ఎప్పుడైనా పరీక్ష రాసుకోవచ్చు. పరీక్ష సమయం 3:00 గంటలు. ఈ పరీక్షలను మీ హాల్ టికెట్ నంబర్ (యూజర్ నేమ్), ఫోన్ నెంబర్ (పాస్‌వర్డ్)తో ఆ సమయంలో ఎప్పుడైనా లాగిన్ అయ్యి రాసుకోవచ్చు. అలాగే పరీక్ష ముగిసిన వెంటనే మీ స్కోర్‌ను కూడా చూసుకోవచ్చు. మాక్ పరీక్షలను https://sakshimocktest.myrank.co.in వెబ్‌సైట్‌లో నిర్వహిస్తారు. టెస్ట్‌కి సంబంధించిన కీ ని ఏప్రిల్ 30న ఇదే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన నంబర్లు: 95055 14424, 96660 13544, 96665 72244.

కవితే సూత్రధారి, పాత్రధారి

- కస్టడీ పిటిషన్‌లో సీబీఐ ఆరోపణ
- 5 రోజులు కస్టడీకి కోరగా 3 రోజులు అనుమతించిన న్యాయమూర్తి

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సూత్రధారి, పాత్రధారిగా సీబీఐ పేర్కొంది. ఆమె ఒకానొక సమయంలో శరత్ చంద్రారెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డిలను భయపెట్టినట్లు కోర్టుకు తెలిపింది. మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి కవితను ఐదు రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోరింది. సీబీఐ వాదనలతో ఏకీభవించిన రౌజ్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా మూడు రోజులపాటు కవితను సీబీఐ కస్టడీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు తిరిగి కవితను కోర్టులో హాజరు పరచాలని ఆదేశించారు. తీహార్ జైలులో ఉన్న కవితను శుక్రవారం అధికారులు ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. ఈడీ తరఫు న్యాయవాది పంకజ్ వాదనలు వినిపించగా, కవిత తరఫు సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు.

ఇదండీ జగత్



ఇక్కడ మాత్రం ఎప్పుడూ తగ్గే ఉంటున్నారు!

ఇంటర్ ఫలితాలు.. అమ్మాయిలదే హవా

రెండో ఏడాదిలో 81 శాతం, మొదటి ఏడాదిలో 71 శాతం మంది బాలికల ఉత్తీర్ణత

బాలురు, బాలికలు కలిపి మొత్తం 10,02,150 మంది పరీక్షలకు హాజరు

సాక్షి, అమరావతి/సాక్షి, నెట్‌వర్క్: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో అమ్మాయిలు సత్తా చాటారు. శుక్రవారం విడుదలైన మొదటి, రెండో ఏడాది ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. మార్చి ఒకటి నుంచి 20 వరకు నిర్వహించిన ఇంటర్ పరీక్షలకు బాలికలు, బాలురు కలిపి మొత్తం 10,02,150 మంది హాజరవగా 6,63,584 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 3,29,528 మంది (78 శాతం), మొదటి సంవత్సరం విద్యార్థులు 3,34,056 మంది (67 శాతం) ఉన్నారు. ఈ మేరకు ఫలితాలను శుక్రవారం తాడేపల్లిలోని ఇంటర్మీడియెట్ విద్యా మండలిలో కమిషనర్, కార్యదర్శి సౌరభ్ గౌర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వీవీ సుబ్బారావు సంయుక్తంగా విడుదల చేశారు. పరీక్షలు ముగిశాక కేవలం 21 రోజుల్లోనే ఫలితాలను వెల్లడించడం విశేషం. కాగా ఎప్పటిలాగే బాలికలే అత్యధిక శాతం ఉత్తీర్ణులయ్యారు. రెండో ఏడాదిలో 81 శాతం, మొదటి ఏడాదిలో 71 శాతం మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. బాలురు రెండో ఏడాది 75 శాతం, మొదటి సంవత్సరంలో 64 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం పెరిగింది. 2023 మార్చిలో ఇంటర్ మొదటి ఏడాది 4.33 లక్షల మంది పరీక్ష రాయగా 61 శాతం, ద్వితీయ సంవత్సరం 3.80 లక్షల మంది రాయగా 72 శాతం మంది పాసయ్యారు. మొత్తం మీద గతేడాది కంటే ఈసారి 6 శాతం ఉత్తీర్ణత మెరుగుపడింది. ఫలితాల్లో జిల్లాల వారీగా కృష్ణా మొదటి స్థానంలో (మొదటి సంవత్సరం 84 శాతం, ద్వితీయ సంవత్సరం 90 శాతం) సాధించగా, చివరి స్థానంలో అల్లూరి సీతారామరాజు (ఇంటర్ మొదటి ఏడాది), చిత్తూరు (రెండో ఏడాది) జిల్లాలు నిలిచాయి. ఫలితాలను https://resultsbie.ap.gov.inలేదా www.sakshieducation.comలో చూడవచ్చు.



పావనికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఒకేషనల్‌లోనూ బాలికలదే పైచేయి..

ఒకేషనల్ విభాగంలోనూ బాలికలే పైచేయి సాధించారు. మొదటి ఏడాది 70 శాతం, రెండో ఏడాది 80 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, బాలురు మొదటి ఏడాది 47 శాతం, రెండో ఏడాది 59 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా ఒకేషనల్ విభాగంలో బాలికలు, బాలురు కలిపి మొదటి సంవత్సరం మొత్తం 38,483 మంది పరీక్షలకు హాజరు కాగా 23,181 మంది (60 శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 32,339 మంది హాజరవగా 23 వేల మంది (71 శాతం) విజయం సాధించారు. ఒకేషనల్ విభాగంలో మొదటి, రెండో ఏడాది ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా మొదటి ఏడాది 77 శాతం, రెండో ఏడాది 83 శాతం ఉత్తీర్ణతతో టాప్‌లో నిలిచింది. చివరి స్థానంలో వైఎస్సార్ (మొదటి ఏడాది), పల్నాడు (రెండో ఏడాది) జిల్లాలు నిలిచాయి.

24 వరకు రీకౌంటింగ్‌కు అవకాశం

ఫలితాలకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఇంటర్ బోర్డుకు తెలియజేయాలని కార్యదర్శి సౌరభ్ గౌర్ కోరారు. ఈ నెల 18 నుంచి 24 వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. మే 25 నుంచి జూన్ 1 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేస్తామన్నారు. మార్కుల లిస్టులు డిజిలాకర్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇవి రెగ్యులర్ పత్రాలుగానే చెల్లుబాటవుతాయన్నారు.

విద్యార్థులకు తల్లిదండ్రులు అండగా ఉండాలి

ఉత్తీర్ణులు కానివారు ఆందోళన చెందొద్దని సౌరభ్ గౌర్ సూచించారు. గతంలో సప్లిమెంటరీ పరీక్షలు రాసి పాసైనవారికి 'కంపార్ట్‌మెంటల్' అని సర్టిఫికెట్‌పై వచ్చేదని, ఇప్పుడు దాన్ని రద్దు చేశామన్నారు. ఇకపై సప్లిమెంటరీ కూడా రెగ్యులర్‌తో సమానంగానే ఉంటుందన్నారు. ఫెయిలైన విద్యార్థులకు తల్లిదండ్రులు మనోధైర్యాన్ని అందించాలని సూచించారు.

బైపీసీలో విశాఖ అమ్మాయి పావనికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్

ఇంటర్ ఫలితాల్లో విశాఖ జిల్లా గాజువాక చైతన్య కళాశాల విద్యార్థి శరగడం పావని సీనియర్ ఇంటర్ బైపీసీలో 1000కి 991 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి ర్యాంకును దక్కించుకుంది. పావని తండ్రి నాగగంగారావు గంగవరం పోర్టులో ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చేయడమే తన లక్ష్యమని పావని తెలిపింది.

కిరణ్మయికి స్టేట్ సెకండ్ ర్యాంక్



ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం మూలగుంటపాడుకు చెందిన ఆలూరి కిరణ్మయి సీనియర్ ఇంటర్ బైపీసీలో 1000కి 990 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో సెకండ్ ర్యాంక్ దక్కించుకుంది. కిరణ్మయి విజయవాడలోని శ్రీ గోసలైట్స్ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివింది. కిరణ్మయి తండ్రి ఏవీ గిరిబాబు సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, తల్లి విజయశాంతి గృహిణి. ఎంబీబీఎస్ చదివి న్యూరాలజిస్ట్ కావాలన్నదే తన చిరకాల కోరిక అని కిరణ్మయి వెల్లడించింది.

జిల్లాలవారీగా ఉత్తీర్ణత శాతం..

జిల్లా	రెండో ఏడాది	మొదటి ఏడాది
కృష్ణా	90	84
గుంటూరు	87	81
ఎన్టీఆర్	87	79
విశాఖపట్నం	84	77
తూర్పు గోదావరి	83	75
తిరుపతి	81	70
నెల్లూరు	81	69
ఏలూరు	80	72
పశ్చిమ గోదావరి	80	69
అనంతపురం	78	60
పార్వతీపురం మన్యం	77	65
కర్నూలు	76	68
శ్రీ సత్యసాయి	76	58
పల్నాడు	73	65
కోనసీమ	72	60
ప్రకాశం	72	59
బాపట్ల	71	61
కాకినాడ	71	60
విజయనగరం	70	62
నంద్యాల	70	59
అల్లూరి సీతారామరాజు	70	48
వైఎస్సార్	69	55
అన్నమయ్య	69	53
శ్రీకాకుళం	67	57
అనకాపల్లి	66	52
చిత్తూరు	63	50

ఫలించిన ప్రభుత్వ కృషి.. దుమ్ములేపిన ప్రభుత్వ కళాశాలలు

- కార్పొరేట్ కళాశాలలను మించి అత్యుత్తమ ఫలితాలు
- వైఎస్ జగన్ ప్రభుత్వ చర్యలే కారణమంటున్న విద్యావేత్తలు



దీక్షిత(975)



బర్ల లలిత(435)



నిర్మల(421)

సాక్షి, అమరావతి/సాక్షి, నెట్‌వర్క్: ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు సత్తా చాటాయి. కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలను మించిన ఫలితాలను సాధించి ఔరా అనిపించాయి. వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకున్న చర్యలే ఇందుకు కారణమని విద్యావేత్తలు విశ్లేషిస్తున్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలను కల్పించిన ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలలను కూడా అభివృద్ధి చేసింది. వాటిలో చదువుకుంటున్న విద్యార్థులకు జగనన్న అమ్మఒడి పథకాన్ని అందించింది. ప్రతి మండలంలో ఒక జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ హైస్కూళ్లను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసి వాటిలో ఇంటర్మీడియెట్ కోర్సులను ప్రవేశపెట్టింది. దీంతో గతంలో మండల కేంద్రాల్లో కళాశాలలు లేక చదువుమానేసే విద్యార్థులకు తమ నివాసాలకు సమీపప్రాంతాల్లోనే కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే ఇంటర్మీడియెట్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక తరగతులు సైతం నిర్వహించింది. ఈ చర్యలన్నీ ఫలించి కార్పొరేట్ కళాశాలలు బిత్తరపోయేలా ప్రభుత్వ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులతో రికార్డులు సృష్టించారు.

టాపర్‌గా తహురా

అన్నమయ్య జిల్లా మదనపల్లె రాజీవ్‌నగర్‌కు చెందిన షేక్ రియాజ్ అలీ, షేక్ నూర్‌భాను కుమార్తె షేక్ తహురా స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఇంటర్ ఎంపీసీ చదివింది. తాజా ఫలితాల్లో 979 మార్కులతో టాపర్‌గా నిలిచింది.

- కృష్ణా జిల్లా మొవ్వలో క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల జనరల్ కోర్సుల్లో 91.26 శాతం, వృత్తి విద్యా విభాగంలో 92.9 శాతం ఉత్తీర్ణతను సాధించింది. కళాశాల విద్యార్థులు ఎన్.హర్షిత (ఎంఈసీ)968, శ్రీవిద్య(ఎంపీసీ) 963, పి.శ్రావ్య (బైపీసీ) 953 మార్కులతో సత్తా చాటారు. అలాగే అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన సెకండ్ ఇయర్ విద్యార్థిని ఎం.శ్వేత ఎంపీసీలో 951 మార్కులతో టాపర్‌గా నిలిచింది. చల్లపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు 92 శాతం, ఫస్టియర్ విద్యార్థినులు 87.5 శాతం ఉత్తీర్ణత సాధించారు.
- పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం కన్నపుదొరవలసకు చెందిన బర్ల లలిత ఇంటర్ ఫస్టియర్ బైపీసీలో 440కు 435 మార్కులు సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఆమె తల్లిదండ్రులు సుశీల, సంగమేష్ భవన నిర్మాణ కూలీలు. లలిత విజయనగరంలోని నెల్లిమర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతూ ఈ ఫలితాలను సాధించింది.
- ఏలూరు జిల్లా నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి హెచ్.అజయ్ రాజు సీనియర్ ఇంటర్ ఎంపీసీలో 985 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచాడు. అలాగే పెదపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని జి.కళ్యాణి ఎంపీసీలో 975 మార్కులతో ఏలూరు జిల్లాలో సెకండ్ ర్యాంక్ దక్కించుకుంది. బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్. కళ్యాణి ఎంఎల్‌టీలో 961 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచింది. నూజివీడు, కలిదిండి, ఆగిరిపల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం, నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కూడా మంచి ఫలితాలను సాధించాయి.
- చిత్తూరు జిల్లాలోని పెనుమూరు మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ ఎంపీసీ చదువుతున్న దీక్షిత 975 మార్కులతో సత్తా చాటింది. చిత్తూరు నగరంలోని పీసీఆర్ ప్రభుత్వ కళాశాలలో ద్వితీయ సంవత్సరం సీఈసీలో నందిని 966, ఎంపీసీలో నందిని 945 మార్కులతో దుమ్ములేపారు. అలాగే పలమనేరు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకుల కళాశాల, రామకుప్పం కళాశాల, చిత్తూరు ఏపీఎస్‌డబ్ల్యూఆర్, కుప్పం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాలల విద్యార్థులు కూడా అత్యుత్తమ మార్కులు సాధించారు.

బాల్య వివాహం నుంచి బయటపడి టాపర్‌గా..

కర్నూలు జిల్లా ఆలూరు కేజీబీవీలో ఇంటర్ ఫస్టియర్ బైపీసీలో 440కి 421 మార్కులు సాధించిన ఎస్.నిర్మల సమాజంతో పోరాడి గెలిచింది. ఈ బాలికకు గతేడాది బాల్య వివాహం జరిపిస్తుండగా జిల్లా యంత్రాంగం రక్షించి కేజీబీవీలో చేర్పించింది. ప్రభుత్వం అండగా నిలవడంతో నిర్మల చక్కగా చదువుకుని అత్యధిక మార్కులు సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్.. నిర్మలను ప్రత్యేకంగా అభినందించారు. ఐపీఎస్ అధికారి కావాలనే ఆమె కల సామాజిక న్యాయం, బాల్య వివాహాల నిరోధంపై ఆమెకున్న తిరుగులేని నిబద్ధతను ప్రతిబింబిస్తోందని ప్రశంసించారు.



తల్లిదండ్రులతో షేక్ తహురా

ఏపీ మోడల్ స్కూల్స్ అదుర్స్..

ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాల్లో ఏపీ మోడల్ స్కూళ్ల విద్యార్థులు సంచలనాలు సృష్టించారు. గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించడంతో పాటు అధిక మార్కులు సొంతం చేసుకున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలోని 162 ఏపీ మోడల్ స్కూల్స్ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం 10,121 మంది పరీక్షలకు హాజరవగా 6,244 మంది (62 శాతం) ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఇంటర్ సెకండియర్ 9,896 మంది పరీక్షలకు హాజరవగా 7,017 మంది (71 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. నంద్యాల జిల్లా మిడ్తూరు, అనంతపురం జిల్లా రాప్తాడు, ప్రకాశం జిల్లా దర్శి, నెల్లూరు జిల్లా నందవరం, శ్రీకాకుళం జిల్లా రాజపురం మోడల్ స్కూళ్లు సంచలన ఫలితాలను సాధించాయి.

కేజీబీవీలు కేక

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) సైతం ఈసారి ఇంటర్ ఫలితాల్లో దుమ్ములేపాయి. కర్నూలు జిల్లా గూడూరు కేజీబీవీలో ఫస్టియర్ విద్యార్థిని జి.విజయలక్ష్మి(ఎంపీసీ) 462/470 మార్కులతో సత్తా చాటింది. సీఈసీలో వి.నాగేశ్వరి 459, అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్‌లో యు.మానస 495, కంప్యూటర్ సైన్స్‌లో ఎం.యమున 494, ఎస్.హాజీరాభాను 490 మార్కులు సాధించారు. సెకండియర్ ఫలితాల్లో మార్కాపురం కేజీబీవీ విద్యార్థి జి.లక్ష్మి అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్‌లో 980, విజయనగరం జిల్లా వేపాడ విద్యార్థిని కంప్యూటర్ సైన్స్ డిప్లొమాలో 978, పల్నాడు జిల్లా నకరికల్లు విద్యార్థిని జె.లక్ష్మీప్రసన్న (ఎంపీసీ) 978, శ్రీకాకుళం కేజీబీవీ విద్యార్థిని బి.హేమలత (ఎంపీసీ) 973, నర్సీపట్నం కేజీబీవీ విద్యార్థిని వి.నాగలక్ష్మి (బైపీసీ) 973 మార్కులతో రికార్డు సృష్టించారు. శాంతిపురం కేజీబీవీలో సీఈసీ ప్రథమ సంవత్సరం మాధవి 500కు 480, కేజీబీవీ కుప్పంలో జయంతి 500కు 473 మార్కులు సాధించారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన గురుకుల విద్యార్థులు

- రాష్ట్ర సగటు ఉత్తీర్ణత శాతానికి మించిన ఫలితాలు
- బీసీ గురుకులాల్లో మొదటి ఏడాది 92.38%, రెండో ఏడాది 95.13%

సాక్షి, అమరావతి: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఏపీ గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. ఇందుకు సంబంధించి ఆయా గురుకులాల కార్యదర్శులు శుక్రవారం వేర్వేరుగా ప్రకటన విడుదల చేశారు. ఇంటర్‌లో రాష్ట్ర సగటు ఉత్తీర్ణత శాతాన్ని మించిన ఫలితాలు మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ గురుకులాల విద్యార్థులు సాధించినట్లు కార్యదర్శి కృష్ణమోహన్ తెలిపారు. రాష్ట్రంలో 18 బీసీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ మొదటి సంవత్సరం 92.38% ,రెండవ సంవత్సరంలో 95.13% ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. మొదటి ఏడాది 1,667 మందిలో1,540 మంది, రెండవ ఏడాది 1,337 మందిలో 1,272 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ (బాలికలు), కృష్ణా జిల్లా మోపిదేవి (బాలురు) బీసీ రెసిడెన్షియల్ కాలేజీలు 100% ఉత్తీర్ణత సాధించాయన్నారు. జూనియర్ ఇంటర్‌లో తిరుపతి జిల్లా కోట (బాలురు), సత్యసాయి జిల్లా గుడిబండ(బాలికలు) రెసిడెన్షియల్ కాలేజీలు 100% ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాలకు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరంలో 80.71%, రెండవ సంవత్సరం 85.40% ఉత్తీర్ణత సాధించినట్లు కార్యదర్శి ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. మొదటి ఏడాది 9,209 విద్యార్థుల్లో 7,452 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కృష్ణా జిల్లా ఈడుపుగల్లు గురుకుల విద్యార్థి కె.నీలిమా 464/470 మార్కులతో ప్రథమ స్థానంలోను, తిరుపతి జిల్లా సత్యవేడు గురుకుల విద్యార్థిని వి.రోజా, కర్నూలు జిల్లా చినటేకూరు గురుకులానికి చెందిన ఎంఎస్ కార్తీకరెడ్డి 463/470 ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 9,670 విద్యార్థుల్లో 8,228 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరంలో తిరుపతి జిల్లా సత్యవేడు గురుకుల విద్యార్థి 986/1000 ప్రథమ స్థానంలోను, శ్రీకాకుళం జిల్లా కొల్లివలస గురుకుల విద్యార్థి ఎ.కరుణాసాగర్, నెల్లూరు జిల్లా కోడూరు గురుకుల విద్యార్థి జి.శరణ్య ప్రియ 982/1000 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వివరించారు.

ఎస్టీ గురుకులాల్లో..

ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల్లో ఇంటర్ మొదటి ఏడాది 78.46%, రెండో ఏడాది 86.70% ఉత్తీర్ణత సాధించినట్లు కార్యదర్శి సదా భార్గవి తెలిపారు. ఇంటర్ మొదటి ఏడాది 4,470 విద్యార్థుల్లో 3,507 మంది, రెండవ ఏడాది 4,016 విద్యార్థుల్లో 3,482 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. మొత్తం 40 గిరిజన సంక్షేమ గురుకులాల్లో (ఇంటర్ రెసిడెన్షియల్ కాలేజీ)10 సంస్థలు 100%,11 సంస్థలు 90 శాతానికిపైగా ఉత్తీర్ణత ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా విజయపురిసౌత్‌లోని ఏపీఆర్ జూనియర్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఐఎస్వీ ప్రసాద్ ఎంపీసీ విభాగంలో 971, బైపీసీలో ఆర్.హర్షవర్ధన్ 967 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో వి.నర్సింహారెడ్డి 459 మార్కులు, బైపీసీలో టి.హర్ష నిఖిల్ 434 మార్కులు సాధించాడు.

ఆదిత్య ప్రతిభ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో తమ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 465 మార్కులు ఏడుగురు, 464 మార్కులు 20 మంది పొందారని పేర్కొన్నారు. బైపీసీలో 435, 434 మార్కులు, ఎంఈసీలో 489 మార్కులు సాధించారని తెలిపారు. అలాగే సీనియర్ ఎంపీసీలో 990, 989, బైపీసీలో 986, ఎంఈసీలో 978 మార్కులు పొంది తమ విద్యార్థులు ప్రతిభ చూపారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి దీపక్ రెడ్డి, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, కో–ఆర్డినేటర్ లక్ష్మీ కుమార్, డైరెక్టర్లు గంగిరెడ్డి, రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్ మెయినా అభినందించారు.

శ్రీచైతన్య విజయకేతనం

విజయవాడ: ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో తమ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని శ్రీ చైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ బొప్పన తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో చింటు రేవతి రాష్ట్రస్థాయిలో 467 మార్కులు సాధించారని చెప్పారు. బైపీసీలో 440 మార్కులకు గాను టి.దివ్య రాష్ట్రస్థాయిలో 436 మార్కులు తెచ్చుకున్నారని తెలిపారు. అలాగే సీనియర్ ఎంపీసీలో ఎ.వి.దుర్గామధులిక 1000 మార్కులకు గాను 992 మార్కులతో స్టేట్ ఫస్ట్ వచ్చారని తెలిపారు. అలాగే బైపీసీలో ఎస్.పావని 991 మార్కులతో స్టేట్ ఫస్ట్ సాధించినట్లు చెప్పారు.

శ్రీప్రకాష్ విజయభేరి

తుని: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారని ఆ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో ఎంపీసీ ద్వితీయ ఏడాది విద్యార్థిని టి.వెన్నెల 982/1000, డీడీ సాయి శ్రీనివాస్ 980/1000, బైపీసీలో కె.లాస్య నందిని 979/1000 మార్కులతో అగ్రస్థానం సాధించారని పేర్కొన్నారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరం డీవీఎల్ సాయి నిహారిక 464/470, ఎస్.మేఘన 463/470, బైపీసీలో జి.వర్షిణి 428/470 మార్కులు పొందారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత నరసింహారావు, కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అభినందించారు.

నారాయణ జయకేతనం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో తమ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను పి.మేఘన 467, కె.ప్రసన్న 466 మార్కులు పొందారని పేర్కొన్నారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను 435 మార్కులు 14 మంది సాధించారని తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో 1000 మార్కులకు గాను 991, 991 టాప్ మార్కులు సాధించినట్లు చెప్పారు. బైపీసీలో 988 మార్కులతో అగ్రస్థానంలో నిలిచినట్లు చెప్పారు.

సత్తా చాటిన శశి

ఉండ్రాజవరం: ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ శుక్రవారం తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు ఎం.నవ్యశ్రీ 990, బి.పార్వతి, కె.లిఖిత 989 మార్కులు సాధించారని చెప్పారు. బైపీసీ విభాగంలో 1000 మార్కులకు కేఎస్ సాయి శివాని 987, ఎండీ అబ్దుల్ జాఫర్ 985 మార్కులు పొందారని తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను ఎం.లీలాకృష్ణారెడ్డి, డి.దుర్గా కౌసల్య 466, ఎస్‌కే ఇర్ఫాత్, బి.సహస్ర, బి.షన్మిత, టి.మనోజ్ఞ 465 మార్కులు తెచ్చుకున్నారని తెలిపారు. బైపీసీలో 440 మార్కులకు టి.కీర్తి, పీవీ హసని, వి.ఖ్యాతి, ఎం.నిస్సి, సీహెచ్ తేజస్వి 435 మార్కులు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను శశి విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ బూరుగుపల్లి లక్ష్మీసుప్రియ అభినందించారు.

తిరుమల విద్యాసంస్థల ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470కి 466 మార్కులు 12 మంది సాధించారని చెప్పారు. బైపీసీలో 440కి 436 మార్కులు నలుగురు తెచ్చుకున్నారని తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను ఇద్దరికి 990 మార్కులు వచ్చాయని తెలిపారు. బైపీసీలో 1000 మార్కులకు గాను నలుగురు 989 మార్కులు పొందారని నున్న తిరుమలరావు వివరించారు.

'విజ్ఞాన్' విజయభేరి

చేబ్రోలు: ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విజ్ఞాన్ విద్యా సంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ తెలిపారు. గుంటూరు జిల్లా వడ్లమూడి విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్స్ జె.మోహనరావు, వై.వెంకటేశ్వరరావు తెలిపారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులు కె.లీలావతి (989), జి.వైశాలి (988), ఎం.స్నేహ (987), ఎస్కే.మీరావలి (987), కె.వంశీక్రిష్ణ (987), టి.సంజయ్ తేజ (986), సీహెచ్ మనస్వి (986), టి.సంజయ్ తేజ (986) మార్కులు సాధించారని తెలిపారు. ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో వి.కౌశిక్ (466), జీవీపి తేజస్వి(464), వై.పార్థసారథి(464), జె.హేమంత్ సందీప్(464), కె.విష్ణువర్ధన్(464), ఆర్.శ్రీకాంత్(464), ఎం.అఖిలేష్ (464), ఎం.హర్ష వర్ధన్(464) మార్కులు సాధించారని చెప్పారు.

సత్తా చాటిన భాష్యం

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో భాష్యం విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో భాష్యం ఐఐటీ–జేఈఈ అకాడమీ విద్యార్థులు ఎం. హేమ ప్రియ హాసిని, జి సాయి మనోజ్ఞ 470 మార్కులకు 466 సాధించారని పేర్కొన్నారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో జి.చంద్రలేఖ్య వెయ్యి మార్కులకు గాను 990 మార్కులు, బి.అభిజ్ఞ, ఎం.లహరి పి.సాయి మనోజ్ఞ, కె.వినోదిని 988 మార్కులు సాధించినట్లు చెప్పారు. జూనియర్ బైపీసీలో భాష్యం మెడెక్స్ విద్యార్థులు ఎల్.నవ్య, షేక్ నసీమా 440కి 436 మార్కులు సాధించారని పేర్కొన్నారు. సీనియర్ బైపీసీలో ఎం.హాసిని లాలిత్య, ఇంటూరి యోషిత వెయ్యి మార్కులకు 985, శ్రీషా 984 మార్కులు సాధించినట్లు తెలిపారు.

శ్రీగోసలైట్స్ విద్యార్థుల ప్రతిభ

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఇంటర్ ఫలితాల్లో శ్రీ గోసలైట్స్ జూనియర్ కళాశాలకు చెందిన బైపీసీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి తమ ప్రతిభను కనబరిచారు. సీనియర్ ఇంటర్ విద్యార్థిని ఆలూరు కిరణ్మయి 990/1000 మార్కులతో రాష్ట్రంలో సెకండ్ టాప్, కృష్ణాజిల్లాలో సెకండ్ టాప్‌లో నిలిచింది. అలాగే జూనియర్ ఇంటర్ విద్యార్థిని ఇంజమూరి హరిచందన 435/440 మార్కులతో రాష్ట్రంలో సెకండ్ టాప్‌లో, కృష్ణాజిల్లాలో సెకండ్ టాప్‌లో నిలిచింది. ఈ సందర్భంగా శ్రీ గోసలైట్స్ చైర్మన్ నరేంద్ర బాబు మాట్లాడుతూ ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

శ్రీవిశ్వశాంతి విజయం

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఇంటర్ ఫలితాల్లో కృష్ణాజిల్లా ఉయ్యూరుకు చెందిన శ్రీవిశ్వశాంతి విద్యార్థులు మంచి ఫలితాలను సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో ద్వితీయ సంవత్సర విద్యార్థులు అత్యధికంగా 988, 984, 984, 982, 982, 981 మార్కులను సాధించారు. అదే విధంగా ప్రథమ సంవత్సర విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 465, 464, 464, 463, 463, 463, 463, 462, 462, 462, 462, 462 మార్కులు పొందారు. ఈ ఘన విజయాలు సాధించిన విద్యార్థులను శ్రీ విశ్వశాంతి విద్యా సంస్థల అధినేత మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు, డైరెక్టర్ మాదల సూర్యశేఖర్ అభినందించారు.

రామోజీ ఆర్థిక ఉగ్రవాదే కాదు..
దేశద్రోహి కూడా!

- విదేశాల నుంచి అక్రమ పెట్టుబడులతోనే రామోజీ వ్యాపార సామ్రాజ్యం
- మార్గదర్శి, ఈనాడు, డాల్ఫిన్ హోటల్స్‌లో జీజే రెడ్డి పెట్టుబడులు!
- ఆ నిధులన్నీ విదేశాల నుంచి అక్రమంగా తెచ్చినట్లు వెల్లడి
- అప్పట్లోనే జీజే రెడ్డిపై దేశద్రోహం కేసు
- దేశం విడిచి పారిపోయిన జీజే రెడ్డి
- ఆయన ఆస్తులు స్వాధీనం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం
- ఆయన పేరిట మార్గదర్శిలో ఉన్న షేర్లను అప్పగించని రామోజీ
- వాటిని తన కుటుంబంపేరిట బదిలీ చేసుకున్న రామోజీ
- విభ్రాంతి కలిగిస్తున్న రామోజీ అవినీతి విరాట్ స్వరూపం



గురివింద రామోజీ

సాక్షి, అమరావతి: ఈనాడు రామోజీరావు ఆర్థిక ఉగ్రవాదే కాదు.. దేశ ద్రోహి కూడా అన్న విషయం బయటపడింది. ఏడు దశాబ్దాలుగా ఆయన సాగిస్తున్న ఆర్థిక అక్రమాల వెనుక దేశ ద్రోహం వంటి తీవ్రమైన నేరాలు కూడా ఉండటం సంచలనంగా మారింది. విదేశాల నుంచి అక్రమంగా తెచ్చిన నిధులే పునాదిగా రామోజీ వ్యాపార సామ్రాజ్యం విస్తరించిందన్న విషయం వెలుగులోకి వచ్చింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్, ఈనాడు, డాల్ఫిన్ హోటల్స్ ఇలా అన్నింటిలోనూ అక్రమ పెట్టుబడులు, ఆర్థిక మోసాల దందా దాగుందన్నది స్పష్టమైంది.

రామోజీ దేశద్రోహం

అనంతర కాలంలో జీజే రెడ్డిపై దేశద్రోహం కేసు నమోదైంది. దాంతో ఆయన దేశం విడిచి పారిపోయారు. కానీ ఈ కేసు విషయంలో ఆయన ప్రధాన ప్రమోటర్‌గా ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను మాత్రం కేంద్ర ప్రభుత్వం విచారించకపోవడం గమనార్హం. జీజే రెడ్డి దేశం విడిచి పారిపోయిన తరువాత ఆయన ఆస్తులను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. కానీ, మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో ఆయన పేరిట ఉన్న 288 షేర్లను రామోజీరావు కేంద్ర ప్రభుత్వానికి సరెండర్ చేయలేదు. చట్టానికి వ్యతిరేకంగా తన వద్దే అట్టిపెట్టుకున్నారు. అది తీవ్రమైన దేశ ద్రోహ నేరం. అంతేకాదు జీజే రెడ్డి దేశం విడిచిపారిపోవడానికి రామోజీ సహాయం చేశారని కూడా అప్పటి పరిణామాలను నిశితంగా పరిశీలించిన వారు చెబుతుండటం గమనార్హం. ఆ కేసులో ఇతర నిందితులు ఈమేరకు వాంగ్మూలం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

ఈనాడు, డాల్ఫిన్ హోటల్స్‌లోనూ జీజే రెడ్డి పెట్టుబడులు!

రామోజీరావు ప్రధాన వ్యాపార సంస్థలైన ఈనాడు పత్రిక, డాల్ఫిన్ హోటల్స్‌లోనూ జీజే రెడ్డి పెట్టుబడులు పెట్టారని బలమైన వాదన ఉంది. జీజే రెడ్డి 1963లోనే రామోజీరావుతో ఎలైట్ అనే ఇంగ్లిష్ పత్రికను పెట్టించారని, ఆ తర్వాత ఈనాడు పత్రిక ప్రారంభానికి కూడా ఆయన పెట్టుబడి పెట్టారని ఆనాటి ఈనాడు సంస్థ ఉద్యోగులే చెప్పడం గమనార్హం. కమ్యూనిస్టు కార్డును ఉపయోగించి రష్యా నుంచి ప్రింటింగ్ యంత్రాలు తెప్పించి ఈనాడు పత్రికను ప్రారంభించడంలో జీజే రెడ్డి కీలకంగా వ్యవహరించారు. ఈనాడు స్థాపన సమయంలో పెట్టుబడులపై కూపీ లాగితే విదేశాల నుంచి అక్రమ నిధుల బాగోతం బయటపడుతుంది. 1960లలో రష్యా నుంచి తెచ్చిన నిధులను ఈనాడు, డాల్ఫిన్ సంస్థల్లో పెట్టుబడిగా పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. రష్యా నుంచి అక్రమంగా నిధుల తరలింపు విషయంలో జీజే రెడ్డిపై అప్పటి కేంద్ర ప్రభుత్వం దేశ ద్రోహ నేరం కింద కేసు పెట్టింది. అలా అక్రమ నిధులు పెట్టుబడిగా పెట్టిన ఈనాడు, డాల్ఫిన్ హోటల్స్, వాటి యజమాని రామోజీరావుపైనా దేశ ద్రోహ నేరం నమోదు చేయాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

రామోజీ వాటా 100 షేర్లే... జీజే రెడ్డి పేరిట 288 షేర్లు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చైర్మన్ చెరుకూరి రామోజీరావు. ఆ సంస్థపై సర్వాధికారాలు ఆయన కుటుంబానివేనని అందరూ భావిస్తారు. కానీ అసలు మార్గదర్శి సంస్థను ఏర్పాటు చేసిందే రామోజీ స్నేహితుడు జీజే రెడ్డి అని, దానిని ఏర్పాటు చేసే నాటికి రామోజీరావు షేర్లకంటే జీజేరెడ్డి షేర్లు చాలా రెట్లు ఎక్కువ అనే విషయాన్ని ఇన్నాళ్లూ గోప్యంగా ఉంచారు. 1960ల నాటికే జీజే రెడ్డి ఢిల్లీలో బాగా పరపతి ఉన్న వ్యక్తిగా గుర్తింపు పొందారు. కొండపల్లి సీతారామయ్య సిఫార్సుతో ఆయన రామోజీరావుకు తన సంస్థలో గుమస్తాగా ఉద్యోగం ఇచ్చారు. అనంతరం వారిద్దరూ కలిసి 1962లో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను స్థాపించారు. ఆ సంస్థకు జీజే రెడ్డి ప్రధాన ప్రమోటర్. 1962 ఆగస్టు 31 నాటికి హైదరాబాద్‌లోని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ రికార్డుల ప్రకారం రామోజీరావు ప్రారంభ వాటా కేవలం రూ.10 మాత్రమే. ఆయన సోదరుడు విశ్వనాథం పేరిట మరో వాటా ఉంది. ఇక 1960–70లలో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో రామోజీరావు పేరిట ఉన్నవి కేవలం 100 షేర్లు మాత్రమే. కానీ జీజే రెడ్డి పేరిట 288 షేర్లు ఉండటం విశేషం. అంటే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో ప్రధాన వాటాదారు జీజే రెడ్డే.

జీజే రెడ్డి కుటుంబాన్ని మోసం చేసిన రామోజీ

1986లో జీజే రెడ్డి మరణానంతరం ఆయన ఇద్దరు కుమారులు తమ తండ్రి పేరిట ఉన్న 288 షేర్ల వాటాను తమ పేరిట బదిలీ చేయమని కోరితే రామోజీ ససేమిరా అన్నారు. జీజే రెడ్డి ఇద్దరు కుమారులు యూరి రెడ్డి, మార్టిన్ రెడ్డిలను తుపాకితో బెదిరించారు. జీజే రెడ్డి పేరిట ఉన్న 288 షేర్లను ఫోర్జరీ సంతకాలతో తన కోడలు శైలజ కిరణ్ పేరిట బదిలీ చేశారు. దీనిపై ఆయన కుమారులు ఇచ్చిన ఫిర్యాదుతో సీబీడీ కేసు నమోదు చేసింది. మరోవైపు జీజే రెడ్డి కుటుంబం తమ వాటా షేర్ల కోసం న్యాయ పోరాటం కూడా చేస్తోంది.

టోఫెల్‌కు 11.74 లక్షల మంది హాజరు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన టోఫెల్ జూనియర్ ప్రిపరేటరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం జూనియర్ విభాగంలో 16,52,142 మందికి గాను 11,74,338 మంది (70 శాతం) విద్యార్థులు హాజరైనట్టు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కాగా, 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఈనెల 10వ తేదీన నిర్వహించిన టోఫెల్ ప్రైమరీ పరీక్షను 4,17,879 మంది (92 శాతం) విద్యార్థులు రాశారు. ఈటీఎస్ సంస్థ పంపించిన ప్రశ్నపత్రాలు, ఆడియో క్లిప్పుల ఆధారంగా విద్యార్థులకు రీడింగ్, లిజనింగ్ విభాగాల్లో పరీక్ష నిర్వహించారు. ప్రైమరీ, జూనియర్ విభాగాల్లో 21 లక్షల మంది విద్యార్థులకు టోఫెల్ నిర్వహించాలని కార్యాచరణ రూపొందించగా, 90 శాతం మంది హాజరైనట్టు అధికారులు ప్రకటించారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అమెరికాకు చెందిన ఈటీఎస్ సంస్థ సర్టిఫికెట్లను ప్రదానం చేస్తుంది.

సాగర్ కుడి కాలువకు మరో 3 టీఎంసీలు

కృష్ణా బోర్డుకు త్రిసభ్య కమిటీ సిఫార్సు

సాక్షి, అమరావతి: ప్రకాశం, పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ కుడి కాలువకు మరో 3 టీఎంసీలు కేటాయించాలని కృష్ణా బోర్డుకు త్రిసభ్య కమిటీ సిఫార్సు చేసింది. కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న త్రిసభ్య కమిటీ శుక్రవారం హైదరాబాద్‌లో సమావేశమైంది. ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, తెలంగాణ ఈఎన్‌సీ అనిల్‌కుమార్ ఈ సమావేశానికి హాజరయ్యారు. కేటాయించిన నీటి కంటే 8.66 టీఎంసీలు అధికంగా వాడుకుంటూ తెలంగాణ ప్రభుత్వం ఏపీ హక్కులను కాలరాస్తోందని ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ వ్యవహారంపై బోర్డుకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాలువకు ప్రస్తుతం విడుదల చేస్తున్న 5 టీఎంసీలకు అదనంగా మరో 3 టీఎంసీలు విడుదల చేయాలని ఈఎన్‌సీ నారాయణరెడ్డి చేసిన ప్రతిపాదనకు త్రిసభ్య కమిటీ కన్వీనర్ డీఎం రాయ్‌పురే అంగీకరించారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం 8.5 టీఎంసీలు కేటాయించాలని తెలంగాణ ఈఎన్‌సీ చేసిన విజ్ఞప్తికి కూడా కమిటీ సానుకూలంగా స్పందించింది. త్రిసభ్య కమిటీ చేసిన సిఫార్సుల ఆధారంగా రెండు రాష్ట్రాలకు నీటిని విడుదల చేస్తూ బోర్డు ఉత్తర్వులు జారీ చేయనుంది.

హమ్మయ్య... కాస్త ఉపశమనం

- ఉత్తర కోస్తా, రాయలసీమల్లో తేలికపాటి వర్షాలు
- తీవ్రత తగ్గిన వడగాలులు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో గణనీయంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు దడపుట్టిస్తున్న తరుణంలో కాస్త ఉపశమనం కలిగేలా రానున్న రెండురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. అయితే ఈ వర్షాలు ఉత్తర కోస్తా, రాయలసీమల్లోనే తప్ప దక్షిణ కోస్తాంధ్రలో అంతగా కురిసే అవకాశాలు లేవు. ఉత్తర కోస్తాలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. అదే సమయంలో ఆయా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉందని పేర్కొంది. మిగిలిన జిల్లాల్లో వేడి, తేమ, ఉక్కపోతతో అసౌకర్య వాతావరణం నెలకొంటుంది. అలాగే ఈనెల 15నుంచి రాష్ట్రంలో మళ్లీ ఉష్ణోగ్రతలు ఊపందుకుని వడగాలులు విజృంభించనున్నాయని వివరించింది. రాష్ట్రంలో శుక్రవారం ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుముఖం పట్టాయి. దీంతో వడగాలులు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. శుక్రవారం విజయనగరం జిల్లాలో జామిలో అత్యధికంగా 41.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస 40.9, నంద్యాల జిల్లా చాగలమర్రి 40.8, కోనసీమజిల్లా అయినవిల్లి, వైఎస్సార్ జిల్లా కాజీపేట, అన్నమయ్య జిల్లా పెద్దమాండ్యంలో 40.5, తిరుపతి జిల్లా రేణిగుంటలో 40.1, కర్నూలు జిల్లా కామవరంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

అన్ని ఆధారాలున్నా వివేకా హంతకులకు శిక్ష పడలేదు

బస్సు యాత్రలో షర్మిల



వేంపల్లె/వేముల/లింగాల/సింహాద్రిపురం/పులివెందుల : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేయించిన వారు దర్జాగా బయట తిరుగుతున్నారని ఏపీసీసీ అధ్యక్షురాలు, కడప ఎంపీ అభ్యర్థి షర్మిల ఆరోపించారు. శుక్రవారం ఆమె వైఎస్సార్ జిల్లాలోని వేంపల్లె, వేముల, లింగాల, సింహాద్రిపురం, పులివెందులలో రోడ్ షోలో పాల్గొన్నారు. వివేకాను అతికిరాతకంగా నరికి చంపారని ఆరోపించారు. వివేకా చనిపోయి ఐదేళ్లు దాటినా ఇంతవరకు హంతకులకు శిక్ష పడలేదన్నారు. హత్య చేయించింది ఎంపీ అవినాష్ రెడ్డి అని సీబీఐ చెప్పిందని, హత్యకు కారణాలు ఆధారాలతో చూపించినా హంతకులకు శిక్ష పడలేదన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సీఎం జగన్ హంతకులను కాపాడుతున్నారన్నారు. వైఎస్ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత మాట్లాడుతూ.. ప్రస్తుతం మీరు ఓటు వేసిన వాళ్లు ఎక్కడున్నారు, మీకోసం పనిచేయకుండా ఎక్కడ తిరుగుతున్నారు అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమాల్లో ఏపీసీసీ మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. లింగాల మండల కేంద్రంలో సునీతారెడ్డి, షర్మిల మాట్లాడుతూ వైఎస్ వివేకాను హత్య చేసిన వ్యక్తికి ఎంపీ టికెట్ ఇచ్చారని అన్నప్పుడు కొందరు యువకులు 'వైఎస్ వివేకాను మీరే చంపారు' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది.

మార్గదర్శి చెల్లింపు సమస్యలపై సమాచారం ఇవ్వండి

- సమాచారం thedepositers@gmail.com మెయిల్‌లో పంపండి
- ఆ సమాచారాన్ని కోర్టు ఫార్మాట్‌లో కోర్టుకు సమర్పిస్తాను
- 2.70 లక్షల మంది డిపాజిటర్లకు పూర్తి వడ్డీతో సహా చెల్లించాలి
- బకాయితో కలిపి చెల్లించాల్సిన వడ్డీ రూ.900 కోట్లు
- మార్గదర్శి చెల్లించింది రూ.55.39 కోట్లే
- కోర్టుల ముందు సామాన్యుడైనా, రామోజీరావు అయినా ఒక్కటే
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



రాజమహేంద్రవరం సిటీ: మార్గదర్శి సంస్థ చెల్లింపుల విషయంలో ఏవైనా సమస్యలుంటే పూర్తి ఆధారాలు, చిరునామాతో తనకు సమాచారం ఇవ్వాలని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఆ సంస్థ ఖాతాదారులకు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఖాతాదారుల సమస్యలను thedepositers@gmail.com అనే జీమెయిల్ అడ్రస్‌కు పంపించాలని కోరారు. ఖాతాదారులు అందించిన సమాచారాన్ని కోర్టు ఫార్మాట్‌లో కోర్టుకు అందజేస్తానని తెలిపారు. చెల్లింపులు జాప్యం కావడంతో 2.70 లక్షల మంది ఖాతాదారులకు డిపాజిట్ మొత్తాన్ని రూ.55.39 కోట్ల వడ్డీ బకాయితో తిరిగి చెల్లించినట్లు కోర్టుకు మార్గదర్శి వివరించిందన్నారు. వాస్తవానికి బకాయి పడిన వడ్డీ కలిపితే మార్గదర్శి ఏకంగా రూ.900 కోట్ల వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అక్రమాలకు పాల్పడితే న్యాయస్థానాల ముందు సామాన్యుడైనా, సెలబ్రిటీ రామోజీరావు అయినా ఒక్కటే అన్న విషయాన్ని ప్రపంచానికి తెలియజేయాలనే ఉద్దేశంతోనే తాను ఈ న్యాయ పోరాటం సాగించానన్నారు. కేవలం సుప్రీం కోర్టు న్యాయమూర్తుల వల్లనే ఈ కేసులో న్యాయం జరిగిందని చెప్పారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. మార్గదర్శి ఫైనాన్స్‌లో ఆర్థిక అవకతవకలపై రిటైర్డ్ హైకోర్టు జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని తెలంగాణ హైకోర్టును సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించిందని చెప్పారు. 45ఎస్ పై పూర్తి విచారణ జరపాల్సిందిగా కూడా తెలంగాణ హైకోర్టును ఆదేశించారన్నారు. మార్గదర్శి వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు, రిజర్వ్ బ్యాంకును సుప్రీం కోర్టు పార్టీలుగా చేసిందని, తెలంగాణ హైకోర్టులో విచారణ సమయంలో సహాయం చేయాల్సిందిగా తనను ఆదేశించిందని అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ విచారణ ఆరు నెలలల్లో పూర్తి కానున్నదని, ఏదో ఒక లాజికల్ కంక్లూజన్ వస్తుందని భావిస్తున్నానని చెప్పారు. రామోజీరావు భావవ్యక్తీకరణను ఏ రకంగా చంపేస్తారో ఇన్ని సంవత్సరాల్లో ఈనాడు పేపరులో రాసిన రాతలు చూస్తే తెలుస్తుందన్నారు. న్యాయం కోసం మార్గదర్శిపై పోరాటం చేస్తున్న తనపై ఎన్నో వక్రీకరణలతో కథనాలు రాశారన్నారు. ఆ పేపర్ కటింగ్స్ అన్నింటితో త్వరలో రాజమహేంద్రవరంలో ప్రదర్శన ఏర్పాటు చేస్తానని చెప్పారు.

షర్మిల రోడ్‌షోకు అద్దె మనుషులే దిక్కు

- కడప లోక్‌సభ స్థానంలో ప్రజల మద్దతు కరవు
- కనీస స్థాయిలో రాని ప్రజా స్పందన
- డబ్బులిచ్చి షర్మిల సభలకు జనాన్ని తరలిస్తున్న టీడీపీ నేతలు
- వీరిలో ఎక్కువ మంది ఇతర రాష్ట్రాల వలస కూలీలే





పులివెందులలో అద్దెకు తెచ్చిన వారి లిస్టు, టోకెన్లను పరిశీలిస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, కడప: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, కడప వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డికి మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య మరకలు అంటేలా దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్న ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు ప్రజల మద్దతు కరవైంది. కాంగ్రెస్ పార్టీ కడప ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆమె రోడ్‌షోల పేరిట నియోజకవర్గంలో తిరుగుతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అండతో, టీడీపీ స్క్రిప్టుతో సీఎం జగన్‌పై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్న షర్మిల వైపు ప్రజలు కన్నెత్తి చూడటంలేదు. దీంతో ఆమె సభలు, రోడ్ షోలు అట్టర్ ఫ్లాపవుతున్నాయి. దీంతో టీడీపీ పంపుతున్న అద్దె మనుషులే దిక్కయ్యారు. స్థానిక టీడీపీ నాయకుల సహకారంతో డబ్బులిచ్చి మరీ మనుషులను తరలించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇలా తరలించిన వారిలో అధికశాతం బీహార్, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలు కూడా ఉన్నారు. షర్మిల శుక్రవారం వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలో ప్రచారం చేశారు. వేంపల్లె కేంద్రంగా తొలుత నిర్వహించిన సమావేశానికి చక్రాయపేట మండలం నుంచి టీడీపీ నాయకులు జనసమీకరణ చేపట్టారు. ఒక్కొక్కరికి రూ.500 ఇచ్చి వాహనాల్లో తరలించారు. సిద్ధారెడ్డిగారిపల్లెకు చెందిన టీడీపీ నేత భాస్కరరెడ్డి జనసమీకరణ బాధ్యతను తీసుకున్నారు. ఆ తర్వాత రోడ్‌షోలకు వేంపల్లెలోని బిడాలమిట్ట, చింతరాంపల్లె ప్రాంతాల నుంచి స్థానిక కాపువీధికి చెందిన టీడీపీ నేత మునిరెడ్డి అద్దె మనుషులను తరలించారు. ముద్దనూరు, కడప ప్రాంతాలను నుంచి జనాన్ని తరలించారు.

పులివెందులలో సాయంత్రం జరిగిన సభకు కడప నుంచి జనాన్ని సమీకరించారు. చెన్నూరు, ఐటీఐ సర్కిల్, ఆజాద్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి జనాన్ని తీసుకొచ్చారు. వీరికి కూడా ఒక్కొక్కరికి రూ.500 చొప్పున ఇచ్చారు. డబ్బులు తీసుకొని మధ్యలో జారుకోకుండా ముందుగా టోకెన్లు ఇచ్చారు. తిరుగు ప్రయాణంలో టోకెన్ ఉన్న వారికి రూ.500 చొప్పున కాంగ్రెస్ నేత తులసిరెడ్డి సన్నిహితుడు చెల్లించినట్లు సమాచారం.

సమావేశానికి రావాలని శివప్రకాష్ రెడ్డి బెదిరింపులు!

మరోవైపు షర్మిల సమావేశానికి హాజరు కావాలంటూ వైఎస్ వివేకా పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాష్‌రెడ్డి స్థానికులకు ఫోన్లు చేసి బెదిరింపులకు దిగారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ టీడీపీ రెండు ఒక్కటేనని, స్థానిక నాయకత్వం తమ చేతుల్లోనే ఉంటుందని ఆయన హెచ్చరించినట్లు సమాచారం.

తొలి విడత ప్రచారంలోనూ..

తొలి విడత ప్రచారంలో షర్మిల బద్వేల్, కడప, మైదుకూరు, కమలాపురం నియోజకవర్గాల్లో పర్యటించిన సందర్భంలోనూ ఇలాగే తుఫాన్ వాహనాల ద్వారా కడప నుంచి జనాల్ని తరలించారు. 20 వాహనాలకు సరిపడా జనానికి కడప జయరాజ్ గార్డెన్‌లో బస ఏర్పాటు చేసి, నాలుగు రోజుల పాటు షర్మిల పర్యటనలకు తిప్పుకున్నారు. వీరంతా హిందీలో మాట్లాడుతుండటంతో పలువురు వాకబు చేయగా, బిహార్ నుంచి వచ్చిన వలసకూలీలని, రోజు కూలీకి ఒప్పందం చేసుకున్నట్లు తేలింది.

> దక్షిణం, ఉత్తరం, పడమట, పై లోకాలు, కింది లోకాల కన్నిటికీ వెలుగులందిస్తూ; సర్వప్రాణుల్నీ, సమస్త విశ్వాన్నీ తన కిరణాలతో ఉత్తేజితం చేస్తూ, సూర్యుడు ప్రాణశక్తికి ఆలవాలమై ఉన్నాడు.
>
> – ప్రశ్నోపనిషత్తు (హిందూ ధర్మం)

సాక్షి

శనివారం, 13 ఏప్రిల్ 2024

ప్రశాంత కశ్మీర్‌కు మార్గం

జమ్మూ, కశ్మీర్‌లో ఉగ్రవాదం, రాళ్లదాడులు, హర్తాళ్లు, సరిహద్దుల్లో అలజడి వగైరాలు లేకుండా ఈసారి లోక్‌సభ ఎన్నికలు జరగబోతున్నాయని శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ ఉదమ్‌పూర్ ర్యాలీలో ఎంతో ఆత్మవిశ్వాసంతో చేసిన ప్రకటనను బహుశా విపక్షాలు కూడా స్వాగతిస్తాయి. 2019 లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పుల్వామాలో సైనికులపై ఉగ్రవాద దాడి, ఆ వెనువెంటనే పాక్ భూభాగంలోని ఉగ్రవాద స్థావరాలపై మన సైన్యం సాగించిన సర్జికల్ దాడులు విపక్షాలకు దేశంలో అప్పటివరకూ కొద్దో గొప్పో ఉందనుకున్న అనుకూలతలను ఆవిరిచేశాయి. బీజేపీకి భారీ మెజారిటీని అందించాయి. కనుక ఈసారి అంతా సవ్యంగా ముగియాలని అవి కోరుకోవటంలో ఆశ్చర్యం లేదు. ఆ మాటెలావున్నా మోదీ చెప్పిన స్థాయిలో ఉగ్రవాదం బెడద సమసిపోయిందనుకోలేము. ఆ ఉదంతాల సంఖ్య గణనీయంగా తగ్గిన మాట వాస్తవమే అయినా అడపా దడపా వారి ఆగడాలు చోటుచేసుకుంటూనే వున్నాయి. నిరుడు డిసెంబర్‌లో పూంచ్‌లో ఉగ్రవాదులు విరుచుకుపడిన ఉదంతంలో నలుగురు జవాన్లు మరణించటమైనా, మరుసటి నెలలో అదే ప్రాంతంలో సైనికులపై జరిగిన దాడి యత్నమైనా, శ్రీనగర్‌లో ఫిబ్రవరిలో ఒక పంజాబీ పౌరుణ్ణి కాల్చిచంపటమైనా మరింత అప్రమత్తత అవసరమన్న సంకేతాలిస్తున్నాయి.

జమ్మూ కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తినిచ్చే రాజ్యాంగంలోని 370 అధికరణను రద్దు చేయటమైనా, రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించటమైనా అక్కడి రాజకీయ ముఖచిత్రాన్ని మార్చాయన్నది వాస్తవం. ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాక ఇది మరింత ప్రస్ఫుటమవుతుంది. లోక్‌సభ ఎన్నికలకంటే అసెంబ్లీ ఎన్నికలకే జమ్మూ, కశ్మీర్‌లో ఎప్పుడూ అధిక ప్రాధాన్యత వుండేది. అయితే మారిన పరిస్థితుల్లో లోక్‌సభ నియోజకవర్గాల్లో పట్టు సంపాదిస్తేనే భవిష్యత్తులో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటడం సాధ్యమవుతుందని ప్రాంతీయ పార్టీలైన నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ, కొత్తగా రంగంలోకొచ్చిన గులాంనబీ పార్టీ డీపీఏపీ భావిస్తున్నాయి. ఇక బీజేపీ, కాంగ్రెస్‌లు రెండూ పార్లమెంటులో తమ సంఖ్యను పెంచుకోవటానికి ఎంతో కొంత దోహదపడుతుందన్న దృష్టితో వున్నాయి. గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ది విషాద స్థితి. అంతక్రితం గెల్చుకున్న జమ్మూ, లద్దాఖ్‌లు రెండూ ఆ సార్వత్రిక ఎన్నికల్లో చేజారాయి. ఆ రెండూ బీజేపీ పరమయ్యాయి. కానీ మారిన పరిణామాలు లద్దాఖ్‌లో ఆ పార్టీకి ఆశలు పుట్టిస్తున్నాయి. ఉపాధిలేమి, హిల్ కౌన్సిళ్లను నీరుగార్చటం, పర్యావరణాన్ని దెబ్బతీసేలా సాగుతున్న కార్పొరేట్ సంస్థల భూదాహం లద్దాఖ్ ప్రజానీకానికి ఆగ్రహం కలిగించాయి. దానికితోడు చైనానుంచి ముప్పు వుండొచ్చన్న ఆందోళనతో రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో లద్దాఖ్‌ను చేరుస్తామన్న హామీ నుంచి బీజేపీ వెనక్కి తగ్గింది. అలా చేరిస్తే ఆదివాసీ ప్రాంతాలకు కార్యనిర్వాహక, శాసన, న్యాయ, ఆర్థిక రంగాల్లో స్వయం నిర్ణయాధికారం లభిస్తుంది. తమ ప్రాంతాల్లోని అడవులు, నదులు, వ్యవసాయం, గ్రామపాలన, వారసత్వ ఆస్తి, వివాహం, విడాకులు, సంప్రదాయాలు తదితర అంశాల్లో చట్టాలు చేసుకునే అధికారం వుంటుంది. పొరుగున చైనా వున్న నేపథ్యంలో ఇది సమస్యాత్మకం కావొచ్చని ఆలస్యంగా గ్రహించటంతో బీజేపీకి ఎటూ పాలుబోవటం లేదన్నది వాస్తవం. అక్కడి ఉద్యమాల పర్యవసానంగా లే ప్రాంతంలో ఆధిపత్యంవున్న బుద్ధిస్టులకూ, కార్గిల్‌లో పైచేయిగా వున్న ముస్లింవర్గాలకూ మధ్య సంప్రదాయ సరిహద్దులు చెరిగిపోయాయి. ఫలితంగా ఇటీవల జరిగిన 26 స్థానాల హిల్ కౌన్సిల్ ఎన్నికల్లో బీజేపీకి రెండు మాత్రమే దక్కాయి. కనుక బీజేపీ సంకల్పం నెరవేరటం అంత సులభం కాదు. ఇక కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీలు విడివిడిగా పోటీచేస్తున్నాయి. ఇటీవల సమష్టిగా అడుగులేసినట్టు కనబడిన ఈ రెండు పార్టీలూ ఎన్నికలు వచ్చేసరికి దూరం జరిగాయి. గతంలో ఒప్పందాలకు కట్టుబడి వుండటం అలవాటులేని పీడీపీతో పొత్తు అసాధ్యమన్నది నేషనల్ కాన్ఫరెన్స్ వాదన. చిత్రమేమంటే ఎప్పుడూ 'మరింత స్వయంప్రతిపత్తి', జమ్మూ, కశ్మీర్‌లో శాంతి స్థాపన చర్చలు ప్రధాన ఎజెండాగా చేసుకునే ఆ పార్టీలకు మారిన పరిస్థితుల్లో ఆ అంశాల ప్రస్తావనకే అవకాశం లేకుండా పోయింది. డీపీఏపీ ఎత్తుగడలే ఈ పార్టీలను కలవరపరుస్తున్నాయి. ఆజాద్ తాను బలంగావున్న ఉదంపూర్–దోడా నియోజకవర్గాన్ని వదిలి అనంత్‌నాగ్–రాజౌరికి ఆయన వలస రావటం వెనక ముస్లింల ఓట్లు చీల్చి బీజేపీకి మేలు చేయాలన్న వ్యూహం వున్నదని వాటి అనుమానం.

ఉన్న ఆరు లోక్‌సభ స్థానాలకూ అయిదు దశల్లో పోలింగ్ నిర్వహించటం జమ్మూ, కశ్మీర్ వర్తమాన స్థితికి అద్దం పడుతుంది. అయిదేళ్లుగా నిద్రాణమైనట్టున్న ఈ ప్రాంతంలో లోక్‌సభ ఎన్నికల ప్రకటన తర్వాత కదలిక వచ్చింది. ఇప్పుడు లభించే ఓట్ల శాతాన్నిబట్టి భవిష్యత్తులో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తన స్థానం ఏమిటన్నది తేలిపోతుందని బీజేపీ గట్టిగా భావిస్తోంది. మిలిటెంట్ల స్వరం ఈసారి మూగబోయిందన్నది వాస్తవం. అయితే రాష్ట్రంలో హిందూ సీఎం వుండాలన్న బీజేపీ ఆశ నెరవేరాలంటే ఉగ్రవాదాన్ని అణిచేయటం ఒక్కటే చాలదు. అందుకు అభివృద్ధికి బాటలు పరిచి యువతకు ఉపాధి అవకాశాలు పెంచటం, సామాజిక, ఆర్థిక పరిస్థితులు మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవటం, మానవహక్కులకు ప్రాధాన్యతనీయటం తప్పనిసరి. సరిహద్దు ఆవల పాకిస్తాన్, చైనాలు వున్నాయన్న స్పృహతో మెలిగి, సున్నితంగా వ్యవహరించటం నేర్చుకుంటే ఆ ప్రాంత ప్రజల హృదయాలు గెల్చుకోవటం సులభమవుతుంది.

ఎవరు గెలిస్తే ఇండియాకు మేలు?

విశ్లేషణ



ప్రశాంత్ ఝా

భారతదేశ వ్యూహాత్మక అవసరాలు తీరేందుకు జో బైడెన్ అమెరికా అధ్యక్ష స్థానంలో ఉండటం అవసరం. అయితే డెమోక్రాట్లకు బీజేపీ అంటే అసలు పడటం లేదు. ట్రంప్‌కు బీజేపీ రాజకీయాలంటే పట్టింపేమీ లేదు కానీ.. ఎప్పుడెలా స్పందిస్తారో తెలియదు! అయితే, ట్రంప్ అధికారంలో ఉండగా ఇతర దేశాల కంటే చాలా తక్కువ నష్టం భారత్‌కు జరిగిన విషయం కూడా ఇక్కడ చెప్పుకోవాలి. చైనాతో ట్రంప్ తెగదెంపులు చేసుకోవడం వల్లనే ట్రంప్ ప్రభుత్వం పుల్వామా, గల్వాన్ ఘటనల్లో భారత్‌కు మద్దతుగా నిలిచింది. అయితే రెండోసారి అధికారం చేపడితే ట్రంప్ వ్యవహారశైలి ఎలా ఉంటుందో ఇప్పుడే ఊహించలేము. అలాంటి నేపథ్యంలో భారతీయ దౌత్యం అవసరం మరింత ఎక్కువవుతుంది.

అమెరికా రాజకీయాలు... భారత్‌లో వాటి ప్రభావం అన్న అంశాన్ని తీసుకుంటే నాలుగు అంశాలు పరస్పర విరుద్ధంగా కనిపిస్తాయి. మొదటగా చెప్పుకోవాల్సింది చైనాను నియంత్రించే విషయంలో బైడెన్ ఇండో పసఫిక్ ప్రాంతంలో తీసుకున్న చర్యలు. ఈ చర్యలన్నీ బాధ్యతాయుతమైనవే కాదు, ఒక పద్ధతి ప్రకారం చేసినవి కూడా. కాకపోతే ఉక్రెయిన్, గాజా యుద్ధాల కారణంగా చైనాపై శ్రద్ధ కొంత తగ్గిందనడం కూడా సత్యదూరమేమీ కాదు.



బైడెన్ నేతృత్వంలో క్వాడ్‌కు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. జపాన్ తన మిలిటరీ ఆధునికీకరణ చేపట్టింది. అమెరికా, జపాన్, దక్షిణ కొరియా భద్రతాంశాలపై త్రైపాక్షిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. అలాగే జపాన్, ఫిలిప్పీన్స్, అమెరికా మధ్య కూడా ఒక ఒప్పందం కుదిరింది. ఫిలిప్పీన్స్‌లో అమెరికా ఉనికి మరింత పెరిగింది. 'ఆకస్'(ఆస్ట్రేలియా, యూకే, యూఎస్) ప్రకటన జరిగింది. దక్షిణ పసిఫిక్ ద్వీపాల ప్రాముఖ్యతనూ అమెరికా గుర్తించడం గమనార్హం. ఆసియాన్ నేతలకు వైట్‌హౌస్ ఆతిథ్యమిచ్చింది. తైవాన్‌లో ఎన్నికల నిర్వహణ సజావుగా సాగింది. వియత్నాంతో అమెరికా బంధం మరింత దృఢపడింది. అలాగే చైనాపై అమెరికా కఠినమైన టెక్ నిషేధాలు కూడా విధించింది. ఇదే సమయంలో ఘర్షణ మరింత ముదరకుండా వ్యూహాత్మకంగా ఒకవైపు చైనాతో చర్చలు కొనసాగిస్తూనే మరోవైపు ఆ దేశంతో తన పోటీతత్వానికి మరింత పదును పెట్టింది.

అమెరికా ఆలోచనల్లో భారత్ కనీసం నాలుగు విధాలుగా ఎక్కువ ప్రయోజనాలు చేకూరుస్తుంది. ప్రపంచస్థాయి చర్చల్లో భారత్ కీలకమైన భాగస్వామి అని బైడెన్ ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. ఈ కారణంగానే భారత్ అధ్యక్షతన జరిగిన జీ20 సమావేశాలకు పూర్తి స్థాయిలో అమెరికా మద్దతిచ్చింది. ఐఎంఈసీ, ఐ2యూ2, క్వాడ్, ఐపీఈఎఫ్, మినరల్ సెక్యూరిటీ పార్ట్‌నర్‌షిప్, ఆర్టిమిస్ అకార్డ్స్ వంటి వేర్వేరు వ్యవస్థల్లో భారత్‌ను కీలకంగా మార్చింది. ఇంధనం నుంచి ఆహార భద్రత, వాతావరణ మార్పులు మొదలుకొని కోవిడ్ వంటి మహమ్మారుల నిర్వహణ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన వంటి అన్ని ప్రపంచస్థాయి సమస్యల పరిష్కారంలో భారత్ భూమిక తప్పదన్న విషయం కూడా అమెరికా గుర్తించింది. భారత్ సామర్థ్యాన్ని పెంచడం ప్రపంచ సమస్యల పరిష్కార బాధ్యతను పంచుకోవడం అవుతుందని అమెరికా భావిస్తోంది. దీనివల్ల అటు చైనాను నియంత్రించడం, దక్షిణాసియా ప్రాంతంలో భద్రతను కాపాడటం కూడా సాధ్యమన్నది అమెరికా అంచనా. అలాగే సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి తగిన వ్యవస్థలను ఏర్పాటు చేయడం, కలిసికట్టుగా తయారీ చేపట్టడం, రక్షణ రంగంలో సహకారం, అమెరికాలోని పెద్ద పెద్ద కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెడుతూండటం భారత్‌పై పెరుగుతున్న అమెరికా విశ్వాసానికి నిదర్శనాలుగా చెప్పుకోవచ్చు. భారత్ భౌగోళిక స్వరూపం, ఇరుగు పొరుగు, చరిత్ర వంటి అనేక అంశాల ఆధారంగా బైడెన్ యంత్రాంగం ఈ దేశం తన ప్రయోజనాలు సాధించుకునేందుకు ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తోంది. కొన్నిసార్లు విభేదించినా భూ దక్షిణార్ధగోళం మొత్తమ్మీద భారత్ పరపతి చైనా కంటే ఎంతో మెరుగని అమెరికా భావిస్తోంది.

ఇక రెండో విషయానికి వద్దాం. డెమోక్రాట్లు ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీతో అంత సౌకర్యంగా ఏమీ లేరు. ఇందుకు మూడు కారణాలు కనిపిస్తాయి. ప్రజాస్వామ్యం విషయంలో పార్టీ ధోరణి మారిపోవడం ఇందులో ఒకటి. యూఎస్ కాంగ్రెస్‌లోని ఐదుగురు దేశీ ప్రతినిధులు డెమోక్రాట్లే కావడం గమనార్హం. ఆధిపత్య ధోరణులకు దూరంగా ఉండాలన్న కాంక్ష, మైనారిటీలకు గుర్తింపు ఉండాలన్న భావనలు వీరిని డెమోక్రాట్ పార్టీ వైపు మళ్లించాయి. జాతి ఆధారిత నేషనలిజమ్‌పై కూడా వీరికి నమ్మకం లేదు. బీజేపీ ఇప్పుడు ఈ విలువలన్నింటికీ దూరమన్న అంచనా డెమోక్రాట్లలో బలపడుతోంది. రెండో కారణం అమెరికన్ ముస్లింల ప్రభావం. డెమోక్రాట్లలో భారతీయ అమెరికన్ ముస్లింల ప్రభావం కూడా క్రమేపీ ఎక్కువ అవుతోంది. బైడెన్ గాజా విషయంలో ఇప్పటికే వీరి నుంచి కొంత వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. మిషిగన్ వంటి స్వింగ్‌స్టేట్‌లో దీని ప్రభావమూ కనిపించింది. మూడో కారణం... డెమోక్రాట్లు ట్రంప్ రాజకీయాలను వ్యతిరేకిస్తారు. ట్రంప్ ప్రజాస్వామ్యానికి ఎలా వ్యతిరేకం అన్న విషయంపై ఈ రాజకీయాలు మొత్తం ఆధారపడి ఉంటాయి. ఫలితంగా వీరు మానవహక్కుల వంటి విషయాలకు అనుకూలంగా ఉండాల్సి ఉంటుంది.

పౌరసత్వ (సవరణ) చట్టం విషయంలో ఇటీవలి కాలంలో భారత్, అమెరికా మాటా మాటా అనుకున్న విషయం ఒకసారి గుర్తు చేసుకుందాం. అయితే ఈ విషయాలన్నింటినీ తప్పుకొని మరీ పని చేసేందుకు బైడెన్ యంత్రాంగం ఒక మార్గాన్ని గుర్తించింది. అంశాలను బహిరంగంగా కాకుండా, ప్రైవేట్‌గా ప్రస్తావించడం. అడపాదడపా ఎవరైనా అడిగితే నర్మగర్భంగా బహిరంగ వ్యాఖ్యలు చేయడం. అమెరికాలో భారత్‌పై ఆందోళన చెందుతున్న బీజేపీయేతర పార్టీలకు సంఘీభావ సంకేతం పంపేందుకు ఇలా చేస్తుందన్నమాట. ఉన్నతాధికారులు, నేతలకు మాత్రం విషయం సుస్పష్టం.

మూడో అంశం... డోనాల్డ్ ట్రంప్ హ్రస్వదృష్టి. ఇందులో మైనారిటీలు, మతపరమైన అంశాలు, ఎన్నికల వ్యవస్థ చేతనావస్థ వంటి వాటికి చోటు లేదు. బహుశా క్రైస్తవుల హక్కుల గురించి ట్రంప్ కొంత ఆందోళన వ్యక్తం చేసే అవకాశం ఉంది. ఎందుకంటే సువార్తికులకు ఈయన కొంచెం తలొగ్గుతూంటారు.

అధ్యక్ష ఎన్నికల్లో కొంచెం ముందున్న ట్రంప్ భారత్ ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటాడని అనుకోలేము. అయితే, ట్రంప్ అధికారంలో ఉండగా ఇతర దేశాల కంటే చాలా తక్కువ నష్టం భారత్‌కు జరిగిన విషయం కూడా ఇక్కడ చెప్పుకోవాలి. చైనాతో ట్రంప్ తెగదెంపులు చేసుకోవడం వల్లనే ట్రంప్ ప్రభుత్వం పుల్వామా, గల్వాన్ ఘటనల్లో భారత్‌కు మద్దతుగా నిలిచింది. అయితే రెండోసారి అధికారం చేపడితే ట్రంప్ వ్యవహారశైలి ఎలా ఉంటుందో ఇప్పుడే ఊహించలేము. అమెరికాలో రాజకీయపరమైన అస్థిరత, విభజన ఉండటం ఉక్రెయిన్, యూరప్ దేశాల నిరుత్సాహానికి తద్వారా అమెరికా ప్రత్యర్థులకు బలాన్ని ఇస్తుంది. అందుకే అమెరికా ప్రత్యర్థులు... డెమోక్రాట్లు అంటే ఇష్టం లేని కొందరు అమెరికా స్నేహితులు కూడా ట్రంప్ విజయాన్ని కోరుకుంటున్నారు.

ఒక ఉదాహరణ తీసుకుందాం. బీజింగ్ ఇప్పటికే అమెరికా వ్యవహారాన్ని తిరిగి మొదలుపెట్టింది. ట్రంప్‌కు సాయపడేలా ఎన్నికల్లో తప్పుడు ప్రచారాన్ని కూడా మొదలుపెట్టిందన్న వార్తలూ ఉన్నాయి. తన ప్రయోజనాలు కాపాడేలా చేస్తే వాణిజ్య పునరుద్ధరణ సాధ్యమే అని చైనా ట్రంప్‌కు సంకేతాలిచ్చినా ఆశ్చర్యం లేదు. టిక్‌టాక్ విషయంలో ట్రంప్ తన మునుపటి వైఖరిని మార్చుకున్న విషయం ఇక్కడ చెప్పుకోవాలి. అమెరికన్ రాజ్యాంగంపై పోరు చేస్తామన్న ట్రంప్ వ్యాఖ్య, వ్యాపార వాణిజ్య వ్యవహారాల్లో దుందుడుకుతనం, ఆసియా, యూరప్‌లలోని కొన్ని మిత్రదేశాలతోనూ దురుసుగా వ్యవహరించడం వంటివి చూస్తే ట్రంప్ మరోసారి అధికారంలోకి వస్తే ప్రపంచం మరోసారి గందరగోళంలో పడుతుందనేది మాత్రం వాస్తవం. అలాంటి నేపథ్యంలో భారతీయ దౌత్యం అవసరం మరింత ఎక్కువవుతుంది. ఈ విషయంలో భారత్ ఎంతో కొంత ఆందోళన చెందాల్సిన అవసరమైతే కనిపిస్తోంది.

వ్యాసకర్త జర్నలిస్ట్ మరియు కాలమిస్ట్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వాళ్లకిది వినోదం



న్యూయార్క్‌లోని ఒక ప్రసిద్ధ ప్రొఫెసర్ ఒక కాలమ్ రాశారు. పౌరులను చంపడం ఎంత గొప్పగా ఉండిందో, 10/7 (ఇజ్రాయెల్ మీద హమాస్ దాడి చేసిన రోజు) తనకు ఎంత ఉత్సాహం కలిగించిందో ఆమె రాశారు. ఇంకేమిటి ఇప్పుడు? ఈ బోరుతో చచ్చే జనాలకు మా మధ్య ప్రాచ్య జనాలం కేవలం వారి స్వైరకల్పనల ఆటబొమ్మలం అంతే!

– అరశ్ అజీజీ, రచయిత

నాలుకతో కష్టం...



ఒక వయసుకొచ్చాక మనం ఇండియాలో తాగుతూ పెరిగింది నిజమైన కాఫీ కాదని అర్థమవుతుంది. పాలు, చక్కెరకు కాఫీ వాసన అద్దిన తియ్యటి సిరప్ మాత్రమే అది. ఇప్పుడు నేను కోస్టా రికా నుంచి అరేబికా కాఫీ గింజలు కొంటున్నా, జపనీస్ హారియో గ్రైండర్‌లో గ్రైండ్ చేస్తున్నా, ఫ్రెంచ్ ప్రెస్‌లో బ్రూ చేస్తున్నా, ఐ లవ్ దిస్ కాఫీ. కానీ కొన్నిసార్లు నా పాత తియ్యటి సిరప్‌ను మిస్ అవుతున్నా.

– పర్మిందర్ సింగ్, వ్యాపారవేత్త

పోయినవన్నీ...



వైరుధ్యాలతో, నిష్ఫలమైన కోరికలతో, చెదిరిన కలలతో, పోగొట్టుకున్న స్నేహాలతో జీవితం నిండిపోయి ఉండవచ్చు. అయినప్పటికీ, జీసస్ పునరుత్థానం అనేది అన్నింటినీ తిరిగి పొందవచ్చునని నమ్మేట్టు చేస్తుంది(ఈస్టర్ సీజన్).

– పోప్ ఫ్రాన్సిస్, క్రైస్తవ మతగురువు

అదే పాటా?



ఒక పేదవాడు ప్రధానమంత్రి అయితే, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ప్రతిపక్షం అంటోందని ప్రధాని మోదీ అంటున్నారు. ఆయన 'పేదరికానికి' ఎక్స్‌పైరీ తేదీ ఏమైనా ఉంటుందా? పదేళ్లవుతోందిగా!

– ప్రేమ్ పణిక్కర్, కాలమిస్ట్

తక్కువే ప్రభావవంతం



ఒక ఎనభై ఏళ్ల గ్రామీణ వృద్ధుడిని చూశాను. 13 రకాల మందులు ఆయనకు రాశారు. వాటిని కేవలం 4కి కుదించాను. చాలాసార్లు తక్కువే ఎక్కువ, ప్రత్యేకించి వృద్ధాప్యంలో.

– ఎస్.పి. కాలంత్రి, ఫిజీషియన్

ఇన్ బాక్స్

శ్రీకాకుళ విప్లవ యోధుడు

వీర శ్రీకాకుళ విప్లవోద్యమానికి ఆయన ఒక చిరునామా. కమ్యూనిస్టు విలువలకూ, త్యాగానికీ, ఆదర్శాలకూ, నిబద్ధతకూ నిలువెత్తు నిదర్శనం. ఆయన విప్లవ రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. ఆయనే మచ్చ లేని మహా నాయకుడు కామ్రేడ్ పైలా వాసుదేవరావు. దేశంలో ముందుకొచ్చిన అనేక అస్తిత్వ, ప్రజాస్వామిక ఉద్యమాలకు బాసటగా నిలిచిన వ్యక్తి పైలా వాసుదేవరావు.

1932 ఆగస్టు 11న శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరు మండలం రిట్టపాడులో జన్మించారు. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు రాజకీయాలవైపు ఆకర్షితులయ్యారు. 1953లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. శ్రీకాకుళ పోరాట ఉద్యమ నాయకుడిగా, దళ జీవితం గడుపుతున్నప్పుడు 1970లో, దళ సభ్యురాలు కామ్రేడ్ చంద్రమ్మను వివాహం చేసుకున్నాడు. ఉద్యమ క్రమంలోనే తమకు పుట్టిన బిడ్డను సైతం తమ విప్లవ సహచరుడు అత్తలూరి మల్లికార్జున రావు కుటుంబానికి ఇచ్చేసి రక్తసంబంధం కంటే వర్గ సంబంధం గొప్పదని చాటిచెప్పారు వాసుదేవరావు – చంద్రక్క. ఎమర్జెన్సీ టైమ్‌లో అరెస్టయ్యి 12 ఏళ్ళ సుదీర్ఘకాలం జైలు జీవితాన్ని అనుభవించారు ఆ దంపతులు.



పైలా వాసుదేవరావు

1968 నవంబరు 25న శ్రీకాకుళ సాయుధ పోరాటం ప్రారంభించడంలో కామ్రేడ్ పైలా వాసుదేవరావుది విశిష్టమైన పాత్ర. రివిజనిజం నుంచి తెగతెంపులు చేసుకొని ఏర్పడిన రాష్ట్ర సమన్వయ కమిటీలో భాగంగా కామ్రేడ్ చారు మజుందార్ నాయకత్వంలో ఏర్పడిన అఖిల భారత విప్లకారుల సమన్వయ కమిటీలో భాగమయ్యారు. పంచాది కృష్ణమూర్తి, సుబ్బారావు పాణిగ్రాహి తదితరులతో కలిసి తెగింపు దళాల నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. శ్రీకాకుళ గిరిజనోద్యమ నిర్మాతలు కామ్రేడ్స్ వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసంలను 1970 జులై 10న పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపడంతో శ్రీకాకుళ ఉద్యమ చరిత్ర ముగిసిందని నాటి ప్రభుత్వం భ్రమించింది. కానీ కామ్రేడ్ పైలా వాసుదేవరావు అత్యంత కీలక సమయంలో ఆనాటికి మిగిలి ఉన్న మరికొందరు నాయకులను కూడగట్టారు. కామ్రేడ్స్ కొండపల్లి సీతారామయ్య, సత్యమూర్తి, రవూఫ్‌లను కలిసి చర్చించి వీరితో ఏర్పడిన రాష్ట్రకమిటీకి పైలా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తదనంతర పరిణామాలలో కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి నాయకత్వాన గల ఎ.పి.ఆర్. సి.పి.తో పార్టీని విలీనం చేశారు. 1984లో పార్టీ చీలికకు గురైన అనతికాలంలోనే ఆ చీలిక వల్ల ప్రతిఘటనోద్యమ రాజకీయాలు బలహీనపడి మితవాద రాజకీయాలు ఆధిపత్యంలోకి వచ్చాయని గుర్తించి జాగ్రత్త వహించారు. చివరికి సొంత ఆస్తి అనేది లేకుండా 2010 ఏప్రిల్ 11వ తేదీన కేన్సర్ వ్యాధితో మరణించిన నిజమైన కమ్యూనిస్టు ఆయన. కామ్రేడ్ పైలాకు విప్లవ జోహార్లు!

– చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి
(ఏప్రిల్ 14న శ్రీకాకుళం జిల్లా మామిడిపల్లిలో పైలా వాసుదేవరావు వర్ధంతి సభ)

యుద్ధరంగంలో సాంకేతికత – కొన్ని ప్రశ్నలు

యుద్ధం వల్ల సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతుందా? ఆ యా దేశాలు తమకు అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని సరికొత్త ఆవిష్కరణలకు సిద్ధం కావటం అనేది ప్రయోజనకరమైన అంశమా? లేదా అది యుద్ధనీతిని తప్పటం, అనైతికతను ప్రోత్సహించటం అవుతుందా అన్న ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) ప్రవేశించని రంగం అంటూ లేదు. యుద్ధరంగంలోకి అది తన బాహువులను చాస్తోంది. ఇజ్రాయెల్ రణక్షేత్రంలోకి ఏఐ ప్రవేశించటం తాజాగా చర్చనీయాంశంగా మారింది. ఇజ్రాయెల్ సైన్యం గాజాలో బాంబింగ్ చేపట్టటానికి ఇంతవరకూ పరిచయం లేని కృత్రిమమేధ ఆధారిత వ్యవస్థను ఉపయోగించింది. హమాస్‌కు సంబంధించి దాదాపు 37 వేలకు పైగా లక్ష్యాలను గుర్తించటానికి దీనిని ఉపయోగించారు. అలాగే దీని ఆధారంగానే పాలస్తీనియన్ పౌరులను కొందరిని గుర్తించి హతమార్చారు.

'మిషన్ లెర్నింగ్' విధానాల ద్వారా యుద్ధ వ్యూహాలను అమలు చేశారు. ఇజ్రాయెల్ ఉపయోగించిన కృత్రిమమేధ వ్యవస్థకు 'లావెండర్' అని పేరు పెట్టారు. ఇక్కడ మనిషి పాత్ర పరిమితం. దానిని అమలు చేయాలా వద్దా అని నిర్ణయం తీసుకోవటమే. 'ఊ' అనుకున్న తర్వాత కొన్ని సెకండ్లలో పని పూర్తయిపోతుంది. ఇజ్రాయెల్ జర్నలిస్టు ఒకరు బాహ్య ప్రపంచానికి ఈ విషయాన్ని వెల్లడించారు. ఆపరేషన్లో ఆరుగురు ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ అధికారులు పాల్గొన్నారని ప్రకటించారు.

అక్టోబర్ 7న దక్షిణ ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులకు నిరసనగా ఇజ్రాయెల్ మిలిటరీ ఆపరేషన్‌లో ఇంత వరకు 33 వేలమందికి పైగా పాలస్తీనియన్లు మృత్యువాతపడ్డారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌కి యుద్ధ సహాయాన్ని నిలిపివేయాలన్న డిమాండ్లు వస్తున్నాయి. ప్రధానంగా ఇజ్రాయెల్‌కు సహకారం అందిస్తున్న యూఎస్, బ్రిటన్‌లపై ఒత్తిడి పెరుగుతోంది. పాలస్తీనా పౌరుల మరణాల పట్ల సానుభూతిని ప్రకటిస్తూనే, బిలియన్ డాలర్ల విలువైన బాంబులు, ఫైటర్ జెట్ల అందచేతను యూఎస్ సమర్థించుకుంటోంది. మరో వైపు బ్రిటిష్ ప్రధాని రుషి సునాక్ రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇజ్రాయెల్ చేపట్టిన దాడిలో ఛారిటీ వరల్డ్ కిచెన్ సెంటర్లో ఏడుగురు బ్రిటిష్ పనివాళ్లు చనిపోవటంతో ఈఅంశానికి ప్రాధాన్యం ఏర్పడింది.

మరోవైపు రష్యా – ఉక్రెయిన్‌ల యుద్ధంలో ఉక్రెయిన్ కూడా ఏఐ ఆధారిత డ్రోన్లను ఉపయోగిస్తోంది. ఇవి మానవ ప్రమేయం లేకుండా వాటంతటికవే లక్ష్యాలను గుర్తించటం, దాడులు చేయటం వంటివి చేస్తాయి. కృత్రిమ మేధ ద్వారా శాటిలైట్ చిత్రాలను, డ్రోన్ వీడియో ఫీడ్‌లను పొందటం వల్ల యుద్ధ భూమిలో ఏం జరుగుతోందో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. చకచకా నిర్ణయాలు తీసుకోవటానికి వీలవుతుంది. శత్రువును వేగంగా, కచ్చితంగా ఎదుర్కోవటానికి వీలవుతుంది.



పూర్తిగా స్వయంచాలిత ఆయుధాలను వినియోగించటం అనే అంశంపైన చర్చలు సాగుతూనే ఉన్నాయి. ఒకరు ఒకరకమైన సాంకేతికత ఉపయోగిస్తే, దానిని ఎదుర్కోవటానికి మరో సాంకేతికత ముందుకొస్తుంది. ఇప్పుడు కొత్తగా 'ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ సిస్టమ్స్' వస్తున్నాయి. ఇవి డ్రోన్ ఆపరేటర్ పైన దాడులకు ఉపయోగపడతాయి. ఇది మరీ కొత్తది అని కూడా చెప్పలేం. ఐసిస్ కొన్నేళ్ల క్రితం అధునాతనమైన డ్రోన్ సైన్యాన్ని వినియోగించేది. ఇరాకీ బృందాలపై దాడులు నిర్వహించింది. ఒక ఎయిర్‌క్రాఫ్ట్‌ను కొన్నట్టు ఏఐని కొనటం సాధ్యం కాదు. స్వయంచాలిత ఆయుధాలతో యుద్ధనియమాలు అంటిపెట్టుకుని యుద్ధాలు చేయాలి. అమెరికా, రష్యాతో పాటు దాదాపు 30 దేశాలు ఇదే అభిప్రాయంతో ఉన్నాయి.

యుద్ధాల విషయానికొస్తే, మొదటి ప్రపంచ యుద్ధం (1914–1918)లో మెషిన్ గన్‌లు, గ్రెనేడ్లు ఇతర ఆయుధాలు... సబ్ మెరైన్లు, పాయిజనస్ గ్యాస్, వార్ ప్లేన్లు, ట్యాంకులు ఉపయోగించారు. రెండో ప్రపంచ యుద్ధం (1939–1945) వచ్చేనాటికి రాడార్ టెక్నాలజీ ప్రవేశించింది. కొంత మంది చరిత్రకారులు ఈ సాంకేతికతే అణుబాంబు కంటే విజయానికి కీలకపాత్ర పోషించేదని వ్యాఖ్యానించారు. రెండో ప్రపంచ యుద్ధానికి తెరవేయటానికి తొలి అణుబాంబును అభివృద్ధి చేశారు.

రెండు దశాబ్దాల తర్వాత చూస్తే ప్రపంచం మొత్తాన్ని సర్వనాశనం చేయటానికి అవసరమైనన్ని బాంబులు సిద్ధమైపోయాయి. యుద్ధంలో అణుబాంబును ఉపయోగిస్తే వచ్చే నష్టాన్ని అంచనా వేసుకుని ఏ దేశానికి ఆ దేశం దానిని ఉపయోగించటానికి వెనకడుగు వేసేలా తయారయ్యింది పరిస్థితి. మీరు శత్రు దేశం పైన అణుబాంబు వేసి సర్వనాశనం చేస్తే, మరో నిమిషం అవతల దేశం కూడా అదే పని చేస్తుంది. అందుకే తర్వాత రోజుల్లో చిన్నవి, తక్కువ శక్తిమంతమైన బాంబులను తయారుచేయటం మొదలు పెట్టారు. అణుబాంబు రూపొందించటంలో కీలక భూమిక పోషించిన భౌతిక శాస్త్రవేత్త రాబర్ట్ హైమర్ తర్వాత రోజుల్లో తాను చేసిన పనికి పశ్చాత్తాపానికి లోనయ్యాడు. ఇవన్నీ పక్కన పెడితే ప్రపంచంలో ఏ కొత్త ఆవిష్కరణ వచ్చినా, ముందుగా మిలిటరీలోనే దానికి బీజాలు పడ్డాయనేది చారిత్రక సత్యం.

– డాక్టర్ పార్థసారథి చిరువోలు
సీనియర్ జర్నలిస్ట్ । 99088 92065

ముక్తి మార్గం!

ఒక పని సఫలం కావడం అనేది మానవ ప్రయత్నం, దైవ సహకారం రెండూ తోడైనప్పుడే జరుగుతుంది కాబట్టి ఆ రెండింటిలో ఎక్కువ తక్కువలనేది లేదు. నిప్పు రవ్వంతైనప్పటికీ గాలితోడుతో పెరిగి పెద్దదైనట్లుగా, మంచి పని చేయడం ఎంత చిన్నదిగా మొదలైనా దైవానుకూలతతో పెరిగి పెద్దదై మనిషికి ఎనలేని మేలును కలగజేస్తుంది. తైలం అయిపోయిన వెంటనే దీపం ఆరిపోయే విధంగా, చేసే కర్మలో పవిత్రత ఎప్పుడైతే లోపిస్తుందో అప్పటినుండి దైవానుకూలత తగ్గిపోవడం ప్రారంభమౌతుందని పెద్దలు చెబుతారు.

కాలానుగుణంగా ఎలాగైతే చెట్లకు ఆకులు, పూవులు, కాయలు కలుగుతాయో అలాగే మనిషి చేసే మంచి చెడు పనులకు అనుగుణంగా, ఆ యా కాలాలలో సరిపోల్చదగిన మంచి, చెడు ఫలితాలు కలుగుతాయి. ప్రకృతిలో మార్పులను తెచ్చే ఋతువులు మనిషి చేసే మంచి చెడు పనులను చూస్తూనే వుంటాయి. కాబట్టి ఎవ్వరికీ కనపడ కుండా ఏదో రహస్య కార్యం చేస్తున్నాను అని మనిషి అనుకోవడం వెర్రితనమే అనిపించుకుంటుంది. మానవుడు నలుగురికి మేలు చేసే మంచిపనులను చేయడంలో నిమగ్నుడైతే దాని ఫలితం ఈ లోకంలోనే కాక పరలోకంలో కూడా అనుభవిస్తాడని, ఆంధ్రమహా భారతంలోని తిక్కన పద్యం చెప్పింది.



మేలు రెండు లోకంబుల మేల తెచ్చు;
గీడు సేసిన దప్పదు కీడ యగుట
కాన పురుషవర్తనమున కానుకూల్య
శీలమగు దైవ మది ఫలసిద్ధి జేయు.

ఈ లోకంలో తోటివారికి మేలును కలగజేసే పని చేస్తే అది రెండు లోకాలకూ–అనగా ఇహ పరలోకాలు అనబడే రెండు లోకాలకూ–పుణ్యఫలాన్ని సమకూర్చే మేలే అవుతుంది. అలాగే, అకారణంగా తోటి మనిషికి కష్టం కలగజేసే పని ఇహ పరాలు రెండింటిలోనూ నష్టాన్ని కలిగించి బాధించేదిగా పరిణమిస్తుంది. ఈలోకంలో మనిషి చేసే మంచి చెడు పనులకు అనుగుణంగానే దైవం సమకూర్చే పుణ్యాపాప ఫలాలు ఆధార పడి ఉంటాయి కాబట్టి, మనిషి ఈ సత్యాన్ని గ్రహించి ఎప్పుడూ మంచి పనులను చేయడంపైనే దృష్టి పెట్టి జీవనం సాగించాలని, ఫలసిద్ధికి, అనగా ముక్తికి అది సుఖమైన మార్గమని ఆ పద్యంలో సారాంశంగా చెప్పబడింది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.పంచమి సా.4.14 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** మృగశిర తె.4.50 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** ఉ.10.24 నుండి 12.01 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.48 నుండి 7.26 వరకు, **అమృతఘడియలు:** రా.8.02 నుండి 9.43 వరకు, శ్రీ పంచమి; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.49, **సూర్యాస్తమయం:** 6.10.

నోటిఫికేషన్ వచ్చిన 5 రోజుల్లో ఇంటి వద్ద ఓటుకు దరఖాస్తు

12డి ఫామ్ పూర్తి చేసి రిటర్నింగ్ అధికారికి ఇవ్వాలి



- ఈ ఫామ్ సేకరించే బాధ్యత బూత్ స్థాయి ఆఫీసర్‌కు
- 85 ఏళ్లు పైబడిన, 40 శాతం వైకల్యం ఉన్న వారు అర్హులు
- దివ్యాంగులు వికలాంగ ధ్రువీకరణ పత్రం కూడా ఇవ్వాలి
- దేశంలో 1.70 కోట్లు పైగా 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగ ఓటర్లు
- రాష్ట్రంలో 85 ఏళ్లు పైబడిన ఓటర్లు 2.11 లక్షలు.. వికలాంగులు 5.18 లక్షలు
- 85 ఏళ్లు పైబడిన ఓటర్లలో మహిళలే అధికం
- ఇంటి వద్దే ఓటు వేసే ప్రక్రియ మొత్తం వీడియో చిత్రీకరణ
- ఓటు ఎవరికి వేశారో తెలియకుండా గోప్యత
- కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడి

సాక్షి, అమరావతి: పోలింగ్ కేంద్రం వరకు రాలేని వృద్ధులు, దివ్యాంగులకు ఈ ఎన్నికల్లో ఇంటి వద్దే ఓటు వేసే సౌకర్యం కల్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) నిర్ణయం తీసుకుంది. దేశంలో 85 ఏళ్లు పైబడిన ఓటర్లు, 40 శాతం, అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగ ఓటర్లు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. ఈమేరకు రాష్ట్రాల వారీగా ఇంటి వద్దే ఓటు వేసేందుకు అర్హత ఉన్న ఓటర్ల సంఖ్యను కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్, కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు శుక్రవారం ప్రకటించారు. వీరికి ఇంటి వద్దే ఓటు వేయాలనేది తప్పనిసరి కాదని, ఇది ఐచ్ఛికం మాత్రమేనని చెప్పారు. ఇటువంటి ఓటర్లు దేశవ్యాప్తంగా 1.70 కోట్లకు పైగా ఉన్నట్లు సీఈసీ తెలిపింది. ఇందులో 85 ఏళ్లు పైబడిన వారు 81 లక్షలకు పైగా, దివ్యాంగులు 90 లక్షలకుపైగా ఉన్నారు. 85 ఏళ్లు పైబడిన ఓటర్లలో మహిళలు ఎక్కువ ఉన్నారు. వీరిలో 33.84 లక్షల మంది పురుషులు కాగా, 47.27 లక్షల మంది మహిళా ఓటర్లు, 18 మంది థర్డ్ జెండర్‌లు ఉన్నారు. 40 శాతం వైకల్యం ఉన్న ఓటర్లలో 53.64 లక్షల మంది పురుషులు, 36.42 లక్షల మంది మహిళలు, 442 మంది థర్డ్ జెండర్‌లు ఉన్నారు. ఈ వర్గాల వారికి ఇంటి వద్దే ఓటు వేసే సదుపాయం కల్పించడం ప్రగతిశీల చర్యగా ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ వర్గాలకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేసే సమయంలో ఇబ్బందులు కలగకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది.

ఈ సదుపాయాన్ని పొందే విధానం సరళంగా, సమగ్రంగా, పారదర్శకంగా కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన ఐదు రోజుల్లోగా అర్హులైన ఓటర్లు ఇంటి వద్ద ఓటు వేసేందుకు 12 డి ఫారమ్‌ను పూర్తి చేసి రిటర్నింగ్ అధికారికి ఇవ్వాలి. దివ్యాంగులు 12 డి ఫామ్‌తో పాటు వైకల్య ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. వీరి నుంచి 12 డి ఫామ్‌ను బూత్ లెవల్ ఆఫీసర్ సేకరిస్తారు. జవాబుదారీ, పాదర్శకత కోసం ఇంటి వద్ద ఓటు వేసే వారి వివరాలను అభ్యర్థులకు అందుబాటులో ఉంచుతారు. అవసరమైతే అభ్యర్థులు ఈ ప్రక్రియను పర్యవేక్షించుకోవచ్చు. ఈ ఓటర్ల ఇళ్లకు భద్రతా అధికారులతో పాటు ప్రత్యేక పోలింగ్ బృందం వెళ్తుంది. ఎప్పుడు ఇంటికి వస్తారో ముందుగానే ఆ ఓటర్లకు తెలియజేస్తారు. ఇంటి వద్ద ఓటు వేసే పూర్తి ప్రక్రియను వీడియో తీస్తారు. ఓటు ఎవరికి వేశారో తెలియకుండా గోప్యతను పాటిస్తారు. ఇంటి వద్ద ఓటు వేసిన తరువాత ఆ బ్యాలెట్‌లను భద్రంగా బ్యాక్సుల్లో ఉంచి తిరిగి రిటర్నింగ్ అధికారికి స్వాధీనం చేస్తారు.

రాష్ట్రంలో 85 ఏళ్లు పైబడిన ఓటర్లు

మొత్తం ఓటర్లు	2,11,088
పురుషులు	84,155
మహిళలు	1,26,927
థర్డ్ జెండర్	6

రాష్ట్రంలో 40 శాతం వైకల్యం గల ఓటర్లు

మొత్తం ఓటర్లు	5,18,193
పురుషులు	3,02,374
మహిళలు	2,15,795
థర్డ్ జెండర్	24

క్లుప్తంగా...

కర్నూలులో హెచ్‌ఆర్‌సీకి భవనం కేటాయింపు

- నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన కలెక్టర్ జి.సృజన



కర్నూల్ (సెంట్రల్): రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ) కార్యాలయానికి పూర్తి స్థాయి భవన సముదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. కర్నూలులోని బళ్లారి చౌరస్తాలో ఉన్న రాగ మయూరి కాంప్లెక్స్‌లో దాదాపు 1000 చదరపు గజాల భవనాన్ని కేటాయించింది. అందులో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసింది. కోర్టు హాళ్లు, చైర్మన్, సభ్యుల కోసం ప్రత్యేక క్యాబిన్‌లు, ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసింది. చైర్మన్, సభ్యుల ప్రోటోకాల్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టింది. 2021 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కర్నూలులో పనిచేస్తోంది. అయితే పూర్తి స్థాయి భవనం లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో పనిచేసేది. ఈక్రమంలో ప్రభుత్వం హెచ్‌ఆర్‌సీకి పూర్తి స్థాయి భవన సముదాయాన్ని కేటాయించింది. ఈ భవన సముదాయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్‌తో కలిసి ఆమె కార్యాలయాన్ని ప్రారంభించారు. శుక్రవారం నుంచే కొత్త భవన సముదాయంలో హెచ్‌ఆర్‌సీ తన విధులు, కార్యకలాపాలు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కమిషన్ ఇన్‌చార్జి కార్యదర్శి పి.అనుమంతరెడ్డి, కర్నూలు వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిశోర్ కుమార్, కమిషన్ విభాగాధికారులు సునీత, బొగ్గరం తారక నరసింహకుమార్ పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి పెద్దపీట

- రూ.140 కోట్లతో టూరిజం రిసార్టుల అభివృద్ధి
- కొత్త టెక్నాలజీతో గండికోట రోప్‌వే
- ఏపీ పర్యాటకానికి రూ.180 కోట్ల ఆదాయం
- టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్‌రెడ్డి వెల్లడి



బి.కొత్తకోట: రాష్ట్రంలో పర్యాటక కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని పర్యాటకశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆరవేటి లక్ష్మి మల్‌రెడ్డి చెప్పారు. అందులో భాగంగా రూ.140 కోట్ల వ్యయంతో 15 యూనిట్లలోని రిసార్టుల ఆధునికీకరణ, అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై అభివృద్ధి పనులు, ఆధునికీకరణ పనులను శుక్రవారం సాంకేతిక బృందంతో కలసి ఆయన పరిశీలించారు. మల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని హార్సిలీహిల్స్, కడప, కర్నూలు, నెల్లూరు, సూర్యలంక, బేరంపాడు, భవానీ ఐల్యాండ్, దిండి, ద్వారకా తిరుమల, విశాఖ యాత్రి నివాస్, టైడా, అనంతగిరి, అరకు వ్యాలీ, అరకు వ్యాలీ రిసార్ట్‌లను అభివృద్ధి చేసేందుకు రూ.140 కోట్లతో టెండర్లు నిర్వహించగా కాంట్రాక్టర్లు పనులు చేపట్టినట్టు తెలిపారు. వైఎస్సార్‌జిల్లా గండికోటలో చేపట్టిన రోప్‌వేను ఆధునాతన టెక్నాలజీతో చేపట్టాలని నిర్ణయించగా.. ప్రస్తుతానికి పనులు తాత్కాలికంగా ఆగినట్టు చెప్పారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో టూరిజం ఆదాయం రూ.164 కోట్లు రాగా, గత ఆర్థిక సంవత్సరంలో రూ.180 కోట్లు వచ్చిందని తెలిపారు. గండికోట, తిరుపతి, వైజాగ్‌లో ఒబెరాయ్ సంస్థ అధునాతన హోటళ్ల నిర్మాణానికి ముందుకొచ్చిందని, దీనిపై గతంలోనే ప్రభుత్వం భూమి కేటాయించిందని వివరించారు.

టీడీపీ సానుభూతిపరుడి వద్ద రూ.2.65 లక్షల నగదు సీజ్

అనంతపురం: టీడీపీ సానుభూతిపరుడి నుంచి రూ.2.65 లక్షల నగదును అనంతపురం రెండో పట్టణ పోలీసులు, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. ఎన్నికల నేపథ్యంలో సీఐ క్రాంతికుమార్ శుక్రవారం అనంతపురంలోని నాయక్‌నగర్ రైల్వే గేటు సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మారుతీనగర్‌కు చెందిన టీడీపీ సానుభూతిపరుడు పి.రామాంజినేయులు ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.2.65 లక్షల నగదును కారులో తరలిస్తూ పట్టుబడ్డారు. పోలీసులు నగదును సీజ్ చేసి అనంతపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు. అలాగే కళ్యాణదుర్గం మండలం బోరంపల్లిలో శుక్రవారం అనుమతులు లేకుండా టీడీపీ నాయకుడు జయరాం ఇంట్లో కల్లు అమ్ముతుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది పట్టుకున్నారు.

శిరోముండనం కేసు వాయిదా

విశాఖ–లీగల్: తూర్పుగోదావరి జిల్లాలో సంచలనం సృష్టించిన శిరోముండనం కేసు ఈనెల 16వ తేదీకి వాయిదా పడింది. న్యాయమూర్తి లాలం శ్రీధర్ విజయవాడకు బదిలీ అయ్యారు. దీంతో నూతన న్యాయమూర్తిగా పి.సత్య శ్రీదేవి రానున్నారు. ఈ నేపథ్యంలో కేసును తదుపరి విచారణ నిమిత్తం వాయిదా వేశారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


- ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా


స్వీప్ సెల్ఫీపాయింట్ వద్ద వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్, అధికారులతో ముఖేష్ కుమార్ మీనా

తిరుపతి సిటీ: రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా, పారదర్శకతతో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా హెచ్చరించారు. శుక్రవారం స్వీప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా తిరుపతి మహిళా వర్సిటీలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను ఆయన ప్రారంభించారు. వర్సిటీలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఎన్నికల విధుల్లో భాగంగా కలెక్టర్లు, ఎస్పీలు పనితీరు, ఫ్లయింగ్ స్క్వాడ్, కంట్రోల్ రూం పనితీరు, గ్రీవెన్స్‌లను ఎలా పరిష్కరిస్తున్నారనే విషయంపై తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్, బోర్డర్ సెక్యూరిటీల నిర్వహణను పరిశీలించినట్లు చెప్పారు. తిరుపతి జిల్లాలోని పద్మావతి మహిళా వర్సిటీలో కౌంటింగ్, స్ట్రాంగ్ రూంలను, స్వీప్ సెల్ఫీ పాయింట్‌ను పరిశీలించారు. స్వీప్ యాక్టివిటీలో భాగంగా 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో 4నెలల క్రిందట డ్రాఫ్ట్ రోల్ ప్రచురించబడినప్పుడు కొత్తగా నమోదైన ఓటర్లు 3లక్షలే ఉండేవని, ఎలక్షన్ కమిషన్, జిల్లాల్లోని కలెక్టర్లు, అధికారులు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల ద్వారా ఆ ప్రస్తుతం సంఖ్య 10 లక్షలకు చేరుకుందన్నారు. ఓటరుగా నమోదు చేసుకొనుటకు మరో 2 రోజులు అవకాశం ఉందని తెలిపారు. నియమాలకు విరుద్ధంగా డౌన్లోడ్ చేసిన ఎపిక్ కార్డుల అభియోగాలపై ఐఎఎస్ అధికారి నుంచి మండల స్థాయి వరకు అధికారులపై చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కొన్ని విషయాల్లో సీఎం జగన్‌కు, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుకి నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఆధారాలు లేని రూ. 8 కోట్ల విలువ చేసే నగదు, వస్తువులను సీజ్ చేశామన్నారు.

ఓటు నమోదుకు మూడు రోజులే గడువు

- 18 ఏళ్లు నిండిన వారంతా ఈనెల 15లోగా ఓటు నమోదు చేసుకోండి
- మే 13న తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోండి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఓటు నమోదుకు ఇక మూడు రోజుల సమయమే ఉంది. 18 సంవత్సరాల వయసు నిండి.. ఓటర్ జాబితాలో పేరులేని వారంతా ఈ నెల 15లోగా ఆన్‌లైన్ ద్వారా గానీ లేదా సంబంధిత రెవెన్యూ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో గానీ ఫాం–6ను సమర్పించడం ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సూచించారు. ఆయన మాట్లాడుతూ.. 'ఓటర్ జాబితాలో పేరుందో, లేదో ఒకసారి ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవాలి. ఓటర్ గుర్తింపు కార్డు ఉన్నప్పటికీ.. జాబితాలో పేరు లేకపోతే పోలింగ్ రోజు ఓటు వేయలేరు. పేరు లేకపోతే ఈ నెల 15లోగా ఫాం–6 సమర్పిస్తే తప్పకుండా ఓటు హక్కు కల్పిస్తాం. సాధారణంగా అయితే నామినేషన్ల చివరి తేదీ వరకు ఓటు నమోదుకు అవకాశముంటుంది. 15వ తేదీ తర్వాత నమోదు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలించి ఓటు హక్కు జారీ చేయడానికి 10 రోజుల సమయం పడుతుంది. అందువల్ల చివరి వరకు ఆగకుండా ఏప్రిల్ 15లోగా నమోదు చేసుకోవడం మంచిది' అని సూచించారు. ఓటర్ల నమోదు ప్రక్రియపై రాజకీయ పార్టీల నుంచి ఆరోపణలు రాకుండా.. అధికారులు అన్ని ధ్రువపత్రాలు సక్రమంగా ఉన్నాయా, లేవా అని సరి చూసిన తర్వాతే ఓటర్‌గా నమోదు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్నా.. ఫిజికల్‌గా ఆధార్ కాపీ, వయసు నిర్ధారణ ధ్రువపత్రంతో పాటు ఇంత వరకు ఎక్కడా ఓటు హక్కు లేదన్న ధ్రువీకరణ పత్రాలను తీసుకొని ఓటర్‌గా నమోదు చేస్తున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని కేవలం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి వదిలేయకుండా.. అన్ని కాపీలను తీసుకువచ్చి ఇవ్వాల్సిందిగా అధికారులు కోరుతున్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు కావడమే కాకుండా మే 13న జరిగే పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలని మీనా సూచించారు.

ముస్లిం మైనార్టీల మద్దతు వైఎస్సార్‌సీపీకే

డాక్టర్ నూరీపరి



మచిలీపట్నంటౌన్: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల మద్దతు వైఎస్సార్ సీపీకే ఉంటుందని కడపకు చెందిన పది రూపాయల డాక్టర్ నూరీపరి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కృష్ణాజిల్లా మచిలీపట్నం వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ అమలు చేసిన 4 శాతం రిజర్వేషన్ల వల్ల ఎంతోమంది ముస్లిం పేద విద్యార్థులు ఇంజనీర్లుగా, డాక్టర్లుగా ఎదిగారన్నారు. గతంలో ఏ రాజకీయ పార్టీ ముస్లిం మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వలేదని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఏడు అసెంబ్లీ సీట్లను ముస్లిం మైనార్టీలకు కేటాయించారని తెలిపారు. 21 సీట్లకు కూటమితో ఒప్పందం కుదుర్చుకున్న పవన్‌కళ్యాణ్ కేవలం 11 సీట్లలోనే తన పార్టీ అభ్యర్థులను నిలిపాడని విమర్శించారు. వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు అత్యుత్తమ అంకాలజిస్ట్‌గా పేరొందారని ఆయనను, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

కృష్ణలంక (విజయవాడతూర్పు)/నందిగామ/గుడివాడ టౌన్/నూజివీడు/మండవల్లి/దెందులూరు/భీమవరం: విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దేవినేని అవినాశ్ సమక్షంలో కృష్ణలంక, 20వ డివిజన్‌లో 25 కుటుంబాలకు చెందిన యువకులు వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం సోమవరం గ్రామానికి చెందిన 8 కుటుంబాలు, కొణతమాత్మకూరుకి చెందిన 3 కుటుంబాలు టీడీపీని వీడి ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. గుడివాడలో ఎమ్మెల్యే కొడాలి నాని సమక్షంలో దనియాలపేటలోని వాంబే కాలనీకి చెందిన యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏలూరు జిల్లా నూజివీడు అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సమక్షంలో నూజివీడు మండలంలోని బోర్వంచలో టీడీపీ నేత సయ్యద్ అనీజ్ ఖాద్రీ ఆధ్వర్యంలో 15 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఏలూరు జిల్లా మండవల్లిలో ఎమ్మెల్యే డీఎన్నార్ సమక్షంలో టీడీపీని వీడి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏలూరు జిల్లా దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సమక్షంలో చల్లచింతలపూడిలో టీడీపీ ఎంపీటీసీ సింహాద్రి పద్మావతి, 60 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని 7,13 వార్డులకు చెందిన 100 మంది టీడీపీ, జనసేనలకు చెందిన కార్యకర్తలు, నేతలు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో టీడీపీ మాజీ కౌన్సిలర్ సీసలి రాజేశ్వరి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.


గుడివాడలో యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని



విజయవాడలో యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి అవినాశ్


సోమవరం గ్రామస్తులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఉదయభాను


భీమవరంలో కండువాలు కప్పి మహిళలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు


కుటుంబ సభ్యులతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిటి రవికుమార్


ఆలయం వెలుపల జస్టిస్ సంజయ్ కరోల్

తిరుమల/శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సిటి రవికుమార్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ షెయ్, సీనియర్ ఐఏఎస్ అధికారి అనిల్ కుమార్ సింఘాల్, రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాల కృష్ణ శ్రీవారిని దర్శించుకున్నారు.

ముక్కంటి సేవలో..

శ్రీకాళహస్తిలోని శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సిటి రవికుమార్, జస్టిస్ సంజయ్ కరోల్ శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, ప్రసాదాలు అందజేశారు.


తిరుచానూరు ఆలయంలో కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకున్న లెఫ్టినెంట్ జనరల్ ఏకే.సింగ్

అమ్మవారి సేవలో లెఫ్టినెంట్ జనరల్

చంద్రగిరి(తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్ కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు ప్రసాదాలను అందజేశారు.

చంద్రబాబు కుట్రలో సోదరీమణుల భాగస్వామ్యం

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పులివెందుల: రాష్ట్రవ్యాప్తంగా బలిజలు, కాపులకు జగనన్న ప్రభుత్వం అండగా ఉందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చెప్పారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలోని భాకరాపురం వద్ద ఉన్న వైఎస్సార్ ఆడిటోరియంలో శుక్రవారం నియోజకవర్గ బలిజ సంఘీయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఎల్లో మీడియా ద్వారా నిత్యం జగనన్న, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద చల్లే కార్యక్రమం చేస్తున్నాడన్నారు. ఎన్ని కుట్రలు చేసినా సరిపోక, చివరకు జగనన్న కుటుంబంలోని సోదరీమణులను కూడా కుట్రలో చంద్రబాబు భాగస్వాములను చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు తన స్వార్థం కోసం ఏ స్థాయికైనా దిగజారుతాడనేందుకు ఇది నిదర్శనమన్నారు. 'నిజంగా వారు ఎంత ద్వేషం, ఓర్వలేని తనంతో మాట్లాడుతున్నారో ప్రజలందరూ గమనిస్తున్నారు. ఈ ప్రాంత వాసులుగా నన్ను 15 సంవత్సరాలుగా, నా తండ్రి భాస్కర్‌రెడ్డిని 40 సంవత్సరాలుగా చూస్తున్నారు. మేం ఎలాంటి వారమో అందరికి తెలుసు. కేవలం చంద్రబాబు కుట్రలో పావులుగా మారి మమ్మల్ని ఇబ్బందులకు గురిచేసే కార్యక్రమాలు చేస్తున్నారు. గడిచిన మూడేళ్లుగా ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో ప్రజల్లోనే ఉన్నాను. ఎన్నికల సమయం దగ్గర పడేకొద్దీ కుట్రలకు ఇంకా పదును పెడుతున్నారు. ఎన్ని కుట్రలు పన్నినా, ఎలాంటి ఆరోపణలు చేసినా భయపడను. నేను ఏ తప్పూ చేయలేదు. ఇదే ఆత్మవిశ్వాసంతో ప్రజల్లోనే ఉంటాను. నా ఊపిరి ఉన్నంతవరకు జగనన్న, కార్యకర్తలతో ఉంటాను' అని అవినాష్‌రెడ్డి తెలిపారు.

భీమవరంలో 15న సిద్ధం బస్సు యాత్ర

భీమవరం: ఉభయగోదావరి జిల్లాల్లో ఇప్పటికే ప్రకటించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల్లో మార్పు ఉండబోదని ఉభయగోదావరి జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇడుపులపాయలో ప్రకటించిన జాబితాలోని అభ్యర్థులంతా పోటీలో ఉంటారని చెప్పారు. భీమవరంలో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతో కలసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఈ నెల 15న జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం బస్సుయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కృష్ణాజిల్లా నుంచి ఈ నెల 15వ తేదీ సోమవారం మధ్యాహ్నం మూడుగంటలకు బస్సు యాత్ర భీమవరం చేరుకుంటుందని చెప్పారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల దగ్గర నుంచి బస్సుయాత్ర రోడ్‌షోగా బైపాస్ రోడ్డుకు చేరుకుంటుందన్నారు. అక్కడ బహిరంగసభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు. భీమవరం సభ అనంతరం గరగపర్రు, పిప్పర మీదుగా తాడేపల్లిగూడెం వరకు రోడ్‌షో నిర్వహిస్తారని చెప్పారు. తాడేపల్లిగూడెంలో రాత్రి బస అనంతరం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం చేరుకుంటారని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ నాయకులు చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వాటన్నింటికీ ముఖ్యమంత్రి జగన్ దీటైన సమాధానం చెబుతారని తెలిపారు.

ఆ మూడ్ స్వింగ్ ఎటో!

కీలకంగా మారిన బిహార్, బెంగాల్, మహారాష్ట్ర ● ఎవరికీ అందని ఓటర్ల నాడి ● ఎన్నికల ఫలితాలనే ప్రభావితం చేసే చాన్స్

దేశంలో మోదీ మేనియా ఏమాత్రం తగ్గలేదని, ఫలితంగా వరుసగా మూడో ఘన విజయంతో బీజేపీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని పలు సర్వేలు చెబుతున్నాయి. అయితే కీలక రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, బిహార్, మహారాష్ట్రల్లో మాత్రం ఓటరు నాడి ఎవరికీ అందడం లేదు. దాంతో వాటిని ఈసారి ఎన్నికల ఫలితాలను నిర్దేశించగల స్వింగ్ స్టేట్లుగా రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఎందుకంటే ఆ మూడు రాష్ట్రాలూ కలిపి ఏకంగా నాలుగో వంతు ఎంపీలను లోక్‌సభకు పంపుతున్నాయి! వాటిని నిర్ణాయక రాష్ట్రాలుగా మారుస్తున్న కారకాలేమిటి? అక్కడ ఫలితాలను ఊహించడం ఎందుకింత కష్టసాధ్యంగా మారింది...?

- సాక్షి, నేషనల్ డెస్క్

అమెరికాలో 7 రాష్ట్రాలను స్వింగ్ స్టేట్స్‌గా పేర్కొంటారు. అధ్యక్ష ఎన్నికల ఫలితాలను ప్రతిసారీ అవే నిర్ణయిస్తుంటాయి. ఎన్డీఏ 400 సీట్లు దాటాలన్న లక్ష్యాన్ని దాటుతుందో లేదో బెంగాల్, బిహార్, మహారాష్ట్ర ఫలితాలు నిర్ణయించనున్నాయి. బెంగాల్లో టీఎంసీ,బీజేపీ మధ్య పోరు నెలకొంది. బిహార్లో రాజకీయ పునరేకీకరణతో సమీకరణాలు మారాయి. మహారాష్ట్రలో రెండు పెద్ద పార్టీలు నిలువునా చీలి రెండో ఎన్డీఏలో, మరో రెండు విపక్ష ఇండియా కూటముల్లో చేరి ఎదురెదురుగా మోహరించాయి. దాంతో 130 ఎంపీ సీట్లున్న ఈ 3 రాష్ట్రాల్లో ఎవరికెన్ని సీట్లు వస్తాయన్నది ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు.

బెంగాల్లో బీజేపీ పాచిక పారేనా...?



2019 లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్లో బీజేపీ పాగా వేసిన తీరు ఆసక్తికరం. మోదీ మేనియాకు పౌరసత్వ అంశం తదితరాలు తోడవడంతో 42 లోక్‌సభ స్థానాల్లో ఏకంగా 18 సీట్లను బీజేపీ తన ఖాతాలో వేసుకోగలిగింది. 2014లో 17 శాతమున్న ఓటు శాతాన్ని 40 శాతానికి పెంచుకోగలిగింది. ఈసారి పరిస్థితి ఎలా ఉండనందన్నది అంచనాలకు అందడం లేదు. కాకపోతే ప్రతి స్థానంలోనూ హోరాహోరీ పోరు ఖాయంగా కన్పిస్తోంది. ప్రధాని మోదీ ఇంకా రాష్ట్రంలో పూర్తిస్థాయిలో ఎన్నికల ప్రచారం మొదలు పెట్టలేదు. ఆయన ఏయే అంశాలను ప్రచారాస్త్రాలుగా సంధిస్తారన్నది కూడా ఆసక్తికరం. వాటిని బట్టి రాష్ట్రంలో ఓటర్ల మూడ్ మారిపోయే ఆస్కారముంది. అయితే బెంగాల్లో ఈసారి బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరిస్తుందని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ చెబుతుండటం ఆసక్తికరం. మిగతా విశ్లేషకులు మాత్రం బీజేపీకి ఈసారి ఓట్లశాతం మరింత పెరగవచ్చంటూనే, అది సీట్ల సంఖ్యలో ప్రతిఫలిస్తుందో లేదో చూడాలని చెబుతుండటం విశేషం. పౌరసత్వ సవరణ చట్టం అమల్లోకి రావడం తదితరాల నేపథ్యంలో రాష్ట్రంలో భారీగా ఉన్న ముస్లింల ఓట్లు పూర్తిగా టీఎంసీ వైపు మళ్లినట్టేనని వారంటున్నారు. ఇది మా పార్టీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీకి అతి పెద్ద సానుకూలాంశంగా కన్పిస్తోంది. ''దీనికి తోడు యూపీ వంటి రాష్ట్రాల మాదిరిగా బెంగాల్లో బీజేపీకి పటిష్టమైన సంస్థాగత నిర్మాణం లేదు. పైగా రాష్ట్ర పార్టీలో సువేందు అధికారి, దిలీప్ ఘోష్, సుకాంతో మజుందార్ మధ్య ఆధిపత్య పోరు పుట్టి ముంచేలా కన్పిస్తోంది'' అని సీనియర్ జర్నలిస్టు జయంత ఘోషా అభిప్రాయపడ్డారు. తృణమూల్ తన 22 స్థానాలను నిలుపుకుంటుందని, బీజేపీకి ఒక సీటు పెరుగుతుందని, కాంగ్రెస్ ఒక్క స్థానానికి పడిపోతుందని ఇండియాటుడే సర్వే పేర్కొంది.

రసకందాయంలో బిహార్



2019లో ఎన్డీఏ క్లీన్‌స్వీప్ చేసిన రాష్ట్రాల్లో బిహార్ ముఖ్యమైనది. 40కి ఏకంగా 39 స్థానాలు అధికార కూటమి వశమయ్యాయి. కానీ ఇక్కడ ఎన్నికల ఫలితాలను అంచనా వేయడం ఎప్పుడూ కత్తిమీద సామే. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు నల్లేరుపై నడకేనని అంతా భావించారు. తీరా చూస్తే ఆ అంచనాలన్నీ తప్పి జేడీ(ఎస్), ఆర్జేడీల మహాఘట్‌బంధన్ ఘనవిజయం సాధించింది. కానీ పల్టూ రామ్‌గా పేరుపడ్డ జేడీ(యూ) సారథి, సీఎం నితీశ్‌కుమార్ 2020 అసెంబ్లీ ఎన్నికల నుంచి వేస్తున్న పిల్లిమొగ్గలతో ఓటర్లలో తీవ్ర అయోమయం నెలకొన్నట్టు కన్పిస్తోందని పట్నాకు చెందిన సీనియర్ జర్నలిస్టు రోహిత్‌సింగ్ అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో జట్టు కట్టిన నితీశ్ 2022లో దానికి కటీఫ్ చెప్పి ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమితో స్నేహం చేశారు. తాజాగా గత జనవరిలో మళ్లీ ఎన్డీఏ గూటికి చేరారు. దీన్ని జనం జీర్ణించుకోలేకపోతున్నారన్నది రోహిత్ విశ్లేషణ. అయితే కుల సమీకణాల కోణంలో బీజేపీ-జేడీ(యూ) భాగస్వామ్యం బలమైన జోడీగా కన్పిస్తుండటం విశేషం. కుర్మీ సామాజికవర్గానికి చెందిన నితీశ్‌కు రాష్ట్రంలో ఏకంగా 36 శాతమున్న అత్యంత వెనకబడ్డ వర్గాల్లో విశేష ఆదరణ ఉంది. పైగా గతేడాది బిహార్లో జరిపించిన కులగణన ఆయనకు మరిన్ని ఓట్లు కురిపించేలా కన్పిస్తోంది. 2005, 2010 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-జేడీ(యూ) జోడీ సూపర్‌హిట్టయింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఏకంగా 39 సీట్లు కొల్లగొట్టింది. దీనికి తోడు ఎన్నికల వేళ ఇంటి పోరు ఆర్జేడీకి పెద్ద తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో మోదీ-నితీశ్ జోడీ దూకుడును తేజస్వీ యాదవ్ ఏ మేరకు నిలువరిస్తారన్నది ఆసక్తికరం.

'మహా' గందరగోళం...



48 సీట్లున్న మహారాష్ట్ర యూపీ తర్వాత లోక్‌సభకు అత్యధిక ఎంపీలను పంపుతోంది. 2014, 2019 ఎన్నికల్లో ఇక్కడ ఎన్డీఏ గెలుపు నల్లేరుపై నడకలా సాగింది. 2019లోనైతే బీజేపీ, శివసేన సంయుక్తంగా ఏకంగా 41 స్థానాలు ఒడిసిపట్టాయి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. గత ఐదేళ్లలో రాష్ట్రంలో రాజకీయాలతో పాటు ఏకంగా పార్టీలే మారిపోయాయి! తర్వాత ఏక్‌నాథ్ షిండే సారథ్యంలో శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలో మరో కీలక పార్టీ ఎన్సీపీ నిలువునా చీలిపోయాయి. చీలిక వర్గాలే అసలైన పార్టీలుగా గుర్తింపు పొందాయి. ఎన్డీఏలో చేరి బీజేపీతో జట్టు కట్టి ఎన్నికల బరిలో దిగాయి. దీన్ని ప్రజలు పెద్దగా జీర్ణించుకోలేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దాంతో ఈసారి కాంగ్రెస్, ఉద్ధవ్ శివసేన, శరద్ పవార్ ఎన్సీపీలతో కూడిన విపక్ష ఇండియా కూటమిదే పైచేయి కావచ్చంటున్నారు. సర్వేలు కూడా ఇండియా కూటమి ఏకంగా 26 స్థానాలు గెలుస్తుందంటున్నాయి. అదే నిజమైతే రాష్ట్రంలో ఎన్డీఏ కూటమికి 20 సీట్లకు పైగా గండి పడుతుంది! అదే సమయంలో ఎన్నికల వేళ ఎంఎన్ఎస్ నేత రాజ్ ఠాక్రే మద్దతు ఎన్డీఏకు కాస్త కలిసొచ్చేలా కన్పిస్తోంది. మరాఠా రిజర్వేషన్లది కూడా ఈసారి రాష్ట్రంలో కీలక పాత్ర కానుంది. విద్య, ఉద్యోగాల్లో వారికి అదనంగా 10 శాతం కోటా కల్పిస్తూ శివసేన చీఫ్, సీఎం ఏక్‌నాథ్ షిండే ఇటీవలే అసెంబ్లీలో బిల్లు పెట్టారు. సాంప్రదాయికంగా బీజేపీ ఓటర్లయిన ఇతర వెనకబడ్డ వర్గాలు దీనిపై గుర్రుగా ఉన్నారు. మరాఠా కోటా తమ వాటాకే ఎసరు పెడుతుందన్న భయం వారిలో పెరుగుతోంది. ఇన్ని సమీకరణాల మధ్య మహారాష్ట్రలో ఎవరికెన్ని సీట్లొస్తాయో అంచనా వేయడం కష్టంగా మారింది.



ఎన్నికల విచిత్రం

లోకల్ రైలులో తిరుగుతూ ప్రజలను ఓట్లు వేయమని అభ్యర్థిస్తున్న ఈమె పేరు లాకెట్ చటర్జీ. పశ్చిమ బెంగాల్‌లో హుగ్లీ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తున్నారు

ఎలక్షన్ బీట్

బారాముల్లా బరిలో ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బారాముల్లా స్థానం నుంచి పోటీ చేస్తారని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) శుక్రవారం ప్రకటించింది. అదేవిధంగా, ఎన్‌సీ కంచుకోటగా ఉన్న శ్రీనగర్ నియోజకవర్గం నుంచి షియా నేత ఆగా సయ్యద్ రుహుల్లా మెహ్ది పోటీ చేస్తారని పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా వెల్లడించారు. మొత్తం 18 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించిన ఉన్న బారాముల్లా లోక్‌సభ స్థానంపైనే ఇప్పుడు అందరి దృష్టీ ఉంది. ఇక్కడి మెజారిటీ షియా ముస్లిం ఓట్లపైనే ఒమర్ ఆశలు పెట్టుకున్నారు. ఇక్కడ ఒమర్‌కు పీపుల్స్ కాన్ఫరెన్స్ నేత సజాద్ గనీ లోన్ నుంచి గట్టి పోటీ ఎదురుకానుంది. నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణకు ముందు 1957 తర్వాత బారాముల్లా సీటును ఎన్‌సీ పది పర్యాయాలు దక్కించుకోగా కాంగ్రెస్ నాలుగుసార్లు, పీడీపీ ఒక పర్యాయం గెలుచుకుంది.

ప్రచారానికి బెయిల్ ఇవ్వండి: సిసోడియా

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తమ పార్టీ తరఫున ప్రచారంలో పాల్గొనేందుకుగాను తనకు మధ్యంతర బెయిల్ మంజూరుచేయాలంటూ ఆప్ నేత మనీశ్ సిసోడియా శుక్రవారం ఢిల్లీలో సీబీఐ, ఈడీ కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఢిల్లీ మద్యం విధానంలో అవకతవకల కేసులో సిసోడియాను సీబీఐ గత ఏడాది ఫిబ్రవరి 26వ తేదీన అరెస్టుచేయడం తెల్సిందే. ఆ తర్వాత ఇదే కేసులో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సైతం ఆ తర్వాతి నెలలో సిసోడియాను అరెస్టుచేసి విచారించింది. కొద్దిరోజులు ఈడీ కస్టడీ తర్వాత కోర్టు ఆయనను జ్యుడీషియల్ కస్టడీకి తరలించింది. అప్పటి నుంచి ఆయన జైలులోనే ఉన్నారు.

అమేథీని నిర్లక్ష్యం చేశారు: స్మృతి ఇరానీ

అమేథీ(యూపీ): అమేథీ ఎంపీగా 15 ఏళ్లపాటు కొనసాగిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నియోజకవర్గం అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని కేంద్ర మంత్రి, బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ ఆరోపించారు. 'అప్పట్లో ఆయన తల్లి సోనియా గాంధీ ప్రభుత్వమే కేంద్రంలో ఉండేది. యూపీ ప్రజలు వారికే మద్దతిచ్చారు. కానీ, రాహుల్ గాంధీ అమేథీ అభివృద్ధిని గురించి పట్టించుకోలేదు'అని మంత్రి విమర్శించారు. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి చూస్తే అమేథీ గతంలో ఎంత నిర్లక్ష్యానికి గురైందో అర్థమవుతుందని చెప్పారు. శుక్రవారం అమేథీలోని తన నివాసంలో ఆమె మాట్లాడారు. వయనాడ్ నుంచి ఎందుకు పోటీ చేస్తున్నారంటూ కర్ణాటక మంత్రి ఒకరు గతంలో ప్రశ్నించగా అక్కడి ప్రజలు మరింత విధేయులుగా ఉంటారని రాహుల్ బదులిచ్చారని ఆమె పేర్కొన్నారు. అంటే 15 ఏళ్లపాటు ఎంపీగా ఉన్న నియోజకవర్గం ప్రజలు విధేయులు కారా? ద్రోహులా? అని స్మృతి ఇరానీ నిలదీశారు.

విభజించేందుకే కులగణన: జేపీ నడ్డా

ఛింద్వారా: దేశవ్యాప్త కులగణనకు బీజేపీ వ్యతిరేకం కాదని ఆ పార్టీ చీఫ్ జేపీ నడ్డా స్పష్టంచేశారు. కులగణన పేరిట సమాజాన్ని విభజించేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని ఆరోపించారు. శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారాలో జరిగిన బీజేపీ ప్రచారసభలో నడ్డా ప్రసంగించారు. '' గరీబ్(జీ), యువ(వై), అన్నదాత-కిసాన్(ఏ), నారీశక్తి(ఎన్).. జ్ఞాన(జీవైఏఎన్) సాధికారతపై మోదీ ప్రభుత్వం ప్రధానంగా దృష్టిపెట్టింది. దేశాభివృద్ధికి ఆ జ్ఞానమే మూలాధారం. జనాన్ని కులాల పేరిట విడగొట్టేందుకే కాంగ్రెస్ కులగణన డిమాండ్‌ను ముందుకు తెచ్చింది' అని నడ్డా అన్నారు.

ఇక కాంగ్రెస్ అంతర్ధానమే: రాజ్‌నాథ్

కాశీపూర్: రాక్షస బల్లుల తరహాలోనే కాంగ్రెస్ పార్టీ మరికొన్నేళ్లలో అంతరించిపోతుందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. కాంగ్రెసా.. అంటే ఏమిటి? అని చిన్నపిల్లలు అడిగే పరిస్థితి వస్తుందన్నారు. కాంగ్రెస్‌లో కొనసాగుతున్న అంతర్గత పోరాటం బిగ్‌బాస్ షోలాగా ఉందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ నుంచి నేతలు బయటకు వెళ్లిపోతున్నారని, ఒకరి తర్వాత ఒకరు బీజేపీలో చేరుతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం ఉత్తరాఖండ్‌లోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచార ర్యాలీలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు.

నియమావళిని బీజేపీ ఉల్లంఘిస్తోంది

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

కూచ్ బిహార్/అలీపూర్‌దువార్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని బీజేపీ ఉల్లంఘిస్తోందని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. రాజకీయ స్వలాభం కోసం బీజేపీ కేంద్ర విభాగాలను దుర్వినియోగం చేస్తోందన్నారు. అన్ని పార్టీలను సమదృష్టితో చూడాలని ఆమె ఎన్నికల సంఘాన్ని కోరారు. సీఎం మమత శుక్రవారం కూచ్ బెహార్, అలీపూర్‌దువార్‌లలో జరిగిన ఎన్నికల ర్యాలీల్లో ప్రసంగించారు. జల్పాయ్‌గురిలో ఇటీవలి తుపాను కారణంగా ధ్వంసమైన ఇళ్లను పునర్నిర్మించేందుకు ఎన్నికల సంఘం అనుమతులు ఇవ్వడం లేదని చెప్పారు.

మేమొస్తే 30 లక్షల ఉద్యోగాలు: రాహుల్

సాక్షి, చెన్నై/తిరునల్వేలి: కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే 30 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. గ్రాడ్యుయేట్లకు, డిప్లొమా పూర్తిచేసిన వారికి లబ్ధి చేకూర్చడానికి పార్లమెంట్‌లో అప్రెంటీస్‌షిప్ హక్కు చట్టం తీసుకొస్తామన్నారు. జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్)తో పేద విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే నీట్ నిర్వహణపై నిర్ణయాన్ని రాష్ట్రాలకే వదిలేస్తామన్నారు. తమిళనాడులోని తిరునల్వేలి, కోయంబత్తూరు లోక్‌సభ నియోజకవర్గాల్లో రాహుల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రచారంలో తమిళనాడు సీఎం స్టాలిన్ కూడా పాల్గొన్నారు.

రాష్ట్రపతి పాలనకు కుట్ర

కేజ్రీవాల్ సర్కార్‌ను అస్థిరపరిచే యత్నం: మంత్రి అతిశి

సాక్షి, న్యూఢిల్లీ: వరసబెట్టి మంత్రులుసహా ఏకంగా ముఖ్యమంత్రినే జైలుపాలుజేసిన కేంద్రప్రభుత్వం త్వరలో ఢిల్లీ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించేందుకు కుట్ర పన్నిందని ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ రాష్ట్ర మహిళా మంత్రి అతిశి శుక్రవారం తీవ్రమైన ఆరోపణలు చేశారు. విశ్వసనీయ వర్గాల ద్వారా తమకు ఈ సమాచారం అందిందన్నారు. ఢిల్లీలో ఆప్ మంత్రి అతిశి శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ''కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచి పడగొట్టేందుకు పెద్ద రాజకీయ కుట్ర జరుగుతోందని మాకు విశ్వసనీయ సమాచారం అందింది. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడం చట్టవిరుద్ధం. ఎన్నికల్లో ప్రజాతీర్పుకు ఇది పూర్తిగా వ్యతిరేకం. కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే రాష్ట్రపతి పాలన విధించే కుట్ర మొదలైందన్న బలమైన సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొంతకాలంగా సీనియర్ ఐఏఎస్ అధికారులుసహా ఖాళీగా ఉన్న పోస్టులను ఢిల్లీలో భర్తీ చేయలేదు. మంత్రులు ఆదేశించినా సరే సీనియర్ ప్రభుత్వాధికారులు సమావేశాలకు రావట్లేరు. ప్రభుత్వాన్ని ఎలా పాలించాలంటూ పదేపదే కేంద్ర హోం శాఖకు లెఫ్టినెంట్ గవర్నర్ లేఖలు రాస్తున్నారు. చాలా ఏళ్ల క్రితం నాటి కేసును తిరగదోడి కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శిని ఉద్దేశపూర్వకంగా ఇప్పుడు తొలగించారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా ఎక్సయిజ్ కేసులో సీఎంను అరెస్టు చేశారు'' అని అతిశి అన్నారు. ''ఢిల్లీలో రాజ్యాంగ సంక్షోభం తలెత్తిందని తరచూ బీజేపీనేతలు, లెఫ్టినెంట్ గవర్నర్ వ్యాఖ్యలు చేస్తున్నారు. 2014లో రాష్ట్రపతి పాలన పెడితే సుప్రీంకోర్టుకెళ్లాం. దాంతో ఎన్నికలొచ్చాయి. 2015, 2020లో రెండుసార్లు బీజేపీ మట్టికరిచింది ఆప్ గెలిచింది. ఈసారీ ఆప్ గెలుస్తుంది. మళ్లీ రాష్ట్రపతి పాలన విధిస్తే ప్రజలే బీజేపీకి బుద్ధిచెబుతారు'' అని మీడియా సమావేశంలో ఆప్ మంత్రి సౌరభ్ భరద్వాజ్ హెచ్చరించారు. ఇటీవల మంత్రిగా రాజీనామా చేసిన ఆప్ నేత రాజ్‌కుమార్ ఆనంద్ ఇంటి వద్ద ఆప్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు.



ఈసీ తీరుపై సీఐసీ విస్మయం

న్యూఢిల్లీ: సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరు, విశ్వసనీయతను ప్రశ్నిస్తూ అడిగిన సమాచారాన్ని ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కేంద్ర ఎన్నికల సంఘాన్ని కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) తీవ్రంగా తప్పుబట్టింది. చట్టాన్ని ఉల్లంఘించినందుకు లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఈసీని సీఐసీ ఆదేశించింది. ఈవీఎంల పనితీరు, ఓట్ల లెక్కింపు ప్రక్రియపై తాము లేవనెత్తిన అనుమానాలను నివృత్తిచేసేలా సమాచారం ఇవ్వాలని మాజీ ఐఏఎస్ అధికారి ఎంజీ దేవసహాయం సహా ప్రముఖ సాంకేతికవిద్యా నిపుణులు, ఐఐటీ, ఐఐఎంలలోని విద్యావేత్తలు, మాజీ ప్రభుత్వ ఉన్నతాధికారులు 2022 మే రెండో తేదీన ఈసీకి ఆర్టీఐ చట్టంకింద దరఖాస్తు పెట్టుకోవడం తెల్సిందే. తమ ఆర్టీఐ దరఖాస్తుపై ఈసీ ఏ మేరకు చర్యలు తీసుకుందని 2022 నవంబర్ 22న దేవసహాయం మరోసారి ఆర్టీఐ కింద సమాచారం అడిగారు. 30 రోజుల్లోపు సమాధానం ఇవ్వాల్సి ఉన్నా ఈసీ సమాధానం ఇవ్వలేదు. దీంతో ఆయన సీఐసీను ఆశ్రయించారు. దేవసహాయానికి ఎందుకు మీ స్పందన తెలపలేదు? అని ఈసీలోని పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌కు చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ హీరాలాల్ సమరియా అడగ్గా ఆయన సమాధానం ఇవ్వలేదు. ''ఆర్టీఐ దరఖాస్తుకు సమాధానం ఇవ్వకుండా పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్(పీఐఓ) వ్యవహరించిన తీవ్ర అసంతృప్తికి గురిచేస్తోంది. దీనిపై 30 రోజుల్లోగా పాయింట్లవారీగా వివరణ ఇవ్వండి' అని ఈసీని సీఐసీ ఆదేశించింది.

జమ్మూకశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర హోదా

శాసనసభ ఎన్నికలు నిర్వహిస్తాం

- ప్రజలు తమ సమస్యలు ఎమ్మెల్యేలకు, మంత్రులకు చెప్పుకోవచ్చు
- జమ్మూలో ఎన్నికల బహిష్కరణ పిలుపులు చరిత్రలో కలిసిపోయాయి
- ఆర్టికల్ 370 రద్దు తర్వాత అభివృద్ధి వేగం పుంజుకుంది
- జమ్మూకశ్మీర్, రాజస్తాన్ ఎన్నికల ప్రచారంలో మోదీ

ఉధంపూర్/జైపూర్: జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఇక ఎంతోదూరంలో లేవని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని, శాసన సభ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేలతో, మంత్రులతో చెప్పుకోవచ్చని తెలియజేశారు. గతంలో జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాదుల నుంచి ఎన్నికల బహిష్కరణ పిలుపులు వినిపించేవని, ప్రస్తుతం అవన్నీ చరిత్రలో కలిసిపోయాయని పేర్కొన్నారు. సీమాంతర ఉగ్రవాదం, బాంబు దాడులు, రాళ్ల దాడులు, కాల్పులు, ఘర్షణలు, భయాందోళనల ప్రసక్తి లేకుండా ఇక్కడ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరుగబోతున్నాయని చెప్పారు. శుక్రవారం జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్‌లో, రాజస్తాన్‌లోని బార్మర్‌లో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ మాట్లాడారు. రాజస్తాన్ రాష్ట్రం దౌసాలో రోడ్‌షోలో పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్ ప్రజల సమస్యలు పరిష్కరిస్తానంటూ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నానని తెలిపారు.



ఆ అడ్డుగోడ కూల్చేశాం.. శకలాలు సమాధి చేశాం

ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో అభివృద్ధి వేగవంతమైందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరిగిందని అన్నారు. గతంలో వైష్ణోదేవి, అమర్‌నాథ్ భక్తుల భద్రతకు ముప్పు ఉండేదని, ఇప్పుడు పరిస్థితి మారిపోయిందని వెల్లడించారు. గతంలో కుటుంబ పార్టీల నిర్వాకం వల్ల జమ్మూకశ్మీర్ ఎంతో నష్టపోయిందన్నారు. ఆర్టికల్ 370 అనే అడ్డుగోడను సృష్టించింది కుటుంబ పార్టీలేనని మండిపడ్డారు. ఈ ఆర్టికల్ వల్ల ప్రజలకు రక్షణ లభిస్తుందన్న భ్రమను కుటుంబ పార్టీలు కల్పించాయని ధ్వజమెత్తారు. ప్రజల అండతో ఈ అడ్డుగోడను కూల్చివేశామని, దాని శకలాలను సైతం సమాధి చేశామని వ్యాఖ్యానించారు.


ఓ వర్గం ఓట్ల కోసమే మాంసాహార వీడియోలు

విపక్ష 'ఇండియా' కూటమిది మొఘల్ రాజుల మైండ్‌సెట్ అని ప్రధానమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అయోధ్యలో రామ మందిరం బీజేపీ ఎన్నికల ఎత్తుగడ అంటూ విపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. రామాలయం కోట్లాది మంది ప్రజల విశ్వాసానికి సంబంధించిన అంశమని అన్నారు. రామజన్మభూమి అంశానికి 500 ఏళ్ల చరిత్ర ఉందని, అప్పట్లో ఎన్నికలు లేవని చెప్పారు. మొఘల్ పాలకులు ఆలయాలను కూల్చివేసి, మెజార్టీ ప్రజల మనోభావాలను గాయపర్చి ఆనందిస్తూ ఉండేవారని తెలిపారు. అదే ఆలోచనాధోరణితో విపక్షాలు వ్యవహరిస్తున్నాయని తప్పుపట్టారు. కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్ష నాయకులు ఓ వర్గం ప్రజలను సంతృప్తిపర్చి ఓట్లు దండుకోవడానికి పవిత్ర మాసాల్లో, నవరాత్రుల్లో మాంసాహారం తింటూ, ఆ వీడియోలను ఉద్దేశపూర్వకంగా ప్రచారంలోకి తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు.

దేశాన్ని శక్తిహీనంగా మారుస్తారా?

భారత రాజ్యాంగాన్ని బీజేపీ ఎంతగానో గౌరవిస్తోందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారంటూ విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ ఇప్పుడొచ్చినా రాజ్యాంగాన్ని రద్దు చేయలేరని అన్నారు. ప్రభుత్వానికి రాజ్యాంగం భగవద్గీత, రామాయణం, మహాభారతం, బైబిల్, ఖురాన్ లాంటిందని అన్నారు. తమకు రాజ్యాంగమే సమస్తం అని వివరించారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశంలో అణ్వాయుధాలను పూర్తిగా నిర్మూలిస్తామని విపక్ష ఇండియా కూటమిలోని భాగస్వామ్యపక్షాలు చెబుతున్నాయని మోదీ తప్పుపట్టారు. మనకు ఇరువైపులా అణ్వాయుధ సంపత్తి కలిగిన దేశాలున్నాయని చెప్పారు. మనకు అణ్వాయుధాలు లేకపోతే ఏం జరుగుతుందో తెలియదా? అని నిలదీశారు. మీరు ఎవరు ఆదేశాలతో పని చేస్తున్నారో చెప్పాలని ఇండియా కూటమిని నిలదీశారు. దేశాన్ని శక్తిహీనంగా మార్చడమే ఇండియా కూటమి లక్ష్యమా? అని ప్రధానమంత్రి మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

వారణాసి ఆలయంలో పోలీసులకు అర్చకుల డ్రెస్



అర్చకుల మాదిరి డ్రెస్‌లో మహిళా, పురుష పోలీసులు

లక్నో: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలోని ప్రఖ్యాత కాశీ విశ్వనాథ ఆలయంలో విధులు నిర్వర్తించే పోలీసులు దోతీ కుర్తా ధరించారు. మహిళా పోలీసులు సల్వార్ కుర్తాలో కనిపించారు. వారికి దోతీ కుర్తా, సల్వార్ కుర్తాలను ఉన్నతాధికారులు డ్రెస్‌కోడ్‌గా నిర్ణయించినట్లు తెలిసింది. అయితే, దీనిపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న పోలీసులు తమ యూనిఫాం కాకుండా ఇతర దుస్తులు ధరించడం ఏమిటని ప్రశ్నించారు. దీనివల్ల భద్రతకు ముప్పు కలుగుందని చెప్పారు. పోలీసులు పూజారుల వేషం వేయడం సరైంది కాదన్నారు. నేరగాళ్లు కూడా ఇలాంటి దుస్తులు ధరించి ప్రజలను మోసం చేసే అవకాశం ఉందన్నారు. ఆలయంలో పోలీసులు పూజారుల దుస్తులు ధరించాలంటూ ఆదేశాలు ఇచ్చినవారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, విశ్వనాథ ఆలయంలో పోలీసుల డ్రెస్‌కోడ్‌ను వారణాసి పోలీస్ కమిషనర్ మోహిత్ అగర్వాల్ సమర్థించారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆలయాల్లో పోలీసుల విధులు భిన్నంగా ఉంటాయని అన్నారు. రద్దీగా ఉన్నప్పుడు పోలీసులు నెట్టివేస్తే భక్తులు ఆగ్రహిస్తారని తెలిపారు. అర్చకుల వేషధారణలో ఉన్నవారు నెట్టివేస్తే పెద్దగా సమస్యలు రాబోవన్నారు.

ఇజ్రాయెల్‌పై దాడికి సిద్ధమైన ఇరాన్!

- వచ్చే 48 గంటల్లో ఏ క్షణంలోనైనా దాడి
- వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం

వాషింగ్టన్: సిరియా రాజధాని డమాస్కస్‌లోని తమ రాయబారి కార్యాలయంపై ఇజ్రాయెల్ దాడితో పట్టరాని ఆవేశంతో ఊగిపోతున్న ఇరాన్ వచ్చే 48 గంటల్లో ఇజ్రాయెల్‌పై దాడికి తెగబడే ప్రమాదం పొంచి ఉంది. ఎంబసీపై దాడిలో ఆర్మీ జనరళ్లు, సైన్యాధికారుల మరణానికి ప్రతీకారం తీర్చుకునేందుకు ఇరాన్ సిద్ధమవుతోందని వాల్‌స్ట్రీట్ జర్నల్ తన కథనంలో పేర్కొంది. దాడి చేస్తే రాజకీయ సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని ఇరాన్ సుప్రీం లీడర్ ఆయాతొల్లా అలీ ఖమేనీ చెబుతున్నాసరే ఆ దేశం తన నిర్ణయంపై వెనకడుగు వేసే పరిస్థితి లేదని కథనం వెల్లడించింది. నిజంగా దాడి జరిగితే పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలు ఊహించనంతగా ఎగసిపడటం ఖాయంగా కనిపిస్తోంది. ఇరాన్ దాడి చేస్తే ప్రతిదాడికి ఇజ్రాయెల్ ఇప్పటికే రెడీ అయిపోయిందని తెలుస్తోంది. యుద్ధ సంసిద్ధతపై వార్ కేబినెట్, రక్షణ శాఖ అధికారులతో ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ శుక్రవారం సమావేశం నిర్వహించారు. హమాస్‌తో ఇప్పట్లో ఆగని యుద్ధంలో తలమునకలైన ఇజ్రాయెల్.. ఇరాన్‌తోనూ కయ్యానికి కాలు దువ్వడంపై పశ్చిమదేశాలు ఆందోళన చెందుతున్నాయి. డమాస్కస్‌పై దాడి ఇజ్రాయెల్ పనేనని ఇరాన్ చెబుతుండగా ఇంతవరకూ ఈ విషయంలో ఇజ్రాయెల్ ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఏప్రిల్ ఒకటోతేదీ నాటి ఆ దాడిలో ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కోర్ ఇద్దరు సైనిక జనరళ్లు సహా ఏడుగురు అధికారుల మరణమే ఈ ఉద్రిక్తతలకు ఆజ్యం పోసింది. యుద్ధవాతావరణం నెలకొనడంతో ఇజ్రాయెల్, ఇరాన్, లెబనాన్‌కు వెళ్లొద్దని తమ పౌరులకు అమెరికా, ఫ్రాన్స్ దేశాలు హెచ్చరికలు జారీచేశాయి. ఉద్రిక్తతను మరింత పెంచొద్దని ఇరాన్‌కు నచ్చజెప్పాలని టర్కీ, చైనా, సౌదీ అరేబియా విదేశాంగ మంత్రులతో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఫోన్‌సంభాషణలో కోరారు. ఇరాన్ విషయంలో మీకు పూర్తి మద్దతు ఇస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యావ్ గాలంట్‌తో అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ చెప్పారు.

ఇజ్రాయెల్, ఇరాన్‌లకు వెళ్లకండి

పౌరులకు భారత సర్కార్ ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: తాము చెప్పే వరకూ ఇజ్రాయెల్, ఇరాన్‌లకు ప్రయాణాల పెట్టుకోవద్దని పౌరులకు భారత విదేశాంగ శాఖ సూచించింది. ఈ మేరకు శుక్రవారం అడ్వైజరీని విడుదలచేసింది. ఇప్పటికే ఆ దేశాల్లో ఉంటే భారతీయ ఎంబసీల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించింది. నిర్మాణరంగంలో కార్మికులుగా భారత్ నుంచి ఇకపై ఎవరినీ ఇజ్రాయెల్‌కు పంపబోమని భారత్ శుక్రవారం స్పష్టంచేసింది.


కేఫ్ పేలుడు సూత్రధారి అరెస్ట్

న్యూఢిల్లీ/బనశంకరి: బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో పేలుడు ఘటన దర్యాప్తులో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కీలక పురోగతి సాధించింది. పేలుడు సూత్రధారి అబ్దుల్ మతీన్ అహ్మద్ తాహా, కేఫ్‌లో ఐఈడీని అమర్చిన ముసవ్విర్ హుస్సేన్ షాజిబ్‌లను శుక్రవారం పట్టుకుంది. వీరిద్దరూ పూర్బమేదినీపూర్ జిల్లా కాంతిలో మారుపేర్లతో దాక్కుని ఉన్నట్లు ఎన్ఐఏ తెలిపింది. బెంగాల్, తెలంగాణ, కర్ణాటక, కేరళ పోలీసులు, కేంద్ర నిఘా విభాగాల సహకారంతో వీరిని గుర్తించడం సాధ్యమైందని వివరించింది. ఇద్దరూ కర్ణాటకలోని శివమొగ్గకు చెందిన వారు. మార్చి ఒకటో తేదీన కేఫ్‌లో సంభవించిన పేలుడులో సిబ్బంది కొందరు తీవ్రంగా గాయపడ్డారు. కేఫ్ భవనం దెబ్బతింది.పేలుడు ఘటనకు సూత్రధారి అబ్దుల్ మతీన్ తాహా 'అల్ హింద్'ఉగ్ర సంస్థలో చురుగ్గా వ్యవహరిస్తున్నట్లు ఎన్ఐఏ గుర్తించినట్లు తెలిసింది.



తూర్పులో ప్రచారానికి శ్రీకారం

తూర్పు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్ శుక్రవారం శ్రీకారం చుట్టారు.



సాగర్‌లో 510 అడుగుల నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 510.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నైపుణ్యాలు పెంచుకోవాలి

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకుంటే అవకాశాలు చేరువ అవుతాయని ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. -8లో▸

న్యూస్‌రీల్

దుర్గమ్మకు మందారం, కలువ పుష్పాలతో అర్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాలలో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం మందారం , ఎర్ర కలువ పుష్పాలతో అర్చన జరిగింది. ఉత్సవాలలో నాల్గో రోజైన శుక్రవారం అమ్మవారికి సమర్పించే పుష్పాలతో ఆలయ ఈవో కేఎస్ రామరావు, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఇతర ఆలయ అధికారులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం పుష్పాలను తీసుకుని పుష్పార్చన వేదిక వద్దకు చేరుకున్నారు. ఆలయ అర్చకుల వేద మంత్రోచ్చారణ మధ్య అమ్మవారికి మందారం, ఎర్ర, తెలుపు కలువ పుష్పాలతో అర్చన నిర్వహించారు. సుమారు గంటన్నర పాటు సాగిన పుష్పార్చనను భక్తులు, ఉభయదాతలు భక్తి శ్రద్ధలతో వీక్షించారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించారు. పుష్పార్చన నిర్వహించిన పూలను అర్చకులు భక్తులకు పంపిణీ చేయగా, పుష్పాల కోసం భక్తులు బారులు తీరి కనిపించారు.

విదేశీ భాషల కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధి ఆధారిత స్పానిష్, కొరియా, అరబిక్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో భాగంగా సమ్మర్ బ్యాచ్‌లుగా విదేశీ భాషలు స్పానిష్, కొరియా, అరబిక్‌లలో సర్టిఫికెట్ కోర్సులు ఏర్పాటు చేశామన్నారు. మే మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరింత సమాచారం కోసం కళాశాలలో స్వయంగా కానీ, 81439 29613 నంబర్‌లో కానీ సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

శివరామకృష్ణ క్షేత్రానికి రూ.1.01లక్షల విరాళం



కోడూరు: కృష్ణాజిల్లా కోడూరులో నూతనంగా నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి పసుపులేటి రాము-విశాలాక్షి దంపతులు రూ.1.01లక్షల నగదును విరాళంగా అందించారు. శుక్రవారం ఈ నగదును కమిటీ సభ్యులకు అందించారు. పూర్తి గ్రానైట్‌తో నిర్మిస్తున్న ఆలయానికి తమ వంతు సహాయం అందించడం ఆనందంగా ఉందని రాము దంపతులు తెలిపారు. కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాథ్ బాబు, జూపూడి సుభాష్‌చంద్రబోస్, అన్నం శివరామకృష్ణ, తూనుగుంట్ల మహేష్, అన్నం సురేంద్ర పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు ఆలయ ఈవో కేఎస్ రామరావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న వసంత నవరాత్రోత్సవాల విశేషాలను ఈవో రామరావు తెలియజేశారు. ఆలయ ప్రాంగణంలోని పుష్పార్చన వేదిక వద్దకు చేరుకున్న వలవన్ పుష్పార్చన గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రంలో ఈవో రామరావు భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు.

అభివృద్ధి అడుగుజాడ.. బెజవాడ

- రికార్డు వేగంతో బెంజిసర్కిల్ జంట ఫ్లై ఓవర్ నిర్మాణాలు
- శరవేగంగా వెస్ట్ బైపాస్ నిర్మాణ పనులు
- తూర్పు బైపాస్ రోడ్డు ప్రతిపాదనలకు తుది రూపు
- బెంజి సర్కిల్ సర్వీస్ రోడ్డు విస్తరణ పనులు సైతం
- అందంగా ఎయిర్ పోర్ట్ కారిడార్ రహదారి
- కృష్ణానదికి రిటైనింగ్ వాల్ నిర్మాణం
- రూపు రేఖలు సమూలంగా మారిన నగర ముఖ చిత్రం

బెజవాడ నగర ముఖచిత్రం సమూలంగా మారిపోయింది. ఈ ఐదేళ్లలో అభివృద్ధి అంటే ఇలా ఉంటుంది...అని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసి చూపించింది. నగరం సర్వతోముఖాభివృద్ధి సాధించింది. ఫ్లై ఓవర్ల ద్వారా ట్రాఫిక్ కష్టాలు గట్టెక్కాయి. కాలువల బ్యూటిఫికేషన్ ద్వారా నగరం పచ్చందాలతో పరిఢవిల్లుతోంది. నగరం నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహం నగరానికే తలమానికంగా నిలుస్తోంది.

సాక్షి ప్రతినిధి, విజయవాడ: మెట్రో పాలిటన్ నగరాలతో పోటీ పడుతూ బెజవాడ నగరం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. బెంజిసర్కిల్ జంట ఫ్లై ఓవర్‌లు అందుబాటులోకి వచ్చాయి. సెంటరాఫ్ అట్రాక్షన్‌గా అంబేడ్కర్ స్మృతి వనం నిలుస్తోంది. కృష్ణా నదిపై రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి కావడంతో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. వెస్ట్ బైపాస్ పనులు తుది దశకు చేరాయి. తూర్పు బైపాస్‌కు సంబంధించిన ప్రతిపాదనలకు తుది రూపు వచ్చింది. కృష్ణానదిలో జల విహారానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. నదీ తీరంలోని ఆలయాలను, పర్యాటక ప్రదేశాలను కలుపుతూ టెంపుల్ టూరిజంకు రూపకల్పన చేస్తోంది. అభివృద్ధితో పాటు మరో పక్క సంక్షేమ పథకాల కింద గత ఐదేళ్లలో ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 72,20,324 మంది లబ్ధిదారులకు వారి ఖాతాల్లో రూ12,096.36 కోట్లను ప్రభుత్వం జమ చేసింది.



కృష్ణానది ఒడ్డున నిర్మించిన రక్షణ గోడ, ఉద్యానవనం

ముంపు నివారణకు రిటైనింగ్ వాల్...

విజయవాడ వాసులను ముంపు నుంచి రక్షించేందుకు వీలుగా రక్షణ గోడలు నిర్మించారు. కనక దుర్గమ్మ వారధి నుంచి కోటి నగర్ వరకు గోడ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.394.27 కోట్లు ఖర్చు చేస్తున్నారు. విజయవాడలో కాలువలపై రూ.31కోట్లతో ఏడు బ్రిడ్జిలను నిర్మించారు. రిటైనింగ్ వాల్ వెంబడి రెండు దశల్లో బ్యూటిఫికేషన్ పనులను రూ.33.39 కోట్లతో చేస్తున్నారు. గ్రీనరీ, పార్కులు, వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్‌లతో రక్షణ గోడ వెంబడి అందంగా తీర్చిదిద్దుతున్నారు.



నగరానికే తలమానికం: అంబేడ్కర్ స్మృతివనం

పచ్చందాలతో పరిఢవిల్లుతున్న బెజవాడ

నగరంలో జాతీయ రహదారి మొత్తం 17,761 మీటర్ల పొడవునా, 18 రహదారుల డివైడర్లను హరిత హారాలుగా తయారు చేశారు. నగరంలో 16 పార్కులను అభివృద్ధి చేశారు. ఎయిర్ పోర్టు కారిడార్‌ను రూ.17 కోట్లతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. కాలువల్లో ఎన్నో ఏళ్లుగా పూడుకుపోయిన చెత్తను తొలగించారు. మిషన్ క్లీన్ కృష్ణా కింద కృష్ణానదీ తీరాన్ని పరిశుభ్రం చేశారు. నగరంలోని ప్రధాన కాలువల్లో బోటింగ్‌కు సన్నాహాలు చేస్తున్నారు. నగరంలో కొండ ప్రాంతాల్లో నీటి సరఫరాకు ప్రాధాన్యం ఇచ్చారు.

పేదోడికి కార్పొరేట్ వైద్యం...

విజయవాడ జీజీహెచ్‌లో కార్డియోథోరాసిక్ సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ వంటి సూపర్ స్పెషాలిటీ విభాగాలు కొత్తగా అందుబాటులోకి వచ్చాయి. రూ.150 కోట్లతో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణం చేయగా, వైఎస్ జగన్ సీఎం కాగానే రూ.30 కోట్లు విడుదల చేశారు. దీంతో అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్, ఎంఆర్‌ఐ స్కాన్, 120 స్లైస్ సీటీ స్కాన్ అందుబాటులోకి వచ్చాయి.అరుదైన శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. రూ.170 కోట్లతో నాడు-నేడు పనులు చురుగ్గా సాగుతున్నాయి.

వెస్ట్, ఈస్ట్ బైపాస్ రోడ్లు

విజయవాడ నగరానికి సంబంధించి వెస్ట్, ఈస్ట్ బైపాస్ నిర్మాణాలతో ట్రాఫిక్ కష్టాలకు పూర్తి చెక్ పడనున్నాయి. విజయవాడ వెస్ట్ బైపాస్‌కు సంబంధించి ఆరు వరుసల రహదారి చిన్న అవుటపల్లి - గొల్లపూడికి సంబంధించి 30 కి.మీ పనులు రూ.1148 కోట్లతో 2021 ఫిబ్రవరిలో ప్రారంభించారు. పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ప్యాకేజీ నాలుగు కింద గొల్లపూడి నుంచి చినకాకాని వరకు 17.88 కి.మీ పొడవున రహదారి పనులు శరవేగంగా సాగుతున్నాయి. కృష్ణా నదిపై ఐకానిక్ వంతెన పనులు 60 శాతానికి పైగా పూర్తయ్యాయి. విజయవాడ తూర్పు వైపు నిర్మించతలపెట్టిన బైపాస్ రోడ్డుకు కృష్ణాజిల్లా పొట్టిపాడు నుంచి గుంటూరు జిల్లా కాజ వరకు 49.3 కిలోమీటర్ల మేర నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. కృష్ణానది పైన 3.750 కిలోమీటర్ల పొడవుతో ఐకానిక్ వంతెన నిర్మించనున్నారు. మొత్తం నిర్మాణ వ్యయం రూ.4607.80 కోట్లుగా అంచనా వేశారు.



తుది దశలో ఉన్న వెస్ట్ బైపాస్ రోడ్డు

చరిత్రలో కనీవిని ఎరుగని అభివృద్ధి



నగర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి జరిగింది. ఒక్క సెంట్రల్ నియోజకవర్గంలోనే రూ.800 కోట్లతో అభివృద్ధి జరిగింది. దీర్ఘకాలికంగా వేధిస్తున్న డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఇంతగా అభివృద్ధి ఏ ప్రభుత్వంలోనూ జరగలేదు.

– పెనుమత్స సత్యనారాయణరాజు, ముత్యాలంపాడు

అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించారు



ఈ ఐదేళ్లలో విజయవాడ నగరం అన్ని రంగాలుగా అభివృద్ధి చెందింది. బెంజిసర్కిల్‌లో రెండు ఫ్లైఓవర్‌లు నిర్మించడంతో పాటు, కనకదుర్గమ్మ ఫ్లైఓవర్‌ను పూర్తి చేశారు. కాలనీల్లో రోడ్లు, పార్కులు పెద్ద ఎత్తున అభివృద్ధి చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం రాష్ట్రానికే తలమానికం.

-చింతగుంట విజయ్ ఆనంద్‌కుమార్, ఫకీరుగూడెం

తూర్పులో రూ.650 కోట్లతో అభివృద్ధి



నియోజకవర్గంలో సీఎం వైఎస్ జగన్ సహకారంతో రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. రూ.924 కోట్ల సంక్షేమ పథకాలు అందించాం. 32 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చాం. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎంతో మందికి పునర్జన్మను ప్రసాదించిన జగనన్నకు నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

-దేవినేని అవినాష్, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

మేమంతా సిద్ధం

14వ రోజు శనివారం షెడ్యూల్



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): 'మేమంతా సిద్ధం' యాత్రలో భాగంగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 14వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు గుంటూరు జిల్లా నంబూరు బైపాస్ రాత్రి బస నుంచి బయలుదేరుతారు. కాజ, మంగళగిరి బైపాస్ మీదుగా 11 గంటలకు సీకే కన్వెన్షన్ వద్దకు చేరుకుని చేనేత కార్మికులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కుంచనపల్లి బైపాస్ మీదుగా తాడేపల్లి బైపాస్‌కు చేరుకుని భోజన విరామం తీసుకుంటారు. అనంతరం వారధి, శిఖామణి సెంటర్, చుట్టుగుంట, భగత్ సింగ్ రోడ్ , పైపుల రోడ్, కండ్రిక, రామవరప్పాడు, నిడమానూరు బైపాస్ మీదుగా కేసరపల్లి బైపాస్ శివారులో రాత్రి బస శిబిరానికి చేరుకుంటారు. షెడ్యూల్ వివరాలు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర జయప్రదం చేయండి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర శనివారం మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడ కనకదుర్గ వారధి మీదుగా నగరంలోకి చేరుకుంటుందని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా ఈ యాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర కనకదుర్గ వారధి మీదుగా తూర్పు నియోజకవర్గంలోకి అడుగుపెట్టి అక్కడి నుంచి చుట్టుగుంట సెంటర్‌లో సెంట్రల్ నియోజకవర్గంలో ప్రవేశించి సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ మీదుగా పాయకాపురం కండ్రిక వరకూ సాగుతుందని వివరించారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ నగరంలోని మూడు నియోజకవర్గాల్లోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలంతా ఈ యాత్రలో పాల్గొని తమ సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, మాజీ డిప్యూటీ మేయర్ గోగుల రమణారావు, కర్నాటి రాంబాబు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లాదే అగ్రస్థానం



- ఇంటర్ సెకండ్ ఇయర్ ఫలితాల్లో 90 శాతం
- 17,425 మందికి 15,688 మంది ఉత్తీర్ణత
- మొదటి సంవత్సరంలో 84 శాతం ఉత్తీర్ణత
- 20,324 మందికి 17,070 మంది ఉత్తీర్ణత
- మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

చిలకలపూడి(మచిలీపట్నం): ఇంటర్మీడియెట్ పరీక్షల్లో మళ్లీ కృష్ణాజిల్లాదే అగ్రస్థానం. కరోనా అనంతరం వరుసగా మూడు సంవత్సరాల పాటు రాష్ట్రంలో కృష్ణాజిల్లా ఇంటర్మీడియెట్ ఫలితాల్లో మొదటిస్థానం సాధిస్తూ వస్తోంది. 2024 పరీక్షల్లో కూడా రాష్ట్రంలో కృష్ణాజిల్లానే అగ్రస్థానంలో నిలిచింది. మార్చి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను జిల్లా వ్యాప్తంగా 59 కేంద్రాల్లో నిర్వహించారు.

మొదటి, రెండో సంవత్సరంలో మంచి ఫలితాలు

జిల్లాలో నిర్వహించిన మొదటి, రెండో సంవత్సరం ఇంటర్మీడియెట్ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 59 పరీక్ష కేంద్రాల్లో 20,324 మంది విద్యార్థులు హాజరుకాగా 17,070 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 84 శాతం సాధించారు. రెండో సంవత్సరం ఇంటర్మీడియెట్ పరీక్షల్లో 17,425 మంది విద్యార్థులు హాజరుకాగా 15,688 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 90 శాతం సాధించారు.

మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్మీడియెట్ బోర్డు ఆదేశాల ప్రకారం జిల్లాలో మే 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఫీజును ఈ నెల 18 నుంచి 24వ తేదీలోగా చెల్లించాలన్నారు. ఫలితాలపై సందేహాలు ఉన్న విద్యార్థులకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం ఇంటర్మీడియెట్ బోర్డు అవకాశం కల్పించింది. అటువంటి సందేహాలు ఉంటే విద్యార్థులు ఈ నెల 18 నుంచి 24వ తేదీలోగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు సంబంధించి ప్రాక్టికల్ పరీక్షలు మే 1 నుంచి 4వ తేదీ వరకు జరుగుతాయన్నారు.

వరుసగా మూడేళ్లుగా జిల్లా ప్రథమ స్థానం



ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో కృష్ణాజిల్లా గత మూడేళ్లుగా మొదటి స్థానం సాధిస్తోంది. సంవత్సరం ఆరంభం నుంచి విద్యార్థులకు ఆయా కళాశాలల ద్వారా మంచి విద్యాబోధన అందించటం, ఉత్తీర్ణత శాతం పెంచేందుకు పకడ్బందీగా సేవలు చేపట్టడం వల్ల ప్రథమ స్థానం సాధించగలిగాం.

– రవికుమార్, ఆర్‌ఐవో

15న బాస్కెట్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి 9వ జూనియర్ బాస్కెట్ బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణాజిల్లా బాలబాలికల జట్లను ఈ నెల 15వ తేదీన ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సుభాష్‌చంద్ర బోస్ తెలిపారు. నూజివీడులోని బేతెస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్(బిఐఎస్) క్రీడా ప్రాంగణంలో ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. 2006 జనవరి ఒకటో తేదీ తరవాత పుట్టిన వారు, కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌కు అనుబంధంగా ఉన్న క్లబ్‌లలోని క్రీడాకారులు మాత్రమే ఈ ఎంపిక పోటీలకు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న క్రీడాకారులు వారి ఆధార్ కార్డ్‌తో ఎంపిక ప్రాంగణంలో సంప్రదించాలని సూచించారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు నూజివీడులోని బీఐఎస్ స్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

గుడివాడ 'సిద్ధం' సభావేదిక ముస్తాబు



సుందరంగా తీర్చిదిద్దుతున్న సభావేదిక



ప్రజలకు అభివాదం చేసేందుకు ఏర్పాటుచేస్తున్న పొడవైన ర్యాంప్

గుడివాడ టౌన్: గుడివాడ పట్టణంలో ఈ నెల 14వ తేదీ ఆదివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించనున్న 'మేమంతా సిద్ధం' సభకు వేదిక యుద్ధప్రాతిపదికన సిద్ధం అవుతోంది. జిల్లా నలుమూలల నుంచి లక్షలాదిగా తరలివచ్చే ప్రజలకు, నాయకులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా సువిశాలమైన మైదానంలో ఈ సభా ప్రాంగణం కొలువుదీరింది. విశాలమైన సభావేదిక, ప్రజలకు అభివాదం తెలిపేందుకు సభావేదిక నుంచి సభాప్రాంగణానికి విశాలమైన ర్యాంప్ నిర్మించారు. సభకు విచ్చేసేవారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పథకాలు వివరించేందుకు కళా వేదికను కూడా సిద్ధం చేశారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు దగ్గరగా వెళ్లి అభివాదం చేసే విధంగా ర్యాంప్ సిద్ధం అయింది. సువిశాలమైన ప్రాంగణం కావడంతో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు వచ్చినా ఏవిధమైన అసౌకర్యం కలుగదని నిర్వాహకులు తెలిపారు.

పకడ్బందీగా ఈవీఎం ర్యాండమైజేషన్

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహణ
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



కలెక్టరేట్‌లో ర్యాండమైజేషన్ గురించి వివరిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శాస్త్రీయంగా, పకడ్బందీ ప్రణాళికతో తొలి విడత ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. జిల్లా కలెక్టరేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు జేసీ పి.సంపత్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి హాజరయ్యారు. తొలుత కలెక్టర్ ఢిల్లీరావు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఎన్నికల నిర్వహణలో భాగమైన ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియ గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. తిరువూరు నియోజకవర్గంలో 234 పోలింగ్ స్టేషన్లు, విజయవాడ పశ్చిమలో 253, విజయవాడ సెంట్రల్‌లో 257 పోలింగ్ స్టేషన్లతో పాటు 10 ఆగ్జలరీ పోలింగ్ స్టేషన్లు, మైలవరంలో 295 పోలింగ్ స్టేషన్లతో పాటు ఒక ఆగ్జలరీ పోలింగ్ స్టేషన్, నందిగామలో 222, జగ్గయ్యపేటలో 222 మొత్తం 1,792 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని వివరించారు. విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి 2,151 కంట్రోల్ యూనిట్లు, 2,151 బ్యాలెట్ యూనిట్లు, 2,330 వీవీ ప్యాట్‌లు అవసరమని, ఇదే స్థాయిలో అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంల అవసరం ఉందన్నారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా అదనపు యూనిట్లను కూడా అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ర్యాండమైజేషన్ డేటా ఆధారంగా పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లతో పాటు వీవీప్యాట్‌లను అందించే ప్రక్రియ సజావుగా సాగుతోందని తెలిపారు. ఇక్కడి నుంచి అత్యంత భద్రత మధ్య తరలించే ఈవీఎంలను ఆయా నియోజకవర్గాల ఆర్వోల పరిధిలోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరుస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఆర్వో బీహెచ్ భవానీ శంకర్, పశ్చిమ నియోజకవర్గ ఆర్వో కిరణ్మయి, నందిగామ ఆర్డీవో కె.మాధవి, తిరువూరు ఆర్డీవో ఎ.రవీంద్రరావు, జగ్గయ్యపేట ఆర్వో జి.వెంకటేశ్వర్లు, ఈవీఎం నోడల్ అధికారి జి.మహేశ్వరరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులతో పాటు వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కంకిపాడులో రూ. 8.98 లక్షలు స్వాధీనం



కంకిపాడు: సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును కంకిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆదేశాల మేరకు గన్నవరం డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో కంకిపాడు సీఐ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికల నియమావళి అమలులో భాగంగా కంకిపాడు పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు శుక్రవారం కంకిపాడు లాకురోడ్డు ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించారు. కంకిపాడు నుంచి తోట్లవల్లూరు మండలం రొయ్యూరు గ్రామానికి చెందిన లుక్కా రాజేష్ తన ద్విచక్ర వాహనంలో రూ. 8.98 లక్షలు నగదు తరలిస్తుండగా అధికారులు గుర్తించారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవటంతో నగదును సీజ్ చేశారు. సీజ్ చేసిన నగదును ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు. తనిఖీల్లో ఎస్ఐ డి.సందీప్, అదనపు ఎస్ఐ తాతాచార్యులు, ఎన్నికల బృందం అధికారి కనకమహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీదుర్గా గీత మాలిక సీడీ ఆవిష్కరణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వరుల వైభవాన్ని కీర్తిస్తూ స్వరపరిచిన దుర్గా గీత మాలిక ప్రతి భక్తుడి చెంతకు చేరుతుందని దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు పేర్కొన్నారు. స్వరమాధురి మ్యూజిక్ వారి ఆధ్వర్యంలో రూపొందించిన శ్రీదుర్గా గీత మాలిక ఆడియో సీడీని శుక్రవారం ఇంద్రకీలాద్రిపై ఆవిష్కరించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య సీడీని ఆలయ ఈవో రామారావు ఆవిష్కరించారు. దుర్గా మల్లేశ్వరుల సేవలను వర్ణిస్తూ, రచన, స్వరకల్పన చేసిన మాధురి జీవితం ధన్యమైందని ఈవో పేర్కొన్నారు. అనంతరం కె. మాధురి స్వర సుప్ప సేవ, భక్తి సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. సంగీత సేవ చేసిన మాధురి, జ్ఞాన ప్రసూనలను ఈవో అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలతో సత్కరించారు. ఆలయ ఏఈవో ఎన్. రమేష్‌బాబు, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ఎన్టీఆర్ జిల్లా సత్తా

- సెకండియర్ 87 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో ద్వితీయ స్థానం
- ఫస్టియర్ 79 శాతం ఉత్తీర్ణతతో తృతీయ స్థానం
- ఈ ఏడాది బాలికలదే పైచేయి
- మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ఎన్టీఆర్ జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. మొదటి రెండో సంవత్సరాలకు చెందిన ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో జిల్లాను తృతీయ, ద్వితీయ స్థానాల్లో నిలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 79 శాతంతో రాష్ట్రంలో తృతీయ స్థానంలో నిలవగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 87 శాతం ఫలితాలతో రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించారు. గత ఏడాది వరకూ ఉమ్మడి కృష్ణా జిల్లాగా ఫలితాలు ప్రకటించగా, ఈ ఏడాది నుంచి కొత్తగా ఏర్పడిన జిల్లాల వారీగా ఇంటర్మీడియెట్ బోర్డు ఫలితాలను ప్రకటించింది.

బాలికలు 88 శాతం..

ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి రెండో సంవత్సరం విద్యార్థులు 87 శాతం విజయం సాధించారు. అందులో బాలికలు 88 శాతం విజయం సాధించారు. అలాగే బాలురు 86 శాతం విజయం సాధించారు. మొదటి ఏడాది ఫలితాల్లో బాలికలు 81 శాతం విజయం సాధించగా, బాలురు 78 శాతం విజయం సాధించారు. మొత్తం మీద బాలికలు అత్యధికంగా విజయం సాధించి తమ రికార్డును భద్రం చేసుకున్నారు. 2023 సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి కృష్ణాజిల్లా 83 శాతం ఫలితాలతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. మార్చి మొదటి తేదీ నుంచి 20వ తేదీ వరకూ 99 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు.

సప్లిమెంటరీకి అవకాశం..

ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ మొదటి తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్‌ను ప్రకటించారు.

పరీక్షకు హాజరైన విద్యార్థులు..

మొదటి సంవత్సరానికి సంబంధించి ఎన్టీఆర్ జిల్లాకు చెందిన విద్యార్థులు 38,307 మంది పరీక్షకు హాజరుకాగా అందులో 21,217 మంది బాలురు, 17,090 మంది బాలికలు ఉన్నారు. ఉత్తీర్ణులైన వారు 30,353 మంది ఉండగా అందులో 16,558 మంది బాలురు, 13,795 మంది బాలికలు ఉన్నారు. రెండో సంవత్సరంలో 34,156 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా అందులో 18,892 మంది బాలురు, 15,264 బాలికలు ఉన్నారు. ఉత్తీర్ణులైన వారిలో 29,707 మంది ఉండగా అందులో బాలురు 16,263, బాలికలు 13,444 ఉన్నారు.

ఒకేషనల్‌లో 70 శాతం ఫలితాలు..

ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 70 శాతం ఫలితాలను సాధించారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 703 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా అందులో 493 మంది విద్యార్థులు ఉత్తీర్ణతను సాధించారు. వారిలో బాలికలు 80 శాతంతో టాప్‌లో ఉన్నారు. అలాగే ఒకేషనల్ మొదటి ఏడాదికి సంబంధించి 1,018 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా అందులో 599 మంది ఉత్తీర్ణతను సాధించారు. మొదటి ఏడాది మొత్తం ఉత్తీర్ణత 59 శాతంగా ఉంది.

రీకౌంటింగ్‌కు అవకాశం..

విద్యార్థులకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు సంబంధించి ఫీజు చెల్లింపునకు ఈ నెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ అవకాశం కల్పించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు

టాప్ లేపిన మొవ్వ జూనియర్ కాలేజీ

ఇంటర్ ఫలితాల్లో ప్రథమ స్థానం కైవసం

మొవ్వ: మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని క్షేత్రయ్య జూనియర్ కళాశాల ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల్లో 2022–24విద్యా సంవత్సరానికి గాను జిల్లా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌శాస్త్రి శుక్రవారం విలేకరులకు తెలిపారు. జనరల్ కోర్సుల్లో 91.26 శాతం ఉత్తీర్ణత, వృత్తి విద్యా విభాగంలో 92.9 శాతాన్ని సాధించిందని.. ప్రథమ సంవత్సర ఫలితాల్లో జనరల్ విభాగంలో 48.54 శాతాన్ని, వృత్తి విద్యా విభాగంలో 86.54 శాతాన్ని సాధించినట్లు తెలిపారు. కాగా ఎస్. హర్షిత (ఎంఈటీ) 968/1000, కె. శ్రీవిద్య(ఎంపీసీ) 963/1000, పి. శ్రావ్య (బైపీసీ) 953/1000 మార్కులు సాధించి కళాశాలలో తొలి మూడు స్థానాల్లో నిలిచినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

డిజిటలైజేషన్ దిశగా అడుగులు

ఐటీ నిపుణులతో సమీక్షలో దుర్గగుడి ఈవో రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు ప్రతి నిత్యం జరిగే ఆర్జిత సేవలకు భక్తులకు మరింత చేరువ చేసేందుకు డిజిటలైజ్ చేయనున్నామని దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు పేర్కొన్నారు. దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఐటీ వ్యవస్థ గురించి ఈవో రామారావు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ ఐటీ విభాగంతో పాటు 9అండ్9 సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొనగా, ఆలయానికి సంబంధించి పలు అంశాల గురించి చర్చించారు. అమ్మవారి ఆలయంలో జరిగే ప్రతి సేవా డిజిటల్ విధానం ద్వారా భక్తులకు చేరువ కావాలని కోరారు. దీనికి సోషల్ మీడియాతో పాటు డిజిటల్ మార్కెటింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఆలయంలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు, పరోక్ష సేవల గురించి భక్తులకు అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలన్నారు. పీవోఎస్ మిషన్లు పూర్తి స్థాయిలో అన్ని కౌంటర్లలో అందుబాటులోకి వచ్చేలా చూడాలని, వాటి వినియోగం సులువుగా, సులభతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు పలు సూచనలు చేయగా, వాటిని అమలుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆలయ ఈఈవో సుధారాణి, ఐటీ నిపుణులు హరీష్, ఏఈలు లక్ష్మణ్, సునీల్ పాల్గొన్నారు.

విజిలెన్స్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించాలి

కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు విజిలెన్స్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు జిల్లా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావాన్ని గణనీయంగా తగ్గించి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలన్నారు. మద్యం అక్రమ రవాణా, బెల్టు షాపులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రిటైల్ మద్యం షాపుల్లో రోజువారీ తనిఖీలు నిర్వహించి స్టాక్, అమ్మకాలను పరిశీలించాలన్నారు. పోలింగ్ తేదీకి 48 గంటల ముందు డ్రైడేగా పాటిస్తూ షాపులు మూసి ఉంచాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అధికారులు ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నదీ, లేనిదీ పరిశీలించాలన్నారు. జిల్లా నియంత్రణ కమిటీ రోజువారీ నివేదికలు సమర్పించాలన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అవులయ్య తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఆచార్య హేమచంద్రారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆచార్య హేమచంద్రారెడ్డి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు అవకాశాలను చేరువ చేసే వివిధ నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే మరిన్ని విజయాలను అందుకుంటారని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి అన్నారు. ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలు విజయవాడ కేబీఎస్ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కె. హేమచంద్రారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో వివిధ విద్యా విషయాలతో పాటుగా వారిలో ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే పలు నైపుణ్యాలను పొందించేందుకు ఉన్నత విద్యామండలి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా గత ఏడాది నుంచి రాష్ట్ర స్థాయిలో క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో రాష్ట్రంలో ఉన్నత విద్యామండలి పరిధిలో సుమారు 15 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యే అవకాశాన్ని కల్పించామన్నారు. అలాగే రాష్ట్రంలో ఇటీవల మూడు ప్రాంతాల్లో ప్రాథమిక పోటీలను నిర్వహించి వాటి నుంచి 12 బృందాలను సెమీ ఫైనల్, ఫైనల్ పోటీలకు ఎంపిక చేసి విజయవాడకు ఆహ్వానించామని వివరించారు. ఈ విధమైన పోటీలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అండగా ఉంటాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి ఉన్నత విద్యామండలి అనేక వినూత్న కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి అధికారులు ఆచార్య చంద్రమోహన్ రెడ్డి, డాక్టర్ ఎల్లారెడ్డి, ఎస్. శ్రీజ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని కళాశాల అధ్యాపకులు బి. మోహన్‌తేజ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ పాల్గొన్నారు.

ఆ ఐదేళ్లూ అరాచకమే!

- కాల్‌మనీ సెక్స్ రాకెట్‌కు కేంద్ర బిందువు విజయవాడ తూర్పులోనే
- ఆ కేసుతో సంబంధం ఉన్న ఎమ్మెల్యే ఎవరో ప్రజలందరికీ తెలుసు
- ఏడాది కిందట చోరీ కేసులో దొరికిపోయిన గద్దె అనుచరులు



టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తో దొంగతనం కేసులో అరెస్టు అయిన పీరుబాబు



గద్దె రామ్మోహన్‌తో దొంగతనం కేసులో అరెస్టు అయిన అన్నారావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): టీడీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ తూర్పు నియోజకవర్గం అరాచకాలకు కేంద్ర బిందువుగా ఉండేది. ఆ పార్టీ నాయకులు చేసిన దుర్మార్గాలు అంతు లేకుండా పోయాయి. 2014 నుంచి 19 వరకూ చోటుచేసుకున్న ఘటనలు తలుచుకుంటేనే తూర్పు నియోజకవర్గ ప్రజలు భయపడిపోతున్నారు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కాల్‌మనీ సెక్స్ రాకెట్ మూలాలు తూర్పులోనే మొదలయ్యాయి. టీడీపీ నాయకులు నియోజకవర్గాన్ని పేకాట డెన్‌గా మార్చారు. నివాస ప్రాంతాల్లోనే పేకాట శిబిరాలు నిర్వహించారు. అక్రమ మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. బెల్ట్ షాపులతో పాటు, దందాలు ఎక్కువగా ఉండేవని ప్రజలు అంటున్నారు. కార్పొరేటర్ల అరాచకాలు సైతం మామూలుగా ఉండేవి కాదని జనం ఆందోళన వ్యక్తం చేశారు. ఆ రోజుల్ని తలచుకుంటేనే గజగజలాడిపోతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం...

టీడీపీ ప్రభుత్వంలో 2015లో వెలుగు చూసిన కాల్‌మనీ సెక్స్ రాకెట్ కేసు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మహిళలను లైంగికంగా వేధించడంపై పటమట, మాచవరం పోలీస్‌స్టేషన్‌లలో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ కేసులో తూర్పు నియోజకవర్గంలోని పలువురు అరెస్ట్ కూడా అయ్యారు. వారంతా కేవలం పాత్రదారులేనని, అసలు సూత్రదారులు నాటి అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఉన్నారనేది బహిరంగ రహస్యమే. ఆ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎవరనేది కూడా తూర్పు ప్రజలందరికీ తెలుసు. తమ అధికారం ఉపయోగించి వారి పేర్లు బయటకు రాకుండా చూసుకున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. మహిళలను లైంగిక అవసరాలకు వాడుకున్న వారిలో వారు కూడా ఉన్నారని తూర్పు ప్రజలు ఇప్పటికే చెబుతున్నారు. అలాంటి వారు నేడు శాంతియుతం అంటూ ప్రచారం చేస్తుండటంతో ప్రజలు నవ్వుకుంటున్నారు.

దొంగలుగా మారిన తెలుగు తమ్ముళ్లు..

గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన దొంగతనం కేసులో తెలుగు తమ్ముళ్లు నిందితులుగా అరెస్ట్ అయ్యారు. వారిద్దరూ ఎమ్మెల్యే గద్దెకు అత్యంత అనుచరులు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 18వ డివిజన్ టీడీపీ తరఫున కార్పొరేటర్‌గా పోటీ చేసిన పీరుబాబు, 22వ డివిజన్ టీడీపీ నేత పెద్ది అన్నారావు బృందావనకాలనీలోని ఓ ఇంట్లో దొంగిలించిన వెండి వస్తువులను దొంగలతో కలిసి అమ్మకాలు చేపట్టగా కృష్ణలంక పోలీసులు అరెస్ట్ చేశారు.

పేకాటకు డెన్‌గా..

నాడు రామలింగేశ్వరనగర్, పటమటలోని పలు ప్రాంతాల్లో పబ్లిక్‌గా పేకాట శిబిరాలు నిర్వహించారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరులుగా ఉండే ఇద్దరు, ముగ్గురు ఈ శిబిరాలు నిర్వహించేవారని ప్రజలు చెబుతున్నారు. పేకాట శిబిరాలు నిర్వహణ, పేకాట ఆడేవారంతా టీడీపీకి చెందిన వారే ఉండేవారు. అంతేకాదు గంజాయి, బెల్ట్‌షాపులు సైతం ఎక్కడ చూసినా దర్శనం ఇచ్చేవి. పటమటలంకలో ఓ కార్పొరేటర్ బంధువు బెల్ట్‌షాపు నడిపేవాడు. యువతను గంజాయికి బానిసలుగా మార్చింది సైతం ఆ సమయంలోనేనని పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతుండేవారని గుర్తు చేసుకుంటున్నారు. అరాచకాలకు కేరాఫ్‌గా ఉన్న ఎమ్మెల్యే, ఇప్పుడు అల్లర్లు అంటూ ప్రచారం చేస్తుండటంతో తూర్పు ప్రజలు నవ్వుకుంటున్నారు.

బైక్ దొంగతనాల కేసులో నిందితుడికి జైలు, జరిమానా

గన్నవరం: మోటర్ సైకిళ్ల చోరీ కేసులో నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష, రూ. 6 వేలు జరిమానా విధిస్తూ గన్నవరం 12వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం తీర్పు ఇచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమాచారం మేరకు.. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో కేసరపల్లిలో ఒకటి, గన్నవరంలో ఐదు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. సదరు యాజమానుల ఫిర్యాదు మేరకు గన్నవరం పోలీసులు ఆరు కేసులు నమోదు చేశారు. అనంతరం నిందితుడైన పమిడిముక్కల మండలం పెనుమత్స గ్రామానికి చెందిన పెదపూడి గోపయ్య అలియాస్ గోపిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణలో గోపిపై నేరం రుజువు కావడంతో 12వ ఏఎంఎం కోర్టు జెడ్జీ ఆరు కేసుల్లో నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఒక నెల సాధారణ జైలుశిక్ష అమలు చేయాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసుల్లో సీఎంఎస్ పోలీసులు సాక్షులను ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. ప్రసన్న వాదనలు వినిపించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

జి.కొండూరు: ద్విచక్ర వాహనంపై రహదారి దాటుతున్న ఇద్దరు వ్యక్తులను కారు ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడ్డారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండల పరిధి చెవుటూరు గ్రామానికి చెందిన ముత్యాల సుబ్బారావు, తాటి వెంకటేశ్వరరావు తమ ద్విచక్ర వాహనంపై గ్రామ శివారులోని బైపాస్‌కి ఆనుకొని ఉన్న రెస్టారెంట్‌కు వెళ్లేందుకు శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో బయలుదేరారు. అయితే బైపాస్ దాటుతున్న క్రమంలో విజయవాడ వైపు నుంచి మైలవరం వైపు వేగంగా వెళ్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముత్యాల సుబ్బారావు కుడికాలు పాదంతో పాటు తాటి వెంకటేశ్వరరావు కుడికాలు మోకాలు కింద భాగం పూర్తిగా నుజ్జు నుజ్జు అయిపోయింది. స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో విజయవాడ తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

రైల్వే పీసీఓఎం ప్రత్యేక తనిఖీలు

రైల్వే స్టేషన్(విజయవాడ పశ్చిమ): మచిలీపట్నం–విజయవాడ స్టేషన్‌ల మధ్య శుక్రవారం ఐఆర్‌టీసీ ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్ బి.నాగయ్య ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ రూట్లో ఉన్న స్టేషన్లలోని ప్లాట్ ఫారంలను, స్టేషన్ సూపరింటెండెంట్ కార్యాలయాలను, ట్రాఫిక్ నియంత్రణకు అమృత్ స్టేషన్ స్కీమ్‌లో భాగంగా చేపట్టిన ట్రాక్ అభివృద్ధి పనులను, క్రూ బుకింగ్ కార్యలయాలను, కోచింగ్ డిపోలను ఆయన తనిఖీ చేశారు. మచిలీపట్నం పోర్టుకు అనుసంధానంగా ఏర్పాటు చేస్తున్న రైల్వే లైన్ నిర్మాణ పనులపై మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై.విద్యాశంకర్, సంబంధిత అధికారులతో రివ్యూ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ నెల చివరిలో మరోమారు తనిఖీలు నిర్వహించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఎంఈ జి.ఉదయభాస్కర్, ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



గుణదల (విజయవాడ తూర్పు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాతే రాష్ట్రంలో సంక్షేమ పాలన మొదలైందని ఆ పార్టీ 4వ డివిజన్ ఇన్చార్జ్ , కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ గల్లా పద్మావతి అన్నారు. గుణదల భారతీనగర్ ప్రాంతంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిబద్ధతగా పనిచేశారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఆయన సఫలీకృతమయ్యారని వివరించారు. ప్రభుత్వం అమలు పరచిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీని మరలా అధికారంలోకి తెస్తాయని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందచేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గల్లా రవికుమార్, ప్రసాద్ రావు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ బస్సు యాత్ర విజయవంతం చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు క్రైస్తవులు తరలిరావాలని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం పిలుపునిచ్చారు. మధురానగర్‌లో శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో శనివారం బస్సు యాత్ర ప్రవేశించనున్న నేపథ్యంలో వేలాది మంది తరలి వచ్చి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఆశీస్సులు అందజేయాలని కోరారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, తూర్పు నియోజకవర్గం అభ్యర్థి దేవినేని అవినాష్, పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి ఆసిఫ్‌లకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రెవరెండ్ ఎం.ఐజాక్, రెవరెండ్ ఎస్.డానియేల్, రెవరెండ్ డాక్టర్ కనపర్తి ప్రభాకర్, రెవరెండ్ కిరణ్ తదితరులు మాట్లాడారు. తొలుత జగనన్న బస్సు యాత్ర విజయవంతం కావాలని ఏసుక్రీస్తు ఆశీస్సులు లభించాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్క్రూబ్రిడ్జి సమీపంలోని విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతంలో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్టు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ తెలిపారు. పకీర్‌గూడెం, ప్రగతినగర్, టిక్కిల్ రోడ్డు, శ్రీరామ్‌నగర్, చంద్రమౌళీపురం, మొహిద్దీన్ ఎస్టేట్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, పోస్టాఫీస్‌రోడ్డు, పటమట లంక, కన్నానగర్, బెంజిసర్కిల్, రాఘవనగర్, నేతాజీరోడ్డు, సీతారామనగర్, ఆశ్రమంరోడ్డుతో పాటు మస్జిద్‌స్ట్రీట్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అందరూ సోదరభావంతో మెలగాలి

ఆటోనగర్(విజయవాడతూర్పు): అందరూ సోదర భావంతో మెలగాలని పలువురు ముస్లింలు తెలిపారు. ఆటోనగర్ 4వ రోడ్డులో పాత టైర్ల యజమానులు ఈద్ మిలాప్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలతో పాటు హిందువులు, క్రైస్తవులు ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. రంజాన్ పర్వదినం మరుసటి రోజున ఈద్ మిలాప్ చేయడం ఆనవాయితీ అని తెలిపారు. కార్యక్రమంలో కలాం బ్యాటరీ వర్క్స్ అధినేత అబ్దుల్ కలాం, ఏటీపీ అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావు, మాజీ ఐలా చైర్మన్ ఎస్.దుర్గాప్రసాద్, బాజీషరీఫ్, ఎండీ నూర్, డిస్పోజబుల్ అధ్యక్షుడు గౌస్‌ఖాన్, ఆర్గనైజర్స్ ఎండీ హరీఫ్, రంహతుల్లా, షరీఫ్, ఎండీ రిజ్వాన్, ఎస్‌కె బాబు, ఖాదిర్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ



సీహెచ్.సంజన-977 మార్కులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):ఇంటర్ పరీక్ష ఫలితాల్లో తమ అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని మోడరన్ అకాడమీ ప్రిన్సిపాల్ కేవీ సునీల్ చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఇంటర్ విభాగంలో సీహెచ్ సంజన-977 మార్కులు, జీవీ శ్రీవాత్సవ్-971 మార్కులు, ఎ.మిత్రిత-967 మార్కులు పొందారన్నారు. కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులలో మోడరన్ అకాడమీ విద్యార్థులు అధిక మార్కులు సాధించారని చెప్పారు. 38 సంవత్సరాలుగా సుంకర పాపారావు అధ్వర్యంలో మోడరన్ అకాడమీ విద్యార్థులు కామర్స్‌లో అసాధారమైన ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అకాడమీ ప్రతినిధులతో పాటుగా అధ్యాపకులు అభినందించారు.

అభివృద్ధి తోరణంతో జగనన్నకు స్వాగతం

- నేడు ఎన్టీఆర్ జిల్లాకు సీఎం జగన్ బస్సుయాత్ర
- తూర్పు నియోజకవర్గంలో ప్రవేశించనున్న వైనం
- ఘనంగా స్వాగతం పలికేందుకు సిద్ధమైన ప్రజలు
- అభివృద్ధికి కేరాఫ్‌గా తూర్పు నియోజకవర్గం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర శనివారం ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశించనుంది. గుంటూరు జిల్లా నుంచి కనకదుర్గమ్మ వారధి మీదగా విజయవాడ తూర్పు నియోజకవర్గంలోకి బస్సు యాత్ర రానుంది. తమ ప్రియతమ నేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు ఘనంగా స్వాగతం పలికేందుకు తూర్పు ప్రజలు సిద్ధమయ్యారు. జగనన్న హయాంలో తూర్పు నియోజకవర్గంలో రూ.650 కోట్లుతో అభివృద్ధి పనులు చేశారు. అలానే రూ.924 కోట్లు సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. అంతేకాదు మరో రూ.300 కోట్లుతో 32 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇలా అన్ని రకాలుగా మేలు చేసిన వైఎస్ జగన్‌కు ఘనంగా స్వాగతం పలికేందుకు అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



నూతనంగా వేసిన కనకదుర్గనగర్ మెయిన్‌రోడ్డు

తూర్పులో యాత్ర ఇలా...

కనకదుర్గమ్మ వారధి వద్ద తూర్పు నియోజకవర్గంలోకి ప్రవేశించనున్న యాత్ర నేతాజీ బ్రిడ్జి మీదగా వచ్చి పశువుల ఆస్పత్రి వద్ద బందరురోడ్డును క్రాస్ చేసి వాటర్ ట్యాంక్ రోడ్డులోకి ప్రవేశిస్తుంది. అక్కడ నుంచి శిఖామణిసెంటర్, ప్రజాశక్తినగర్, మెట్రో మీదగా చుట్టుగుంట చేరుకుని, అక్కడ సెంట్రల్ నియోజకవర్గంలోకి ప్రవేశిస్తారు. కాగా పశువుల ఆస్పత్రి జంక్షన్, శిఖామణి సెంటర్, ప్రజాశక్తినగర్, మెట్రో, చుట్టుగుంట వరకూ రోడ్డు పొడవునా ప్రజలు బారులు తీరి స్వాగతం పలకనున్నారు.

స్వాగతం పలకనున్న అభివృద్ధి..

విజయవాడలోని మూడు నియోజకవర్గాల్లో అత్యధికంగా అభివృద్ధి చెందింది విజయవాడ తూర్పులోనే. కాగా జిల్లాలో ప్రవేశించనున్న మేమంతా బస్సుయాత్రకు తూర్పులో అభివృద్ధి తోరణం స్వాగతం పలకనుంది. జిల్లాలోకి ప్రవేశించేటప్పుడు రిటైనింగ్‌వాల్, కృష్ణమ్మ జల విహారం పార్కు మీదగా జగనన్న రానున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలకు నూతన భవనాలు, ఆధునిక పరికరాలు సమకూర్చారు. కొండ ప్రాంతాల్లో మంచినీరు, మెట్లు మార్గాలు, విద్యుత్ సౌకర్యం కల్పించారు. పార్కులు అభివృద్ధి చేశారు. నాడు-నేడుతో ఆస్పత్రులు, పాఠశాలలు రూపురేఖలు మారిపోయాయి. ఇలా అన్ని రకాలుగా మేలు చేసిన వైఎస్ జగన్‌కు అండగా ఉండేందుకు తూర్పు ప్రజలు సిద్ధమయ్యారు.

కరకట్ట వాసులు ఎదురు చూస్తున్నారు



ఎన్నో దశాబ్దాలుగా ఉన్న కృష్ణానది వరద ముంపు సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ఘనంగా స్వాగతం పలికేందుకు కరకట్ట దిగువన నివశించే వారంతా ఎదురు చూస్తున్నారు. రణదీవెనగర్, తారకరామనగర్, భూపేష్‌గుప్తా నగర్ తదితర ప్రాంతాలకు చెందిన వేలాది మంది వారధి వద్ద వైఎస్ జగన్‌కు తమ మద్దతు తెలియచేయనున్నారు.

–కసగోని దుర్గారావు, కృష్ణలంక

జగనన్న రాకకోసం



తూర్పులో రూ.650 కోట్లు అభివృద్ధి పనులు చేసేందుకు సహకారం అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో మంచినీరు, మెట్లు మార్గాలు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించిన తమ నేతకు అండగా ఉండేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఆయన రాక కోసం ఎప్పుడెప్పుడా అంటూ ప్రజలు ఎదురు చూస్తున్నారు.

–చందా కిరణ్‌తేజ, ఎస్సీ విభాగం నాయకుడు

అవినాష్ గెలుపునకు మేమంతా సిద్ధం



ఆటోనగర్(విజయవడతూర్పు): వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్‌ను రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధిక మెజారిటీతో గెలిపించుకునేందుకు 15వ డివిజన్ ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ తెలిపారు. కొమ్మ పూర్ణచంద్రరావు రోడ్డు, సాయిబాబా రోడ్డులో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని)లను గెలిపించాలని ఓటర్లనుకోరారు. ఇంటింటికి తిరిగి అవినాష్, కేశినేని నానికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల గురించి స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా బెల్లం దుర్గ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూర్చారన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా పరిపాలన చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు ఆళ్ల చెల్లారావు. వెంకటరెడ్డి, భుజంగరావు, దశరథరామయ్య, కనకదుర్గ, సంధ్య, సత్యనారాయణ, కాటూరి మోహనరావు, లక్ష్మణ్, బాలాజీ, చంటి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే
సంక్షేమం, అభివృద్ధి



ఎన్నికల ప్రచారంలో అవినాష్, కుటుంబసభ్యులు

తూర్పులో ఎన్నికల ప్రచారానికి అవినాష్ శ్రీకారం

పటమట(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గ అభివృద్ధి వైఎస్సార్ సీపీ హయాంలోనే జరిగిందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. 12వ డివిజన్‌లోని మెగా ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ మంత్రి దేవినేని నెహ్రూ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రచార రథం ఎక్కి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డివిజన్‌లో ప్రతి గడపను సందర్శించామని తెలిపారు. ఈ డివిజన్‌లో ఇప్పటి వరకు రూ.18 కోట్ల మేర అభివృద్ధి పనులను పూర్తిచేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. సుదీర్ఘకాలంగా వేధిస్తున్న డ్రెయిన్లు, పార్కుల అభివృద్ధి, రోడ్లు వంటి పనులను గత పాలకులు గాలికివదిలేశారని విమర్శించారు. స్థానికంగా ఉండే ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ డివిజన్ అభివృద్ధిపై పట్టించుకున్న దాఖలాలు లేవని ధ్వజమెత్తారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ. 650 కోట్ల అభివృద్ధి పనులు చేశామని వెల్లడించారు. ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించామని వివరించారు. సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో సుభిక్షంగా పాలన సాగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలు తనను, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని)కు ఓటువేసి గెలించాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు, డైరెక్టర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్వర్యంలో జరుగుతున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర శనివారం విజయవాడ నగరానికి చేరుకుటుంన్న సందర్భంగా నియోజకవర్గ ప్రజలు భారీ స్థాయిలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఆటో కార్మికులకు జగనన్న అండ


దేవినేని అవినాష్



ఆటో కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): రవాణా రంగంపై ఆధారపడి బతుకుతున్న ఆటో కార్మికులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. 4వ డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలో గల పరిటాల ఓంకార్ కల్యాణ మండపంలో ఆటో డ్రైవర్ల ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సీఎం జగన్ నిబద్ధతగా పనిచేశారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ప్రభుత్వ పాలన సాగిందని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు ఆటో కార్మికుల సంక్షేమానికి జగనన్న విశేషంగా కృషి చేశారని తెలిపారు. ఆటో కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఏడాదికి రూ.10 వేలు అందించారని చెప్పారు. దీని ద్వారా కేవలం డ్రైవర్లుగా ఉండే ఆటో కార్మికులు ఓనర్లుగా మారే అవకాశం లభించిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పేదల సంక్షేమం కనుమరుగైందన్నారు. కార్మికులు, రైతులు, చిరు వ్యాపారులు ఆర్థికంగా చితికిపోయి రోడ్డున పడ్డారని ఆవేదన చెందారు. పేదల కష్టాన్ని దోచుకున్న టీడీపీ నాయకులకు గత ఎన్నికల్లో ప్రజలు సరైన గుణపాఠం నేర్పించారని గుర్తు చేశారు. కేవలం సొంత వ్యాపారాలకే పరిమితమైన టీడీపీ నేతలకు ఈ ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ శెటికం దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు గొట్టిపాటి హరీష్, బత్తుల సునీల్ కుమార్, గోర్ల గోవింద్, పలగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో చైతన్య విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):ఇంటర్మీడియెట్ ఫలితాల్లో చైతన్య విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారని చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ మద్దినేని మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను ఐదుగురు విద్యార్థులు 466 మార్కులు, 56 మంది విద్యార్థులకు 465 మార్కులు, 805 మంది విద్యార్థులు 480 మార్కుల పైన సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను ఒక విద్యార్థికి 435 మార్కులు, 13 మంది విద్యార్థులకు-435 మార్కులు, 184 మంది విద్యార్థులు 430 మార్కుల పైన సాధించారని వివరించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను ఐదుగురు విద్యార్థులకు 990 మార్కులకుపైగా సాధించారని, 106 మంది విద్యార్థులకు 985 మార్కుల పైగా, 388 మంది విద్యార్థులు 980 మార్కుల పైగా పొందారని వివరించారు. సీనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను ఇద్దరు విద్యార్థులు 989 మార్కులకు పైగా పొందారన్నారు. 17 మందికి 985 మార్కుల పైగా పొందారని, 78 మంది విద్యార్థులు 980 మార్కుల పైగా పొందారని తెలియజేశారు. అధ్యాపకులతో పాటుగా ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులను మురళీకృష్ణ అభినందించారు.

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో త్రివేణికి మెరుగైన ఫలితాలు

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించారని త్రివేణి కళాశాల ప్రిన్సిపాల్ బి.సీ తారామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 94 శాతం, జూనియర్ ఫలితాల్లో 91 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో తమ విద్యార్థి లహరి 972 మార్కులు, పి. కావ్య 970 మార్కులు, ఎంఈసీలో వి.అనూష 958 మార్కులు సాధించారని చెప్పారు. జూనియర్ ఇంటర్‌లో ఎంఈసీలో పిజ జోత్స్న 485 మార్కులు, సీఈసీలో పి. సాయి మనోజ్ఞ 473 మార్కులు పొందారని పేర్కొన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ శ్రీధర్, సాంబిరెడ్డి, క్యాంపస్ ఇన్‌చార్జి పుష్పలత, విజయలక్ష్మి, శ్యామల అభినందించారు.

జాతి మనుగడలో భాష కీలకం



విజయవాడ కల్చరల్: భాషా సంస్కృతి, సంప్రదాయాల కృషికి సాహిత్య సంస్థలు, ప్రభుత్వాలు కృషి చేయాలని మాజీ మేయర్ జంధ్యాల శంకర్ అన్నారు. రసభారతి సాహితీ సంస్థ, గోళ్ళ రాధాకృష్ణ మూర్తి, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌ క్లబ్‌లో శుక్రవారం డాక్టర్ జంధ్యాల మహతీశంకర్ రచించిన పద్య మంజరి, డాక్టర్ జంధ్యాల పరదేశిబాబు రచించిన బుద్ధుని బోధనలు- జాతక కథలు, కవి సమ్మేళనం నిర్వహించారు. పద్య మంజరి గ్రంథాన్ని ఆవిష్కరించిన శంకర్ మాట్లాడుతూ జాతి మనుగడలో భాష కీలకమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. బహుముఖ ప్రతిభాశాలి సాహితీవేత్త జంధ్యాల మహతీ శంకర్‌గా అభివర్ణించారు. జాతక కథలు గ్రంథాన్ని గోళ్ళ నారాయణరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహనీయుడు గౌతమ బుద్ధుని బోధనలు సర్వదా ఆచరణీయమని చెప్పారు. గ్రంథాలను కవి పండిత పోషకుడు చెట్లపల్లి మారుతీ ప్రసన్నకు అంకితమిచ్చారు. రసభారతి అధ్యక్షుడు పొన్నలూరి లక్షణరావు సభకు అధ్యక్షత వహించారు. డాక్టర్ క్రోవి పార్థసారథి, డాక్టర్ జంధ్యాల జయకృష్ణ బాపూజీ మహతీ శంకర్ సాహిత్య సేవలను వివరించారు. నూతన సంవత్సర ఉగాది సందర్భంగా చలపాక ప్రకాష్, డాక్టర్ వెన్నావల్లభరావు, సర్వాశారద స్వీయ కవితా గానం చేశారు. డాక్టర్ పరదేశిబాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మార్కెట్‌లోకి అధునాతన పల్సర్ బైక్



లబ్బీపేట(విజయవాడతూర్పు): బజాజ్ ఆటో వారి అధునాతన బైక్ పల్సర్ 150 సీసీని శుక్రవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా బెంజిసర్కిల్ వద్ద ఉన్న వరుణ్ బజాజ్ షోరూమ్‌లో ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీవీ సత్యనారాయణ సరికొత్త బైక్‌ను ఆవిష్కరించి తొలి కస్టమర్‌కు తాళాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పల్సర్ 4 స్ట్రోక్, ఎయిర్ కూల్డ్, క్లోజ్డ్ లూప్ ఫ్యూయల్ ఇంజక్షన్ సిస్టమ్, 14 హార్స్ పవర్, 13.4 ఎన్ఎం టార్క్ అందించగల, 5 - స్పీడ్ గేర్ బాక్స్ ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బజాజ్ ఆటో ఏరియా మేనేజర్ సదత్ బాషా ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో యువ శతావధానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం యువ శతావధానం జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శుక్రవారం ఉప్పలధడియం భరత్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన అవధానంలో తొలి అచ్చ తెలుగు అవధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానందప్రసాద్, డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, మెట్ల వెంకటేశ్వరరావు, డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ, పింగళి వెంకటకృష్ణారావు, కేఎస్ రామారావు, పీ భానుమతి, డాక్టర్ దండిభోట్ల దత్తాత్రేయశర్మ పాల్గొన్నారు. శతావధానంలో పాల్గొన్న ప్రముఖులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ఈఓ రామారావు వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

పొలిటికల్ టూరిస్టులతో జాగ్రత్త



48వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, శ్వేత

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఎన్నికల సమయంలో వచ్చే పొలిటికల్ టూరిస్టులతో అప్రమత్తంగా ఉండాలని, ఓడిపోగానే వాళ్లు వెళ్లిపోతారని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కేశినేని శ్వేత పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌లకు మద్దతుగా 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో డివిజన్‌లోని కొండ ప్రాంతాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సొరంగం రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపం నుంచి ప్రచారం ప్రారంభించగా, చిరు వ్యాపారులు, వృద్ధులు, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. సాధుజాన్ వీధి మీదుగా సొరంగం కొండపైకి చేరుకున్న మేయర్ భాగ్యలక్ష్మి, కేశినేని శ్వేత, కార్పొరేటర్లు ఆదిలక్ష్మి, మరుపిళ్ల రాజేష్, పడిగపాటి చైతన్యరెడ్డి, యలకల చలపతిరావులు ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి ప్రజల కోసం ఈ ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందించి ఆశీర్వదించాలని కోరారు. రెండు ఓట్లలో ఒకటి ఎంపీ అభ్యర్థి కేశినేని నానికి, మరొకటి ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌కు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి, కేశినేని శ్వేత మాట్లాడుతూ ఎన్నికల పేరిట పొలిటికల్ టూరిస్టులు వస్తున్నారని తెలిపారు. వారికి, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న స్థానికులకు మధ్య పోటీ జరుగుతుందన్నారు. పశ్చిమను సింగపూర్ చేస్తామని చెబుతున్న ఉమ్మడి అభ్యర్థి, మాతో సమానంగా కొండలు ఎక్కగలరా అని ప్రశ్నిస్తున్నామని అన్నారు. పశ్చిమలో జరిగిన అభివృద్ధితో బహిరంగ చర్చకు మేము సిద్ధమని పేర్కొన్నారు. 48వ డివిజన్‌ను నాలుగు కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందని వివరించారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, కోటిరెడ్డి, మహదేవు అప్పాజీరావు, గుడివాడ నరేంద్ర, అబ్దుల్ అర్షద్, 48వ డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధి మెహరాజ్, నాయకులు అయితా కృష్ణకిశోర్, నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు, దిద్దుకూరి శివతో పాటు వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, సోషల్ మీడియా సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కేశినేని శ్వేత పుట్టిన రోజును పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నేతలు కేక్ కట్ చేయించారు. ప్రచార యాత్ర ప్రారంభంలో సొరంగం రోడ్డులో పెద్ద ఎత్తున చిన్నారులు శ్వేతకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో శారదా విద్యార్థుల ప్రతిభ



ఎస్.యామిని-466 జూనియర్ ఎంపీసీ



ఎస్.జాహ్నవి-435 జూనియర్ బైపీసీ



సీహెచ్ శ్రీరామ్ సంజీవ్-987 సీనియర్ ఎంపీసీ



ఎ.మధుమేఘన-989, సీనియర్ బైపీసీ

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో తమ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారని శారద విద్యాసంస్థల చైర్మన్ వై.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను ఎస్.యామిని-466, కె.జాన్ మార్లిటో-465, డి.మాధురి-465, జి.రసజ్ఞ-465, ఎం.నాగసాయి-464 మార్కులు పొందారని పేర్కొన్నారు. జూనియర్ బైపీసీలో 440 మార్కులకు గాను ఎస్.జాహ్నవి-435, బి.సింధు- 433, సీహెచ్ శ్రీరామ్-430, కె.యషిత-430 మార్కులు పొందారని చెప్పారు. సీనియర్ ఎంపీసీలో వెయ్యి మార్కులకు గాను సీహెచ్.శ్రీరామ్ సంజీవ్, టి.నాగభారతి, కె-నవ్య చంద్రిక, సీహెచ్.శ్రావణి -987 మార్కులు, మనస్వి దుర్గ -986 మార్కులు సాధించారని పేర్కొన్నారు. సీనియర్ బైపీసీలో వెయ్యి మార్కులకు గాను ఎ.మధుమేఘన-989, ఎం.లావణ్య-987, ఆర్. సింధుశ్రీ-982 మార్కులతో ఉత్తీర్ణులయ్యారని వివరించారు. పరిమిత విద్యార్థులతో ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఇంత మంచి ప్రతిభ చూపడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. చక్కని ప్రణాళికతో, మారుతున్న పాఠ్యాంశాలకు అనుగుణంగా సులభతరంగా పాఠ్యాంశాలు అర్థం చేసుకునేలా అనుభవజ్ఞులైన అధ్యాపకులతో స్టడీ అవర్స్ నిర్వహిచడంతోనే ఈ ఫలితాలు సాధించామని మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి తెలిపారు. ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులను కళాశాల సలహాదారుడు ఈయస్ఆర్‌కె.ప్రసాద్ కళాశాల జనరల్ మేనేజర్ జీవీ రావు తోపాటుగా అధ్యాపకులు అభినందించారు.


సభకు హాజరైన అశేష జనసందోహానికి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

భారీ వర్షంలోనూ జనం 'సిద్ధం'

భోజన విరామం కూడా లేకుండా 9 గంటల పాటు సీఎం జగన్ యాత్ర

అభిమాన సముద్రం ముందు గాలి దుమారం తేలిపోయింది. ఈదురు గాలులు వీస్తున్నా జనసందోహం చెక్కు చెదరని సంకల్పంతో జననేత కోసం నిరీక్షించింది. శుక్రవారం మేమంతా సిద్ధం బస్సుయాత్ర పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం ధూళిపాళ్ల నుంచి గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గం నంబూరు వరకు జరిగింది. యాత్ర మేడికొండూరు చేరుకునేసరికి ఈదురు గాలులతో వర్షం మొదలైంది. జన సంద్రమే గొడుగులా సీఎం జగన్ కాన్వాయి ముందుకు సాగింది. గుంటూరులో మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు పలుదఫాలుగా వర్షం పడింది. గాలుల ధాటికి పలు చోట్ల ఫ్లెక్సీలు ఒరిగిపోవడంతో ప్రజలే స్వచ్ఛందంగా ముందుకొచ్చి వాటిని నిలబెట్టడం గమనార్హం. ఏటుకూరులో భారీ వర్షం కురవడంతో సభా ప్రాంగణం మొత్తం తడిచి ముద్ద అయింది. ప్రతిచోటా అభిమానులు, ప్రజలు భారీగా తరలిరావడంతో ముఖ్యమంత్రి జగన్ బస్సు యాత్ర శుక్రవారం భోజన విరామం కూడా లేకుండా తొమ్మిది గంటల పాటు నిరాటంకంగా సాగింది. గుంటూరు జిల్లాలో పేరేచర్ల నుంచి సభా ప్రాంగణం వరకు సుమారు 16 కిలోమీటర్ల మేర జనసంద్రాన్ని తలపిస్తూ రోడ్‌షో జరిగింది.

మోసాలు కావాలా? మంచి కొనసాగాలా?

మీరే నా స్టార్ క్యాంపైనర్లు.. ఏటుకూరు మేమంతా సిద్ధం సభలో సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'మోసాల చంద్రబాబు నుంచి మన రాష్ట్రం, పేదల భవిష్యత్తును కాపాడుకునేందుకు జరుగుతున్న ఈ యుద్ధంలో మీరంతా ప్రతి ఇంటికి వెళ్లి గత 58 నెలలుగా జరిగిన మంచిని వివరించాలి. ప్రతి ఇంటికి వెళ్లి వాస్తవాలు వివరించి స్టార్ క్యాంపైనర్లుగా చేయాలి. ఈ మంచి కొనసాగాలంటే మీ బిడ్డ మళ్లీ రావాలి.. మోసపోకూడదంటే మీ బిడ్డకే ఓటు పడాలి అని ప్రతి గడపకూ చెప్పాలి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి గుంటూరు శివారు ఏటుకూరు వద్ద నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

అందరి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ..

ఈరోజు గుంటూరులో కనిపిస్తున్న ఈ మహా జన సముద్రం చరిత్రలో ఎప్పటికి నిలిచిపోతుంది. మనందరి ప్రభుత్వానికి మద్దతుగా ఇప్పుడు జరుగుతున్న మంచిని కాపాడుకునేందుకు, ఆ మంచిని కొనసాగించేందుకు ఇక్కడికి వచ్చిన ప్రతి అవ్వాతాత, సోదరులు, స్నేహితులకు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలియచేస్తున్నా. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రతి గ్రామానికి పౌర సేవలు, విద్య, వైద్యం, రైతన్న లకు భరోసా, అక్క చెల్లెమ్మలకు సాధికారత, అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ సేవలు అందించిన మన ప్రభుత్వానికి మద్దతు పలకడానికి మీరంతా సిద్ధమేనా? గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఏకంగా రూ.2.70 లక్షల కోట్లను ఒక్క రూపాయి కూడా లంచం, వివక్షకు తావు లేకుండా 130 సార్లు బటన్ నొక్కి పారదర్శకంగా నేరుగా అందించిన ఈ ప్రభుత్వానికి, మీ జగన్‌కు మద్దతుగా ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కేందుకు, మరో వంద మందికి చెప్పి నొక్కించడానికి మీరంతా సిద్ధమేనా?

రోడ్లపై అబద్ధాల బుర్ర కథలు..

ఈ ఎన్నికల యుద్ధం కేవలం చంద్రబాబుకు, జగన్‌కు మధ్య జరుగుతున్నది కాదు. ఈ యుద్ధం బాబు



మోసాలకు, ప్రజలకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఇది ఇంటింటికి పెన్షన్ అందించిన ప్రభుత్వానికి, వాటిని ఆపిన బాబు దుర్మార్గాలకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఇది వారి మోసాలకు, మన విశ్వసనీయతకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఆ అబద్ధాల బాబుకు ఇద్దరు వంత పాడుతున్నారు. ఒకరు దత్తపుత్రుడు, మరొకరు ఆయన వదినమ్మ. ఈ ముగ్గురు కలిసి రోడ్లపై అబద్ధాల బుర్ర కథలు చెబుతున్నారు. 2014 హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చకుండా మోసగించిన బాబు ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవన్ అంటూ నమ్మబలుకుతున్నారు.

మంచి కొనసాగాలో వద్దో ఆలోచించండి..

ఈ రోజు మీరంతా ఇంటికి వెళ్లాక కుటుంబ సభ్యులతో కలసి ఒక్క అంశంపై ఆలోచన చేయమని కోరుతున్నా. మీ బిడ్డకు ఓటు వేయడం అంటే గత 58 నెలలుగా జరుగుతున్న మంచిని మీరందరూ కొనసాగించేందుకే ఓటు వేసినట్లే. మీ బిడ్డకు కాకుండా చంద్రబాబుకు ఓటు వేయడం అంటే దాని అర్థం.. ఈ 58 నెలలుగా మీకు జరుగుతున్న మంచిని మీ అంతట మీరే మీకు వద్దని చెప్పినట్లేనని గుర్తుంచుకోవాలని కోరుతున్నా. 58 నెలల క్రితం మీ బిడ్డ మీ అందరి ముందు నిలబడి ఫలానాది చేస్తానని ఎన్నికల మేనిఫెస్టో తీసుకొచ్చాడు. మేనిఫెస్టోను బైబిల్, భగవద్గీత, ఖురాన్ మాదిరిగా భావించి 99 శాతం హామీలను అమలు చేసి మీ ముందుకు వచ్చి మరోసారి ఆశీస్సులు కోరుతున్నాడు.

సెల్‌ఫోన్ లైట్లతో సంఘీభావం..

వలంటీర్లు మళ్లీ మన ఇంటికే రావాలన్నా, పేదవాడి భవిష్యత్ బాగుండాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు లేని పాలన కొనసాగాలన్నా, మన పిల్లల చదువులు, బడులు బాగుపడాలన్నా, మన వ్యవసాయం, మన ఆస్పత్రులు బాగుండాలన్నా ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలి. 175కి 175 అసెంబ్లీ సీట్లు, 25కి 25 పార్లమెంట్ సీట్లలో ఏ ఒక్కటీ తగ్గకుండా గెలిపించేందుకు మీరు సిద్ధమేనా? పేదల భవిష్యత్తు బాగుండాలని చేస్తున్న ఈ యుద్ధానికి మీరంతా సెల్‌ఫోన్లలో టార్చి లైట్లు వెలిగించి సంఘీభావం తెలియచేయాలి.

పాలకుడు మోసగాడైతే...

ఎలాంటి వారు రాజకీయ నాయకుడిగా ఉండాలి? ఎలాంటి వారిని మనం ముఖ్యమంత్రిగా తెచ్చుకోవాలన్న విషయంపై ప్రతి ఇంట్లో చర్చ జరగాలి. ఎందుకంటే మనం వేసే ఓటు ద్వారా రాబోయే ఐదేళ్ల జీవితం ఆ పాలకుడి చేతుల్లో పెడుతున్నాం. ఆ పాలకుడికి మంచి మనసు ఉండి మంచి చేస్తే మన జీవితాలు బాగుపడతాయి. ఆ పాలకుడు మోసగాడు అయితే మన బతుకులు అంధకారం అవుతాయి. పిల్లల జీవితాలు అస్తవ్యస్తం అవుతాయి. అక్కచెల్లెమ్మల బతుకులు అతలాకుతలం అవుతాయి. రైతన్నల జీవితాలు మోసపోయి ఆత్మహత్యల పాలవుతాయి. అవ్వాతాతల సంక్షేమం అడుగంటిపోతుంది. అందుకే ఈ వాస్తవాలపై ప్రతి ఇంట్లోనూ చర్చ జరగాలని కోరుతున్నా.

- గుంటూరు పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న కిలారు రోశయ్య, అసెంబ్లీ అభ్యర్థులు నూరి ఫాతిమా, బలసాని కిరణ్‌కుమార్, మురుగుడు లావణ్య, మేకతోటి సుచరిత, అన్నాబత్తుని శివకుమార్, విడదల రజని, అంబటి మురళీకృష్ణ, మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎంపీలు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, నందిగం సురేష్, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మహ్మద్ ముస్తఫా, మద్దాళి గిరి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, పార్టీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, మందపాటి శేషగిరిరావు, బత్తుల దేవానంద్ తదితరులు ఏటుకూరు సిద్ధం సభలో పాల్గొన్నారు.

2014 ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే..



ఒక్కసారి 2014 ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే.. నాడు కూడా ఇదే కూటమి! మేనిఫెస్టో అంటూ రంగు రంగుల కాగితాలతో ప్రజల జీవితాలతో చెలగా టమాడారు. ఇదే చంద్రబాబు సంతకం చేసి దత్తపుత్రుడు, ప్రధాని మోదీ ఫొటోలతో పాంప్లెట్లు ముద్రించి ప్రతి ఇంటికి పంపారు. మీరు మర్చిపోతారేమోననే భయంతో టీవీలలో, పేపర్లలో ఊదరగొట్టారు. చంద్రబాబు నాటి మోసాల్లో ఒక్కసారి ముఖ్యమైన వాటిని మీకు గుర్తు చేస్తా.

రైతులకు రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ అయ్యాయా?

పొదుపు సంఘాల రుణాలు రూ.14,205 కోట్లు మాఫీ చేస్తామని చెప్పి కనీసం ఒక్క రూపాయైనా మాఫీ చేశాడా?

ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద బ్యాంకులో రూ.25 వేలు డిపాజిట్ చేస్తామన్నాడు. మీకుగానీ, మీ ఇంటి చుట్టుపక్కల వారికిగానీ ఎవరికైనా ఒక్క రూపాయి డిపాజిట్ చేశారా?

ఇంటికో ఉద్యోగం లేదంటే రూ.2 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు. ఐదేళ్లలో అంటే 60 నెలల పాటు నెలకు రూ.రెండు వేలు చొప్పున ప్రతి ఇంటికి రూ.1.20 లక్షలు ఇచ్చాడా?

అర్హులైన వారందరికీ మూడు సెంట్ల స్థలం, కట్టుకునేందుకు పక్కా ఇల్లు ఇస్తామన్నారు. ఏ పేదవాడికైనా ఒక్కటంటే ఒక్క సెంటు స్థలం ఇచ్చాడా?

రూ.10 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అన్నాడు. చేనేత, పవర్‌లూమ్స్ రుణాలు మాఫీ అన్నాడు. మరి జరిగిందా?

మహిళా ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మరి చేశాడా?

సింగపూర్‌కు మించి అభివృద్ధి చేస్తామన్నాడు.. మరి జరిగిందా?

ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మరి గుంటూరులో ఏమైనా కనిపిస్తోందా?


గుంటూరు రోడ్ షోకు తరలివచ్చిన భారీ జనసందోహానికి అభివాదం చేస్తున్న సీఎం జగన్

బాధలు విన్నాడు.. భరోసా ఇచ్చాడు..

తనను కలిసిన బాధితులకు సీఎం జగన్ ఆపన్న హస్తం



బాధితుల సమస్యలను వింటున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి : మేమంతా సిద్ధం బస్సు యాత్ర చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను పలువురు కలిసి తమవారికి వచ్చిన కష్టాలు చెప్పుకొన్నారు. వైద్యం అందించాలని కోరారు. వారి బాధలు సావధానంగా విన్న సీఎం జగన్.. ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లిన తన సోదరుడు షేక్ సుభానికి వైద్యం చేయించండన్నా అంటూ గుంటూరు జిల్లా క్రోసూరు మండలం ఊటుకూరుకు చెందిన బాజీబీ సీఎం జగన్‌ను వేడుకున్నారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల సమీపంలోని భాగ్యనగర్ కాలనీ వద్ద మేమంతా సిద్ధం బస్సు యాత్రకు సీఎం జగన్ వస్తున్నారని తెలుసుకుని కోమాలో ఉన్న సోదరుడిని కుటుంబ సభ్యులతో కలిసి అంబులెన్స్‌లో తీసుకొచ్చి రోడ్డుపై నిలబడింది బాజీబీ. వారిని గమనించిన సీఎం వెంటనే బస్సు దిగి సమస్యను తెలుసుకున్నారు. వీఆర్‌వోగా పనిచేస్తున్న సుభాని గత ఆగస్టులో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడని, అప్పటి నుంచి కోమాలోకి వెళ్లాడని చెబుతూ ఇప్పటి వరకు రూ.20 లక్షలు ఖర్చయ్యాయని, సీఎం సహాయనిధి ద్వారా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రూ.3 లక్షలు సాయం కూడా అందించారని సీఎం దృష్టికి తెచ్చారు. ఇక వైద్యం చేయించే స్తోమత తమకు లేదన్నారు. వారి సమస్యను విన్న సీఎం జగన్.. సుభానికి ప్రభుత్వమే వైద్యం చేయిస్తుందని భరోసా ఇచ్చారు. అలాగే, దాచేపల్లి మండలం శ్రీనగర్‌కు చెందిన గంటెల వెంకటేశ్వర్లు, శారదల 12 ఏళ్ల కుమారుడు చరణ్‌కు పుట్టుకతోనే మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఎదుగూ బొదుగూ లేకుండా మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. మేమంతా సిద్ధం యాత్రకు ధూళిపాళ్ల శివారులో సీఎం జగన్ రోడ్ షో చేస్తుండగా బస్సు వెంట ఆ బాలుడిని ఎత్తుకుని తల్లిదండ్రులు పరుగెత్తడం సీఎం జగన్ గమనించి.. బస్సాపి వారిని పిలిచి వివరాలు తెలుసుకున్నారు. ఎంత ఖర్చయినా సరే చరణ్‌కు వైద్యం చేయిస్తామని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. వైద్యానికి ఏర్పాట్లు చేయాల్సిందిగా తన సిబ్బందిని ఆదేశించారు.

బాబు మోసాలకు వంతపాడుతున్న వదినమ్మ, దత్తపుత్రుడు

సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: చంద్రబాబు మోసాల బుర్రకథకు తానా అంటే తందానా అంటూ ఆయన వదినమ్మ, దత్తపుత్రుడు వంతపాడుతూ రోడ్లపై కని పిస్తున్నారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 'మీ బిడ్డకు ఓటు వేయడమంటే 58 నెలలుగా మీకు జరుగుతున్న మంచిని కొనసాగించాలని ఓటు వేస్తున్నట్లు లెక్క. అదే చంద్రబాబుకు ఓటు వేయడం అంటే దాని అర్థం.. మీకు జరుగుతున్న మంచి మాకొద్దు అని ఓటు వేసినట్లు అవుతుంది. ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి' అని ప్రజలను కోరుతూ సీఎం జగన్ ట్వీట్ చేశారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ, బీజేపీ ముఖ్య నేతలు

- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం జగన్
- పార్టీలో చేరిన వారిలో మాజీ ఎమ్మెల్సీ మసాల పద్మజ, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, టీడీపీ నేత కోట్ల హరిచక్రపాణిరెడ్డి, మాజీ మేయర్ కురువ శశికళలు

సాక్షి, అమరావతి : టీడీపీ, బీజేపీ పార్టీలకు చెందిన ముఖ్య నేతలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా పల్నాడు జిల్లా ధూళిపాళ్ల నైట్ స్టే పాయింట్ వద్దకు వచ్చిన సీఎం జగన్ సమక్షంలో ఆలూరు, కోడుమూరు నియోజకవర్గాల నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. కోడుమూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, టీడీపీ కీలక నేత కోట్ల హరిచక్రపాణిరెడ్డిలు వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే.. ఆలూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ మసాల పద్మజ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైకుంఠం మల్లికార్జునచౌదరి, చిప్పగిరి మాజీ ఎంపీపీ భీమలింగప్పచౌదరి, నియోజకవర్గ నేత షీలాధరణ్, వాల్మీకి సంఘం సీనియర్ నేత, మాజీ జెడ్పీటీసీ దేవేంద్రప్ప, వలిగొండ మాజీ ఎంపీపీ సిద్ధప్పలు వైఎస్సార్‌సీపీలో చేరారు. బీజేపీ నుంచి మాజీ మేయర్, ఆలూరు నియోజకవర్గ నేత కురువ శశికళ, ఏపీ కురువ సంఘం గౌరవాధ్యక్షుడు కృష్ణమోహన్‌లు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి సీఎం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కర్నూలు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి రామయ్య పాల్గొన్నారు.


సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ మసాల పద్మజ, బీజేపీ నేత, మాజీ మేయర్, కురువ శశికళ, ఏపీ కురవ సంఘం గౌరవ అధ్యక్షుడు కృష్ణమోహన్


సీఎం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్ రెడ్డి, కోట్ల హరిచక్రపాణిరెడ్డి

నేడు మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఇలా..

- ఉదయం 9 గంటలకు నంబూరు బైపాస్ నుంచి సీఎం యాత్ర ప్రారంభం
- 11 గంటలకు సీకే కన్వెన్షన్‌లో చేనేత కార్మికులతో ముఖాముఖి
- కేసరపల్లి శివారులో రాత్రి బస



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర 14వ రోజైన శనివారం(ఏప్రిల్ 13) షెడ్యూల్‌ను ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం గురువారం విడుదల చేశారు. ఈ యాత్రలో భాగంగా సీఎం జగన్ శుక్రవారం రాత్రి బస చేసిన నంబూరు బైపాస్ నుంచి శనివారం ఉదయం 9 గంటలకు బయలుదేరుతారు. కాజా, మంగళగిరి బైపాస్ మీదుగా 11 గంటలకు సీకే కన్వెన్షన్ వద్దకు చేరుకొని చేనేత కార్మికులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కుంచనపల్లి బైపాస్ మీదుగా తాడేపల్లి బైపాస్‌కు చేరుకొని భోజన విరామం తీసుకుంటారు. ఆ తర్వాత విజయవాడలో వారధి, శిఖామణి సెంటర్, చుట్టుగుంట, భగత్‌సింగ్ రోడ్డు, పైపుల రోడ్డు, కండ్రిక, రామవరప్పాడు, నిడమానూరు బైపాస్ మీదుగా కేసరపల్లి బైపాస్ శివారులో ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి సీఎం జగన్ చేరుకుంటారు.

గుంటూరు జిల్లా సిద్ధమా?

మేమంతా సిద్ధం బస్సు యాత్ర శుక్రవారం గుంటూరు జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా 'గుంటూరు జిల్లా సిద్ధమా?' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక మాధ్యమం ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు చేశారు. ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో మేమంతా సిద్ధమంటూ సీఎం వైఎస్ జగన్‌తో కలిసి బస్సు యాత్రలో పాల్గొన్నారు.

-సాక్షి,అమరావతి

స్టార్ క్యాంపెయినర్లతో
13వ రోజు సీఎం వైఎస్ జగన్

'మేమంతా సిద్ధం యాత్రలో 13వ రోజున నా స్టార్ క్యాంపెయినర్లతో...' అంటూ సీఎం వైఎస్ జగన్ శుక్రవారం కొన్ని ఫొటోలను ట్వీట్ చేశారు. ఓ మహిళ సెక్యూరిటీని దాటుకుని సీఎం జగన్‌తో సెల్ఫీ దిగేందుకు ముందుకొచ్చారు. ఆమెను గమనించిన సీఎం జగన్.. సెక్యూరిటీకి చెప్పి సెల్ఫీ తీసుకునేందుకు అవకాశం ఇచ్చారు. మరో మహిళ మండే ఎండలో సీఎం జగన్‌ను కలిసి 'సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయి. మేం చల్లాగా ఉన్నాం.. మీరు, మీ కుటుంబం చల్లాగా ఉండాలయ్యా? మిమ్మల్ని కలవడం చాలా సంతోషంగా ఉంది..' అని చెప్పడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. పార్టీ కండువా కప్పుకొని సీఎం దగ్గరకు వచ్చి పలకరించిన ఓ యువతిని.. సీఎం జగన్ ఆశీర్వదించారు. వీల్‌చైర్‌పై వచ్చిన ఓ మహిళను చూసి సీఎం జగన్ చలించిపోయారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి.. 'నేను ఉన్నాను.. నేను విన్నాను.. నీకు అంతా మంచి జరుగుతుంది' అంటూ భరోసా ఇచ్చారు. - సాక్షి, అమరావతి





















సత్తెనపల్లి: బస్సు యాత్రకు హాజరైన భారీ జనసందోహానికి సీఎం జగన్ అభివాదం

అభిమాన జల్లు

ఉదయం మండుటెండ.. సాయంత్రం జడివాన.. తగ్గని జనహోరు

సత్తెనపల్లి, గుంటూరులో జన సునామీని సృష్టించిన సీఎం జగన్ బస్సుయాత్ర

(మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి
సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

'సుర్రుమంటున్న ఎండలో బిడ్డను చంకనెత్తుకుని పరుగెడుతున్న ఓ తల్లి.. చిన్నారిని భుజాలపై ఎక్కించుకుని అదిగో జగన్ అంటున్న ఓ తండ్రి.. ఊతకర్ర సాయంతో ఉత్సాహంగా అడుగులేస్తున్న ఓ తాత.. మనస్సున్న మనవడిని కళ్లారా చూసేందుకు క్యారేజీ కట్టుకుని రోడ్డుపై నిరీక్షిస్తున్న ఓ అవ్వ.. మా భవిష్యత్తు నీతోనేనంటూ ఉరలేస్తున్న యువత.. అన్నొచ్చాడన్న ఆనందంలో డీజే స్టెప్పులేస్తున్న అక్కచెల్లెమ్మలు'.. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ఉదయం పూట కనిపించిన దృశ్యాలివి. ఇక మధ్యాహ్నం వేళ ఆకాశమంత అభిమానాన్ని వరుణుడు తన జల్లులతో అభిషేకించడంతో ప్రతి హృదయం పులకించింది. ఎండైనా, వానైనా.. పగలైనా, రాత్రయినా.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్ర కోట్లాది ప్రజల హృదయాలను స్పృశిస్తూ జన జాతరను తలపిస్తోంది. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కొనసాగుతున్న పాలనకు అశేష జనవాహిని బ్రహ్మరథం పడుతోంది.

వేకువజాము నుంచే జనజాతర

మేమంతా సిద్ధం' బస్సుయాత్ర 13వ రోజు పల్నాడు జిల్లా వాసుల అపూర్వ ఆదరాభిమానాల మధ్య గుంటూరు జిల్లాలోకి ప్రవేశించి జైత్రయాత్రను తలపించింది. సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలం ధూళిపాళ్లలోని రాత్రి బస శిబిరం నుంచి శుక్రవారం ఉదయం 10.15 గంటలకు ముఖ్యమంత్రి జగన్ బస్సు యాత్ర ప్రారంభమైంది. జననేత కోసం వేకువజామునుంచే తరలివచ్చిన జన సందోహంతో ధూళిపాళ్ల శిబిరం కోలాహలంగా మారింది. సాయం కోరుతూ తనను కలిసేందుకు వచ్చిన అనారోగ్య బాధితులను అక్కున చేర్చుకున్న సీఎం జగన్ వారి సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. భాగ్యనగర్ కాలనీ, జంగంగుంట్లపాలెం, కంకణాలపల్లిలో మహిళలు భారీ ఎత్తున సీఎం జగన్‌కు యాత్రకు స్వాగతం పలికారు.



పేరేచర్ల: రోడ్‌షోకు తరలివచ్చిన అశేష ప్రజానీకానికి సీఎం వైఎస్ జగన్ అభివాదం

సత్తా చూపిన సత్తెనపల్లి

సీఎం జగన్‌కు సత్తెనపల్లి జనతోరణాలతో ఘన స్వాగతం పలికింది. ప్రధాన రహదారి కిక్కిరిసిపోయింది. భారీ గజమాలలు, పూల వర్షంతో బస్సు యాత్రగా వస్తున్న సీఎం జగన్‌ను మనసారా ఆశీర్వదించింది. ప్రతి సెంటర్‌లో మహిళలు భారీగా తరలివచ్చి గుమ్మడి కాయలతో దిష్టి తీసి హారతులు పట్టారు. సీఎం జగన్ బస్సుపైకి చేరుకుని అందరికీ అభివాదం చేశారు. మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు రోడ్‌షో ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. లా నేస్తం, సంక్షేమ నిధికి సాయం అందించి తమకు అండగా నిచిలిన సీఎం జగన్‌కు యువ న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు.

గర్జించిన గుంటూరు..

మేడికొండూరు మండలం కంటెపూడి అడ్డరోడ్డు వద్ద మధ్యాహ్నం 2 గంటలకు గుంటూరు జిల్లాలోకి ప్రవేశించిన సీఎం జగన్ బస్సు యాత్రకు అపూర్వ స్వాగతం లభించింది. విద్యార్థులు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో తాము పొందిన లబ్ధిని వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఎక్కడ చూసినా బస్సుయాత్ర వెంట భారీ జనసందోహం ఉరకలెత్తింది. కొర్రపాడులో గజమాలలు, బంతిపూలతో బస్సుయాత్రను ఆహ్వానించారు. మహిళలు రోడ్లకు ఇరువైపు నిలబడి జెండాలు చేత పట్టుకుని రెపరెపలాడించారు. జంగంగుంట్లపాలెంలో మేళతాళాలతో స్టార్ క్యాంపెయినర్లు కదం తొక్కారు. మేడికొండూరు జెండాచెట్టు సెంటర్‌లో మహిళలు గుమ్మడి కాయలతో దిష్టి తీసి జగన్ మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలని ఆకాంక్షించారు.

16 కి.మీ. జనప్రవాహం..

పేరేచర్ల నుంచి ఏటుకూరు బైపాస్‌లోని బహిరంగ సభ ప్రాంగణం వరకు రహదారులన్నీ కిక్కిరిసి కనిపించాయి. సుమారు 16 కిలోమీటర్లకుపైగా జనప్రవాహం బస్సుయాత్ర వెంట కదలి వచ్చింది. షెడ్యూల్ కంటే నాలుగు గంటలకుపైగా బస్సుయాత్ర ఆలస్యమైంది. ఉదయం నుంచి రోడ్‌షో, ఆత్మీయ పలకరింపులతో ముఖ్యమంత్రి జగన్ భోజన విరామాన్ని సైతం పట్టించుకోలేదు. గుంటూరులోని హౌసింగ్ బోర్డులో భోజన విరామ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అశేష జన వాహినిని దాటుకుని అక్కడకు చేరుకునే సరికి సాయంత్రం ఆరు గంటలు అయింది. అప్పటికే సభా ప్రాంగణం వద్ద జన సందోహం తనకోసం నిరీక్షిస్తుండటంతో సీఎం జగన్ భోజన విరామం కోసం ఆగకుండా ముందుకు కదిలారు. మిర్చియార్డు నుంచి ఏటుకూరి వరకు దారిపొడవునా జనం బారులు తీరారు. భవనాలు, వీధులు నిండిపోయాయి. సీఎం జగన్ బస్సుపైకి ఎక్కి రెండు చేతులు జోడించి అభివాదం చేస్తూ సాయంత్రం ఏడు గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. జోరు వానను సైతం లెక్కచేయకుండా జనవాహిని సీఎం రాక కోసం వేచి చూసింది. సభ అనంతరం రాత్రి 7.40 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి బుడంపాడు బైపాస్, తక్కెళ్లపాడు బైపాస్, పెదకాకాని బైపాస్, వెంగళరావునగర్ మీదుగా రోడ్ షోలో అభిమానులను పలకరిస్తూ పెదకాకాని మండలం నంబూరు బైపాస్‌లో ఏర్పాటు చేసిన రాత్రి బస కేంద్రానికి 8.15 గంటలకు చేరుకున్నారు.



ఘాటు మిర్చి గజమాల

సిరిపురం అడ్డరోడ్డు, భీమనేనివారిపాలెంలో అక్కచెల్లెమ్మలను పలుకరిస్తూ మధ్యాహ్నం 3.30 గంటలకు మేడికొండూరు సెంటర్‌లోకి సీఎం జగన్ బస్సు యాత్ర ప్రవేశించింది. అనంతరం 4 గంటలకు పేరేచర్ల సెంటర్‌కు చేరుకున్న యాత్ర జనసంద్రం నడుమ సాయంత్రం 5 గంటలకు నల్లపాడుకు చేరుకుంది. ప్రతి చోటా పోటెత్తిన జనవాహినితో నిర్దేశిత షెడ్యూల్ కంటే బస్సుయాత్ర ఆలస్యమైంది. నల్లపాడు శ్రీనివాస కాలనీ వద్ద అంబులెన్స్‌కు దారి ఇవ్వాలని కోరుతూ యాత్ర ముందుకు సాగింది. చుట్టుగుంట సెంటర్‌లో గుంటూరు ఘాటు మిర్చి గజమాలతో సంక్షేమ సారథి పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు.



మేడికొండూరు: వర్షంలోను సీఎం వైఎస్ జగన్ బస్సుయాత్రలో అభిమానులు, పార్టీ శ్రేణులు

కరుణించిన వరుణుడు

అందరి అభిమానాన్ని సొంతం చేసుకున్న సీఎం జగన్ యాత్రను స్వాగతిస్తూ వరుణుడు చిరు జల్లులతో ఆశీర్వదించాడు. అప్పటి వరకు వేడి వాతావరణంలో కొనసాగుతున్న బస్సుయాత్ర మేడికొండూరులోకి ప్రవేశించగానే చిరుజల్లులు కురిశాయి. వర్షంలోనూ మేమంతా సిద్ధమంటూ ప్రజలు రోడ్లపై బారులు తీరారు. సీఎం జగన్ వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు తేలికపాటి వర్షం కురిసింది. అంతకుముందు శిబిరం వద్ద సత్తెనపల్లి, నరసరావుపేట, పెదకూరపాడు, గుంటూరు జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల యోగక్షేమాలను తెలుసుకుని ఎన్నికల సమాయత్తంపై దిశా నిర్దేశం చేశారు.



మేడికొండూరు: వర్షంలోను సీఎం జగన్ కోసం తరలివచ్చిన అభిమానులు



గుంటూరు: అభిమానులకు సీఎం జగన్ అభివాదం



గుంటూరు: జాతీయ రహదారి వెంబడి సీఎం జగన్ కోసం బారులు తీరిన అభిమానులు



గుంటూరు: సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు బస్సుల పైకి ఎక్కిన యువకులు, మహిళలు





పేరేచర్ల: అభిమాన నేతకు దిష్టి తీస్తూ...



గుంటూరు: సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో..





పొలదుగు, ధూళిపాళ్ల: అవ్వలతో ఆప్యాయంగా మాట్లాడుతూ..



కంటెపూడి: జగనన్న కోసం మేము సైతం...



పొలదుగు: అభిమానులు బహూకరించిన మేకపిల్లను ఎత్తుకున్న ముఖ్యమంత్రి



సత్తెనపల్లి: సీఎం జగన్ బస్సు యాత్రకు న్యాయవాదుల సంఘీభావం



కంటెపూడి: జగనన్న వెంట మేము సైతం...

పురందేశ్వరి కుట్ర రాజకీయాలు మానుకోవాలి

జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు



నిరసన తెలుపుతున్న జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు, యువకులు

సీతమ్మధార (విశాఖ జిల్లా): రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావుకు విశాఖ ఎంపీ సీటు కేటాయించాలని జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు సమితి ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో శుక్రవారం యువకులు నిరసన తెలిపారు. ×పురందేశ్వరి డౌన్‌డౌన్.. జీవీఎల్ జిందాబాద్÷ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ పురందేశ్వరి కుట్ర రాజకీయాలకు పాల్పడి జీవీఎల్‌ను పక్కన పెట్టారని ఆరోపించారు. విశాఖ పార్లమెంట్ పరిధిలోని వేలాది మంది హిందూ జాతీయవాదులు టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీ భరత్‌ను ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఏబీవీపీ రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షుడు గిద్దలూరు విజయ్‌కుమార్,చింతపల్లి సునీల్ కుమార్, శ్రీహరి, సాయి, రాజశేఖర్, మనోహర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

1 ఎంపీ, 8 అసెంబ్లీ సీట్లలో పోటీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఒక ఎంపీ, 8 అసెంబ్లీ సీట్లలో సీపీఎం పోటీ చేయనుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు వెల్లడించారు. ఇండియా వేదికతో సీట్ల సర్దుబాటు ఓ కొలిక్కి వచ్చిందని, ఎనిమిది సీట్లకు సర్దుబాటు చేసుకున్నామని తెలిపారు. ఈ విషయమై పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం ఆన్‌లైన్‌లో వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించినట్లు శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బీజేపీ, దానికి కొమ్ముకాస్తున్న పార్టీలను ఓడించడానికి ఇండియా వేదిక పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుతో ఉమ్మడిగా పోటీ చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ మేరకు సీపీఐ, కాంగ్రెస్ పార్టీలతో చర్చల అనంతరం జరిగిన ఒప్పందం ప్రకారం ఒక ఎంపీ, ఎనిమిది ఎమ్మెల్యే సీట్లు సర్దుబాటు చేసుకున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. అరకు ఎంపీ, రంపచోడవరం, కురుపాం, గాజువాక, విజయవాడ (సెంట్రల్), గన్నవరం, మంగళగిరి, నెల్లూరు టౌన్, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీపీఎం అభ్యర్థులు పోటీ చేస్తారని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇండియా వేదిక పార్టీలైన కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ అభ్యర్థుల విజయానికి ఆ పార్టీల శ్రేణులు కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

పిఠాపురం నుంచి పవన్‌ను తరిమికొట్టాలి

- ప్రజలకు కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం పిలుపు
- గతంలో భీమవరం, గాజువాక ప్రజలు తరిమికొట్టారు
- ప్రజలపై ప్రేమ ఉంటే పిఠాపురానికి శాశ్వతంగా రావాలి
- ఎమ్మెల్యే అయితే సినిమాలు ఎక్కువ చేయొచ్చు అనుకుంటున్నారు
- మీకు ఓటేయడానికి ప్రజలేమీ అమాయకులు కాదు
- సీఎం జగన్‌ను సంస్కార హీనంగా విమర్శిస్తారా?
- జనసేన అధినేత పవన్‌పై ముద్రగడ ఆగ్రహం



కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన పిఠాపురం నియోజకవర్గం ప్రజలు

కిర్లంపూడి: ముఖానికి రంగు వేసుకొని పిఠాపురంలో పోటీ చేస్తున్న సినిమా యాక్టర్ పవన్ కళ్యాణ్‌ను వచ్చే ఎన్నికల్లో తరిమికొట్టాలని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం ప్రజలకు పిలుపునిచ్చారు. గతంలో భీమవరం, గాజువాక ప్రజలు అదేపనిచేశారని, ఇప్పుడు పిఠాపురం వంతు వచ్చిందన్నారు. పిఠాపురం దరిదాపుల్లో కనబడకుండా ఆయనను చిత్తుచిత్తుగా ఓడించాలని అన్నారు. పవన్ పిఠాపురంలో ఓడిపోవడం ఖాయమన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గానికి చెందిన వెలమ, సగర సంఘం నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పెద్ద సంఖ్యలో కిర్లంపూడి వచ్చి ముద్రగడను, ఆయన తనయుడు గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ, పిఠాపురం ప్రజలపై పవన్‌కు నిజంగా ప్రేమ ఉంటే హైదరాబాద్, విజయవాడలోని ఆస్తులు అమ్ముకుని ఇక్కడికి శాశ్వతంగా రావాలన్నారు. ఎమ్మెల్యే అయితే మరో 4 సినిమాలు ఎక్కువ వస్తాయనుకుని పోటీ చేస్తే ఓటు వేయడానికి ప్రజలు అమాయకులు కాదన్నారు. సీఎం జగన్ దగ్గరకు ఎందుకు వెళ్లానని, పవన్ దగ్గరకు ఎందుకు వెళ్లలేదని కొంతమంది తనను ప్రశ్నిస్తున్నారని చెప్పారు. పవన్ దగ్గర ఒక ఎమ్మెల్యే అయినా ఉన్నారా? ఆయన వద్దకు తానెందుకు వెళ్లాలని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌ది మొదటి నుంచీ రాజకీయ చరిత్ర ఉన్న కుటుంబమని, ప్రస్తుతం సీఎం స్థాయిలో ఉన్న నాయకుడు అని చెప్పారు. కాపు ఉద్యమంలో తనను, తన కుటుంబాన్ని చంద్రబాబు అణచివేస్తుంటే పవన్ ఒక్కసారైనా ఖండించారా అని నిలదీశారు. యువతకు ఉద్యోగావకాశాలు ఎలా కల్పిస్తారో చెప్పకుండా, వారి జీవితాలు నాశనం చేస్తున్నారని దుయ్యబట్టారు. బహిరంగ సభల్లో సీఎం స్థాయిలో ఉన్న జగన్‌ను మెడపై కాలు పెట్టి పాతాళంలోకి తొక్కేస్తానని పవన్ అనడం సంస్కారం అనిపించుకోదన్నారు.

అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీని గెలిపించాలి

పిఠాపురంలో వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే పరిశ్రమలు ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి కృషి జరుగుతుందని ముద్రగడ చెప్పారు. ప్రత్యేకంగా సీఎం జగన్ దృష్టికి తీసుకుని వెళ్లి పిఠాపురం ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించి, జగన్‌ను మరోసారి సీఎంను చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జగన్ సీఎం అయితేనే ప్రతి పేదవాడూ మూడు పూటలా భోజనం చేసే విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలవుతాయని చెప్పారు. మీతో పాటు మీ బంధువుల చేత వైఎస్సార్ సీపీకి ఓటు వేయించాలి అని తనను కలవడానికి వచ్చిన వారికి విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబు అరాచకాలను ప్రజలు మర్చిపోలేదు

చంద్రబాబు పాలనలో అరాచకాలను ప్రజలు మరచిపోలేదని ముద్రగడ అన్నారు. కాపు రిజర్వేషన్ల ఉద్యమం తలపెట్టినప్పుడు తనపై, తన కుటుంబంపై చంద్రబాబు చేసిన అరాచకాలకు తానే ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. 14 రోజులు తిండి తిప్పలు లేకుండా చేశారని, తనపై 19 కేసులు పెట్టి ఏ1 ముద్దాయిగా చూపించారని అన్నారు. కిర్లంపూడిని పోలీసు వలయంలో పెట్టి పాకిస్తాన్‌లా చిత్రీకరించారన్నారు. ఇన్ని చేసిన చంద్రబాబుదే అరాచక పాలన అని స్పష్టం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం సముద్రంలో కలసిపోవాలని అప్పుడే దేవుడిని కోరుకున్నానని, ఆ భగవంతుడు తనను కరుణించడంతో 2019లో చిత్తుగా ఓడిపోయారని చెప్పారు.

నిధుల కోసమే బీజేపీతో పొత్తు

పట్టిసీమను కట్టానన్న కక్షతో డెల్టాకు సీఎం నీరివ్వలేదు

- రెండు బాటిళ్లు తాగినా కిక్కు ఎక్కడంలేదు.. పైగా కిడ్నీలు పోతున్నాయి
- వేమూరు, రేపల్లె నియోజకవర్గాల సభల్లో చంద్రబాబు



కొల్లూరులో చంద్రబాబు ప్రసంగిస్తుండగా వెనుతిరిగి వెళ్లిపోతున్న మహిళలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల/రేపల్లె రూరల్/కొల్లూరు/వేమూరు : దగాపడ్డ రాష్ట్రానికి నిధుల కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని.. లేకపోతే ప్రభుత్వాన్ని నడపటం కష్టమని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం కొల్లూరు, రేపల్లె నియోజకవర్గంలో జరిగిన ప్రజాగళం సభల్లో శుక్రవారం సాయంత్రం ఆయన ప్రసంగించారు. డెల్టా రైతులకు పట్టిసీమ నీళ్లిచ్చిన ఘనత తనదేనని.. పట్టిసీమ తానే కట్టానన్న అక్కసుతో 13 లక్షల ఆయకట్టు ఉన్న కృష్ణా డెల్టాకు జగన్ నీళ్లివ్వలేదన్నారు. పోలవరం పూర్తిచేస్తే గుంటూరు జిల్లాలో మూడు పంటలకు నీళ్లు ఇవ్వవచ్చన్నారు. 2020కి పోలవరం పూర్తిచేద్దామనుకుంటే ఈ ముఖ్యమంత్రి దానిని గోదావరిలో ముంచాడన్నారు. తాను ముఖ్యమంత్రిగా ఉండగా క్వార్టర్ బాటిల్ రూ.60 ఉంటే ఇప్పుడు రూ.200 ఉందని.. రెండు బాటిళ్లు తాగినా కిక్కు ఎక్కడంలేదన్నారు. దీంతో కిడ్నీలు పోతున్నాయన్నారు. తాము సూపర్ సిక్స్‌తో వచ్చామని.. పవన్ మరో నాలుగు పథకాలను కూడా చెప్పారని వాటిని అమలుచేస్తామన్నారు. తాను అధికారంలోకి రాగానే ఏపీ ల్యాండ్ సీలింగ్ యాక్టును రద్దుచేస్తానన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి లొంగి వలంటీర్లు రాజీనామాలు చేయొద్దన్నారు. అలాచేస్తే వచ్చేది ఎన్‌డీఏ ప్రభుత్వమని, అప్పుడు మీ ఉద్యోగాలు గోవింద అన్నారు. ఇక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొంతమంది మంచివాళ్లు, కొంతమంది రౌడీలున్నారని, వీరు కాకుండా సంఘం కోసం ఆలోచించే మంచివాళ్లు టీడీపీలో చేరాలని ప్రతిపక్ష నేత చంద్రబాబు పిలుపునిచ్చారు. వైఎస్ జగన్ మీటింగ్‌కు రూ.20 కోట్లు ఖర్చుపెట్టి జనాన్ని తరలిస్తుంటే తన మీటింగ్‌కు జనం స్వచ్ఛందంగా తరలివస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి సభలకు రాకపోతే రేషన్, పింఛన్ కట్ అని బెదిరిస్తున్నారన్నారు. ఇన్నాళ్లూ పరదాల మాటున తిరిగి ఇప్పుడు బయటకొచ్చాడన్నారు.

వేమూరులో ఫ్లాప్ షో..

ఇక వేమూరు నియోజకవర్గం కొల్లూరులో శుక్రవారం సాయంత్రం చంద్రబాబు ప్రజాగళం సభ జనంలేక ఫ్లాప్ అయింది. సభకు జనం రాకపోవటం, వచ్చిన కొద్దిమంది కూడా బాబు వేదిక మీదకు రాకముందే వెనుదిరగటంతో నేతలు తలలు పట్టుకున్నారు. రేపల్లెలో బాబు ప్రసంగం మొదలు కాగానే వచ్చిన జనంలో అధికులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

నా ఇల్లు తగలబెట్టిన వ్యక్తికి టికెట్ ఇచ్చిన చంద్రబాబు

మంత్రి పినిపే విశ్వరూప్



అమలాపురం రూరల్: 'నా ఇల్లు తగలబెట్టిన వ్యక్తికి టీడీపీ అధినేత చంద్రబాబు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. అటువంటి మనిషి ఇప్పుడు చౌకబారు రాజకీయాలు చేస్తున్నారు. నాపై ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటా..' అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ అమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పినిపే విశ్వరూప్ మండిపడ్డారు. విశ్వరూప్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అమలాపురం సభలో చంద్రబాబు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. అమలాపురంలో వైద్య కళాశాలకు భూసేకరణ, జగనన్న ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూములకు సంబంధించి ఏ యజమాని దగ్గరకి అయినా వెళ్లి వాస్తవాలు తెలుసుకోవాలి. నేను అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యేగా పోటీ నుంచి తప్పుకుంటా..' అని సవాల్ విసిరారు.

పవన్, చంద్రబాబు, లోకేశ్‌లపై చర్యలు తీసుకోవాలి

- ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యక్తిగత ఆరోపణలు చేశారు
- అదనపు సీఈవోకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు



అదనపు సీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తదితరులు

సాక్షి, అమరావతి: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యక్తిగత ఆరోపణలు, ఆధారాలు లేకుండా వ్యాఖ్యలు చేసిన పవన్‌కళ్యాణ్, చంద్రబాబు, లోకేశ్‌లపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ లీగల్‌సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వారి వ్యాఖ్యలపై శుక్రవారం అదనపు సీఈవో కోటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన ఆధారాలను అందచేశారు. ఈ సందర్భంగా విష్ణు, మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి విరుద్ధంగా సీఎం జగన్‌పై వ్యక్తిగత విమర్శలు చేసిన పవన్‌కళ్యాణ్‌పై ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. మార్చి 11న అమలాపురంలో జరిగిన బహిరంగసభలో పవన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన ఆధారాలను సైతం ఇచ్చినట్లు తెలిపారు. అదే సభలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిపై ఎన్నికల నియమావళికి విరుద్ధంగా 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులను ఇబ్బందుల పాలు చేశారని పవన్ ఆరోపించినట్లు చెప్పారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఈనెల 11న అమలాపురం సభలో సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు, ఆధారాలు లేని ఆరోపణలు చేశారని చెప్పారు. వీటిపైన కూడా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సీఎం జగన్‌పై ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా రచించిన ఓ పాటను లోకేశ్ తన యూట్యూబ్ చానల్‌లో ప్రసారం చేశారని, ఆ పాటను వాయిస్ మెసేజ్ (ఐవీఆర్ఎస్ విధానం) ద్వారా బల్క్ కాల్స్ పంపుతున్నారని చెప్పారు. వీటిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అమరావతిని రియల్ ఎస్టేట్ చేసింది చంద్రబాబే?

పెరికె వరప్రసాదరావు



సాక్షి, అమరావతి: పేదల నోళ్లు కొట్టి అమరావతిని రియల్ ఎస్టేట్‌గా చేసింది చంద్రబాబేనని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు ధ్వజమెత్తారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద ఉన్న మానసిక వ్యాధిగ్రస్తుడు మాదిగాని గురునాథాన్ని మంగళగిరిలో లోకేశ్ మైలేజీ కోసం పెయిడ్ ఆర్టిస్టుగా తెచ్చారని విమర్శించారు. తాడేపల్లిలో శుక్రవారం వరప్రసాదరావు మీడియాతో మాట్లాడారు. లోకేశ్‌ను ఏదో ఒక విధంగా గెలుపుదాకా తీసుకురావాలని రామోజీరావు ఆరాటపడుతున్నారని చెప్పారు. ఎన్నికలకు 30 రోజులే ఉండటంతో పెయిడ్ ఆర్టిస్టులను, మానసిక వ్యాధిగ్రస్తులను రంగంలోకి దించారని ఎద్దేవా చేశారు.

జిల్లా వార్తలు



ఇదిగో సంక్షేమం.. ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న విజయవాడ సెంట్రల్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



మాటామంతి.. గుడివాడలోని వాంబేకాలనీలో అవ్వాతాతలతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని



ఆత్మీయ కరచాలనం.. నందిగామ పాత బస్టాండ్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



సమస్యలు వింటూ.. పెదపారుపూడి మండలంలోని యలమర్రులో స్థానికులతో మాట్లాడుతున్న పామర్రు ఎమ్మెల్యే కైలె అనిల్‌కుమార్

మాట కలుపుతూ.. మమేకమవుతూ..

ప్రజలతో మమేకమవుతూ.. మరలా దీవించమని కోరుతూ.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి ఎటువంటి తారతమ్యాలు లేకుండా.. పార్టీలు చూడకుండా.. ఎక్కడా రాజకీయాలకు తావులేకుండా అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. గ్రామగ్రామాన కనిపిస్తున్న అభివృద్ధి జాడలను చూపిస్తూ ఓటును అభ్యర్థిస్తున్నారు. మరోసారి ఫ్యాన్ గుర్తుపై అమూల్యమైన ఓటు ముద్రను వేసి ఇంటికే అందిస్తున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని కొనసాగించే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

ప్రపంచమంతా కీర్తిస్తున్న మేధావి అంబేడ్కర్



ప్రసంగిస్తున్న డాక్టర్ రాజశేఖర్, వేదికపై వీసీ ఆచార్య రాజశేఖర్, గంధం చంద్రుడు

- హరియాణా ప్రభుత్వ అడిషనల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ రాజశేఖర్
- ఏఎన్‌యూలో అంబేడ్కర్ జయంతి ముందస్తు వేడుకలు

ఏఎన్‌యూ: ప్రపంచంలోని అన్ని దేశాలు కీర్తిస్తున్న మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని హరియాణా ప్రభుత్వ అడిషనల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ వి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ జయంతి ముందస్తు వేడుకలు నిర్వహించారు. అతిథులు, యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్య అతిథి వి.రాజశేఖర్ ప్రసంగిస్తూ అంబేడ్కర్‌లోని అంకితభావం, అధ్యయన తత్వం, మనోధైర్యం వంటి ఎన్నో అంశాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నిరంతర అధ్యయనం, విశ్లేషణ, విషయ పరిజ్ఞానం ద్వారా అంబేడ్కర్ దార్శనికమైన ఆలోచనలు చేశారన్నారు.

ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు ప్రసంగిస్తూ పుస్తక పఠనం, విజ్ఞానం పెంపొందించేందుకు అంబేడ్కర్ ఎంతో ప్రాధాన్యమిచ్చారన్నారు. యువత వాటిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ప్రసంగిస్తూ అంబేడ్కర్‌ను అధ్యయనం చేయకపోతే తాను ఈ స్థాయిని పొందేవాడిని కాదన్నారు. మద్రాస్ యూనివర్సిటీ అధ్యాపకుడు ఆచార్య ఎస్.ఆర్మ్‌స్ట్రాంగ్ ప్రసంగిస్తూ అంబేడ్కర్‌లో ప్రపంచానికి ఆదర్శమైన తత్త్వవేత్త, ఆలోచనాపరుడు ఉన్నారన్నారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, ప్రిన్సిపాళ్లు ఆచార్య స్వరూపరాణి, ఆచార్య సిద్ధయ్య, అంబేడ్కర్ అధ్యయన కేంద్రం అధ్యాపకులు ఆచార్య వై.అశోక్ కుమార్, డాక్టర్ కె.అబ్రహం లింకన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పెనమలూరు సమగ్రాభివృద్ధికి కృషి

రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్



ప్రసంగిస్తున్న మంత్రి జోగి రమేష్

కంకిపాడు: పెనమలూరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. కానూరులోని మన కల్యాణ మండపం సమీపంలో గల ఇందిరా ఐకాన్ అపార్ట్‌మెంట్స్‌లో కాలనీ వాసులతో గురువారం రాత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశానికి మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై కాలనీ వాసులతో ముఖాముఖీ మాట్లాడారు. ఆ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉందన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించి మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ దేవభక్తుని చక్రవర్తి, తాడిగడప మున్సిపల్ అధ్యక్షులు అన్నే శ్రావణ్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫోన్ చేసుకుంటానని.. రూ. 95వేలకు కుచ్చుటోపీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేస్తున్నట్లుగా వ్యాపారస్తుడిని నమ్మించి, చాకచాక్యంగా మోసగించిన ఘటన హనుమాన్ జంక్షన్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక విజయవాడరోడ్డులోని లయన్స్‌క్లబ్ సమీపంలో నిర్వహిస్తున్న ఆటోమొబైల్ షాపులో ఓ వ్యక్తి సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చాడు. ఆ సామగ్రికి ఫోన్‌పే ద్వారా నగదు చెల్లిస్తానని, దీని కోసం మరొకరికి ఫోన్ చేయాలంటూ సదరు వ్యాపారి నుంచి ఆ వ్యక్తి ఫోన్ అడిగి తీసుకున్నాడు. ఇంతలో వ్యాపారికి తెలియకుండానే అతని ఫోన్‌పే యాప్ ఓపెన్ చేసి, దాని నుంచి రూ.95 వేలు నగదును మరో అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకుని వెళ్లిపోయారు. ఫోన్ తీసుకున్నా కొద్దిసేపటికి దీన్ని గుర్తించిన వ్యాపారి లబోదిబోమంటూ సైబర్ పోలీసులను, బ్యాంకు అధికారులను ఆశ్రయించారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విజయకేతనం



విద్యార్థులతో నందకిషోర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు ఎంఈసీ, సీఈసీ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. కొత్తపేటలోని కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీ విభాగంలో వీజే సాయిశ్రియ 500 మార్కులకు గాను 490, ఏటీఎస్ వెంకట్ 490, బి. హేమంత్ 488, ఆర్. యోమిత మహి 487, ఎం. వంశీ వచన్ 486, ఎన్వీ కౌశిక్ సాయి 486, ఎం. గాయత్రి 485 మార్కులు సాధించినట్లు వివరించారు. సీనియర్ ఇంటర్ ఎంఈసీ విభాగంలో బి. రాహుల్ 977, బీఎస్ఎస్ ధీరజ్ 969, షేక్ షాహినా 967, ఎస్. కిషోర్ 966, జీఆర్ఎస్ఎస్ వైష్ణవి 965 మార్కులతో టాపర్లుగా నిలిచినట్లు తెలిపారు. సీనియర్ ఇంటర్ సీఈసీ విభాగంలో డాలీ జైన్ 971, జూనియర్ సీఈసీలో పి. సందీప్ 473 మార్కులు సాధించారని వెల్లడించారు. గత 19 ఏళ్లుగా ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో టాప్ మార్కులతో పాటు అత్యధిక ఉత్తీర్ణత సాధిస్తున్నట్లు వివరించారు. వ్యక్తిగత శ్రద్ధ, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో క్రమశిక్షణతో కూడిన ప్రణాళికాబద్ధమైన విద్యా విధానంతో అద్భుత ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అన్నా నందకిషోర్, కరస్పాండెంట్ శ్రీలక్ష్మి అభినందించారు.

ఏసీబీ ఏఎస్పీ వాహనానికి ప్రమాదం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఏసీబీ ఏఎస్పీ రోడ్డు ప్రమాదానికి గురైన ఘటన ఎన్టీఆర్ జిల్లా 65వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. విజయవాడ ఏసీబీ ఏఎస్పీ సుప్రజ కుటుంబసభ్యులతో విజయవాడ నుంచి శుక్రవారం రాత్రి కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో రాత్రి 10 గంటల సమయంలో చిల్లకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న హోటల్ వద్దకు వచ్చే సరికి రహదారి పక్కన ఆగి ఉన్న లారీ అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చింది. దీంతో ఆ లారీ ఏఎస్పీ ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. కారులో ఉన్న ఏఎస్పీతో పాటు కుటుంబసభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు బాధితులను జగ్గయ్యపేట ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తీసుకొచ్చారు.

యార్డులో 1,05,868 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 94,798 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,05,868 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.18,000 వరకు పలికింది.



స్ట్రాంగ్‌గా ఉంటేనే మనుగడ



సాధారణంగా ఇళ్లలో ఆడవాళ్లే వంటలు చేస్తారు. వృత్తిపరంగా చూస్తే మగ చెఫ్‌లే ఎక్కువ కనిపిస్తారు. ఈ విషయాన్ని హైదరాబాద్‌లో ఉంటున్న చెఫ్ నిఖితా ఉమేష్‌ను అడిగితే... "నేను చెఫ్‌గా ఈ వృత్తిని ఎంచుకోవాలనుకున్నప్పుడు 'గిన్నెలు కడగడానికి వెళుతున్నావా' అని వ్యంగ్యంగా అన్నవాళ్లే ఇప్పుడు నా వంటలు రుచి చూసి చూసి తమ అభిప్రాయాన్ని మార్చుకున్నారు" అని వివరించారు. మాస్టర్ చెఫ్ ఇండియా (తెలుగు) జ్యూరీ ప్యానెల్‌లో స్థానం దక్కించుకున్న **నిఖిత ఉమేష్** ఎన్నో విషయాలు ఇలా మన ముందుంచారు.

''చదువుకునే రోజుల్లో టీవీలో మాస్టర్ చెఫ్ ఆస్ట్రేలియా చూసేదాన్ని. ఇంట్లో రకరకాల వంటలు ప్రాక్టీస్ చేసేదాన్ని. ఆ ఆసక్తితోనే హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్స్ చేశాను. దుబాయ్, సింగపూర్‌లలో శిక్షణ కోసం రెండేళ్లపాటు పనిచేశాను. పేస్ట్రీ ప్రొఫెషనల్ అండ్ మాస్టర్ చాకోలేటియర్‌గా హైదరాబాద్‌లో ఏడేళ్లు పని చేశాను. అలా హైదరాబాద్ పేస్ట్రీ చెఫ్‌గా, క్యుజిన్ డిజైనర్‌గా పేరొచ్చింది. ఏడాది క్రితం హైదరాబాద్‌లో మావారితో కలిసి మూడు పేస్ట్రీ బ్రాంచ్‌లు ఏర్పాటు చేశాను. ఏ రంగమైనా మనల్ని మనం నిత్యం నిరూపించుకుంటూనే ఉండాలి. అందులోనూ ఆహారం విషయానికి వస్తే మరీ ప్రత్యేకం. ఇంట్లో తిన్నవారు ఆ వంట రుచి చెప్పేంతవరకు వంట వండినవారు ఒక తెలియని ఒత్తిడిని పీలవుతుంటారు. అలాగే, మేం ప్రతి రోజూ మా పాకశాస్త్ర ప్రావీణ్యంతో ఎంతోమందికి చేరవవుతుంటాం. కాబట్టి, ఈ రంగంలోనూ ఒత్తిడి ఉంటుంది. నైపుణ్యంతోపాటు రుచిగా అందించాలనే భావన కూడా మమ్మల్ని గెలిపిస్తుంటుంది.

వర్క్ బాగుంటేనే...

ఐటీసీ హోటల్స్‌లో చెఫ్‌గా వర్క్ చేసినప్పుడు నా వయసు 22 ఏళ్లే. టీమ్‌లో పద్దెనిమిది మంది చెఫ్స్ ఉండేవారు. అందరూ మగవాళ్లే. అందులో సీనియర్స్ కూడా ఉండేవారు. నా వర్క్ బాగుంటేనే వారందరూ నన్ను గౌరవిస్తారు. ఈ విషయంలో ఎప్పుడూ నేను అలర్ట్‌గా ఉండేదాన్ని. వారికి తగిన సూచనలు ఇస్తూ ఏడేళ్లు పనిచేశాను. ఈ వర్క్‌లో శారీరక శ్రమతో పాటు టైమ్‌కు సంబంధించిన సమస్యలు కూడా ఉంటాయి. ఎక్కువ గంటలు పని చేయాల్సి ఉంటుంది కాబట్టి కుటుంబం కూడా సపోర్ట్‌గా ఉండాల్సి ఉంటుంది. నిజానికి ఇళ్లలో వంటలు చేసే వాళ్లు ఆడవాళ్లే కానీ. హోటల్స్‌లో వృత్తిపరంగా చెఫ్‌లుగా ఉన్న మహిళల శాతం మాత్రం తక్కువగానే ఉంది.

కొత్తగా నేర్చుకుంటూ..

నేను బెంగళూరులో పుట్టి పెరిగాను. అమ్మ ప్రభ డిఫెన్స్‌లో సీనియర్ అడ్మిన్ ఆఫీసర్, నాన్న ఉమేష్ ఎల్ఐసీ రిటైర్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్. నేను కన్నడ అమ్మాయిని కాబట్టి తెలుగు రాదు. మాస్టర్ చెఫ్ ఇండియా అవకాశం వచ్చాక తెలుగు నేర్చుకున్నాను. అందుకు ఆన్‌లైన్ క్లాసెస్ తీసుకున్నాను. చెఫ్ కమ్యూనిటీ నుంచి ఎవరో నన్ను రికమండ్ చేసి ఉంటారు. ఆ విధంగా నాకు జ్యూరీలో సభ్యురాలిగా ఉండే అవకాశం లభించింది. పనిలో చూపించే శ్రద్ధ, తపన మనల్ని విజయమార్గంలో తప్పక నడిపిస్తుంది'' అని వివరించారు ఈ మాస్టర్ చెఫ్. ఆమె అనుభవ పాఠాలు మరికొందరికి విజయ సోపానాలు అవుతాయి కదా...

– నిర్మలారెడ్డి

బ్యూటిప్స్

శిరోజాలకు జీవ కళ...



ఈ కాలం జుట్టుకు నూనె పెడితే జిడ్డుగా ఉంటుందని, పెట్టకుండా ఉంటే వెంట్రుకలకు జీవం లేదని ఇబ్బంది పడుతుంటారు. ఈ సమస్యకు విరుగుడుగా..

- అర కప్పు ఆలివ్ ఆయిల్ (మీ జుట్టుకు తగినంత) వేడి చేయాలి. చల్లారాక వేళ్లతో అద్దుకొని, జుట్టు కుదుళ్లకు పట్టించాలి. దువ్వెనతో కుదుళ్ల దగ్గర నుంచి కిందవరకు దువ్వాలి. ఆ తర్వాత షవర్ క్యాప్ లేదా టవల్‌ను తలకు చుట్టాలి. గంట సేపు ఇలాగే ఉంచి, ఆ తర్వాత ఘాడత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేయాలి. కొబ్బరి నూనెతోనూ ఇలాగే చేయవచ్చు.
- పొడిబారిన మాడు దురదగా కూడా పెడుతుంటుంది. ఈ సమస్యకు విరుగుడుగా అరకప్పు ఆలివ్ ఆయిల్‌లో 2 టీ స్పూన్ల తేనె కలిపి మాడుకు పట్టించాలి. వేడినీళ్లలో ముంచిన టవల్‌ని గట్టిగా పిండి, దానిని తలకు చుట్టాలి. (భరించగలిగేంతటి వేడి మాత్రమే ఉండాలి) 15 నిమిషాల తర్వాత హెర్బల్ షాంపూతో తలస్నానం చేయాలి.
- అర కప్పు వేడి చేసిన ఆలివ్‌ను తలకు పట్టించి, గంట తర్వాత తలస్నానం చేయాలి. చివరలో 3–4 టీ స్పూన్ల యాపిల్ సైడర్ వెనిగర్ కలిపిన మగ్గు నీళ్లతో తలంతా తడపాలి. పది నిమిషాల తర్వాత మంచి నీళ్లతో కడిగేయాలి. ఇలా చేయడం వల్ల కురులు, మాడుపైన చర్మం మృదువుగా మారుతుంది. చుండ్రు సమస్య కూడా తగ్గుతుంది.

● పుస్తకాల హోటల్!

అన్నాన్ని చదివించి అక్షరాలను తినిపిస్తుంది

''మా హోటల్‌కి తినడానికే వస్తారు, కాని తినడానికి వచ్చిన సంగతిని ఇట్టే మర్చిపోతారు. మేము భోజనం తెచ్చి వేడిగా వడ్డిస్తుంటే వాళ్ల చేతులు మాత్రం పేజీలు తిప్పడంలోనే నిమగ్నమై ఉంటాయి. వాళ్ల కళ్లు అక్షరాల వెంట పరుగులు తీస్తుంటాయి. వాళ్ల నాసికలు పదార్థాల ఘుమఘుమలను పసిగట్టే స్పృహలో ఉండవు'' అంటారు 74 ఏళ్ల భీమాబాయ్ జోంధాలే. తన పుస్తకాల హోటల్ ద్వారా నాసిక్ వాసులందరికీ అజ్జి (నానమ్మ) అయ్యారామె. నాసిక్‌కి సమీపంలోని ఓజర్‌లో ఆమె నడుపుతున్న హోటల్ పేరు 'అజ్జిచ్య పుస్తకంచ హోటల్ (గ్రాండ్ మదర్స్ హోటల్ విత్ బుక్స్). ఇందులో మరాఠీ, హిందీ, ఇంగ్లిష్ భాషల పుస్తకాలు... మొత్తం ఐదు వేలున్నాయి. పుస్తకాలను తినిపించే ఈ బామ్మకు చదవడం అంటే చాలా ఇష్టం. కానీ ఆమె తన హోటల్‌లో ఉన్న ఏ ఒక్క పుస్తకాన్నీ చదవలేదు. హోటల్‌కి వచ్చిన వాళ్లు పుస్తకాలు చదువుతుంటే చూసి మురిసిపోతుంది. వాళ్లకు వేడివేడిగా వండి పెడుతుంది. పదార్థాలు చల్లారిపోకముందే తినండి అని అభిమానంగా గుర్తు చేస్తుంది. ఆ రోజు హోటల్‌కి వచ్చిన వాళ్ల పుట్టినరోజు లేదా పెళ్లిరోజు వంటి ప్రత్యేకతలుంటే ఇంటికి వెళ్లేటప్పుడు వారికి అభినందనలు తెలుపుతూ ఒక పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చి పంపిస్తుంది అజ్జి. ఇంతకీ భీమాబాయ్ అజ్జి ఇలా ఎందుకు చేస్తోందంటే...



● భీమాబాయ్ జోంధా

దూరమైన పుస్తకం!

భీమాబాయ్‌కి చిన్నప్పటి నుంచి చదువుకోవడం ఇష్టం. క్లాసు పుస్తకాలను ఇష్టంగా సర్దుకునేది. పెద్ద చదువులు చదవాలని ఉండేదామెకు. కానీ ఆరవ తరగతిలో ఉండగానే పెళ్లి చేసి మహారాష్ట్ర, నాసిక్ పట్టణానికి సమీపంలో ఓ కుగ్రామానికి పంపించారు తల్లిదండ్రులు. అత్తగారిల్లు అంటూ ఒక ప్రదేశం ఉంది, కానీ అక్కడ ఎలా బతకాలో తెలియదు. ఊహ తెలిసేటప్పటికే ఇద్దరు పిల్లలు పుట్టారు. భర్త మద్యానికి బానిస అనే వాస్తవాన్ని జీర్ణించుకోవడం కష్టమైందామెకు. పొలంలో పనులు చేసుకుంటూ బతుకీడ్చడానికి సిద్ధమైంది. కానీ అతడు ఏ పనీ చేయకపోగా తాగుడు కోసం తమ కుటుంబానికి ఉన్న పొలాన్ని కూడా అమ్మేయడం మొదలుపెట్టాడు. ఇంట్లో వాళ్ల కడుపు నింపడానికి ఇతరుల పొలంలో కూలి పనికి వెళ్లాల్సి వచ్చింది. కూతురిని రోజంతా ఇంట్లో వదల్లేక తనతోపాటు పొలానికి తీసుకువెళ్లేది. ఇలాగే కొనసాగితే పిల్లల భవిష్యత్తు కూడా అంధకారమవుతుందని భయపడింది. అప్పుడు... అంటే 2008లో తీసుకుందామె కఠినమైన నిర్ణయం. కుటుంబాన్ని నాసిక్‌కి మార్చింది. కొడుకు ప్రవీణ్ ఆమెకు సహాయంగా పేపర్ వేయడం వంటి చిన్న చిన్న పనులు చేసుకుంటూ తన చదువుకు కావల్సిన డబ్బు సమకూర్చుకునేవాడు. కూతురి సహాయంతో భీమాబాయ్ చిన్న టీ స్టాల్ తెరిచింది. ప్రవీణ్ ఒక ప్రచురణ సంస్థలో ఉద్యోగంలో చేరడం, తర్వాత కొంతకాలానికి సొంతంగా సంస్థను ప్రారంభించడంతో వారి జీవితానికి ఒకింత స్థిరత్వం వచ్చింది. అయితే... ఇక్కడ నుంచి వారి జీవితం మరో మలుపు తీసుకుంది.

టీ గ్లాసు నుంచి టిఫిన్ ప్లేట్ వరకు!

టీ స్టాల్‌తో వచ్చిన లాభాలను ఇంటి ఖర్చులకు పోగా మిగిలిన వాటిని దాచుకునే స్థితికి వచ్చింది కుటుంబం. టీ స్టాల్‌ను విస్తరించి చిన్న హోటల్ చేయాలనే ఆలోచన వచ్చింది. భీమాబాయ్ కొడుకు ప్రవీణ్ ప్రచురణ సంస్థను మూసేసి హోటల్ కోసం పని చేయాలని నిర్ణయించుకున్నాడు. అలా మొదలైంది అజ్జి హోటల్. ఆ హోటల్‌లో పుస్తకాలు పెట్టాలనే ఆలోచన మాత్రం అజ్జిదే. హోటల్‌కి వచ్చిన వాళ్లు తాము ఆర్డర్ చేసిన పదార్థాలు వచ్చే వరకు స్మార్ట్ ఫోన్‌లో మునిగిపోతున్నారు. పరిసరాలను మర్చిపోతున్నారు. వాళ్ల వేళ్లు స్మార్ట్ ఫోన్‌ను స్క్రోల్ చేయడానికే పుట్టినట్లు ఉంది. ఈ అనారోగ్యకరమైన తీరుకు స్వస్తి పలకాలంటే మరొక వ్యాపకాన్ని అలవాటు చేయాలనుకుందామె. తన బాల్యంలో చదువుకున్న వాళ్లంతా మంచి మంచి పుస్తకాలు చదువుతూ ఉంటే వారిని మైమరిచి చూసేది. అలాంటిది ఇప్పుడు చదువుకున్న వాళ్లందరూ పుస్తకాన్ని వదిలేసి ఫోన్‌కి అంకితమైపోతున్నారు. ఇదేం బాగోలేదనుకుంది. ప్రచురణ సంస్థలో మిగిలిపోయిన పాతిక పుస్తకాలతో ఒక బుక్ షెల్ఫ్‌ను టేబుళ్లకు దగ్గరగా పెట్టింది. ఆహారం ఆర్డర్ తీసుకున్న వెంటనే సర్వర్ 'ఆహారం వచ్చేలోపు పుస్తకం చదువుకోమని, ఏ పుస్తకం కావాలని' అడగడంతో మొదలైంది ఓ నిశ్శబ్ద విప్లవం. ఇప్పుడు అజ్జి హోటల్‌కి వచ్చిన వాళ్లు పుస్తకాలు చదువుకుని, భోజనం చేసి సంతృప్తికరమైన జ్ఞాపకాలతో ఇంటిబాట పడుతున్నారు. మరో విషయం... అజ్జి ఇక్కడితో సంతృప్తి చెందలేదు. పుస్తకాలను హోటల్ నుంచి హాస్పిటల్‌కు కూడా విస్తరించింది. 'డాక్టర్‌లు పేషెంట్‌లకు మందులిస్తారు. అవి దేహానికి స్వస్థత చేకూరుస్తాయి. నేనిచ్చే పుస్తకాలు వారి మనసును సాంత్వన పరుస్తాయి', దాంతో త్వరగా కోలుకుంటారని చెబుతోంది బామ్మ భీమాబాయ్.



● పుస్తకాలుండే నానమ్మగారి హోటల్

పల్లవించిన రక్షణ



● స్కూల్ పిల్లలతో పల్లవి ఘోష్

'బాలికల అక్రమ రవాణా' ఈ హెడ్డింగ్‌తో వార్తలు కనిపిస్తూనే ఉంటాయి. 'అయ్యో' అనుకుని మరో వార్తలోకి వెళ్లిపోవడం కూడా చాలా మామూలుగా జరిగిపోతూనే ఉంటుంది. మన కళ్ల ముందు ఉండే అమ్మాయిని ఎవరో అపహరించుకుని వెళ్లారని తెలిస్తే మనసంతా పిండేసినట్లవుతుంది. రోజులపాటు బాధపడతాం. కానీ ఏమీ చేయం. అక్రమాల మీద గళమెత్తలేకపోయినప్పటికీ కనీసం నోరు తెరిచి మనకు తెలిసిన విషయాన్ని చెబితే ఆ సమాచారం దర్యాప్తుకు దోహదమవుతుందని తెలిసినా పోలీసు ముందు పెదవి విప్పడానికి భయం. కానీ, అస్సాంకు చెందిన పల్లవి ఘోష్ అలా చూసి ఊరుకోలేదు. పన్నెండేళ్ల వయసులో ఆమె కళ్ల ముందు జరిగిన ఓ సంఘటన ఆమెను కదిలించింది. సమాజానికి అంకితమయ్యేలా ఆమెను ప్రభావితం చేసింది.

అప్పుడు పల్లవి ఘోష్‌కు పన్నెండేళ్లు. ఆమె నివసిస్తున్న గ్రామానికి సమీపంలో ఉన్న మరో చిన్న గ్రామానికి చెందిన బాలికను దుండగులు అపహరించుకు వెళ్లడం ఆమె కంట పడింది. పెద్దగా అరుస్తూ పెద్దవాళ్లను అప్రమత్తం చేయడం ద్వారా ఆ బాలికను రక్షించగలిగింది పల్లవి. ట్రాఫికింగ్‌ని స్వయంగా చూడడం ఆమెకది తొలిసారి. కానీ బాలికలు, మహిళల అక్రమ రవాణా పట్ల అస్పష్టంగానైనా కొంత అవగాహన ఉందామెకి. అక్రమ రవాణాను నిరోధించాలని ఆ వయసులోనే నిర్ణయించుకుంది పల్లవి. వయసు పెరిగేకొద్దీ ఆమెలో ట్రాఫికింగ్ పట్ల స్పష్టమైన కార్యాచరణ రూపుదిద్దుకుంది. 'ఇంపాక్ట్ అండ్ డైలాగ్ ఫౌండేషన్' స్థాపించి బాలికలు, మహిళల కోసం పని చేయడం మొదలుపెట్టింది.

వేదిక మీద ప్రసంగం చాలదు!

''బాలికలకు పొంచి ఉన్న ప్రమాదం గురించి వివరించి చెప్పడానికి, ఆ బారిన పడకుండా కాపాడడానికి వేదికల మీద ఎన్ని ప్రసంగాలు చేసినా వాటితో అనుకున్న లక్ష్యం నెరవేరట్లేదని కొద్దికాలంలోనే తెలిసింది. ఇలా ప్రసంగాలతో కనీసం ఆలోచననైనా రేకెత్తించగలుగుతున్నానా అనే సందేహం కూడా కలిగింది. అప్పటి నుంచి నేరుగా ఇంటింటికీ వెళ్లి తలుపు కొట్టడం మొదలుపెట్టాను. వాళ్ల ఉద్ధరణ కోసం నిజంగా చేయాల్సిన పని ఏమిటనేది అప్పుడు తెలిసింది. మహిళలు గతంలోకి వెళ్లి తమకు జరిగిన అన్యాయాన్ని, జరగబోయి తప్పించుకున్న దురాగతాలను ఏకరువు పెట్టారు. ప్రమాదాలు ఎన్ని రకాలుగా చుట్టుముడతాయనే విషయాన్ని వారికి విడమరిచి చెప్పడంతో పాటు ప్రమాదాన్ని శంకించినప్పుడు రక్షణ కోసం ఏమి చేయాలో వివరించాను. కొన్ని ఇళ్ల నుంచి అప్పటికే మాయమైపోయిన బాలికల అన్వేషణ కోసం పోలీస్ శాఖను ఆశ్రయించాను. అలాగే సమాజాన్ని చైతన్యవంతం చేసే క్రమంలో కానిస్టేబుళ్లను భాగస్వాములను చేశాను. వారిని దగ్గరగా చూడడం, వారు చెప్పే ధైర్యవచనాలను వినడం ద్వారా బాలికలు తమకు ప్రమాదం ఎదురైనప్పుడు నిర్భయంగా పోలీసుల సహాయాన్ని కోరగలుగుతారు. ఇలా ఎన్నో ప్రయత్నాల ద్వారా అక్రమ రవాణా పట్ల బాలికల్లో చైతన్యం తీసుకువచ్చాను. అపహరణకు గురైన పదివేలకు పైగా బాలికలను తిరిగి వారి ఇళ్లకు చేర్చగలిగాను. అంతటితో సరిపోదని ఆ తర్వాత తెలిసింది. రక్షించిన బాలికలకు ఉపాధి కూడా కల్పించాలి. ఆ పని చేయలేకపోతే ట్రాఫికింగ్ మాఫియా పని పేరుతో ఆ బాలికలను తిరిగి తమ గుప్పెట్లోకి తీసుకుపోతుంది. అందుకోసం మా ఫౌండేషన్ ద్వారా వారికి పనుల్లో శిక్షణ ఇచ్చి పని కల్పించడం కూడా మొదలు పెట్టాను. పది వేలకు పైగా బాలికలను కాపాడడంతోపాటు 75 వేల మందిలో చైతన్యం తీసుకురాగలిగాను. వారి భవిష్యత్తు అంధకారంలోకి తోసేసే ముఠాల నుంచి వారికి జాగ్రత్తలు తెలియచేశాను. కానీ మాఫియా ముఠాలను కూకటి వేళ్లతో పెకలించి వేయడం అనే పనిని ప్రభుత్వాలు చేయాలి. అప్పుడే ఈ భూతం తిరిగి నిద్రలేవకుండా ఉంటుంది'' అని వివరించింది పల్లవి ఘోష్.



● పల్లవి ఘోష్

చీర... నా రెండో గుర్తింపు

అప్పటివరకు గృహిణిగానే కాలం వెళ్లబుచ్చింది విని టాండన్ కెనీ. 53 ఏళ్ల వయసులో చీరకట్టు ద్వారా బిజినెస్ ఉమెన్‌గా మారింది. నేటి తరం అమ్మాయిలకు చీరకట్టు నేర్పించడానికి గోవాలో ప్రత్యేకంగా 'శారీ స్పీక్' స్టూడియోను ఏర్పాటు ద్వారా చేనేతకారులను ప్రోత్సహిస్తోంది. సోషల్ మీడియా ద్వారా 'శారీ గ్రూప్' ఏర్పాటు చేసి ఎంతోమంది మహిళలను ప్రభావితం చేస్తోంది. 'చీర నా రెండో గుర్తింపు' అంటున్న విని గురించి ...

విని టాండన్ కెనీ ని పలకరిస్తే చాలు చీరల పట్ల తనకున్న ప్రేమను ఎంతో ఆనందంగా వ్యక్తపరుస్తుంది. 'శారీ స్పీక్' స్టూడియో వ్యవస్థాపకురాలుగా ఆమె ప్రయాణం నేటితరానికి కొత్త పాఠం.

భార్య.. తల్లి... కోడలు.. శారీ ఇన్‌ఫ్లుయెన్సర్, కామిక్ కంటెంట్ సృష్టికర్త కూడా... ఇన్ని పాత్రలను చిరునవ్వుతో పోషించవచ్చుననడానికి వినీనే ఉదాహరణ. 'నా కుటుంబమే నాకు బలం. ఉత్సాహం. మా కుటుంబ సభ్యులే నా ఫొటోలు, వీడియోలు తీస్తూ ఉంటారు. ఫేస్‌బుక్ గ్రూప్ 'శారీ స్పీక్'ని క్రియేట్ చేసి రేపటికి ఏడేళ్లు పూర్తవుతాయి. ఈ గ్రూప్ కారణంగా చాలామంది మహిళల ఆలోచనల్లో చీర గురించిన నిర్వచనమే మారిపోయింది.

ఖాళీ నుంచి మొదలైన ప్రయాణం... నేను పుట్టి పెరిగింది ఉత్తర్‌ప్రదేశ్‌లోని హర్దోయ్‌లో. మా నాన్నగారు మెరైన్ ఇంజనీర్ అవడంతో ఆయన ఉద్యోగరీత్యా వివిధ నగరాల్లో నివసించాం. నాన్నగారికి గోవాలో పోస్టింగ్ వచ్చినప్పుడు అక్కడ ప్రసాద్ కెనీతో నా పెళ్లి జరిగింది. అలా నేను గోవాలోనే ఉండిపోయాను. ఇద్దరు అబ్బాయిల పెంపకంలో ఎప్పుడూ తీరికలేకుండా ఉండేదాన్ని. పిల్లలు పెద్దవాళ్లై కాలేజీలకు వెళుతున్నప్పుడు నాలో ఏదో వెలితి ఏర్పడింది. ఏం చేయాలో అర్థం కాలేదు. అప్పుడు నా ఆసక్తుల వైపు దృష్టి సారించాను. మొదట సినిమా అభిమానుల కోసం 'మూవీ స్పీక్' పేరుతో ఫేస్‌బుక్ గ్రూప్‌ను క్రియేట్ చేశాను. ఆ తర్వాత వివిధ రకాల కళలు, కవులు .. మొదలైన గ్రూప్‌లను సృష్టించాను. అదే సమయంలో 'శారీ స్పీక్' బృందం కూడా ఏర్పాటయింది.

అలా మొదలైంది... మా అమ్మ, అత్తగారు సౌకర్యం కోసం చీర నుంచి సల్వార్ కమీజ్‌కు మారినప్పుడు నాకెందుకో మనసు చివుక్కుమంది. ఈ విధంగా ఆలోచిస్తే అందరూ చీర కట్టుకోవడం మానేస్తారని అనిపించేది. దీంతో నేను చీర కట్టుకోవడం మొదలుపెట్టాను. నన్ను చీరలో చూసి, నా చుట్టూ ఉన్న ఆడవాళ్లు కూడా చీరలవైపు మొగ్గు చూపేవారు. చీరకట్టు ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేసేదాన్ని. నాకు మంచి స్పందన రావడంతో వాళ్లూ పోస్ట్ చేయడం మొదలుపెట్టారు.

చేనేత కారులే నా బ్రాండ్... మా చిన్నబ్బాయి సొంతంగా ఏదైనా బిజినెస్ స్టార్ట్ చేయమన్నప్పుడు శారీ ఐడియా గురించి చెప్పాను. స్టూడియో ఏర్పాటుకు తనే మద్దతుగా నిలిచాడు. దీంతో 53 ఏళ్ల వయసులో శారీ స్టూడియోతో వ్యాపారవేత్తను అయ్యాను. నా సొంత బ్రాండ్ అంటూ ఏమీ లేదు. దేశవ్యాప్తంగా ఉన్న నేత కార్మికుల నుంచి చేనేత చీరలను కొనుగోలు చేసి, సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నాను. నా స్టూడియోలో 95 శాతం చేనేత చీరలే ఉంటాయి. ఇప్పుడు చీరలను ఇష్టపడే మహిళలు వాటిని కొనడానికి నా స్టూడియోకు రావడం మొదలుపెట్టారు. కొందరు చీర కట్టుకోవడం తమకు చేత కాదని, ఇంకొందరూ తమకు అసౌకర్యం అని చెబుతుంటారు. చీర కట్టుకోవడానికి ఐదు నిమిషాలు చాలు. ఇక అసౌకర్యం ఎందుకో నాకు అర్థం కాదు. ఈ సమస్యను పరిష్కరించడానికి నా స్టూడియోలో చీరకట్టుకు సులువైన టెక్నిక్స్ ఇస్తుంటాను.





శారీ స్పీక్ స్టోరీలు... చీరకట్టు గురించి మాత్రమే కాదు వారి ఆనందం, అలాగే తమ మానసిక వేదనల నుంచి బయటపడే విధానాల గురించి చెప్పినప్పుడు వాటినీ సోషల్ మీడియా వేదికగా పంచుతుంటాను. బెంగళూరుకు చెందిన ఉషా అగర్వాల్ అనే మహిళ తన తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయింది. కొన్ని రోజులకు నా పోస్ట్‌లను చూసి తనూ ప్రతి రోజూ కొత్త చీర కట్టుకొని, వాటిని పోస్ట్ చేసింది. ఆ మార్పుతో తన బాధ నుంచి కొద్ది రోజుల్లోనే బయటపడగలిగింది. ఆమె శారీ స్పీక్‌కి కృతజ్ఞతలు తెలిపింది.

వెయ్యిమందిలో... ప్యాంటు నుండి సల్వార్ డ్రెస్సుల వరకు అన్నీ ధరిస్తాను. కానీ, నాకు అపారమైన నమ్మకాన్ని ఇచ్చేది శారీనే. చీర కట్టుకోగానే నా ముఖంలో చిరునవ్వు వచ్చేస్తుంది. నాతో చీర మాట్లాడుతున్నట్టే అనిపిస్తుంది. కిందటేడాది భారతీయ నేత కార్మికులకు సహాయం చేయడానికి యూకే రాయల్ ఆస్కాట్ హార్స్ రేస్‌లో సుమారు వెయ్యిమంది వరకు చీరలు ధరించారు. వారిలో నేనూ ఉన్నాను. మేం తమ దేశంలో చీర ధరించాలని నిర్ణయించుకున్నందుకు బ్రిటిషర్లు మా వేషధారణను చూసి ఎంతో ఆనందించామని చెప్పారు. అప్పుడు నాకు చాలా సంతోషమనిపించింది.

లక్షా డెబ్భై వేల మంది సభ్యులు... శారీ స్పీక్ ఫేస్‌బుక్ అకౌంట్‌కి ప్రపంచం నలుమూలల నుండి లక్షా డెబ్భై వేల మంది సభ్యులు గా ఉన్నారు. ఈ గ్రూపులో మహిళలు మాత్రమే సభ్యులు. ఈ గ్రూప్ చీరలను మాత్రమే ప్రమోట్ చేస్తుంది.

ఇన్నేళ్లుగా చీర నన్ను బిజీగా ఉంచింది. నిన్ను చూడగానే చీరలు కట్టుకోవడం మొదలు పెట్టామంటూ చాలా మంది మహిళలు నాకు మెసేజ్ చేస్తుంటారు. మీ వల్లే మాకు ప్రమోషన్ వచ్చిందని, మా అమ్మకాలు పెరిగాయని చేనేత కార్మికులు అంటున్నారు. ఇదంతా వింటే మరింత పనిచేయాలనే ధైర్యం వస్తుంది. ఈ నెల 14న మా గ్రూప్ ఎనిమిదో వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా మీరూ చీరలో ఆనందంగా విహరించండి' అంటున్నారు విని టాండన్.

కాన్స్ చిత్రోత్సవంలో భారతీయ చిత్రాలు



● 'ఆల్ వీ ఇమాజిన్...' పోస్టర్



● 'సంతోష్' పోస్టర్

భారతీయ దర్శకురాలు పాయల్ కపాడియా తెరకెక్కించిన 'ఆల్ వీ ఇమాజిన్ యాజ్ లైట్' చిత్రం చరిత్ర సృష్టించింది. కాన్స్ చలన చిత్రోత్సవంలో ప్రధాన విభాగంగా భావించే 'పామ్ డ ఓర్' అవార్డు పోటీలో నిలిచింది ఈ మలయాళ చిత్రం. ముంబైకి చెందిన పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన ఈ చిత్రం 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'పామ్ డ ఓర్' అవార్డు కోసం పోటీలో నిలిచినట్లు నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. ఇక ఈ ఏడాది కాన్స్ చిత్రోత్సవం మే 15 నుంచి 25 వరకు జరగనుంది. ఈ సందర్భంగా ఈ ఫెస్టివల్‌కు సంబంధించిన అవార్డులు, స్క్రీనింగ్ కానున్న సినిమాల జాబితాను ప్రకటించారు నిర్వాహకులు. కాన్స్‌లో అత్యధిక బహుమతిని అందించే 'పామ్ డ ఓర్' విభాగంలో భారతీయ చిత్రం 'ఆల్ వీ ఇమాజిన్ యాజ్ లైట్'తో పాటు అమెరికన్ ఫిల్మ్ 'అనోర', యూకే ఫిల్మ్ 'ఓహ్.. కెనడా', ఫ్రెంచ్ ఫిల్మ్ 'బీటింగ్ హార్ట్స్', పోర్చుగల్ ఫిల్మ్ 'గ్రాండ్ టూర్' వంటి దాదాపు 20 చిత్రాలు నిలిచాయి. ఇక 'అన్‌సర్టైన్ రిగార్డ్' విభాగంలో బ్రిటిష్ ఇండియన్ దర్శకురాలు సంధ్యా సూరి దర్శకత్వం వహించిన 'సంతోష్', బల్గేరియన్ దర్శకుడు కోన్‌స్టాటిన్ బోజనోవ్ దర్శకత్వంలో భారతీయ నటీనటులు భాగమైన 'ది షేమ్‌లెస్' చిత్రాలతో పాటు చైనా ఫిల్మ్ 'బ్లాక్‌డాగ్', 'సెప్టెంబర్ సేస్', జపాన్ ఫిల్మ్ 'మై సన్‌షైన్' వంటి 15 చిత్రాలు పోటీ పడుతున్నాయి. ఇక 'అవుట్ ఆఫ్ కాంపిటిషన్' విభాగంలో 'ఫూరియోషియా: ది మ్యాడ్‌మాక్స్ సాగ', 'రూమర్స్'తో పాటు మరో మూడు చిత్రాలు ఉన్నాయి. మిడ్‌నైట్ స్క్రీనింగ్ విభాగంలో 'ది సఫర్'తో కలిసి నాలుగు చిత్రాలు, కాన్స్ ప్రీమియర్‌లో 'ఇట్స్ నాట్ మీ'తో పాటు ఆరు చిత్రాలు, స్పెషల్ స్క్రీనింగ్ విభాగంలో 'ది బ్యూటీ ఆఫ్ ఘాజా'తో కలిపి ఐదు చిత్రాలు ప్రదర్శితం కానున్నాయి.



● సంధ్యా సూరి

మూడు దశాబ్దాల తర్వాత...

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో దాదాపు మూడు దశాబ్దాల తర్వాత 'పామ్ డ ఓర్' విభాగంలో భారతీయ చిత్రం 'ఆల్ వీ ఇమాజిన్ యాజ్ లైట్' పోటీ పడుతోంది. ఈ విభాగంలో 1994లో మలయాళ చిత్రం 'స్వాహం' నామినేషన్‌ను దక్కించుకున్నా, అవార్డు గెల్చుకోలేకపోయింది. ఈ సినిమాకు షాజీ నీలకంఠన్ కరుణ్ దర్శకత్వం వహించారు. అలాగే ఇదే విభాగంలో అవార్డు గెలుచుకున్న ఏకైక భారతీయ చిత్రం 'నీచా నగర్'. 1946లో విడుదలైన ఈ హిందీ సినిమాకు చేతన్ ఆనంద్ దర్శకుడు. 'నీచా నగర్' చిత్రం తర్వాత 'అమర్ భూపాలి', 'ఆవారా' వంటి చిత్రాలు 'పామ్ డ ఓర్'కు నామినేషన్ దక్కించుకున్నా అవార్డు గెల్చుకోలేకపోయాయి. 30 ఏళ్లకు ఈ విభాగంలో పోటీ పడుతున్న భారతీయ చిత్రం 'ఆల్ వీ ఇమాజిన్ యాజ్ లైట్'కు అవార్డు వస్తుందా? అనేది చూడాలి. ఈసారి 'పామ్ డ ఓర్' విభాగంలో విజేతను నిర్ణయించే జ్యూరీ అధ్యక్షురాలిగా అమెరికన్ నటి గ్రెటా గెర్విక్ వ్యవహరిస్తున్నారు.

● 30 ఏళ్లకు ప్రతిష్ఠాత్మక 'పామ్ డ ఓర్' విభాగంలో భారతీయ చిత్రం

ఆల్ వీ ఇమాజిన్... కథేంటంటే...

కేరళకు చెందిన ఇద్దరు నర్సులు ప్రభ, అనులు ముంబైలో పని చేస్తుంటారు. ఈ ఇద్దరూ వారి వారి రిలేషన్‌షిప్స్‌లో ఇబ్బందులు పడుతుంటారు. అలా ఈ ఇద్దరూ ఓ రోడ్ ట్రిప్‌కు వెళ్లినప్పుడు ఏం జరిగింది? అన్నదే ఈ చిత్రం కథాంశమని సమాచారం. ఈ మలయాళ చిత్రానికి రచయిత–దర్శకురాలు, ఎడిటర్ పాయల్ కపాడియా దర్శకత్వం వహించారు. ఇక పాయల్ కపాడియా దర్శకత్వం వహించిన తొలి ఫీచర్ ఫిల్మ్ కూడా ఇదే కావడం విశేషం. గతంలో పాయల్ దర్శకత్వం వహించిన డాక్యుమెంటరీ ఫిల్మ్ 'ఆఫ్టర్‌నూన్ క్లౌడ్స్' 2015లో కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ స్క్రీనింగ్‌కు ఎంపిక అయింది. అలాగే పాయల్ దర్శకత్వంలో వచ్చిన మరో డాక్యుమెంటరీ ఫిల్మ్ 'ఏ నైట్ ఆఫ్ నోయింగ్ నథింగ్' 2021లో జరిగిన కాన్స్ ఫెస్టివల్‌లో 'గోల్డెన్ ఐ' అవార్డును గెలుచుకుంది. మరి.. ఈసారి కూడా పాయల్ అవార్డును గెలుస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.



● పాయల్ కపాడియా

సంతోష్ కథేంటంటే...

బ్రిటిష్ ఇండియన్ ఫిల్మ్ మేకర్ సంధ్యా సూరికి దర్శకురాలిగా 'సంతోష్' తొలి చిత్రం. ఉత్తర భారతదేశంలోని ఓ గ్రామం నేపథ్యంలో ఈ చిత్రకథ ఉంటుంది. వితంతువు సంతోష్‌కి తన భర్త చేసే పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం దక్కుతుంది. బలహీన వర్గానికి చెందిన ఓ అమ్మాయిపై జరిగిన అత్యాచారం, ఆ పై హత్యకు సంబంధించిన కేసుని ఛేదించే దర్యాప్తు బృందంలో సంతోష్ భాగం అవుతుంది. ఈ కేసుని ఆమె ఎలా హ్యాండిల్ చేసింది? అనేది కథాంశం. మరి.. ఈ చిత్రం కూడా అవార్డు దక్కించుకుంటుందా? చూడాలి.

భజే వాయు వేగం



● కార్తికేయ

కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'భజే వాయు వేగం' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఈ చిత్రానికి ప్రశాంత్ రెడ్డి దర్శకుడు. ఐశ్వర్యా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో 'హ్యాపీ డేస్' ఫేమ్ రాహుల్ టైసన్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. యువీ క్రియేషన్స్ సమర్పణలో యువీ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై 'భజే వాయు వేగం' రూపొందుతోంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్, మోషన్ పోస్టర్‌ను హీరో మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేసి, అభినందనలు తెలిపారు. ''ఫ్రెష్ కంటెంట్‌తో ప్రేక్షకులను ఎంగేజ్ చేసేలా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అన్నారు మేకర్స్.

థ్రిల్లింగ్ శబ్దం



● ఆది

హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'శబ్దం'. ఈ సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ మూవీలో సిమ్రాన్, లైలా లీడ్ రోల్స్‌లో నటించగా, 7జీ శివ నిర్మించారు. తెలుగు–తమిళ భాషల్లో రూపొందిన ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. ఈ సందర్భంగా 'శబ్దం' టీజర్‌ను హీరో వెంకటేశ్ షేర్ చేశారు. ''ఆది పినిశెట్టి– అరివళగన్ కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'వైశాలి' విజయం సాధించింది. ఇప్పుడు 'శబ్దం' వస్తోంది. ఈ సినిమాలోని చాలా సన్నివేశాలను పర్వతాలు, పర్యాటక ప్రదేశాల్లో చిత్రీకరించాం. అలాగే 120 ఏళ్ల క్రితం నాటి లైబ్రరీని కూడా నిర్మించాం. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

శబరిలో డ్యాన్స్ చేశాను

- వరలక్ష్మీ శరత్‌కుమార్



''తెలుగులో నేను చేసిన తొలి లేడీ ఓరియంటెడ్ చిత్రం 'శబరి'. ఇది థ్రిల్లర్ మూవీ. తన బిడ్డను కాపాడుకోవడం కోసం ఓ తల్లి ఏం చేసింది? అనేది ఈ చిత్రకథ. చాలా రోజుల తర్వాత ఈ మూవీలో డ్యాన్స్ చేశాను'' అని వరలక్ష్మీ శరత్‌కుమార్ అన్నారు. ఆమె లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'శబరి'. అనిల్ కాట్జ్ దర్శకత్వంలో మహర్షి కూండ్ల సమర్పణలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించారు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో మే 3న ఈ సినిమా విడుదలవుతోంది. ఐదు భాషల ట్రైలర్స్ విడుదల వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. నటుడు వరుణ్ సందేశ్ తెలుగు ట్రైలర్‌ని, నిర్మాత మహేంద్రనాథ్ తమిళ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ''నిర్మాత గురించి ఆలోచించే నటి వరలక్ష్మి. 'శబరి' నా తొలి సినిమా. ఆదరించాలి'' అన్నారు మహేంద్రనాథ్ కూండ్ల.

క్రైమ్ కామెడీ షురూ



● రాశీ సింగ్, రాజ్ తరుణ్

రాజ్ తరుణ్ హీరోగా కొత్త సినిమా ఆరంభమైంది. రమేశ్ కడుముల దర్శకునిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో రాశీసింగ్ హీరోయిన్. గోవిందరాజు సమర్పణలో మురళీధర్ రెడ్డి, కేబీటీఎన్ శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమానికి దర్శకులు ప్రవీణ్ సత్తార్ కెమెరా స్విచ్చాన్ చేయగా, మారుతి క్లాప్ ఇవ్వగా, నక్కిన త్రినాథరావు తొలి సీన్‌కి దర్శకత్వం వహించారు. ''క్రైమ్ కామెడీగా ఈ మూవీ రూపొందనుంది. అక్టోబరులో సినిమా రిలీజ్ ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు రమేశ్ కడుముల, కేబీటీఎన్ శ్రీనివాస్. ''చాలా మంచి కథ ఇది'' అన్నారు రాజ్ తరుణ్. ఈ చిత్రానికి కెమెరా: ఆదిత్య జవ్వాడి, సంగీతం: శేఖర్ చంద్ర.

మూకీ కావ్య



● కవిత

కవితా రాజ్‌పుత్, జమున, అంజలి, మధు ముఖ్య తారలుగా మధులింగాల దర్శకత్వం వహించిన చిత్రం 'కావ్య రాజ్'. గజగౌని దయానంద్ గౌడ్ నిర్మాత. ఈ చిత్రం ట్రైలర్‌ని ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ రిలీజ్ చేశారు. ''తెలంగాణ తొలి మూకీ చిత్రం 'కావ్య రాజ్'. కరీంనగర్‌కు చెందిన నటుడు, నిర్మాత, దర్శకుడు, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, తెలంగాణ రాష్ట్రం నుండి హిందీ చిత్ర పరిశ్రమను ఏలిన పైడి జైరాజ్‌గారికి ఈ సినిమాను అంకితమిస్తున్నాను'' అన్నారు గజగౌని దయానంద్.

రామాయణంకి ఎంతైనా కష్టపడతాను

- యశ్



● నమిత్ మల్హోత్రా, యశ్

''నమిత్, నేను కలిసి రామాయణంపై మూవీ చేస్తే బాగుంటుందని చాలాసార్లు అనుకున్నాం. కానీ, అంత పెద్ద సబ్జెక్టు తియ్యాలంటే అది మామూలు విషయం కాదు.. బడ్జెట్స్ కూడా సరిపోవు.. అందుకే నేను కూడా కో ప్రొడ్యూస్ చెయ్యాలనుకున్నాను. ఈ 'రామాయణం' కోసం ఎంతైనా కష్టపడతాను'' అన్నారు 'కేజీఎఫ్' ఫేమ్ హీరో యశ్. ఆయన నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, నిర్మాత నమిత్ మల్హోత్రా నిర్మాణ సంస్థ ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ కలిసి రామాయణం నేపథ్యంలో ఓ సినిమా నిర్మించనున్నాయి. ఈ చిత్రానికి నితీష్ తివారి దర్శకుడు. నమిత్ మల్హోత్రా మాట్లాడుతూ– ''మన దేశ ప్రగతి అయిన రామాయణాన్ని తీయడంలో న్యాయం చేయగలను అనిపిస్తోంది'' అన్నారు. కాగా నితీష్ తివారి దర్శకత్వంలో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి 'రామాయణ్' చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఈ చిత్రానికే నమిత్ మల్హోత్రా, యశ్ నిర్మాతలనే టాక్ వినిపిస్తోంది.

కిడ్నాప్ చేయడం ఓ కళ!



● శ్రద్ధా దాస్

సునీల్, శ్రద్ధాదాస్, చైతన్యా రావు, మాళవికా సతీశన్ ప్రధాన పాత్రల్లో సంతోష్ కంభంపాటి దర్శకత్వం వహించిన చిత్రం 'పారిజాత పర్వం'. 'కిడ్నాప్ ఈజ్ ఏన్ ఆర్ట్' (కిడ్నాప్ చేయడం ఓ కళ) అన్నది ట్యాగ్ లైన్. మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 19న రిలీజవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని యాంకర్ సుమ కనకాల రిలీజ్ చేశారు. ''పారిజాత పర్వం' క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్'' అని యూనిట్ పేర్కొంది.

వినోదం.. సందేశం



● గణేశ్, ఆయూషి

గణేశ్, ఆయూషి పటేల్ జంటగా, పోసాని కృష్ణమురళి కీలక పాత్రలో నటించిన చిత్రం 'కల్లు కాంపౌండ్ 1995'. ప్రవీణ్ జెట్టి దర్శకత్వంలో బుర్రా మల్లేష్ గౌడ్ (బొట్టు), హారిక జెట్టి, పిట్ల విజయలక్ష్మి నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ని దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఆవిష్కరించి... ''వాస్తవ ఘటన ఆధారంగా తీసిన ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''వినోదం, సందేశంతో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది'' అన్నారు ప్రవీణ్ జెట్టి.

వైఎస్సార్‌సీపీని ఎదుర్కోలేకపోతున్నాం..



చంద్రబాబు నివాసంలో సమావేశమైన కూటమి నేతలు

మన సభలకు స్పందన లేదు.. ఇలాగైతే ఎలా?	కూటమి నేతల తర్జనభర్జన	హాజరైన పవన్, బాబు, బీజేపీ ముఖ్య నేతలు	కొన్ని సీట్లలో అభ్యర్థుల మార్పుపై చర్చ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎన్నికల బరిలోకి ఉమ్మడిగా దిగుతున్నా వైఎస్సార్‌సీపీకి పోటీ ఇచ్చే పరిస్థితి లేకపోవడంపై బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి నేతలను ఆందోళన ఆవహించింది. చంద్రబాబు నివాసంలో శుక్రవారం జరిగిన కూటమి నేతల సమావేశంలో దీనిపైనే చర్చ జరిగింది. ఎంత ప్రయత్నించినా ప్రజల నుంచి ఆశించిన స్పందన కనిపించడంలేదని, కూటమి సభలకు జనం అనుకున్నట్లుగా రావడంలేదని, మిగిలిన అంశాల్లోనూ అధికార పార్టీని ఎదుర్కొనే పరిస్థితిలేదని మూడు పార్టీల నేతలు చర్చించుకున్నట్లు తెలిసింది. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, బీజేపీ పరిశీలకులు సిద్ధార్థనాథ్‌సింగ్, అరుణ్‌సింగ్‌లు సమావేశమై పలు అంశాలపై మాట్లాడుకున్నారు. ఇటీవల గోదావరి జిల్లాల్లో ఉమ్మడిగా నిర్వహించిన సభలకు ఆశించిన స్థాయిలో జనం రాలేదని బీజేపీ ముఖ్యులు అన్నట్లు సమాచారం. విడివిడిగా సభలు పెడితే అసలు జనం రావడంలేదని, ఉమ్మడిగా పెట్టినా ఫలితం ఉండడంలేదని, ఇప్పుడు ఏం చేయాలనే దానిపై మూడు పార్టీల నేతలు మల్లగుల్లాలు పడ్డారు. ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో విడుదలవుతున్న నేపథ్యంలో ఉమ్మడి సభలు ఎక్కువగా నిర్వహిద్దామని, వాటికి జనాన్ని ఎక్కువగా సమీకరించాల్సి వుందని సమావేశంలో చంద్రబాబు ప్రతిపాదించారు. త్వరలో ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేయాల్సి వుందని, ఇప్పటికే ప్రాథమికంగా దీన్ని రూపొందించామని చంద్రబాబు చెప్పినట్లు తెలిసింది.

వైఎస్సార్‌సీపీ నేతలపై చర్యలు తీసుకునేలా చూడండి..

ఇక ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై అన్ని స్థాయిల్లో భారీగా ఫిర్యాదులు చేయిస్తామని, వాటిపై చర్యలు తీసుకునేలా చూడాలని ఆయన బీజేపీ పరిశీలకులను కోరినట్లు సమాచారం. అలా చేయడంవల్ల అధికార పార్టీ కేడర్‌ను కొద్దిగానైనా నిలువరించవచ్చనే అభిప్రాయం చంద్రబాబు వ్యక్తంచేసినట్లు తెలిసింది. అలాగే, ప్రకటించిన సీట్లలో కొన్నింటిని మార్చాలనే దానిపైనా చర్చ జరిగింది. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి అభ్యర్థిని మార్చాలని ఈ సమావేశంలో బీజేపీని కోరారు. అక్కడ ప్రస్తుతమున్న బీజేపీ అభ్యర్థి శివకృష్ణంరాజు స్థానంలో అక్కడి టీడీపీ నేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డినిగానీ లేకపోతే ఆయన కుటుంబసభ్యుల్లో ఒకరిని బీజేపీలో చేర్చి వారికి సీటు ఇవ్వాలని ప్రతిపాదించారు లేకపోతే ఈ సీటును బీజేపీ వదిలేస్తే మరో స్థానం ఇచ్చేందుకు చంద్రబాబు ఓకే చెప్పినట్లు తెలిసింది. మరికొన్ని సీట్లపైనా సమావేశంలో చర్చ జరిగినట్లు ఆయా పార్టీల నేతలు తెలిపారు.


అనపర్తిపై ఢిల్లీ పెద్దలతో చర్చించాకే నిర్ణయం..

ఇదిలా ఉంటే.. అనపర్తితో పాటు మరో రెండు మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి టీడీపీ–బీజేపీ–జనసేన కూటమిలో తలెత్తుతున్న ఇబ్బందులపై త్వరలో తమ పార్టీ జాతీయ నాయకత్వంతో చర్చించి ఒక నిర్ణయానికి వస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తెలిపారు. ఈ ఉమ్మడి సమావేశానంతరం ఆమె విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. బీజేపీకి కేటాయించిన అనపర్తి నియోజకవర్గంలో పార్టీ జాతీయ నాయకత్వం ప్రకటించిన అభ్యర్థిని కూడా టీడీపీ నాయకులు ప్రచారం చేసుకోనీయకుండా అడ్డుకోవడంపై విలేకరుల ప్రశ్నకు ఆమె బదులిస్తూ.. అనపర్తి విషయం మాత్రమే కాకుండా ఎక్కడైతే ఇలాంటి ఇబ్బందులున్నాయో వాటన్నింటిపై ఈ సమావేశంలో చర్చ జరిగిందన్నారు. పొత్తుల్లో చిన్నచిన్న లోపాలు ఎక్కడైతే తలెత్తుతున్నాయో, వాటన్నింటినీ ఎలా పరిష్కరించుకుంటూ ముందుకెళ్లాలని అన్న దానిపైన ఈ సమావేశంలో చర్చించామన్నారు. అలాగే, పైస్థాయిలోనే కాకుండా, క్షేత్రస్థాయిలో బూత్ వరకు కార్యకర్తలు ఎలా సమన్వయంతో పనిచేయాలన్న దానిపై చర్చించామన్నారు.

ఓటమి భయంతోనే ట్యాపింగ్ డ్రామా

లోకేశ్ ఐ ఫోన్ ట్యాపింగ్ అంటూ టీడీపీ కొత్త నాటకం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం
- అసలు ప్రస్తుత ఏపీ ప్రభుత్వం వద్ద ట్యాపింగ్ చేసే టెక్నాలజీనే లేదు
- కేంద్ర ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పింది
- ఫోన్ ట్యాపింగ్, ఓటర్ల డేటా చౌర్యంలో చంద్రబాబే సిద్ధహస్తుడు



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో టీడీపీ ఘోర పరాజయం తథ్యమని స్పష్టం కావడంతో చంద్రబాబు కోటరీ బెంబేలెత్తుతోంది. ప్రజల దృష్టిని మళ్లించేందుకు కొత్త పన్నాగాలు పన్నుతోంది. టీడీపీ అధికారంలో ఉండగా ఫోన్ ట్యాపింగ్ కుట్రలకు పాల్పడిన చరిత్ర ఉన్న చంద్రబాబు తిరిగి అవే ఆరోపణలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేందుకు యత్నిస్తున్నారు. చంద్రబాబు కుమారుడు లోకేశ్ ఐ ఫోన్‌ను ట్యాపింగ్ చేస్తున్నారంటూ టీడీపీ ఎన్నికల కమిషన్ (ఈసీ)కి ఫిర్యాదు చేయడం ఆ కుట్రలో భాగమేనన్నది సుస్పష్టం. వాస్తవం ఏమిటంటే అసలు ఫోన్లు ట్యాపింగ్ చేసే టెక్నాలజీ ప్రస్తుత ఏపీ ప్రభుత్వం వద్ద లేనే లేదు. ఈ విషయాన్ని కేంద్రం కూడా ఇటీవల స్పష్టంగా చెప్పింది. అసలు వాస్తవానికి వస్తే డాటా చోరీ, ఫోన్ల ట్యాపింగ్‌లో చంద్రబాబే సిద్ధహస్తుడు. ఇందు కోసం ఆయన సీఎంగా ఉండగా ఇజ్రాయెల్ నుంచి స్పైవేర్ 2019ను కొనుగోలు చేశారన్నది బహిరంగ రహస్యం. ఆ విషయాన్ని పశ్చిమ బెంగాల్ సీఎం మమత ఆ రాష్ట్ర అసెంబ్లీలోనే వెల్లడించారు కూడా.

భద్రతా చట్టాలను ఉల్లంఘించి పెగసస్ సాఫ్ట్‌వేర్ కొన్న చంద్రబాబు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఫోన్ ట్యాపింగ్ జాడ్యానికి ఆద్యుడు చంద్రబాబే. 2004 ఎన్నికల్లో అప్పటి సీఎంగా ఉన్న ఆయన ప్రతిపక్ష నేతల ఫోన్ల ట్యాపింగ్ కోసం ఏకంగా ఓ వ్యవస్థను ఏర్పాటు చేశారు. రాష్ట్ర విభజన తరువాత 2014లో ఆంధ్రప్రదేశ్‌కు సీఎం అయిన చంద్రబాబు మరోసారి ఫోన్ ట్యాపింగ్ అక్రమాలకు పాల్పడ్డారు. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేకంగా ఓ వ్యవస్థను ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నేతల ఫోన్ల ట్యాపింగ్‌తోపాటు ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడటం ఆ వ్యవస్థ లక్ష్యం. ఐటీ గ్రిడ్స్ అనే ప్రైవేటు కంపెనీ, అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు కుమారుడు భాగస్వామిగా ఉన్న ఆకాశ్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీల ద్వారా ఏరోస్టాట్ బెలూన్లు, ఇతర ఫోన్ ట్యాపింగ్ సాఫ్ట్‌వేర్ కొనుగోలుకు ఇజ్రాయెల్‌కు చెందిన పెగసస్‌తో సంప్రదింపులు జరిపారు. అందు కోసం ఏబీవీ బృందం ఇజ్రాయెల్‌లో పర్యటించింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం విదేశీ కంపెనీల నుంచి ఫోన్ ట్యాపింగ్ సాఫ్ట్‌వేర్ కొనాలంటే కేంద్ర రక్షణ శాఖ అనుమతి తప్పనిసరి. జాతీయ భద్రత చట్టాన్ని సైతం చంద్రబాబు ప్రభుత్వం ఉల్లంఘించింది. రక్షణ శాఖకు సమాచారం ఇవ్వకుండానే ఐటీ గ్రిడ్స్ కంపెనీ ద్వారా ఫోన్ ట్యాపింగ్ పరికరాలు కొనుగోలు చేసి, వాటిని టీడీపీ కార్యాలయాల్లో పెట్టుకుంది.

35 లక్షల మంది డేటా చౌర్యం

అక్రమంగా కొన్న ఫోన్ ట్యాపింగ్, డేటా చౌర్యం సాఫ్ట్‌వేర్‌తో చంద్రబాబు ప్రభుత్వం బరితెగించింది. అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌తో పాటు వైఎస్సార్‌సీపీకి చెందిన 65 మంది నేతల ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడింది. దీనిపై పూర్తి ఆధారాలతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2019 ఎన్నికలకు ముందు వివిధ కేసుల దర్యాప్తు ముసుగులో ఏకంగా వైఎస్సార్‌సీపీకి చెందిన 150 మంది ఫోన్లను ట్యాప్ చేయడం చంద్రబాబు దుర్మార్గ రాజకీయాలకు నిదర్శనం. మరోవైపు చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన ప్రజా సాధికార సర్వే ద్వారా సేకరించిన ఓటర్ల సమాచారం మొత్తాన్ని టీడీపీ ప్రధాన కార్యాలయానికి తరలించారు. టీడీపీ రాజకీయ ప్రయోజనాల కోసం రూపొందించిన సేవా మిత్ర యాప్‌నకు అనుసంధానించారు. ఇలా రాష్ట్రంలోని ఓటర్ల వ్యక్తిగత సమాచారం చౌర్యానికి పాల్పడ్డారు. మరోవైపు టీడీపీ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఉన్న 35 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు కుట్ర పన్నారు. ఈ కుట్రకు వ్యతిరేకంగా అప్పట్లోనే వైఎస్సార్‌సీపీ ఆందోళనలు చేసింది. పోలీసులు, కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పూర్తి ఆధారాలతో ఫిర్యాదులు చేసింది.

నిగ్గు తేల్చిన శాసన సభ ఉప సంఘం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ ప్రభుత్వం చేసిన డేటా చౌర్యంపై విచారణకు శాసన సభ ఉప సంఘాన్ని నియమించింది. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలోని ఈ కమిటీ హోం, ఆర్థిక, సమాచార–పౌర సంబంధాల శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులను విచారించింది. అప్పటి సీఎం చంద్రబాబు ఆదేశాలతోనే తాము ఓటర్ల వ్యక్తిగత సమాచారాన్ని టీడీపీ సేవా మిత్ర యాప్‌నకు బదిలీ చేశామని ఆ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇజ్రాయెల్ నుంచి ఫోన్ ట్యాపింగ్, డేటా చౌర్యం సాఫ్ట్‌వేర్‌ను అక్రమంగా కొన్న మాట వాస్తవమేనని, అందుకే ఆ దేశంలో పర్యటించామని తెలిపారు. ఈ వ్యవహారంపై శాసన సభా ఉప సంఘం మధ్యంతర నివేదికను కూడా శాసన సభకు సమర్పించింది.

ఐ ఫోన్‌ను ట్యాప్ చేసే టెక్నాలజీ ఏపీ వద్ద లేదు

ఫోన్ల ట్యాపింగ్ అంశంపై కేంద్ర హోమ్ శాఖ ఇటీవల కీలక ప్రకటన చేసింది. ఐ ఫోన్లను ట్యాప్ చేసే టెక్నాలజీ ఏపీ ప్రభుత్వం వద్ద లేదని తెలిపింది. ఆ టెక్నాలజీ కేంద్ర హోం, రక్షణ శాఖల వద్దే ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలను నిరోధించడం, దేశ భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం అత్యున్నతస్థాయిలో ఆ పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. మరి లోకేశ్ ఐ ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని యాపిల్ కంపెనీ అలెర్ట్ మెస్సేజ్ పంపిందని టీడీపీ అంటోంది. అంటే లోకేశ్ ఫోన్‌ను ట్యాప్ చేసే అవకాశం కేంద్ర ప్రభుత్వానికే ఉందని పరిశీలకులు చెబుతున్నారు. మరి కేంద్ర ప్రభుత్వాన్నిగానీ, బీజేపీనిగానీ ప్రశ్నించే ధైర్యం టీడీపీకి ఉందా? బీజేపీ నేతలతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్న చంద్రబాబు ఆ సమయంలోనే వారిని లోకేశ్ ఫోన్ ట్యాపింగ్‌పై నిలదీయవచ్చు. చంద్రబాబు అంత ధైర్యం చేయగలరా? కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈసీకి ఫిర్యాదు చేస్తారా? లేకపోతే తాము వైఎస్సార్‌సీపీపై చేస్తున్న ఆరోపణలను ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్తారా?

చంద్రబాబు పెగసస్ సాఫ్ట్‌వేర్ కొన్నారు: మమతా బెనర్జీ

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం రూ.25 కోట్లు వెచ్చించి పెగసస్ నుంచి అక్రమంగా ఫోన్ ట్యాపింగ్, డేటా చౌర్యం సాఫ్ట్‌వేర్ కొన్నారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా ప్రకటించడం జాతీయ స్థాయిలో పెను సంచలనం సృష్టించింది. 2022లో పశ్చిమ బెంగాల్ శాసన సభలో ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ మాట్లాడుతూ డేటా చౌర్యం సాఫ్ట్‌వేర్ కొనాలని పెగసస్ కంపెనీ ప్రతినిధులు తనను సంప్రదించినా, తిరస్కరించినట్టు వెల్లడించారు. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం ఆ సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేసిందని, మీరు కూడా కొనాలంటూ ఆ సంస్థ ప్రతిపాదించిందని తెలిపారు. చట్ట విరుద్ధమైన ఆ పనిని తాను చేయలేనని తిరస్కరించానని ఆమె చెప్పారు. ఇవన్నీ చంద్రబాబు కుతంత్రాలను బయటపెట్టే వాస్తవాలు.

మాపై కేసుల వివరాలు ఇచ్చేలా పోలీసులను ఆదేశించండి

హైకోర్టులో చంద్రబాబు తదితరుల పిటిషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో తమపై నమోదైన కేసుల వివరాలు అందజేసేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు శుక్రవారం హైకోర్టులో అత్యవసరంగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలతో పాటు ఇదే అంశంపై పలువురు టీడీపీ నేతలు దాఖలు చేసిన వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్, న్యాయవాదులు వీవీ లక్ష్మీనారాయణ, వీవీ సతీష్ తదితరులు వాదనలు వినిపించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థీ ఎన్నికల అఫిడవిట్‌లో తమపై ఉన్న కేసుల వివరాలు పొందుపరచాల్సి ఉంటుందన్నారు. పిటిషనర్లు అందరూ ఎన్నికల్లో పోటీచేస్తున్నారని, అందువల్ల తమపై ఉన్న కేసుల వివరాలు పొందుపరచాలని, అలా చేయకుంటే అనర్హత వేటు పడుతుందన్నారు. అయితే పోలీసులు తమపై ఉన్న కేసుల వివరాలివ్వడం లేదని, దీంతో నామినేషన్ దాఖలులో జాప్యం జరుగుతోందని తెలిపారు. హోమ్ శాఖ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్జీపీ) వేలూరు మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లపై నమోదైన కేసుల వివరాలను ఆయా జిల్లాల ఎస్పీల నుంచి తెప్పించాల్సి ఉందని, అయితే పిటిషనర్లు ఎస్పీలను సంప్రదించకుండా నేరుగా డీజీపీని సంప్రదించారని తెలిపారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం నడుచుకుంటామన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. కేసుల వివరాలు తెప్పించడం కష్టంకాదని, ఇందుకు కృత్రిమ మేధను ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ నెల 16 లోపు పిటిషనర్లపై ఉన్న కేసుల వివరాలు అందచేయాలని పోలీసులకు మౌఖికంగా ఆదేశాలిచ్చారు. తదుపరి విచారణ అదే రోజుకి వాయిదా వేశారు.

సాక్షి బిజినెస్
శనివారం
13-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
793	234
74,245	22,519

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	16,167	▽	277
డోజోన్స్	37,984	▽	475
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,996	△	72
డాక్స్	17,930	▽	24
షాంఘై	3,019	▽	15
నికాయ్	39,524	△	81

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	73,174
బంగారం (99.5 స్వచ్ఛత)	72,881
వెండి (కేజీ)	83,819

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.04	84.05
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.22	106.77
€	యూరో	ఎస్‌బీఐ	89.38	91.74
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.64	55.87
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.98	55.90
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.51	64.17
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.32	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.79	23.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.39	12.47

మార్చిలో రిటైల్ ధరలు డౌన్

5 నెలల కనిష్టానికి సీపీఐ



న్యూఢిల్లీ: ఆహారోత్పత్తుల ధరలు నెమ్మదించడంతో మార్చిలో రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) ఐదు నెలల కనిష్టానికి తగ్గింది. 4.85%గా నమోదైంది. తద్వారా రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించుకున్న 4% లక్ష్యం దిశగా దిగి వస్తున్నట్లు శుక్రవారం విడుదల చేసిన గణాంకాల్లో వెల్లడైంది. వీటి ప్రకారం గతేడాది మార్చిలో ద్రవ్యోల్బణం 5.66 శాతంగా ఉండగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో 5.09 శాతంగా ఉంది. చివరిసారిగా 2023 అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 4.87% స్థాయిలో నమోదైంది. ఎన్ఎస్ఓ డేటా ప్రకారం ఆహారోత్పత్తుల ధరల పెరుగుదల 8.66% (ఫిబ్రవరి) నుంచి మార్చిలో 8.52 శాతానికి దిగి వచ్చింది. గుడ్లు, సుగంధ ద్రవ్యాలు, పప్పు దినుసులు తదితర రేట్లు నెలవారీగా కొంత తగ్గాయి.

4 నెలల గరిష్టానికి ఐఐపీ..


మైనింగ్ రంగం ఊతంతో పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) వృద్ధి ఫిబ్రవరిలో మరింత పుంజుకుంది. నాలుగు నెలల గరిష్ట స్థాయి 5.7 శాతంగా నమోదైంది. గతేడాది ఫిబ్రవరిలో ఇది 6 శాతంగా ఉంది. చివరిసారిగా అక్టోబర్‌లో అత్యధికంగా 11.9 శాతంగా ఉన్న ఐఐపీ వృద్ధి నవంబర్‌లో 2.5 శాతానికి పరిమితమైంది. ఆ తర్వాత డిసెంబర్‌లో 4.2 శాతం, జనవరిలో 4.1 శాతంగా నమోదైంది. 2023-24 ఏప్రిల్–ఫిబ్రవరి మధ్య కాలంలో ఐఐపీ వృద్ధి 5.6 శాతం నుంచి 5.9 శాతానికి చేరింది. తాజా డేటా ప్రకారం ఫిబ్రవరిలో మైనింగ్ ఉత్పత్తి వృద్ధి 4.8 శాతం నుంచి 8 శాతానికి చేరింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-4-2024 ఫామ్ ధర...

విశాఖ	411-00
చిత్తూరు	468-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	396-00
విజయవాడ	396-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	385-00
వరంగల్	387-00
రిటైల్ ధర	4.45

మరోసారి టీసీఎస్



- క్యూ4లో నికర లాభం రూ. 12,434 కోట్లు
- 2023–24 లాభం రూ. 45,908 కోట్లు
- షేరుకి రూ. 28 డివిడెండ్

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవలకు దేశంలో నంబర్ వన్.. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) మరోసారి పటిష్ట ఫలితాలు సాధించింది. మార్చితో ముగిసిన గతేడాది (2023-24)తోపాటు చివరి త్రైమాసికంలోనూ ప్రోత్సాహకర పనితీరు ప్రదర్శించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ4 (జనవరి–మార్చి)లో రూ. 12,434 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2022-23) ఇదే కాలంలో సాధించిన రూ. 11,392 కోట్లతో పోలిస్తే 9 శాతం అధికం. త్రైమాసిక ప్రాతిపదికన(రూ. 11,058 కోట్లు) సైతం 12 శాతంపైగా వృద్ధి నమోదైంది. ఇందుకు మెరుగుపడిన మార్జిన్లు, దేశీ బిజినెస్‌లో వృద్ధి దోహదపడ్డాయి. మొత్తం ఆదాయం వార్షికంగా 3.5 శాతం పుంజుకుని రూ. 61,237 కోట్లను తాకింది. అంతక్రితం రూ. 59,162 కోట్ల టర్నోవర్ సాధించింది. కంపెనీ బోర్డు షేరుకి రూ. 28 చొప్పున వాటాదారులకు మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.

పూర్తి ఏడాదిలో..

గత ఆర్థిక సంవత్సరానికి టీసీఎస్ 9 శాతం అధికంగా రూ. 45,908 కోట్ల నికర లాభం ప్రకటించింది. నిర్వహణ లాభ మార్జిన్లు 1.5 శాతం బలపడి 26 శాతాన్ని తాకాయి. మొత్తం ఆదాయం 7% వృద్ధితో రూ. 2,40,893 కోట్లకు చేరింది.



సీవోవో గణపతితో సీఈవో కృతివాసన్(ఎడమ)

అనిశ్చితిలోనూ

లాభాల మార్జిన్, ఆర్డర్ బుక్ సమర్థవంత ఎగ్జిక్యూషన్, పటిష్ట బిజినెస్ మోడల్ కంపెనీ విలువను తెలియజేస్తున్నాయి. ప్రపంచ అనిశ్చితిలోనూ కీలకమైన, ప్రాధాన్యతగల అంశాలలో మెరుగైన సేవలను అందించాం. విభిన్న ఆఫరింగ్స్, కొత్తతరహా సామర్థ్యాలు, నాయకత్వ సలహాల ద్వారా కస్టమర్లకు మద్దతిచ్చాం.- కె.కృతివాసన్, సీఈవో, ఎండీ, టీసీఎస్

యింది. టర్నోవర్‌లో అతిపెద్ద మార్కెట్ ఉత్తర అమెరికా వాటా 2.3% తగ్గి 50 శాతానికి పరిమితమైంది. 24.6% నిర్వహణ మార్జిన్లు సాధించింది. దేశీ బిజినెస్ 38% ఎగసింది. దీంతో మొత్తం ఆదాయంలో దేశీ వాటా 5% నుంచి 6.7 శాతానికి బలపడింది. 40ఏళ్లపాటు బాధ్యతలు నిర్వహించిన సీవోవో ఎన్.గణపతి సుబ్రమణ్యం వచ్చే నెలలో పదవీ విరమణ చేయనున్నట్లు కంపెనీ సీఈవో కృతివాసన్ పేర్కొన్నారు. అయితే కొత్త సీవోవోగా ఎవరినీ ఎంపిక చేయబోమని, సీనియర్లకు బాధ్యతలు పంపిణీ చేస్తామని తెలియజేశారు. ఉద్యోగులకు 4.7% వార్షిక వేతన పెంపును చేపట్టనున్నట్లు హెచ్ఆర్ చీఫ్ మిలింద్ లక్కడ్ వెల్లడించారు. అత్యుత్తమ పనితీరు చూపినవారికి రెండంకెలలో పెంపు ఉంటుందని తెలియజేశారు.


ఫలితాల నేపథ్యంలో టీసీఎస్ 0.5% పెరిగి రూ. 4,005 వద్ద ముగిసింది.

ఇతర విశేషాలు

- క్యూ4లో కంపెనీ చరిత్రలోనే గరిష్టస్థాయిలో 13.2 బిలియన్ డాలర్ల ఆర్డర్లు పొందింది.
- క్యూ4లో యూకే బీమా దిగ్గజం అవైవాతో 15 ఏళ్ల కాలానికి మెగా డీల్‌ను సాధించింది.
- వరుసగా మూడు త్రైమాసికాలలో మొత్తం 13,249 మంది సిబ్బంది తగ్గారు.
- పూర్తి ఏడాదికి 42.7 బిలియన్ డాలర్ల విలువైన డీల్స్ కుదుర్చుకుంది.
- ఉద్యోగ వలసల (అట్రిషన్) రేటు 13.3 శాతం నుంచి 12.5 శాతానికి దిగివచ్చింది.
- క్యూ4లో సుమారు 2,000 మంది తగ్గడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 6,01,546కు చేరింది.
- 2004లో టీసీఎస్ లిస్టింగ్ తదుపరి గతేడాదిలోనే తొలిసారి ఉద్యోగుల సంఖ్యలో కోతపడింది.

రికార్డుల ర్యాలీకి బ్రేక్

- తెరపైకి ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు వాయిదా ఆందోళనలు
- వారాంతాన వెల్లువెత్తిన విక్రయాలు
- 75 వేల దిగువకు సెన్సెక్స్
- నిఫ్టీకి నష్టం 234 పాయింట్లు
- రూ.2.52 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబై: దేశీయ స్టాక్ సూచీలు ఒక శాతానికి పైగా పతనమయ్యాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం భారీగా పెరగడంతో ఈ జూన్‌లోనూ ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపుపై సందేహాలు తలెత్తాయి. ఫిబ్రవరి పారిశ్రామికోత్పత్తి, మార్చి ద్రవ్యోల్బణ డేటాతో పాటు ఐటీ దిగ్గజం టీసీఎస్ క్యూ4 ఆర్థిక ఫలితాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఈక్విటీ మార్కెట్ జీవితకాల గరిష్టం వద్ద ట్రేడవుతుండటంతో అధిక వాల్యుయేషన్ల ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో ఇన్వెస్టర్లు పలు రంగాల షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. సెన్సెక్స్ 793 పాయింట్లు నష్టపోయి 74,245 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 234 పాయింట్లు పతనమై 22,519 వద్ద నిలిచింది. సూచీలు ఉదయం స్వల్ప నష్టాలతో మొదలయ్యాయి. అమ్మేవారు తప్ప కొనేవారు లేకపోవడంతో మరింత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 849 పాయింట్లు క్షీణించి 74,189 వద్ద, నిఫ్టీ 250 పాయింట్లు క్షీణించి 22,504 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. అన్ని రంగాల్లోనూ విక్రయాలు వెల్లువెత్తాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.8,027 కోట్ల ఈక్విటీలు అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.6,341 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు అరశాతం నుంచి ఒకశాతం మేర నష్టపోయాయి.

- రంగాల వారీగా ఆయిల్అండ్‌గ్యాస్ 1.28%, యుటిలిటీ 1.02%, రియల్టీ, కమోడిటీ, ఫైనాన్స్ సూచీలు 1% చొప్పున నష్టపోయాయి. బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 0.60%, 0.50% చొప్పున నష్టపోయాయి.
- రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ షేరు 13% పతనమై రూ.198 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 20% క్షీణించి రూ.182 వద్ద లోయర్ సర్క్యూట్ తాకింది. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎక్స్‌ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు(డీఏఎంఈపీఎల్) అనుకూలంగా గతంలో వచ్చిన రూ.8,000 కోట్ల ఆర్బిట్రేషన్ అవార్డును సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఈ షేరు రెండోరోజూ లోయర్ సర్క్యూట్ తాకింది.
- నష్టాల మార్కెట్లోనూ భారతీ హెక్సాకామ్ లిస్టింగ్ విజయవంతమైంది. ఇష్యూ ధర (రూ.570)తో పోలిస్తే బీఎస్ఈలో 32% ప్రీమియంతో రూ.755 వద్ద మొదలైంది. నష్టాల మార్కెట్లో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో 54% బలపడి రూ.880 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 43% లాభంతో రూ.814 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.40,687 కోట్లుగా నమోదైంది.
- సెన్సెక్స్ 793 పాయింట్ల పతనంతో బీఎస్ఈలో రూ.2.52 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.399 లక్షల కోట్లకు దిగివచ్చింది.

వొడాఫోన్ భారీ ఎఫ్‌పీవో

- రూ. 18,000 కోట్ల సమీకరణ
- 18 నుంచి ఇష్యూ ప్రారంభం

న్యూఢిల్లీ: ఆర్థిక సమస్యల్లో చిక్కుకున్న టెలికం సంస్థ వొడాఫోన్-ఐడియా (వీఐ) భారీ ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీవో)కి తెరతీయనుంది. దీని ద్వారా రూ. 18,000 కోట్లు సమీకరించనుంది. ఏప్రిల్ 18–22 మధ్య ఎఫ్‌పీవో ఉండనుంది. ఇందుకోసం షేరు ధర రూ. 10–11 శ్రేణిలో ఉంటుంది. ఇటీవల ప్రమోటరు సంస్థకు ప్రిఫరెన్షియల్ షేర్ల కేటాయింపునకు సంబంధించి నిర్ణయించిన రూ. 14.87 రేటుతో పోలిస్తే ఇది సుమారు 26 శాతం తక్కువ. కనీసం 1,298 షేర్లకు బిడ్ చేయాల్సి ఉంటుంది. ఎఫ్‌పీవో ద్వారా సేకరించిన నిధులను 4జీ నెట్‌వర్క్ విస్తరణ, 5జీ నెట్‌వర్క్‌ల ఏర్పాటుతో పాటు పన్నులు, బాకీలు చెల్లించడానికి వొడాఫోన్ ఐడియా వినియోగించుకోనుంది. 2020లో యస్ బ్యాంక్ రూ. 15,000 కోట్ల ఫాలో



ఆన్ తర్వాత ఇదే అతి పెద్ద ఎఫ్‌పీవో కానుంది. బ్రిటన్ టెలికం సంస్థ వొడాఫోన్ గ్రూప్ భారత్‌లో తన వ్యాపారాన్ని ఐడియా సెల్యులార్‌తో విలీనం చేయడం ద్వారా 2018లో వొడాఫోన్ ఐడియా ఏర్పడింది. ప్రస్తుతం రూ. 2.1 లక్షల కోట్ల రుణ భారంతో మనుగడ కోసం సతమతమవుతోంది. శుక్రవారం వొడాఫోన్-ఐడియా షేరు రూ. 12.96 వద్ద క్లోజయ్యింది.

జీక్యూజీ, ఎస్‌బీఐ ఎంఎఫ్ ఆసక్తి..

ఈ ఎఫ్‌పీవోలో దాదాపు 800 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 6,500 కోట్లు) వరకు ఇన్వెస్ట్ చేయాలని జీక్యూజీ పార్ట్‌నర్స్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మ్యూచువల్ ఫండ్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్ఆర్ఐ రాజీవ్ జైన్ సారథ్యంలోని అమెరికన్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ జీక్యూజీ పార్ట్‌నర్స్ 500 మిలియన్ డాలర్లు, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ 200–300 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసే యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

రూ.50 వేల కోట్ల టర్నోవర్‌ను దాటిన మలబార్

హైదరాబాద్: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ రూ.50 వేల కోట్లను మించి రికార్డు వార్షిక టర్నోవర్ సాధించిందని సంస్థ చైర్మన్ ఎం.పి. అహమ్మద్ తెలిపారు. సోమాజిగూడ మలబార్ షోరూమ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ''గ్లోబల్ ర్యాంకింగ్ ఆఫ్ లగ్జరీ ప్రోడక్ట్స్‌లో మలబార్ గ్రూప్ 19వ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరం రూ.51,218 కోట్ల వార్షిక రిటైల్ గ్లోబల్ టర్నోవర్ సాధించింది'' అన్నారు. వ్యాపార విస్తరణకు ప్రణాళికల్లో భాగంగా దేశ, విదేశాల్లో వచ్చే ఏడాదిలో 100 కొత్త షోరూములు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తద్వారా అదనంగా 7 వేల మందికి ఉపాధి కల్పిస్తామని అహమ్మద్ పేర్కొన్నారు.

MALABAR GOLD & DIAMONDS

సాక్షి స్పోర్ట్స్



భారత్‌ను గెలిపించిన అంకిత-ప్రార్థన జోడీ

చాంగ్షా (చైనా): బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా జోన్ మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టుకు మూడో విజయం లభించింది. దక్షిణ కొరియాతో శుక్రవారం జరిగిన నాలుగో లీగ్ మ్యాచ్‌లో భారత్ 2–1తో గెలిచింది. తొలి మ్యాచ్‌లో రుతుజా భోస్లే 6–2, 6–2తో సోహున్ పార్క్‌పై నెగ్గి భారత్‌కు 1–0తో ఆధిక్యం అందించింది. రెండో మ్యాచ్‌లో అంకిత రైనా 2–6, 3–6తో సుజియోంగ్ జాంగ్ చేతిలో ఓడిపోవడంతో స్కోరు 1–1తో సమమైంది. నిర్ణాయక డబుల్స్ మ్యాచ్‌లో అంకిత -ప్రార్థన తొంబారే ద్వయం 6–4, 6–4తో దబిన్ కిమ్–సోహున్ పార్క్ జంటను ఓడించి భారత్‌కు విజయాన్ని ఖరారు చేసింది. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో ప్రస్తుతం చైనా టాప్ ర్యాంక్‌లో, భారత్ రెండో ర్యాంక్‌లో ఉన్నాయి. నేడు జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్‌తో భారత్, కొరియాతో చైనా పోటీపడతాయి. టాప్-2లో నిలిచిన జట్లు వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్స్ దశకు అర్హత సాధిస్తాయి.



ఫ్రేజర్

లక్నో జోరుకు బ్రేక్

- 6 వికెట్ల తేడాతో ఢిల్లీ గెలుపు
- కుల్దీప్ మాయాజాలం
- ఫ్రేజర్, పంత్ మెరుపులు

లక్నో: ఐపీఎల్‌లో హ్యాట్రిక్ విజయాలతో జోరు మీదున్న లక్నో సూపర్ జెయింట్స్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ బ్రేక్ వేసింది. ముందుగా బౌలర్లు, లక్ష్యఛేదనలో బ్యాటర్లు బాధ్యత కనబరచడంతో పంత్ బృందం 6 వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట లక్నో 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. ఆయుశ్ బదోని (35 బంతుల్లో 55 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో రాణించాడు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ 3, పేసర్ ఖలీల్ అహ్మద్ 2 వికెట్లు తీశారు. తర్వాత ఢిల్లీ 18.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసి గెలిచింది. తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్న ఆస్ట్రేలియా యువతార జేక్ ఫ్రేజర్ మెగర్క్ (35 బంతుల్లో 55; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), రిషభ్ పంత్ (24 బంతుల్లో 41; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగి ఢిల్లీ గెలుపుతో కీలకపాత్ర పోషించారు.

ఆదుకున్న బదోని

ఆరంభంలో ధాటిగా ఆడిన లక్నో జట్టు పవర్‌ప్లేలో 57/2 స్కోరు చేశాక కుల్దీప్ ఉచ్చులో పడింది. వరుస బంతుల్లో స్టొయినిస్ (8), పూరన్ (0)లను కుల్దీప్ అవుట్ చేశాడు. ఆ తర్వాత రాహుల్ (22 బంతుల్లో 39, 5 ఫోర్లు, 1 సిక్స్), దీపక్ హుడా (10), కృనాల్ పాండ్యా (3)ల వైఫల్యంతో 94 పరుగులకే 7 వికెట్లను కోల్పోయింది. ఈ దశలో ఆయుశ్ బదోని... అర్షద్ (16 బంతుల్లో 20 నాటౌట్)తో కలిసి 8వ వికెట్‌కు 73 పరుగులు జోడించాడు.

సిక్సర్లతో అలరించి...

ఢిల్లీ జట్టు ఆరంభంలోనే వార్నర్ (8), పృథ్వీషా (22 బంతుల్లో 32; 6 ఫోర్లు)లను కోల్పోయింది. అయితే ఫ్రేజర్, రిషభ్ పంత్ లక్నో బౌలర్ల భరతం పట్టి ఢిల్లీని లక్ష్యంవైపు నడిపించారు. కృనాల్ 13వ ఓవర్లో ఫ్రేజర్ మూడు వరుస సిక్స్‌లు బాదడంతో ఆ ఓవర్లో 21 పరుగులు వచ్చాయి. 31 బంతుల్లో అతని అర్ధ సెంచరీ పూర్తయ్యింది. జట్టు స్కోరు 140 వద్ద ఫ్రేజర్‌ను నవీనుల్ పెవిలియన్ చేర్చగా మూడో వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరుసటి ఓవర్లోనే పంత్‌ను బిష్ణోయ్ అవుట్ చేయగా, మిగతా లాంఛనాన్ని స్టబ్స్ (15 నాటౌట్), హోప్ (11 నాటౌట్) పూర్తి చేశారు.



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుల్దీప్

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఖలీల్ 19; రాహుల్ (సి) పంత్ (బి) కుల్దీప్ 39; పడిక్కల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఖలీల్ 3; స్టొయినిస్ (సి) ఇషాంత్ (బి) కుల్దీప్ 8; పూరన్ (బి) కుల్దీప్ 0; హుడా (సి) వార్నర్ (బి) ఇషాంత్ 10, బదోని (నాటౌట్) 55; కృనాల్ (సి) పంత్ (బి) ముకేశ్ 3; అర్షద్ (నాటౌట్) 20; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 167.** వికెట్ల పతనం: 1-28; 2-41, 3-66, 4-66, 5-77, 6-89, 7-94. బౌలింగ్: ఖలీల్ 4-0- 41-2, ఇషాంత్ 4-0-36-1, ముకేశ్ 4-0-41-1, అక్షర్ 4-0-26-0, కుల్దీప్ 4-0-20-3. **ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్:** పృథ్వీషా (సి) పూరన్ (బి) బిష్ణోయ్ 32; వార్నర్ (బి) యశ్ 8; ఫ్రేజర్ (సి) అర్షద్ (బి) నవీనుల్ 55; పంత్ (స్టంప్డ్) రాహుల్ (బి) బిష్ణోయ్ 41; స్టబ్స్ (నాటౌట్) 15; హోప్ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (18.1 ఓవర్లలో 4 వికెట్లకు) 170.** వికెట్ల పతనం: 1-24, 2- 63, 3-140, 4-146. బౌలింగ్: అర్షద్ 3.1-0 -34-0, నవీనుల్ 3-0-24-1, యశ్ ఠాకూర్ 4-0-31-1, కృనాల్ 3-0-45-0, రవి బిష్ణోయ్ 4-0-25-2, స్టొయినిస్ 1-0-10-0.

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ X రాజస్తాన్
వేదిక: ముల్లాన్‌పూర్
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	5	4	1	8	0.871
కోల్‌కతా	4	3	1	6	1.528
చెన్నై	5	3	2	6	0.666
లక్నో	5	3	2	6	0.436
హైదరాబాద్	5	3	2	6	0.344
గుజరాత్	6	3	3	6	-0.637
ముంబై	5	2	3	4	-0.073
పంజాబ్	5	2	3	4	-0.196
ఢిల్లీ	6	2	4	4	-0.975
బెంగళూరు	6	1	5	2	-1.124

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

కాంస్య పతక బౌట్‌లలో ఆకాశ్, అనిరుధ్ ఓటమి



బిష్కెక్ (కిర్గిస్తాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల రెండో రోజు భారత ఫ్రీస్టయిల్ రెజ్లర్లు ఒక్క పతకం కూడా గెలవలేకపోయారు. ఇద్దరు రెజ్లర్లు ఆకాశ్ దహియా (61 కేజీలు), అనిరుధ్ కుమార్ (125 కేజీలు) కాంస్య పతక బౌట్‌లలో ఓడిపోయారు. ఆకాశ్ 7–18 పాయింట్ల తేడాతో ఎంఖ్‌బోల్డ్ ఎంఖ్‌బట్ (మంగోలియా) చేతిలో... అనిరుధ్ 2–8 పాయింట్ల తేడాతో షామిల్ షరిపోవ్ (బహ్రెయిన్) చేతిలో ఓటమి పాలయ్యారు. భారత ఇతర రెజ్లర్లు యశ్ తుషీర్ (74 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో, సందీప్ సింగ్ మాన్ (86 కేజీలు), వినయ్ (92 కేజీలు) క్వాలిఫయింగ్ రౌండ్ బౌట్‌లలో పరాజయం పాలయ్యారు. ఇదే టోర్నీలో నేటి నుంచి మహిళల ఫ్రీస్టయిల్ బౌట్‌లు మొదలవుతాయి. శనివారం ఐదు వెయిట్ కేటగిరీల్లో (శివాని పవార్–50 కేజీలు; తమన్నా–55 కేజీలు; పుష్పా యాదవ్–59 కేజీలు; రాధిక–68 కేజీలు; ప్రియా–76 కేజీలు) బౌట్‌లు జరుగుతాయి.

చెఫ్ డి మిషన్‌గా వైదొలగిన మేరీకోమ్



న్యూఢిల్లీ: ఆరుసార్లు ప్రపంచ చాంపియన్, భారత దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ పారిస్ ఒలింపిక్స్‌లో చెఫ్ డి మిషన్‌గా వ్యవహరించలేనని తన బాధ్యతల నుంచి వైదొలగింది. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉషకు ఆమె లేఖ రాసింది. 'దేశానికి సేవ చేయడాన్ని నేనెప్పుడు గౌరవంగా భావిస్తాను. మానసికంగానూ సిద్ధంగా ఉంటా. కానీ... వ్యక్తిగత కారణాల వల్ల ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో గురుతర బాధ్యతలు నిర్వర్తించలేకపోతున్నాను. అందుకే ఆ పదవికి రాజీనామా చేస్తున్నా' అని 41 ఏళ్ల ఈ మణిపూర్ మహిళా బాక్సర్ లేఖలో వివరించింది. దీనిపై స్పందించిన పీటీ ఉష... మేరీకోమ్ పదవి నుంచి తప్పుకోవడం బాధాకరమే అయినా... ఆమె నిర్ణయాన్ని, వ్యక్తిగత గోప్యతను గౌరవిస్తామని తెలిపారు. మేరీ స్థానంలో మరొకరిని నియమిస్తామని ఉష చెప్పారు. పారిస్ ఒలింపిక్స్ ఈ ఏడాది జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకు జరుగుతాయి.

సత్యన్-మనిక జోడీకి నిరాశ

హవిరోవ్ (చెక్ రిపబ్లిక్): ప్రపంచ మిక్స్‌డ్ డబుల్స్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టేబుల్ టెన్నిస్ (టీటీ) టోర్నీలో సత్యన్ జ్ఞానశేఖరన్–మనిక బత్రా (భారత్) జోడీ నిరాశ పరిచింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 18వ స్థానంలో ఉన్న సత్యన్–మనిక ద్వయం శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో 9–11, 9–11, 9–11, 11–7, 8–11తో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 153వ స్థానంలో ఉన్న చూంగ్ జావెన్–లిన్ కరెన్ (మలేసియా) జంట చేతిలో ఓడిపోయింది. ఈ ఓటమితో మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత జోడీకి పారిస్ ఒలింపిక్స్ బెర్త్ దక్కే అవకాశాలు ఆవిరయ్యాయి. చివరి అవకాశమైన వరల్డ్ ర్యాంకింగ్ ఆధారంగా కూడా సత్యన్–మనిక జోడీకి పారిస్ ఒలింపిక్స్ బెర్త్ లభించే అవకాశాలు కనిపించడంలేదు.



హంపి గేమ్ 'డ్రా'

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీ ఏడో రౌండ్ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్స్ కోనేరు హంపి, వైశాలిలకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ప్రపంచ మాజీ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్ అనా ముజిచుక్ (ఉక్రెయిన్)తో జరిగిన గేమ్‌ను ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి హంపి 40 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. లె టింగ్జీ (చైనా)తో జరిగిన గేమ్‌లో తమిళనాడు అమ్మాయి వైశాలి 36 ఎత్తుల్లో ఓడిపోయింది. ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్స్ ప్రజ్ఞానంద, విదిత్ తమ గేమ్‌లను 'డ్రా'గా ముగించగా... దొమ్మరాజు గుకేశ్‌కు ఓటమి ఎదురైంది. ప్రజ్ఞానంద–ఫాబియానో కరువానా (అమెరికా) గేమ్ 41 ఎత్తుల్లో... విదిత్–నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్) గేమ్ 51 ఎత్తుల్లో 'డ్రా' అయ్యాయి. అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్)తో జరిగిన గేమ్‌లో గుకేశ్ 40 ఎత్తుల్లో ఓడిపోయాడు. ఏడో రౌండ్ తర్వాత హంపి, వైశాలి 2.5 పాయింట్లతో ఉమ్మడిగా ఐదో ర్యాంక్‌లో ఉన్నారు. ఓపెన్ విభాగంలో గుకేశ్, ప్రజ్ఞానంద 4 పాయింట్లతో ఉమ్మడిగా రెండో స్థానంలో ఉన్నారు.



రిటైర్మెంట్ ఆలోచన లేదు

2027 వన్డే ప్రపంచకప్ ఆడాలనుకుంటున్నా • భారత కెప్టెన్ రోహిత్ శర్మ వ్యాఖ్య



న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌ను ఇంకొన్నాళ్లు కొనసాగిస్తానని... వీడ్కోలు తీసుకునే ఆలోచన లేదని... 2027 వన్డే ప్రపంచకప్ కూడా ఆడాలనే ప్రణాళికలు ఉన్నాయని భారత కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. గతేడాది జరిగిన వన్డే ప్రపంచకప్‌లో ఒకే ఒక్క చెడ్డ రోజు భారత జట్టుకు టైటిల్ దూరం చేసిందని చెప్పాడు. 'యూ ట్యూబ్' చాట్ షోలో అతను పంచుకున్న విషయాలు అతని మాటల్లోనే... 'అసలు రిటైర్మెంట్ పలకాలనే ఆలోచనే లేదిపుడు. కానీ జీవితం ఎక్కడికి తీసుకెళుతుందో ఎవరికి తెలుసు. ఇప్పుడైతే నేను బాగా ఆడుతున్నా. ఇంకొన్నేళ్లు ఆటలో కొనసాగాలని గట్టిగా కోరుకుంటున్నా. ప్రపంచకప్ గెలవాలనే కసితోనే ఉన్నాను. నా దృష్టిలో వన్డే ప్రపంచకప్పే అసలైన ప్రపంచకప్. మేమంతా 50 ఓవర్ల వరల్డ్‌కప్‌లు చూసే పెరిగాం. వచ్చే ఏడాది ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ ఉంది. లార్డ్స్ (ఇంగ్లండ్)లో జరిగే తుదిపోరుకు మేం అర్హత సాధిస్తామనే ఆశిస్తున్నా'నని వివరించాడు. జూన్‌లో వెస్టిండీస్, అమెరికాల్లో జరిగే టి20 ప్రపంచకప్‌లో టీమిండియాకు రోహితే సారథ్యం వహించనున్నాడు.

మళ్లీ ఓడిన భారత్

పెర్త్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత పురుషుల హాకీ జట్టు ఖాతాలో వరుసగా నాలుగో పరాజయం చేరింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన నాలుగో మ్యాచ్‌లో టీమిండియా 1–3 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (12వ ని.లో) ఏకైక గోల్ చేశాడు. ఆస్ట్రేలియా జట్టుకు జెరెమి హేవార్డ్ (19వ, 47వ ని.లో) రెండు గోల్స్, జేక్ వెల్స్ (54వ ని.లో) ఒక గోల్ అందించారు. ఈ సిరీస్‌లో చివరిదైన ఐదో మ్యాచ్ నేడు జరుగుతుంది.









Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి 2024

జైత్రయాత్ర





శనివారం
ఏప్రిల్, 13

గుసగుస

పవనన్నా.. వదినెక్కడ?



పవనన్నా.. వదినమ్మ అన్నా లెజినోవా ఎక్కడ? అంటూ తమ్ముళ్లు రాష్ట్ర వ్యాప్తంగా తెగ హైరానా పడుతున్నారు. ఇటీవలే జనసేన పార్టీకి రాజీనామా చేసిన విజయవాడ పశ్చిమకు చెందిన నేత పోతిన మహేష్ సూటిగా ఈ ప్రశ్నను సంధించాక.. మనం సరైన సమాధానం చెప్పలేకపోతే ప్రజలు ఏమనుకుంటారు? అని జనసైనికులు వాపోతున్నారు. 'ఇంతకీ ఆమె ఎక్కడున్నారో మీకైనా తెలుసా?' అంటూ పరస్పరం జనసేన నేతలు ఆరా తీస్తున్నారు. 'జనసేనాని చేపట్టే గృహ ప్రవేశాన్ని వదినమ్మ అన్నా లెజినోవాతో చూడాలని ఉంది' అన్న పోతిన మహేష్ వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. 'ఇంతకీ ఆమె మలేసియాలో ఉన్నారా? లేక పుట్టిల్లు రష్యా వెళ్లిపోయారా? లేకా హైదరాబాద్‌లోనే ఉన్నారా..?' అని జన సైనికులు తలలు పట్టుకొంటున్నారు. వరుణ్ తేజ్, లావణ్యల నిశ్చితార్థ వేడుకలో పవన్ సింగిల్‌గానే పాల్గొన్నారు. అక్కడ కూడా అన్నా లెజినోవా కనిపించలేదు. తర్వాత వారాహి విజయ యాత్రకు ముందు పవన్ నిర్వహించిన యాగంలో కూడా వదినమ్మ కనిపించలేదు. ఇక రామ్ చరణ్, ఉపాసనల కుమార్తె నామకరణ వేడుకలోనూ అదే పరిస్థితి. 'ఆమె ఎక్కడ ఉందో తెలిస్తే తప్ప మనం తలెత్తుకోలేం. వైఎస్సార్ సీపీని బలంగా తిప్పికొట్టలేం' అని పిఠాపురంలో జన సైనికులు వాపోతున్నారు.

రెండు కండువాలే..

అనపర్తిలో కూటమి అభ్యర్థుల మధ్య చిచ్చు మరింతగా పెరిగింది. సీటు దక్కించుకున్న బీజేపీ అభ్యర్థి ఎంఎస్ఆర్‌కే రాజు మూడు కండువాలు వేసుకుని ప్రచారానికి వెళ్తే, తమ పార్టీ కండువా వేసుకోవద్దని టీడీపీ నాయకులు బిక్కవోలులో హుకుం జారీ చేశారట. ఇక్కడ టీడీపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యే సీటుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికీ బీజేపీకి వేరే స్థానాన్ని కేటాయించి, ఈ స్థానాన్ని నల్లమిల్లికే ఇస్తారన్న వార్తలున్నాయి. గురువారం రాత్రి పురందేశ్వరిని కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారట. తన రాజకీయ కష్టాలను ఏకరువు పెడుతూ రూపొందించిన ఆడియోలను మాత్రమే ప్లే చేస్తున్నారు. ఎక్కడా టీడీపీ/బీజేపీకి ఓటేయాలని ఆ ఆడియోలో లేదు. పూర్తి క్లారిటీ ఎప్పుడు వస్తుందో..?

బాబోయ్.. బాలయ్య



సినీ హీరో బాలయ్య ఎన్నికల ప్రచారంలో భాగంగా స్వర్ణాంధ్ర సాకార యాత్ర పేరిట బస్సు యాత్రకు శ్రీకారం చుడుతున్నారు. రాయలసీమలో ప్రారంభమయ్యే ఈ బస్సు యాత్ర ఈ నెల 25 నుంచి ఉత్తరాంధ్రలో నిర్వహించాలని టీడీపీ ప్లాన్. అయితే ఉత్తరాంధ్ర నేతలు మాత్రం బాలయ్య బస్సు యాత్ర తమ నియోజకవర్గాల్లో వద్దే వద్దని చెప్తున్నారట. ఆయన అన్‌స్టాపబుల్‌గా.. అర్థం లేకుండా.. అర్థం కాకుండా చెప్పే మాటలతో తమకు లాభం కంటే నష్టమే ఎక్కువన్న అభిప్రాయం వ్యక్తం చేశారట. బాలయ్య బుల్‌బుల్ మాటల్ని సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తే జరిగే నష్టంతో పోలిస్తే, ఆయన ప్రచారం ద్వారా వచ్చే ఫాయిదా ఏ మూలకూ సరిపోదని భయపడుతున్నారట.

జనసేన ఖాళీ.. ఇక టీడీపీ వంతు

పొత్తులో భాగంగా విజయవాడ వెస్ట్ అసెంబ్లీ స్థానాన్ని బీజేపీ నేత సుజనా చౌదరికి అప్పగించడంపై జనసేన, టీడీపీ వర్గంతోపాటు మైనార్టీలు మండిపడుతున్నారు. రూ.8 వేల కోట్ల బ్యాంకు రుణాల ఎగవేతలో ఈడీ కేసులు ఎదుర్కొంటున్న సుజనాకు ఈ స్థానం కట్టబెట్టడంపై గుర్రుగా ఉన్నారు. అధికారపక్షం వైఎస్సార్‌సీపీ తన పార్టీ నుంచి మైనార్టీ వర్గానికి చెందిన అతి సామాన్యుడు ఆసిఫ్‌కు సీటిస్తే, టీడీపీ, జనసేన నాయకులు మాత్రం పార్టీని నమ్ముకున్న వారిని కాదని, బీజేపీ నేత సుజనాకు కేటాయించడాన్ని తట్టుకోలేకపోతున్నారు. ఇప్పటికే జనసేన నేత పోతిన మహేష్ వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్‌పై కూడా అనుచరుల ఒత్తిడి పెరుగుతోందట. సుజనా నీడలో ఎదగలేమని తెలుసుకుని, వారు కూడా టీడీపీకి హ్యాండిచ్చే పనిలో చర్చోపచర్చలు చేస్తున్నారట.

విప్లవ సారథీ.. విజయీభవ

జననేత జగన్‌కు జనం దీవెన

58 నెలల్లో సమపాళ్లలో అటు సంక్షేమం... ఇటు అభివృద్ధి

సుపరిపాలనతో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

గత ఎన్నికల్లో 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయం

- తొలి కేబినెట్‌లోనే ఆవిష్కృతమైన సామాజిక విప్లవం
- మేనిఫెస్టోయే దిక్సూచిగా పాలన.. 99 శాతం హామీల అమలు
- నామినేటెడ్ పదవులు, పనుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50% రిజర్వేషన్
- వివక్ష, లంచాలకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాల వర్తింపు
- డీబీటీ రూపంలో పేదల ఖాతాల్లో నేరుగా రూ.2.70 లక్షల కోట్లు జమ
- ప్రభుత్వ పథకాల ద్వారా 11.77 నుంచి 4.19 శాతానికి తగ్గిన పేదరికం
- సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు
- ఇంటివద్దే పింఛన్, రేషన్ పంపిణీ చేసిన ఏకైక రాష్ట్రంగా ఏపీకి గుర్తింపు
- గత 58 నెలల్లో 2.32 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు
- నాడు–నేడుతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- సర్కారు బడుల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్ బోధన
- నాడు–నేడుతో ప్రభుత్వ ఆస్పత్రులకు మహర్దశ



సిద్ధం.. సిద్ధం..
అంటూ ఊరూరా సీఎం జగన్‌కు బ్రహ్మరథం


ప్రజాస్వామ్యమంటే ప్రజల చేత.. ప్రజల కోసం.. ప్రజలే పాలకులను ఎన్నుకోవడం. ప్రజలకు మంచి చేయాలన్న చిత్తశుద్ధి, నిబద్ధత, జవాబుదారీతనం పాలకుడికి ఉంటేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. అలాంటి నాయకుడు ముఖ్యమంత్రి అయితే విప్లవాత్మక మార్పులతో రాష్ట్రం ప్రగతిపథంలో ఎలా దూసుకెళ్లగలదో గత 58 నెలల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరూపించారు. సుపరిపాలనతో ప్రతి నియోజకవర్గం.. ప్రతి గ్రామం.. ప్రతి ఇంటా.. విప్లవాత్మక మార్పు కనిపిస్తోంది. ఈ మార్పు కొనసాగాలని బలంగా కోరుకుంటున్న జనం 'మేమంతా సిద్ధం' అంటూ బస్సు యాత్రలో సీఎం వైఎస్ జగన్‌కు నీరాజనాలు పలుకుతున్నారు. ఈ యాత్రలో జననేతను చూసేందుకు.. మాట కలిపేందుకు.. కరచాలనం చేసేందుకు.. వీలైతే ఫొటో దిగేందుకు స్కూలు పిల్లల నుంచి వృద్ధుల వరకు మండుటెండైనా.. అర్ధరాత్రయినా పోటీ పడుతుండటం ఊరూరా కనిపిస్తోంది. ఈ పరిణామంతో మరో చారిత్రక విజయం ఖాయమైందని రాజకీయ పరిశీలకులతో పాటు జాతీయ స్థాయి సర్వే సంస్థలు అభిప్రాయపడుతున్నాయి.

సాక్షి, అమరావతి: దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత 58 నెలలుగా విప్లవాత్మక మార్పులతో సుపరిపాలన అందిస్తున్నారు. గత ఎన్నికల్లో 50 శాతం ఓట్లు సాధించి 151 శాసనసభ (86.28 శాతం), 22 లోక్‌సభ (88 శాతం) స్థానాల్లో వైఎస్సార్‌సీపీ చరిత్రాత్మక విజయం సాధించిన సంగతి తెలిసిందే. 2019 మే 30న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వేదికపై నుంచే సుపరిపాలనకు ఆయన శ్రీకారం చుట్టారు. గత పాలకులకు భిన్నంగా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 99 శాతం అమలు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాపన, జిల్లాల పునర్వ్యవస్థీకరణ ద్వారా పరిపాలనను వికేంద్రీకరించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు భారీ ఎత్తున ఉద్యోగుల నియామకాలు చేపట్టారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా రాష్ట్రంలో నాలుగు లక్షల ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే.. కేవలం 58 నెలల్లోనే 2.32 లక్షల మందికి

- మిగతా III లో



దొరికాడు దొంగ



'స్కిల్' బెడిసికొట్టి కటకటాల్లోకి..

సీమెన్స్ కంపెనీ ముసుగులో భారీ దోపిడీ

కుట్రదారు, లబ్ధిదారు చంద్రబాబే

అవినీతి నెట్‌వర్క్ ద్వారా చంద్రబాబు బంగ్లాకు రూ.241 కోట్లు

సీఐడీ దర్యాప్తుల్లో ఆధారాలతోసహా వెల్లడి

A1 చంద్రబాబు అరెస్ట్...
రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో 52 రోజులు

బాబు చీకటి పాలన

17ఏ కింద చంద్రబాబుకు రక్షణ లభించదన్న సుప్రీంకోర్టు

షెల్ కంపెనీల ద్వారా టీడీపీ ఖాతాల్లోకి రూ.65.86 కోట్లు

కేజ్రీవాల్ అరెస్ట్ తరహాలోనే చంద్రబాబుపై ఈడీ కన్ను

ఇదీ చంద్రబాబు అవినీతి 'స్కిల్'

సాక్షి, అమరావతి: 'స్కిల్' స్కామ్... చంద్రబాబుకు ఎప్పటికీ వెంటాడే పీడకల...40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకుంటూ యథేచ్ఛగా అవినీతికి పాల్పడిన ట్రాక్ రికార్డు ఉన్న చంద్రబాబును ఖైదీ నంబర్ 7691గా 52 రోజులపాటు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు ఊచలు లెక్కించేలా చేసింది ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం. యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణ పేరుతో ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఈ కేసులో సీఐడీ చంద్రబాబుతో పాటు 8 మందిని అరెస్ట్ చేసింది. చంద్రబాబును ఏ1గా పేర్కొంటూ ఆయనపై ఐపీసీ సెక్షన్లు 120(బి), 166, 167, 418, 420, 465, 468, 471, 477(ఏ), 409, 201, 109 రెడ్‌విత్ 34, 37లతోపాటు అవినీతి నిరోధక చట్టం సెక్షన్లు 13(2) రెడ్‌విత్ 13(1) (సి), (డి) కింద అభియోగాలు నమోదు చేశారు. ఈ కేసులో కేంద్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షెల్ కంపెనీల ప్రతినిధులు నలుగురిని అరెస్ట్ చేసింది. డిజైన్ టెక్‌కు చెందిన రూ.31.20 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఈడీ జప్తు చేసింది. రాజ్యాంగబద్ధ సంస్థ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో అవినీతి జరిగిందని నిర్ధారించింది. చంద్రబాబు 17ఏ చట్టం కింద ఈ కేసు నుంచి తప్పించుకోలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇదే తరహాలో షెల్ కంపెనీల ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీకి నిధులు పొందిన కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేయడం సరైన చర్యేనని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది. మరి అదే తరహాలో స్కిల్‌స్కామ్‌కు పాల్పడి షెల్ కంపెనీల ద్వారా టీడీపీ ఖాతాల్లోకి నిధులు మళ్లించిన చంద్రబాబుపై ఈడీ కత్తి వేలాడుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. చంద్రబాబు స్కిల్డ్ క్రిమినల్ అని నిర్ధారిస్తూ దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కుంభకోణం కథ కమామిషు ఇలా ఉంది...

370 కోట్ల నుంచి 3,300 కోట్ల రూపాయలకు పెంచేసి..

2014లో అధికారంలోకి రాగానే ప్రజాధనాన్ని కొల్లగొట్టడాన్నే చంద్రబాబు లక్ష్యంగా చేసుకున్నారు. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ఆ కంపెనీ ముసుగులో ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అనంతరం తన బినామీ సంస్థ డిజైన్ టెక్‌ను రంగంలోకి దింపి ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. ఈ ప్రాజెక్ట్‌లో చంద్రబాబు బినామీలు, సన్నిహితులైన అప్పటి ఏపీఎస్ఎస్‌డీసీకి డైరెక్టర్‌గా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె. లక్ష్మీనారాయణ, ఎండీగా ఉన్న గంటా సుబ్బారావు కీలకంగా వ్యవహరించారు. ప్రాథమిక నివేదిక ప్రకారం రూ.370 కోట్లుగా ఉన్న ప్రాజెక్ట్ వ్యయాన్ని రూ.3,300 కోట్లకు పెంచేశారు. ప్రభుత్వం పది శాతం నిధులు సమకూరిస్తే సీమెన్స్, డిజైన్‌టెక్ 90 శాతం నిధులు పెట్టుబడి పెట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నట్టు 2015 జూన్ 30న ఉత్తర్వులు జారీ చేశారు. ఒప్పందంలో చెబుతున్నట్లుగా సీమెన్స్ డిజైన్ టెక్ కంపెనీలు తమ వాటా 90 శాతంలో ఒక్కరూపాయి కూడా ఇవ్వనే లేదు. ఏపీఎస్ఎస్‌డీసీ మాత్రం తన వాటా కింద జీఎస్టీ కలిపి డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్లు విడుదల చేసేసింది. అప్పటి ఆర్థిక శాఖ ఉన్నతాధికారుల అభ్యంతరాలను చంద్రబాబు బేఖాతరు చేస్తూ రూ.371 కోట్లు విడుదల చేయాలని ఆదేశించారు. అందుకోసం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన నోట్ ఫైళ్లపై 13 చోట్ల చంద్రబాబు సంతకాలు చేశారు.

షెల్ కంపెనీల ద్వారా బాబు బంగ్లాకు...

డిజైన్ టెక్‌కు చెల్లించిన రూ.371 కోట్లను షెల్ కంపెనీల ద్వారా బోగస్ ఇన్వాయిస్‌లు సమర్పించి వివిధ దశల్లో అక్రమంగా తరలించారు. ప్రతిదశలోనూ షెల్ కంపెనీల సృష్టికర్తలు, దళారుల కమీషన్లు పోనూ చంద్రబాబుకు రూ.241 కోట్లు చేర్చారు.

ఫైళ్లు మాయం చేసిన కుంభకోణం గుట్టు రట్టు

- మిగతా II లో

చంద్రబాబు అవినీతి నెట్‌వర్క్ ఇదీ..

- టీడీపీ ప్రభుత్వం పుణెకు చెందిన డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్లు చెల్లించింది.
- డిజైన్ టెక్ కంపెనీ నుంచి పుణెలోని పీవీఎస్‌పీ అనే షెల్ కంపెనీకి రూ.238.29 కోట్లు, ఢిల్లీలోని ఏసీఐ కంపెనీకి రూ.2.71 కోట్లు అంటే మొత్తం రూ.241 కోట్లు తరలించారు.
- పీవీఎస్‌పీ కంపెనీ నుంచి మళ్లీ ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్‌లో ఉన్న వివిధ షెల్ కంపెనీలతో పాటు దుబాయ్, సింగపూర్‌లోని కంపెనీలకు నిధుల తరలింపు ఇలా సాగింది...
  - ఏసీఐ: రూ.56 కోట్లు
  - నాలెడ్జ్ పోడియమ్: రూ.45.28 కోట్లు
  - ఈటా: రూ.14.1 కోట్లు
  - పాట్రిక్స్: రూ.3.13 కోట్లు
  - ఐటీ స్మిత్: రూ.3.13 కోట్లు
  - భారతీయ గ్లోబల్: రూ.3.13 కోట్లు
  - ఇన్‌వెబ్: రూ.1.56 కోట్లు
  - పోలారిస్: రూ.2.2 కోట్లు
  - కాడెన్స్ పార్టనర్స్: రూ.12 కోట్లు
- మొత్తం రూ.140.53 కోట్లను ఆ కంపెనీల బ్యాంకు ఖాతాల నుంచి యోగేశ్ గుప్తా డ్రా చేసి మనోజ్ వాసుదేవ్ పార్థసానికి అందించారు. మనోజ్ పార్థసాని ఆ నగదు మొత్తాన్ని చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు హైదరాబాద్‌లో ముట్టజెప్పారు. అంటే ఆ రూ.140.53 కోట్లను చంద్రబాబు బంగ్లాకు చేర్చారు.
- ఇక మిగిలిన రూ.100.47 కోట్లను పీవీఎస్‌పీ కంపెనీ దుబాయి, సింగపూర్‌లోని కంపెనీలకు మళ్లించింది. ఆ నిధులను మళ్లీ హవాలా మార్గంలో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ మనోజ్ పార్థసాని ద్వారా చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు అందించారు. అనంతరం చంద్రబాబు బంగ్లాకు చేర్చారు.
- ఏపీఎస్ఎస్‌డీసీకి చెందిన రూ.241 కోట్లు అవినీతి నెట్‌వర్క్ ద్వారా ఇలా గుట్టు చప్పుడు కాకుండా చంద్రబాబు బంగ్లాకు వచ్చి చేరాయి.

రౌడీలు.. అక్రమార్కులు.. కాలకేయులు

..ఇది తప్పన్న పాపానికి మహిళా అధికారి జుట్టు పట్టుకుని ఈడ్చుకెళతాడొకడు..


అధిక వడ్డీలకు అప్పులిచ్చి, గడువులోగా తీర్చలేదన్న సాకుతో పక్కకు రమ్మంటున్న వారిని వెనకేసుకొస్తాడు ఇంకొకడు..

ప్రకృతిని చెరబట్టడానికే పుట్టామన్నట్లు వ్యవహరిస్తాడు మరొకడు.. చిన్నారులని కూడా చూడకుండా లైంగికంగా వేధించే వెధవలకు అండగా నిలుస్తాడొక దుర్మార్గుడు..

ఆడది కనిపిస్తే ముద్దు అయినా పెట్టాలి, లేదంటే కడుపైనా చేయాలని నిస్సిగ్గుగా, సందేశంగా చెబుతాడో నేత..

'అసలు ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా?' అని స్వయంగా పార్టీ అధినేతే హేళన చేస్తాడు.. ఇలాంటి వాళ్లంతా ప్రజలను ఉద్ధరిస్తారట!

ప్రజలను పీల్చి పిప్పి చేయడంలో వీరందరిదీ అందె వేసిన చేయి. ఇలాంటి టీడీపీలో ఒక్కో నేతది ఒక్కో చీకటి చరిత్ర. నేటి నుంచి ఒక్కొక్కరి బాగోతాన్ని 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.



రౌడీ ఛీటర్ చింతమనేని

- వివరాలు II లో

ప్రజల మద్దతు పొందినవారికే పట్టం



నిరంతరం ప్రజల కోసం ఆలోచించే ప్రభుత్వాలకే పట్టం కట్టాలి. ఎన్నికల్లో లబ్ధి కోసం మోసపూరిత హామీలు గుప్పించేవారిని నమ్మరాదు. బంధుప్రీతి, స్వప్రయోజనాల కోసం వెంపర్లాడే నాయకులు అసలే వద్దు. గ్రాఫిక్స్, తాత్కాలిక అభివృద్ధి పేరిట హడావుడి సరికాదు. ప్రస్తుత పిల్లలకు ఉత్తమ విద్య, ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించే ప్రభుత్వాన్నే ప్రజలు విశ్వసిస్తారు. అలాంటి పార్టీల నేతలనే గొప్పగా ఆదరిస్తారు. వారినే ఎన్నికల్లో గెలిపిస్తారు. ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలుపే ప్రధానంగా గుంపులు కట్టే నాయకులను ప్రజలు ఎప్పుడూ నమ్మరు.

– చంద్ర ఓబుల్‌రెడ్డి, ఉరుటూరు, వీరపునాయునిపల్లె మండలం, వైఎస్సార్ జిల్లా

మీరూ స్పందించండి — పబ్లిక్ వాయిస్

ఎన్నికల గురించి మీరేం అనుకుంటున్నారు.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలంటే మీ సూచనలేంటి? అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రజలకు, రాజకీయ పార్టీలకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా? ఇలా ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపై అయినా సరే మీ అభిప్రాయాలను **73867 92224** నంబర్‌కు మీ ఫొటో సహా వాట్సాప్ ద్వారా పంపిస్తే ప్రచురిస్తాం.

ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలి



గతంలో చాలా ప్రభుత్వాల పనితీరును చూశాం. బడుగు, బలహీన వర్గాలకు, పేదలకు బాసటగా నిలిచిన ఈ ప్రభుత్వానిదే పైచేయి. ప్రజల కోసం ఏం చేస్తే బాగుంటుందన్న నిరంతర తపన సీఎం జగన్‌లో ఈ ఐదేళ్లు కనిపించింది. గత ప్రభుత్వాల్లో సంక్షేమ పథకాల లబ్ధి కోసం ఎన్నిపాట్లు పడాల్సి వచ్చిందో.. ఎవరూ మర్చిపోలేరు. ప్రభుత్వ పథకాలను అందుకోవాలంటే ఇలానే కష్టపడాలని పేదల మనసుల్లో ఏళ్లతరబడి నాటుకుపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే అర్హత ఉంటే సంక్షేమ పథకాలను ఇంత ఈజీగా అందుకోవచ్చని తెలిసింది. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ చాలా గొప్పవి. పేదల పక్షాన నిలిచే ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి రావాలి.

– కె.ప్రమీల, పెద్దచెప్పలి ఎస్సీ కాలనీ, కమలాపురం

- మంగళగిరి మరో మాదాపూర్ అంటూ రామోజీ గ్రాఫిక్స్ రాతలు
- జగన్ రాగానే ఆకాశహర్మ్యాలు మాయమైపోయాయట..
- ఐటీ పార్కుల పేరుతో మంగళగిరిలో చినబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారం
- డిజిగ్నేటెడ్ టెక్నాలజీ పార్కుల పేరుతో ప్రజాధనం దోపిడీ
- మార్కెట్ ధర కంటే అధిక అద్దెతో ఒప్పందాలు
- కనీసం ఒక్క ఐటీ కంపెనీ పేరు రాయలేని పిరికి రాతలు

లోకేశ్ ఐటీ.. రియల్ లూటీ

ఫ్యాక్ట్ చెక్


సాక్షి, అమరావతి:

రాజధాని పేరుతో మాటల మరాఠీ చంద్రబాబు చూపించిన గ్రాఫిక్స్ పాలనను ప్రజలు ఛీకొట్టారు. అరచేతిలో స్వర్గం చూపిస్తే.. జనం తమ ఓటుతో అసలు వాస్తవం చూపించారు. మన మంగళగిరి చినబాబు అయితే ఏకంగా ఐటీ పేరుతో మంగళగిరిలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెర తీస్తే.. గోబెల్స్‌కు రాజగురువు రామోజీ మాత్రం మంగళగిరిని ఏకంగా మాదాపూర్‌లా మార్చేయడానికి మా మాలోకం కష్టపడ్డాడని జాకీలతో పైకెత్తడానికి తెగ ఆరాటపడుతున్నారు. 'మంగళగిరి ఐటీపై జగన్ వేటు'అంటూ ఈనాడులో విషపు రాతలు రాశారు. చంద్రబాబు హయాంలో మంగళగిరి సింగపూర్‌ను తలదన్నేలా బహుళ అంతస్తుల భవనాల ఐటీ కంపెనీలతో కళకళలాడేదట. కనకదుర్గ వారధి నుంచి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వరకు ఆకాశహర్మ్యాలతో హైదరాబాద్‌లోని మాదాపూర్‌ను తలపించేదట. యువత ఆనందంతో ఉద్యోగాలు చేసుకునేవారట. జగన్ వచ్చాక ఇవన్నీ మాయమయ్యాయట.

ఇదీ అసలు నిజం..



ఐటీ కంపెనీలకు ప్రోత్సాహం అంటూ చంద్రబాబు పుత్రరత్నం ఇక్కడ ఐటీ మంత్రిగా పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెగబడ్డారు. ఐటీ పార్కుల పేరుతో బిల్డింగ్‌లు నిర్మించేసి.. ఐటీ కంపెనీలు రాకపోతే ఖాళీగా ఉన్న స్థలానికి ప్రభుత్వమే అద్దె చెల్లించేలా ప్రణాళిక వేశారు. ఇందుకోసం డిజిగ్నేటెడ్ టెక్నాలజీ పార్కుల పేరుతో ప్రత్యేక పాలసీ రూపొందించారు. ఈ పాలసీ ముసుగులో బాబు అనుయాయులు పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ భవనాలు నిర్మించి భారీ ఎత్తున ప్రభుత్వ సొమ్మును కాజేశారు. ఈ విధంగా నిరుపయోగంగా ఉన్న భవనాలకు భారీగా అద్దెను చెల్లించాల్సి వస్తుండటంతో ఈ పథకాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. నిజంగా మంగళగిరిలో ఐటీ కంపెనీలు వచ్చి ఉంటే ఆ కంపెనీల పేర్లు రాయొచ్చు కదా రామోజీ..? ఒక్క కంపెనీ పేరు రాసే ధైర్యం లేదు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో మూడు లక్షల ఉద్యోగాలంటూ లోకేశ్ ప్రచారంలోని డొల్లతనం 2019 జనవరిలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లోనే బయట పడింది. చంద్రబాబు అధికారం చేపట్టినప్పటి నుంచి ఐటీ రంగంలో లక్ష ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంటే 2018 అక్టోబర్ నాటికి కేవలం 8,768 మందికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. ప్రస్తుత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో 47,908 మందికి ఐటీ రంగంలో ఉపాధి కల్పించినా అవేవీ మీకు పట్టవా రామోజీ?



రౌడీ‘ఛీ’టర్ చింతమనేని

- ఎమ్మెల్యే హోదాలో అప్పటి మంత్రి వట్టి వసంత్‌కుమార్‌పై దాడి
- తహసీల్దార్ వనజాక్షి జుట్టుపట్టి ఈడ్చి దాడి చేసిన వైనం.. చంద్రబాబు హయాంలోనే రౌడీషీట్
- అత్యంత వివాదాస్పద రాజకీయ నేతగా ముద్ర
- ఎస్సీలకు రాజకీయాలు ఎందుకురా.. అంటూ తీవ్ర స్థాయిలో దూషణ
- పవన్ కళ్యాణ్.. వాళ్ల అన్న చిరంజీవినే గెలిపించలేనివాడు అంటూ వ్యక్తిగత విమర్శలు
- ప్రజా ప్రతినిధిగా ఉన్న సమయంలో పోలవరం కుడికాల్వ విధ్వంసం
- 5 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ మింగిన మహా అవినీతిపరుడు
- కొల్లేరులోనూ వందల ఎకరాల్లో సొంతంగా అక్రమ సాగు
- 1,860 ఎకరాల అక్రమ సాగులో అడ్డగోలుగా కమీషన్ల దందా

85కు పైగా కేసులు

అన్ని రకాల కేసులు 85కు పైగానే చింతమనేనిపై ఉన్నాయి. వీటిలో సగం కేసులు కోర్టుల్లో కొట్టి వేయగా, మరికొన్ని నడుస్తున్నాయి. 26 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. గతంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న కొవ్వూరు ఏఎస్‌ఐ, సీపీఓలపై దాడిచేసిన కేసుతోపాటు తెలంగాణలోనూ కోడిపందేల కేసులు ప్రభాకర్‌పై నమోదు కావడం విశేషం. ప్రధానంగా తహసీల్దార్ వనజాక్షిపై దాడి కేసులో చింతమనేని, ఆయన గన్‌మెన్, మరో 58 మందిపై నాన్ బెయిలబుల్ సెక్షన్లు ఐపీసీ సెక్షన్ 353, 332, 379, రెడ్ విత్ 34 కింద కేసు నమోదు చేశారు. 2011 నవంబర్ 26న దెందులూరులో జరిగిన రచ్చబండలో అప్పటి మంత్రి వట్టి వసంత్‌కుమార్‌పై చింతమనేని దాడి చేసిన ఘటనలో ఐపీసీ సెక్షన్ 506, 353, 332, రెడ్ విత్ 34 కింద కేసు నమోదు చేశారు. భీమడోలు కోర్టులో రెండేళ్ల జైలుశిక్ష విధించారు. దీనిపై ప్రస్తుతం ఏలూరు జిల్లా కోర్టులో అప్పీల్ కేసు కొనసాగుతోంది.

సాక్షి ప్రతినిధి, ఏలూరు:

“మీరు దళితులు, మీరు వెనుకబడిన వారు, మీరు షెడ్యూల్డ్ కాస్ట్ వారు... రాజకీయాలు మాకుంటాయి..మాకు పదవులు... మీకెందుకురా పిచ్చముండా కొడకల్లారా గొడవలు...” ఇదీ ఏలూరు జిల్లా దెందులూరు మండలం శ్రీరామవరంలోని దళిత పేటలో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దళిత సామాజికవర్గంపై తీవ్ర అసభ్య పదజాలంతో చేసిన వ్యాఖ్యలు. “పవన్‌కళ్యాణ్.. వాడి వల్ల ఏం అవుతుంది. వాడి అన్న చిరంజీవి లాంటి వాడినే గెలిపించుకోలేనివాడు.. మమ్మల్ని ఏమి చేస్తాడు... మేము గతంలో 2014లో వాడి బొమ్మపై గెలిచామా..” అంటూ దురహంకారపూరిత వ్యాఖ్యలు. దెందులూరులోని ఎన్టీఆర్ బొమ్మ సెంటర్ వద్ద జనసేన నేత పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలివి. దెందులూరు టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే చింతమనేని నోటి దురుసుతో పాటు తీవ్ర వివాదాస్పద వైఖరితో ప్రతి ఒక్కరిపై దాడులు చేయడంలో సిద్ధహస్తుడు. జర్నలిస్టు మొదలుకొని మంత్రి వరకు అందరిపై దాడి చేసిన ఏకైక రికార్డు కలిగిన రాజకీయ నేత. 85కి పైగా కేసులు చింతమనేనిపై ఉన్నాయని గత డీజీపీ విలేకరుల సమావేశంలో ప్రకటించారు. 40కి పైగా క్రిమినల్ కేసులు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా ప్రభుత్వ విప్ హోదాలో ఉన్న చింతమనేనిపై ఏలూరు త్రీటౌన్‌లో రౌడీషీట్ తెరిచారు. అత్యంత వివాదాస్పద వ్యక్తిగా రాష్ట్రంలో గుర్తింపు ఉన్న చింతమనేని అన్ని వర్గాలను దూషించి, అందరితో ఘర్షణలకు దిగినా కనీసం క్షమాపణలు కూడా చెప్పని తలపొగరు రాజకీయం సాగిస్తున్నారు. 2004 నుంచి 2014 వరకు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కొల్లేరు అక్రమ చేపల సాగు, పోలవరం కుడికాల్వ, తమ్మిలేరు ఇసుకను ప్రధాన ఆదాయ వనరులుగా మార్చుకుని వందల కోట్ల సహజ సంపద బహిరంగంగా దోపిడీకి పాల్పడ్డారు. అడ్డుకోవడానికి యత్నించిన పోలీస్, అటవీ శాఖ, రెవెన్యూ, మైనింగ్ శాఖ సిబ్బందిపై దాడులకు దిగిన ఘటనలు కోకొల్లలున్నాయి. 10 ఏళ్ళ ఎమ్మెల్యే పదవి కాలంలో వందల కోట్ల రూపాయలు సంపాదించాడని ఆరోపణలు ఉన్నాయి.

మాజీ మంత్రి వట్టి వసంత్‌పై దాడి

2011 నవంబర్ 26న దెందులూరు ఉన్నత పాఠశాలలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో అప్పటి రాష్ట్ర మంత్రి హోదాలో ఉన్న వట్టి వసంత్ కుమార్‌పై అప్పటి ఎమ్మెల్యేగా పదవిలో ఉన్న చింతమనేని ప్రభాకర్ దాడి చేశారు. వట్టి వసంత్‌కుమార్‌తో మాటామాటా పెరిగి చింతమనేని అకస్మాత్తుగా దాడి చేశారు. ఈ ఘటనపై కేసు నమోదై భీమడోలు జూనియర్ సివిల్ కోర్టులో మూడు సెక్షన్ల కింద అభియోగాలు నిర్ధారణ కావడంతో జడ్జి కె.దీపదైవకృప రెండేళ్ల జైలు శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ తీర్పుపై చింతమనేని అప్పీల్‌కు వెళ్లారు.

పోలవరం గట్లు మాయం

పోలవరం కుడికాల్వ గట్టు 20 కిలోమీటర్ల మేర ఐదేళ్లలో పూర్తిగా మాయం చేసిన ట్రాక్ చింతమనేనిది. పోలవరం నుంచి 180 కిలోమీటర్ల మేర కాల్వ నిర్మాణం ఉండగా దెందులూరు నియోజకవర్గం చల్లచింతలపూడి నుంచి పెదపాడు మండలం వరకు సుమారు 50 కిలోమీటర్ల మేర ఉంది. 240 అడుగుల వెడల్పుతో కాల్వను నిర్మించడానికి భూసేకరణ చేసి 240 అడుగుల వెడల్పు విస్తీర్ణంలో 80 అడుగుల మేర కాల్వ తగ్గి, కుడి, ఎడమ వైపు 80 అడుగుల మేర పోలవరం గట్లు ఏర్పాటు చేశారు. అలాగే 30 అడుగుల లోతుతో కాల్వను తవ్వారు. కాల్వను తవ్విన మట్టితో పాటు కుడి, ఎడమ వైపు తవ్విన గట్లపై ఉన్న గ్రావెల్‌నూ కొల్లగొట్టారు. దెందులూరు నియోజకవర్గంలోనే లక్ష క్యూబిక్ మీటర్ల మేర మట్టిని కొల్లగొట్టినట్టు చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే అప్పటి విజిలెన్స్, ఇరిగేషన్ అధికారులు నిర్ధారించారు. 17 క్యూబిక్ మీటర్ల చొప్పున ఒక లారీ లోడు దింపి ప్రతిరోజూ 200 టిప్పర్లు, కొన్నేళ్లపాటు నిరాటంకంగా నిర్వహించి మట్టి దోపిడీకి పాల్పడ్డారు.

తమ్మిలేరును మింగేశారు

తెలంగాణ రాష్ట్రం నుంచి ఏజెన్సీ ప్రాంతం మీదుగా ఏలూరు నగరం నుంచి కొల్లేరు వరకు విస్తరించి ఉన్న తమ్మిలేరు ప్రధాన కాల్వను చింతమనేని అండ్ ముఠా మింగేసింది. దెందులూరు నియోజకవర్గంలో తమ్మిలేరు ఎక్కువగా ఉండటం, తమ్మిలేరు పరీవాహక ప్రాంతంలో నాణ్యత ఉన్న ఇసుక ఉండటంతో దెందులూరు, నూజివీడు నియోజకవర్గాల్లోని తమ్మిలేరు పరీవాహక ప్రాంతాలంతా గట్టిగా కొల్లగొట్టారు. ప్రధానంగా పెదవేగి మండలంలో విజయరాయి నుండి ప్రారంభమై నడిపల్లి, బలివే, సూర్యారావుపేట, తమ్మిలేరు, చింతలపూడి నియోజకవర్గం వలసపల్లి వద్ద తమ్మిలేరు 24 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఒక రాత్రికి 200 లారీలు చొప్పున దాదాపు 4 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను దోచేశారు. దోపిడీ ప్రస్థానాన్ని దెందులూరుతో పాటు పక్క నియోజకవర్గమైన నూజివీడులో కూడా చొరబడి ముసునూరు మండలంలో ఇసుక దోపిడీకి పాల్పడ్డారు. ఈ క్రమంలోనే 2015 జూన్‌లో ముసునూరు తహసీల్దార్ వనజాక్షిపై దాడి చేసి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనానికి కేంద్ర బిందువయ్యారు.

తహసీల్దార్ వనజాక్షి జుట్టు పట్టుకుని దాడి

2015 జూలై 11న ముసునూరులో చింతమనేని అనుచరులు అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తుండటంతో అప్పటి ముసునూరు తహసీల్దార్ వనజాక్షి ఇసుక ట్రాక్టర్లకు అడ్డుపడి గట్టిగా నిలువరించారు. దీంతో సమాచారం తెలుసుకున్న చింతమనేని హుటాహుటిన అక్కడకు చేరి మహిళా అధికారి, మండల మేజిస్ట్రేట్ అని కూడా చూడకుండా జుట్టుపట్టి ఈడ్చి పక్కకు పడేసి దాడి చేయడంతో పాటు నానా దుర్భాషలాడిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారింది. కేసు నమోదైన వెంటనే బెయిల్ రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాగ్రహం వెల్లువెత్తడం, రెవెన్యూ తిరుగుబాటుతో చంద్రబాబు దిగి వచ్చి వ్యవహారాన్ని సద్దుమణిగేలా చేశారు. చింతమనేనిపై 2015లో ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచారు. అలాగే ఆటపాక పక్షుల కేంద్రం వద్ద అటవీ శాఖాధికారిపై దాడి, ఐసీడీఎస్‌లో పనిచేసే మహిళా అధికారులపై బెదిరింపులకు దిగడం, 2016 ఫిబ్రవరి 10న కానిస్టేబుల్ మధుపై దాడి ఘటనలకు చింతమనేని పాల్పడ్డారు.

కొల్లేరులో చేపలు మాయం

కొల్లేరులో చేపలను మాయం చేసిన ఘనత చింతమనేనిది. అటవీ శాఖ అధికారులను బెదిరించి మరీ కొల్లేరులో ఆక్రమణలకు దిగి చెరువులను స్థానిక టీడీపీ నేతలతో సాగు చేయించారు. అడ్డుకోవడానికి వెళ్లిన రెవెన్యూ, అటవీశాఖ అధికారులకు.. కొన్ని సమయాల్లో చెక్‌పోస్టుల వద్ద పోలీసులపై తన నోటికి, చేతికి పని చెప్పడంతో కేసులు నమోదైన ఘటనలు అనేకం. మొత్తం 1,860 ఎకరాల్లో చేపల చెరువులు పూర్తిగా చింతమనేని కనుసన్నల్లోనే సాగైనట్టు అంచనా. ఒక్క కొల్లేరులోనే సగటున రూ.వంద కోట్లకుపైగా దోచినట్లు సమాచారం. పెదవేగి మండలం పెదవేగి (సూర్యారావుపేట) లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేయకుండా దాదాపు 70 ఎకరాల్లో గ్రావెల్ దోచేశారు. పెదపాడు మండలం ఏపూరు, కలపర్రు గ్రామాల్లో మట్టిని కొల్లగొట్టారు.

నాలుకా.. తాటిమట్టా?

వైఎస్సార్‌సీపీకి పోలీసులు ఊడిగం చేస్తున్నారని నాడు రామోజీ రాతలు

- బెడిసికొట్టడంతో వేధిస్తున్నారంటూ నేడు ప్లేటు ఫిరాయింపు
- వైఎస్సార్‌సీపీ హయాంలోనే పోలీసుల సంక్షేమానికి పెద్దపీట
- 16 ఏళ్ల డిమాండ్ 16 రోజుల్లో పరిష్కారం
- అమరవీరుల పిల్లలకు 2 శాతం రిజర్వేషన్.. ఎస్సైలకు గెజిటెడ్ హోదా

ఫ్యాక్ట్ చెక్



సాక్షి, అమరావతి: 'అది నేనే... ఇది నేనే... నా చేతులతోనే పోలీసులపై బురద జల్లుతా... మళ్లీ నా నోటితోనే అయ్యో పోలీసులు అంటూ మొసలి కన్నీరు కారుస్తా' ఇదీ ఈనాడు రామోజీరావు పాత్రికేయ వికృత తాండవం. మొన్నటి వరకు రాష్ట్రంలో ఐపీఎస్ అధికారుల నుంచి కానిస్టేబుల్ వరకూ వైఎస్సార్‌సీపీకి ఊడిగం చేస్తున్నారంటూ యథేచ్ఛగా రాసేశారు. దీనిపై పోలీసు యంత్రాంగం తిరగబడడంతో రామోజీ వెంటనే ప్లేటు ఫిరాయించి పోలీసులను వైఎస్సార్‌సీపీ నేతలు వేధిస్తున్నారంటూ నిర్లజ్జగా మరో విషపు రోత రాత అచ్చేసేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన పోలీసు వ్యవస్థకు గౌరవాన్ని పెంచింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్న నిజాన్ని ఉద్దేశ పూర్వకంగా విస్మరించారు. చంద్రబాబు–పురందేశ్వరి కుట్రలో భాగంగా ఎన్నికల కమిషన్(ఈసీ)ను తప్పుదారి పట్టించేందుకు పోలీసులపై దుష్ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో ఈసీ ఒక డీఐజీ, అయిదుగురు ఎస్పీలను బదిలీ చేసింది. వారి స్థానంలో ఎన్నికల నియమావళి ప్రకారం కొత్త అధికారులను నియమించింది కూడా. అయినా సరే ఈనాడు రామోజీరావు శాంతించ లేదు. తనను సంప్రదించకుండా ఎస్పీలను ఈసీ నియమిస్తుందా అన్నట్టుగా పేట్రేగిపోయారు. 'పీళ్లా ఎస్పీలు..' అంటూ ఐపీఎస్ అధికారులను అవమానపరుస్తూ విషం కక్కారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలపై కూడా దుష్ప్రచారానికి పాల్పడ్డారు. దీనిపై ఐపీఎస్ అధికారుల సంఘం, పోలీసు అధికారుల సంఘం తీవ్రంగా స్పందించి ఈసీకి ఫిర్యాదు చేశాయి. దీంతో రామోజీ మరో కుట్రకు తెరతీశారు.

16 ఏళ్ల డిమాండ్ 16 రోజుల్లో పరిష్కారం

- బ్రిటిష్ కాలంలో ప్రవేశపెట్టిన తమ యూనిఫామ్‌లో మార్పులు చేయాలని ఆర్మ్‌డ్ రిజర్వుడ్(ఏఆర్), స్పెషల్ పోలీస్(ఏపీఎస్పీ) కానిస్టేబుళ్ల 16 ఏళ్లుగా చేస్తున్న డిమాండ్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 16 రోజుల్లో పరిష్కరిస్తూ జీవో జారీ చేశారు. బ్యారెట్ టోపీ స్థానంలో పీక్ టోపీని ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. కానిస్టేబుల్ నుంచి రిజర్వ్ ఎస్సై స్థాయివరకు నలువు రంగు విజిల్ కార్డ్‌ను తీసుకువచ్చింది. ఏఆర్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల విజిల్ కార్డ్‌తోపాటు పోలీస్ ఎంబ్లమ్ ఉన్న నలువు బకిల్ ఉన్న బెల్ట్‌ను యూనిఫామ్‌లో భాగం చేసింది.
- రాష్ట్రంలో ఎస్సైలకు గెజిటెడ్ అధికారి హోదా కల్పించాలన్న దీర్ఘకాలిక డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. కొత్త పీఆర్సీ ద్వారా ఆ మేరకు సిఫార్సు చేయనున్నట్టుగా ప్రకటించింది.
- పోలీసులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించేందుకు ఎస్ఎల్ఆర్, ఏఎస్ఎల్ఎస్ బిల్లులు చెల్లించేలా ఆర్థిక శాఖను ఆదేశించారు. వివిధ రిస్క్ అలవెన్స్‌లను మంజూరు చేయాలని ఆదేశించారు.
- 24 ఏళ్ల సర్వీసు ఇంక్రిమెంట్‌ను కొనసాగిస్తూనే 30 ఏళ్ల సర్వీసుకు ప్రత్యేకంగా ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని నిర్ణయించింది.
- ఏపీఎస్పీ నుంచి ఏఆర్‌కు మారే పోలీసులకు 6, 12, 18, 24 ఇంక్రిమెంట్లను మంజూరు చేయాలని నిర్ణయించింది.
- అమర వీరుల కుటుంబాల పిల్లలకు ఇంజినీరింగ్, వైద్య విద్య తదితర కోర్సుల్లో 2 శాతం రిజర్వేషన్ (ఇది వరకు 0.25 శాతం) కల్పించారు.

ఇతర ప్రయోజనాలు

- డీజీపీ, జిల్లా ఎస్పీ, పోలీస్ కమిషనరేట్లలో ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు.
- కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లా కేంద్రాల్లో పోలీసు ఆసుపత్రుల ఏర్పాటు.
- మహిళా పోలీసులకు అదనంగా ఏడాదికి 5 క్యాజువల్ లీవులు. చైల్డ్ కేర్ లీవులు 150 నుంచి 180 రోజులకు పెంపు.
- విధి నిర్వహణలో భాగంగా రాజధానికి వచ్చే మహిళా పోలీసులకు ప్రత్యేక వసతి సౌకర్యం.. ఎల్‌టీసీ సౌకర్యం పునరుద్ధరణ
- పోలీసు అధికారుల సంఘం తొలిసారిగా రాష్ట్ర జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో భాగం.

ప్రచారంలో పదనిసలు




ఎన్నికల ప్రచారంలో భాగంగా పిఠాపురంలో రజకుడి ఇంటి వద్ద బట్టలు ఇస్త్రీ చేసి ఆకట్టుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత



శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం దిరువ మల్లెలు గూడ గిరిజన గ్రామంలో గిరిజనులతో కలసి చింతపండు పిక్క తీస్తున్న పాతపట్నం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డి శాంతి

ఫైళ్లు మాయం చేసిన కుంభకోణం గుట్టు రట్టు

సీఐడీ చార్జ్‌షీట్‌లో పేర్కొన్న నిందితులు



- ఏ1: చంద్రబాబు, టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి
- ఏ2: కింజరాపు అచ్చెన్నాయుడు, టీడీపీ ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రి
- ఏ3: గంటా సుబ్బారావు, టీడీపీ ప్రభుత్వంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ-సీఈవో
- ఏ4: కె.లక్ష్మీ నారాయణ, టీడీపీ ప్రభుత్వంలో ఏపీఎస్ఎస్‌డీసీ డైరెక్టర్
- ఏ5: సీమెన్స్, డిజైన్‌టెక్, పీవీఎస్‌పీ స్కిల్కర్ తదితర కంపెనీల అధికారులు



2017లోనే కేంద్ర జీఎస్టీ అధికారులు పుణెలోని పలు షెల్ కంపెనీల్లో నిర్వహించిన సోదాల్లో ఏపీఎస్ఎస్‌డీసీకి సరఫరా చేసిన నకిలీ ఇన్వాయిస్‌లను గుర్తించి ఏపీ ఏసీబీ అధికారులకు సమాచారమిచ్చారు. దీనిపై విచారణ చేయకుండా ఏసీబీని చంద్రబాబు అడ్డుకున్నారు. ఆ వెంటనే ఏపీఎస్ఎస్‌డీసీ ఆఫీసులో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫైళ్లను మాయం చేశారు. 2019లో పుణెకి చెందిన ఓ సామాజిక కార్యకర్త ఈ కుంభకోణం గురించి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ ఆధ్వర్యంలో సిట్ నియమించింది. సిట్ దర్యాప్తులో చంద్రబాబు అవినీతి బాగోతం అంతా బట్టబయలైంది. సీఐడీ అధికారులు జర్మనీలోని సీమెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించగా అసలు తమకు ఆ ప్రాజెక్టు గురించే తెలియదని స్పష్టం చేసింది. డిజైన్ టెక్, ఇతర షెల్ కంపెనీల ద్వారా సాగించిన కుంభకోణాన్ని కూడా సిట్ అధికారులు ఛేదించారు. స్కిల్ కుంభకోణానికి కర్త కర్మ క్రియ అంతా చంద్రబాబే అన్నది నిర్ధారణ అయింది.

చంద్రబాబుకు 17ఏ కింద రక్షణ లభించదన్న సుప్రీం కోర్టు

స్కిల్ స్కామ్ కేసులో ఆధారాలతో సహా అడ్డంగా దొరికిన మాజీ సీఎం చంద్రబాబు 'సెక్షన్ 17ఏ'ను సాకుగా చూపిస్తూ విచారణను అడ్డుకునేందుకు పన్నిన పన్నాగం బెడిసికొట్టింది. సెక్షన్ 17ఏను తనకు వర్తింపజేస్తూ తనపై స్కిల్ స్కామ్‌లో తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసును కేంద్ర జీఎస్టీ విజిలెన్స్ విభాగం 2017లోనే నమోదు చేసింది కాబట్టి 2018 నవంబరు నుంచి అమలులోకి సెక్షన్ 17ఏ చంద్రబాబుకు వర్తించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో చంద్రబాబుకు హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని సీఐడీ దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణలో ఉంది.

స్కిల్ స్కామ్ ద్వారా టీడీపీ ఖాతాల్లోకి రూ.65.86కోట్లు.. చంద్రబాబుపై ఈడీ కన్ను

మద్యం కుంభకోణం కేసులో ఆ రాష్ట్ర సీఎం కేజ్రీవాల్ అరెస్టును సమర్థిస్తూ ఆ రాష్ట్ర హైకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు చంద్రబాబు వెన్నులో వణుకు పుట్టిస్తోంది. షెల్ కంపెనీల ద్వారా ఏ రాజకీయ పార్టీ అయినా అక్రమ నిధులు పొందితే అందుకు ఆ పార్టీ అధ్యక్షుడే బాధ్యత వహించాలని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో స్కిల్ స్కామ్‌కు కూడా ఇది వర్తిస్తుందని ఈడీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఎందుకంటే షెల్ కంపెనీల ద్వారా టీడీపీ ఖాతాల్లోకి రూ.65.86 కోట్లు మళ్లించినట్టు సీఐడీ ఆధారాలతోసహా నిర్ధారించింది. హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని నాలుగు బ్యాంకుల్లో టీడీపీ పేరిట ఉన్న నాలుగు బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ.65,86,47,510 మళ్లించారు. జూబ్లీ హిల్స్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచిలో టీడీపీకి మూడు ఖాతాలు ఉన్నాయి. ఆ మూడు ఖాతాల్లో వరుసగా రూ.4,81,60,587, రూ.25,31,31,352, 2,26,28,500 జమ చేశారు. హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని యూనియన్ బ్యాంక్ ఖాతాలో రూ.33,47,27,071 డిపాజిట్ చేశారు. 2016 నవంబరు నుంచి 2017 జనవరి మధ్యలో రూ.500, రూ.వేయినోట్ల కట్ల రూపంలో తీసుకువచ్చి మరీ జమ చేశారు. ఆ నిధులు తమకు ఎలా వచ్చాయన్నది టీడీపీ వెల్లడించలేదు. కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దును 2016, నవంబరులో ప్రకటించింది. ప్రజలు, సంస్థల దగ్గర ఉన్న పెద్ద నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు అనుమతించింది. భారీ డిపాజిట్లకు ఆదాయ మార్గాలు వెల్లడించాలని పేర్కొంది. కానీ ఆదాయ మార్గాలను వెల్లడించకుండానే టీడీపీ ఖాతాల్లోకి ఏకంగా రూ.65.86కోట్లు జమ చేయడం గమనార్హం. ఢిల్లీ హైకోర్టు తీర్పు నేపథ్యంలో స్కిల్‌స్కామ్‌లో చంద్రబాబును ఈడీ అరెస్ట్ చేసే అవకాశాలున్నాయని న్యాయ నిపుణులు చెబుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.



రైల్వే అనౌన్స్‌మెంట్‌లో టికెట్ కేటాయింపు వార్త!


ప్రయాణికులకు విజ్ఞప్తి.. ఫలానా రైలు.. ఫలానా ప్లాట్‌ఫాం మీదకు వస్తోంది... దయచేసి గమనించగలరు.. అంటూ సాధారణంగా.. రైల్వే స్టేషన్లలో అనౌన్స్‌మెంట్ వినిపిస్తుంటుంది. కానీ.. ఫలానా వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ కేటాయించారని ఎప్పుడైనా రైల్వే అనౌన్స్‌మెంట్‌లో విన్నారా.? నాలుగు దశాబ్దాల క్రితం అప్పటి ప్రజలు విన్నారు.. ఆశ్చర్యంగా ఉందా.? అక్షరాలా అది నిజం. 1985లో జరిగిన ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గం నుంచి రాజాసాగి అప్పల నర్సింహరాజు టికెట్‌కోసం హైదరాబాద్‌లో మకాం వేసి ప్రయత్నించి ఎప్పటికీ తేలకపోవడంతో గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో విశాఖకు తిరుగు ప్రయాణమయ్యారు. ట్రైన్ పిఠాపురం రైల్వే స్టేషన్‌లో ఆగింది. ఆ స్టేషన్‌లో భీమిలి నియోజకవర్గ టికెట్‌ను అప్పలనర్సింహరాజుకు కేటాయించారని.. వెంటనే బీ-ఫాం తీసుకునేందుకు తిరిగి హైదరాబాద్ రావాలని టీడీపీ అధిష్టానం సూచించిందంటూ రైల్వే అనౌన్స్‌మెంట్ వినిపించింది. వెంటనే ఆయన రైలు దిగి.. తిరిగి హైదరాబాద్ వెళ్లే రైలెక్కారు. ఆ ఎన్నికల్లో విజయం సాధించడమే కాకుండా రాజు మంత్రిగా పనిచేశారు.



'లోకల్ పవర్'పై రాజీవ్ ఆశ్చర్యం!

ఎంత పెద్ద దేశీ నేత అయినా.. స్థానిక బలం తెలుసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే భంగపాటు తప్పదనేందుకు ఉదాహరణ ఈ సంఘటన. తెలుగుదేశం పార్టీ హవా కొనసాగుతున్న రోజుల్లో 1985లో ఎన్టీఆర్ తన ప్రభుత్వాన్ని రద్దుచేసి మధ్యంతర ఎన్నికలకు వెళ్లారు. ఈ ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరఫున టికెట్‌కు గట్టిపోటీ నెలకొంది. అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ ఎలాగైనా కాంగ్రెస్‌ను గెలిపించాలనే ధ్యేయంతో స్వయంగా ఏపీకి చేరుకొని అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో పనిచేస్తున్న ప్రొఫెసర్ ఆకెళ్ల శేషగిరిరావు అభ్యర్థన మేరకు ఎవరినీ సంప్రదించకుండా ఆయనకు టికెట్ ఖరారుచేశారు. విషయం తెలుసుకున్న భీమిలి నేతలు ఒక్కసారిగా కంగుతిన్నారు. తమను కాదని కొత్త వ్యక్తికి టికెట్ ఇవ్వడంపై మండిపడ్డారు. రాజీవ్ ఆదేశించినా ఆకెళ్ల నామినేషన్‌కూ సహకరించలేదు. సొంత పార్టీ నుంచే ప్రతికూలత ఎదురవ్వడంతో రాజీవ్ ఎంపిక చేసిన వ్యక్తి టీడీపీ నేత నర్సింహరాజు చేతిలో ఓటమి చవిచూశారు.

మీకు తెలుసా



రెండు సార్లు రాష్ట్రపతిపాలన

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు రెండుసార్లు రాష్ట్రపతి పాలన విధించారు. ఏపీ ఏర్పడకముందు 1954లో టంగుటూరి ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా ఉన్న సందర్భంలో ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం శాసన సభలో నెగ్గడంతో ప్రకాశం పంతులు రాజీనామా చేశారు. 1954 నవంబర్ 15 నుండి 1955 మార్చి 29 వరకు రాష్ట్రపతి పాలన విధించారు. జై ఆంధ్ర ఉద్యమం సమయంలో 1973 జనవరి 17న అప్పటి ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు తన పదవికి రాజీనామా చేయడంతో రెండో సారి రాష్ట్రపతి పాలన విధించారు.

గ్రామీణ ప్రాంతమే లేని జిల్లా విశాఖ

2022లో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తరువాత విశాఖపట్నం జిల్లాలో అసలు గ్రామీణ ప్రాంతమే లేదు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని నగర ప్రాంతాన్ని విశాఖపట్నం జిల్లాగా, గ్రామీణ ప్రాంతాన్ని అనకాపల్లి జిల్లా, ఏజెన్సీ ప్రాంతాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లాగా విభజించారు. విస్తీర్ణం పరంగా (928చ.కి.మీ.) రాష్ట్రంలో అతి చిన్న జిల్లా ఇదే.

ఏపీలో 8 జిల్లాలకు వ్యక్తుల పేర్లు

రాష్ట్రంలో గతంలో ఉన్న 13 జిల్లాల్లో ప్రకాశం, పొట్టి శ్రీరాములు, వైఎస్సార్ జిల్లాలు వ్యక్తుల పేర్లతో ఉన్నాయి. జిల్లాల విభజన తర్వాత అల్లూరి సీతారామరాజు పేరును పాడేరు జిల్లాకు, నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) పేరు విజయవాడ జిల్లాకు, ప్రఖ్యాత వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమయ్య పేరుతో రాయచోటి కేంద్రంగా ఒక జిల్లా, పుట్టపర్తి కేంద్రంగా శ్రీ సత్యసాయి పేరుతో, అమలాపురం కేంద్రంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పాటయ్యాయి. మొత్తమ్మీద 26 జిల్లాలకు గాను ఎనిమిది జిల్లాలకు వ్యక్తుల పేర్లు ఉండడం విశేషం.

మన పిల్లలు ఇంగ్లిషు చదువులు చదివి పెద్ద ఉద్యోగాలు చేయాలి..
ఐఐటీ, ఐఐఎం వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో చదివి తమ ప్రతిభను చాటాలి..
కేవలం కార్పొరేట్ కళాశాలల విద్యార్థులకే ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలా?
ప్రభుత్వ బడుల్లో చదివే మన పిల్లలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశాలు కలేనా..
ఎన్నో ఏళ్ల నుంచి సామాన్య, పేద వర్గాల తల్లిదండ్రులను తొలిచే ఈ ప్రశ్నలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా సంస్కరణలతో సమాధానమిచ్చారు.
మన పిల్లలకు ఇంగ్లిషు మీడియం చదువుల్ని అందుబాటులోకి తెచ్చారు.
"ఒకటో తరగతి నుంచే ఇంగ్లిష్ మీడియం బోధన..
3వ తరగతి నుంచి సబ్జెక్టు టీచర్ విధానం..
1000 ప్రభుత్వ స్కూళ్లల్లో సీబీఎస్ఈ సిలబస్
2025 జూన్ నుంచి ఐబీ సిలబస్
మన చిన్నారులకు ట్యాబ్‌లతో డిజిటల్ బోధన" - సాక్షి, అమరావతి

మన ఇంగ్లిషు విద్యపై ప్రసంశల జల్లు

- ''ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బైలింగువల్ పాఠ్యపుస్తకాలను అందించడం గొప్ప పరిణామం- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ కితాబు..''
- ''ప్రాథమిక స్థాయి నుంచి నాణ్యమైన విద్య అందించడంలో పనితీరు అద్భుతంగా ఉంది: కేంద్ర పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్''
- ''మహారాష్ట్ర, ఒడిశా, అసోం, హరియాణా, ఛత్తీస్‌గఢ్, మిజోరాం, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, నాగాలాండ్, గుజరాత్, పుదుచ్చేరి, కేరళ, తెలంగాణ, అండమాన్ -నికోబార్, డామన్ డయ్యూ, దాద్రానగర్ హవేలీ విద్యాశాఖాధికారులు మన సంస్కరణలు తమ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలుకు సిద్ధం''
- ''అమెరికాలోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై జరిగిన ఉన్నత స్థాయి సదస్సులో 140 దేశాల విద్యావేత్తలు మన విద్యా సంస్కరణలపై ప్రశంసలు''

ఇంగ్లిష్ మీడియం

ఇదిగో.. మార్పు

జగన్ విజన్

- ఇదీ జగన్ బ్రాండ్ గవర్నెన్స్
- పేద విద్యార్థుల చెంతకు ఇంగ్లిష్ చదువులు
- ప్రభుత్వ బడుల్లో సీబీఎస్ఈ సిలబస్
- పిల్లలు అంతర్జాతీయంగా రాణించేలా 'టోఫెల్' శిక్షణ
- సంపన్నుల పిల్లలకే పరిమితమైన ఐబీ విద్య మన స్కూళ్లలో..
- ప్రస్తుత ప్రపంచంలో మన పిల్లలు రాణించేలా నైపుణ్య శిక్షణ
- అన్ని స్థాయిల్లోను యాక్టివిటీ బేస్డ్ పాఠ్యపుస్తకాల రూపకల్పన
- ఐటీ కోర్సుల్లో శిక్షణకు స్కిల్ ఎక్స్‌పర్ట్స్ నియామకం
- నిత్య జీవిత సమస్యలను అధిగమించేందుకు 'సంకల్పం' శిక్షణ



బోధన, పాఠ్యాంశాల్లో సంస్కరణలు

విద్యార్థుల్లో నేర్చుకునే తత్వం, జిజ్ఞాస పెంచేలా ప్రభుత్వం పాఠ్యాంశాల్లో సంస్కరణలు తీసుకొచ్చింది. 21వ శతాబ్దపు నైపుణ్యాలు అందిపుచ్చుకునేలా, ఫౌండేషనల్ అక్షరాస్యత ప్రోత్సాహం కోసం క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ అమలు చేస్తోంది. 3 నుంచి 10 తరగతుల విద్యార్థులకు సబ్జెక్ట్ టీచర్లను అందించారు. అన్ని పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల అవసరాలు తీర్చేందుకు దాదాపు 25 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారు. ఉపాధ్యాయుల్లో బోధనా సామర్థ్యాలు పెంచేందుకు, సీబీఎస్ఈ బోధనకు అనగుణంగా 'టీచర్ కెపాసిటీ బిల్డింగ్' శిక్షణ ఇచ్చారు. ఇందుకోసం ఇఫ్లూ, రివర్ సైడ్ లెర్నింగ్ సెంటర్లలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐబీ సిలబస్ బోధన ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఏడాది ఉపాధ్యాయులకు ఐబీ సిలబస్ బోధనపై శిక్షణకు చర్యలు ప్రారంభించారు. మరోపక్క విద్యార్థుల్లో నిర్మాణాత్మకమైన లైఫ్ స్కిల్స్, నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు, సమాజంలో ఉన్నత విలువలతో ఉన్నతంగా జీవించేందుకు ఉపయోగపడే నైపుణ్యాలను అందించేందుకు 'సంకల్పం' శిక్షణను సైతం ప్రభుత్వం అందిస్తోంది.

డిజిటల్ విద్య కోసం 8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు రూ.1,306 కోట్లతో 9,52,925 ఉచిత బైజూస్ కంటెంట్ ట్యాబ్‌ల పంపిణీ

ఆరో తరగతి నుంచి ఆపైన రూ.838 కోట్లతో ప్రతి తరగతిలోను 62 వేల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ),ప్రాథమిక పాఠశాలల్లో 45 వేల స్మార్ట్ టీవీల ఏర్పాటు

విద్యార్థుల చెంతకు డిజిటల్‌పాఠాలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 4 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ఉత్తమ కంటెంట్‌ను ఉచితంగా అందించేందుకు దేశంలోనే అతిపెద్ద ఎడ్ టెక్ కంపెనీ అయిన బైజూస్‌తో ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఈ కంటెంట్‌ను ఇంటర్ విద్యార్థులకు కూడా అందించడం విశేషం. ఎనిమిదో తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కలిపి 2021-22, 2022-23 విద్యా సంవత్సరాల్లో 9.53 లక్షల మందికి బైజూస్ కంటెంట్‌తో ఉచితంగా ట్యాబ్‌లు ఇచ్చి, విద్యార్థులు ఇంటి వద్ద కూడా డిజిటల్ పాఠాలు నేర్చుకునేలా చర్యలు తీసుకుంది. డిజిటల్ పాఠాలు ట్యాబ్స్‌తో పాటు 16 లక్షల మంది విద్యార్థులు తమ తల్లిదండ్రుల మొబైల్స్‌లో కూడా చూడడం విశేషం. ఏపీ ఈ పాఠశాల మొబైల్ యాప్, దీక్ష వెబ్‌సైట్, డీటీహెచ్ చానెళ్లు, యూట్యూబ్ చానెల్ వంటి వాటి ద్వారా నిరంతరం ప్రభుత్వం పాఠాలను అందిస్తోంది. దీంతో విద్యార్థులు ఎక్కడి నుంచైనా ఎప్పుడైనా చదువుకునే ఏర్పాటు చేసింది. సబ్జెక్టుల్లో సందేహాలను నివృత్తి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఏఐ' టెక్నాలజీతో పనిచేసే 'డౌట్ క్లియరెన్స్ బాట్' యాప్‌ను రూపొందించింది. ఇది ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్, టోఫెల్ శిక్షణలో ఎదురయ్యే క్లిష్టమైన సందేహాలను నివృత్తి చేస్తుంది.

సీబీఎస్ఈ బోధన

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు జాతీయ, అంతర్జాతీయంగా పోటీపడేలా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. అందుకు అనువైన బోధన కోసం మొదటి విడతగా ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం 1,000 పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధన ప్రారంభించింది. ఇప్పుడు తొమ్మిదో తరగతి చదువుతున్న ఈ స్కూళ్లలోని విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో తొలిసారి పదో తరగతి పరీక్షలు సీబీఎస్ఈ విధానంలో రాయనున్నారు. హైస్కూల్‌లో ఉత్తీర్ణులైన బాలికలు చదువు మానేయకుండా ప్రభుత్వం ప్రతి మండలంలో బాలికల కోసం ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేసింది. 292 ఉన్నత పాఠశాలలు బాలికల కోసం హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. మొత్తం 352 కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ ప్రవేశపెట్టారు. 2022-23 నుంచి 14 కో-ఎడ్ జూనియర్ కళాశాలలను బాలికల జూనియర్ కళాశాలలుగా మార్చారు. దీంతో మొత్తం 679 మండలాల్లో బాలికల కోసం ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల చొప్పున అందుబాటులోకి వచ్చింది.

మూడో తరగతి నుంచే టోఫెల్ శిక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేదింటి పిల్లలు ఉన్నత చదవులకు వచ్చేసరికి ఇంగ్లిష్ భాషపై పట్టు అవసరమని ప్రభుత్వం భావించి తెలుగు, ఇంగ్లిష్‌లో పాఠాలు మిర్రర్ ఇమేజ్ విధానంలో ముద్రించి బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం అందించింది. ఒకటో తరగతి నుంచే ఇంగ్లిషు బోధనను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లిష్‌పై పట్టు సాధించేలా, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచేందుకు అమెరికాకు చెందిన ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్)తో టోఫెల్ శిక్షణ అందిస్తోంది. టోఫెల్ ప్రైమరీలో 3 నుంచి 5 తరగతులకు, టోఫెల్ జూనియర్‌లో 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు శిక్షణ నిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 20 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల పిల్లలకు ఈ సదుపాయం లభించింది. ఈనెల 10వ తేదీన టోఫెల్ ప్రైమరీ పరీక్షను నిర్వహించగా 13,104 ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 3 నుంచి 5 తరగతుల విద్యార్థులు 4,17,879 మంది (92 శాతం) రాశారు. శుక్రవారం (ఏప్రిల్ 12)న జరిగిన టోఫెల్ జూనియర్ పరీక్షకు 5,907 పాఠశాలలకు చెందిన 11,74,338 మంది హాజరయ్యారు.

ప్రపంచ వేదికలపై మెరిసేలా ఐబీ విద్య

మన పేదింటి పిల్లలు ప్రపంచానికి దిక్సూచిగా మారాలన్న సీఎం జగన్ ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు సమున్నతంగా మారాయి. ఇంగ్లిష్ మీడియం బోధన, సీబీఎస్ఈ సిలబస్ అమలుతో ఆగిపోకుండా ప్రభుత్వ బడుల్లోకి ఇప్పుడు 'ఇంటర్నేషనల్ బాకలారియేట్ (ఐబీ) బోధనను కూడా తెస్తోంది. ఇప్పటిదాకా దేశంలో 210 వరల్డ్ క్లాస్ కార్పొరేట్ స్కూళ్లలో సంపన్నుల పిల్లలకు మాత్రమే చదువుకొనగలిగే ఐబీ బోధన 2025 జూన్ నుంచి ప్రారంభం కానుంది. తొలి ఏడాది ఒకటో తరగతి నుంచి ప్రారంభమై ఏటా ఒక తరగతి చొప్పున ఐబీ బోధన పెంచుతూ 2037 నాటికి +2 వరకు విద్యనందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. విద్యార్థులకు క్రిటికల్. లేటరల్, డిజైన్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ వంటి నైపుణ్యాలు అందించడంతోపాటు భవిష్యత్ రంగాల్లో రాణించేలా, ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి పొందేలా తీర్చిదిద్దాలని నిర్ణయించారు.

ఇంగ్లిష్ వ్యతిరేకులను చీపుర్లతో స్వాగతించండి

- ఇంగ్లిష్ మీడియం విద్యే జగన్‌ను గెలిపించబోతోంది
- ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం పెట్టాలని ఎప్పుడో గళమెత్తా
- వెంకయ్యనాయుడు, రమణ, చంద్రబాబు, బీజేపీ, పవన్‌ల పిల్లలను తెలుగు మీడియంలో చదివించాలి
- మేం మాత్రం మీరు అంటున్న దిక్కుమాలిన ఇంగ్లిష్‌లోనే చదువుకుంటాం
- 'సాక్షి'తో ప్రొఫెసర్ కంచ ఐలయ్య షెపర్డ్



'ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు భారతదేశానికే దిక్సూచిలా మారింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా విధానం భవిష్యత్తులో ప్రతీ ఒక్కరూ అనుసరించక తప్పదు. వద్దన్న వారికి చీపుర్లతో బుద్ధి చెప్పాలి' అని ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కంచ ఐలయ్య షెపర్డ్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లభాష అమలు, దాని ఫలాలపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పంచుకున్న అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

ఇంటర్వ్యూ

దేశాన్ని మార్చే విద్యా విధానం..

ఇంగ్లిష్ మీడియం కోసం 1990 నుంచి నేను గళం విప్పాను. మండలి బుద్ధప్రసాద్, ఏబీకే ప్రసాద్, చుక్కా రామయ్య.. వీళ్లంతా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అంటే నా మీద తీవ్ర స్థాయిలో విమర్శలతో దాడి చేశారు. ఈ విషయంలో సీఎం జగన్ చేసిన పోరాటం చాలా గొప్పది. ఆయన దేశాన్ని మార్చే విద్యా విధానం తీసుకొచ్చారు. మొత్తం బీజేపీ ప్రభుత్వ అజెండాను కూడా మార్చే శక్తి దానికుంది. నిజానికి గ్రామాల్లో నుంచి వచ్చే పిల్లలతో నగరాల్లోని పిల్లలు పోటీ పడలేరు. గ్రామీణ పిల్లలకు కేవలం కమ్యూనికేషన్ ఒక్కటే సమస్యగా ఉంటుంది. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల పిల్లలు బాగా మాట్లాడుతున్నారు. స్కూలు పిల్లల్ని బహిరంగ సభల్లో తెచ్చి మాట్లాడించిన నాయకుడ్ని నా జీవితంలో చూడలేదు. ఇంగ్లిష్ మీడియం విద్య జగన్‌ను గెలిపించబోతోంది. దీన్ని ఎవరూ ఆపలేరు. ఇటీవల రాహుల్ గాంధీకి కూడా చెప్పా. దేశమంతా ఆంధ్ర మోడల్ తీసుకురండి.. బీజేపీని ఓడించగలుగుతారు అని. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం, మ్యూజియంలను నేను అంబేడ్కర్ గుడి అంటాను. 2002లో నేను మా ఊర్లో గుడ్ షెపర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ పెట్టి.. లంబాడి కూలోళ్ల పిల్లలకు ఇంగ్లిష్ చదువులు చెప్పించాను. ఇప్పుడు అద్భుతంగా వాళ్లు ఇంగ్లిష్‌లో మాట్లాడుతున్నారు.

మీ పిల్లల్ని తెలుగు మీడియంలో చదివిస్తారా?

వెంకయ్యనాయుడు, రమణ, చంద్రబాబు, పవన్‌కు చెబుతున్నా. మీ ఆధ్వర్యంలో తెలుగు మీడియం స్కూల్స్ పెట్టించండి. మీ పిల్లల్ని, అగ్రకులాల పిల్లల్ని తెలుగు మీడియంలో బాగా చదివించండి. మేం మాత్రం దిక్కుమాలిన ఇంగ్లిష్‌లోనే చదువుకుంటాం. మీరు తెచ్చిన నారాయణ, చైతన్య, విజ్ఞాన్ స్కూల్స్‌ను తెలుగు మీడియంకు మార్చండి. ఇంగ్లిష్ మీడియం వద్దన్న వారికి ఊరూరా మహిళలు చీపుర్లతో స్వాగతం చెప్పండి. అలాంటి మేధావులకు అంటిన మురికిని వదిలించడానికి చీపుర్లతో శుభ్రం చేయండి.

తొలి మార్పు వైఎస్సార్ నుంచే

వైఎస్సార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక 2006లో 6 వేల స్కూల్స్‌లో ప్యారలల్ ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడితే పలువురు వ్యతిరేకించారు. ఈ విషయం మీద తనని కలిసిన వారిని మీ పిల్లలు, మనవళ్లు ఏ మీడియంలో చదువుతున్నారు అని వైఎస్సార్ ప్రశ్నించాక నోరు మూసుకున్నారు. మన పిల్లలకు ఇంగ్లిష్ చదువులు కావాలా? బీదల పిల్లలకి అక్కర్లేదా? అని వారందర్నీ మందలించారు. బహుశా అదే జగన్‌కు స్ఫూర్తినిచ్చి ఉంటుంది. పాదయాత్రలో పిల్లల పరిస్థితి చూసిన జగన్.. మేనిఫెస్టోలో ఇంగ్లిష్ విద్య గురించి పెట్టారు. ఇచ్చిన మాట ప్రకారం ఆయన ఇంగ్లిష్ మీడియం తేవడానికి ప్రయత్నిస్తే వెంకయ్యనాయుడు, చంద్రబాబు, పవన్‌లాంటి వాళ్లంతా వ్యతిరేకించారు. నా దృష్టిలో వాళ్లంతా యూజ్‌లెస్. కమ్యూనిస్టులు, నాతో పనిచేసిన వారు కూడా వ్యతిరేకించారు. ఆఖరికి అప్పట్లో సుప్రీంకోర్టు జడ్జిగా ఉన్న రమణ కూడా వీరికి జతకలిశారు. ఆయన తెలుగు భాష గురించి ఉపన్యాసాలు ఇస్తుంటారు. ఆయన అసలు ఏం తెలుగు రాశారని? వీళ్లందరికీ ఏం తెలుగు వచ్చని? లోక్ సత్తా జయప్రకాష్ నారాయణ్‌కు చెబుతున్నా. ఒక్కసారి ఆ పిల్లలతో ఇంగ్లిష్‌లో మాట్లాడు. మేధావితనం ముసుగు మాత్రమేనని నీకే తెలుస్తుంది.

విప్లవ సారథీ.. విజయీభవ

▶ మొదటి పేజీ తరువాయి

కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించడం గమనార్హం. ఒకే నోటిఫికేషన్ ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.34 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి రికార్డు సృష్టించారు. దేశ చరిత్రలోనే ఇంత భారీ ఎత్తున ఉద్యోగులను నియమించడం ఇదే ప్రథమం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 50 ఇళ్లకూ.. పట్టణాల్లో 75 నుంచి వంద ఇళ్లకు ఒకరి వంతున 2.65 లక్షల మంది వలంటీర్లను నియమించారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. మరో అడుగు ముందుకేసి వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే పెన్షన్ పంపిణీ చేసి చరిత్ర సృష్టించారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం ద్వారా పేదరిక నిర్మూలనకు విశేషంగా కృషి చేశారు. వివక్ష, లంచాలకు తావు లేకుండా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను 87 శాతం కుటుంబాలకు అందించారు. డీబీటీ రూపంలో రూ.2.70 లక్షల కోట్లను పేదల బ్యాంకు ఖాతాల్లో జమ చేసి.. దేశం మొత్తాన్ని మన వైపు చూసేలా చేశారు. నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్ల ప్రయోజనం చేకూర్చారు. డీబీటీ, నాన్ డీబీటీ కలిపి రూ.4.49 లక్షల కోట్ల లబ్ధి చేకూర్చారు. సంక్షేమాభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకున్న ప్రజలు వాటి ద్వారా జీవనోపాధులను మెరుగుపర్చుకున్నారు. రాష్ట్రంలో పేదరికం టీడీపీ సర్కార్ హయాంలో 2015-16లో 11.77 శాతం ఉంటే.. 2022-23 నాటికి అది 4.19 శాతానికి తగ్గడమే అందుకు నిదర్శనం.

ప్రభుత్వ ఆస్పత్రులకు మహర్దశ

సర్కారు దవాఖానాల్లో నాణ్యమైన వైద్యం అందించేందుకు అనువుగా నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేశారు. అందులో 53,466 ఉద్యోగాలను భర్తీ చేశారు. ఆరోగ్యశ్రీ వైద్య సేవల పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతోపాటు.. చికిత్స విధానాలను 1059 నుంచి 3,257కు పెంచారు. ఇప్పటిదాకా 44.78 లక్షల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.13 వేల కోట్ల విలువైన చికిత్సలు చేయించారు.

- ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కొత్తగా 17 కాలేజీలకు శ్రీకారం చుట్టి, ఈ విద్యా సంవత్సరంలో 5 కాలేజీలు ప్రారంభించారు. వచ్చే విద్యా సంవత్సరంలో మరో 5 ప్రారంభం కానున్నాయి. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటింటా జల్లెడ పడుతూ.. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, విలేజ్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారు.

సాగుకు సాయం

- ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా విత్తనం నుంచి విక్రయం దాకా రైతులకు సీఎం జగన్ దన్నుగా నిలిచారు. ఫలితంగా దేశంలో స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో వ్యవసాయ రంగం వాటా 17 నుంచి 18 శాతం ఉంటే.. గత నాలుగేళ్లలో దేశ జీడీపీలో మన రాష్ట్ర వ్యవసాయ రంగ వాటా 36 శాతంపైగా ఉండటం విశేషం.
- విప్లవాత్మక సంస్కరణలతో అన్ని రంగాల్లో రాష్ట్రం దూసుకెళ్తోంది. 2021-22లో 11.23 శాతం వృద్ధి రేటుతో దేశంలో ఏపీ అగ్రగామిగా నిలవడమే అందుకు నిదర్శనం.

సామాజిక న్యాయంలో టార్చ్ బేరర్

కేబినెట్‌లో 70 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చిన సీఎం వైఎస్ జగన్.. ఐదుగురు డిప్యూటీ సీఎం పదవుల్లో నాలుగు వర్గాలకే ఇచ్చారు. హోంశాఖ మంత్రిగా ఎస్సీ మహిళను నియమించారు. సామాజిక న్యాయం నినాదంతో అధికారంలోకి వచ్చిన మాయవతి, బీసీ వర్గానికి చెందిన అఖిలేష్ యాదవ్ అధికారంలో ఉన్నప్పుడు, ప్రస్తుతం తమిళనాడులో అధికారంలో ఉన్న స్టాలిన్ కూడా ఆ వర్గాలకు కేబినెట్‌లో ఇంతగా ప్రాధాన్యం ఇవ్వలేదని సామాజిక వేత్తలు చెబుతున్నారు. రాజ్యసభ, శాసన మండలి సభ్యులుగా అధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే అవకాశం ఇచ్చారు. స్థానిక సంస్థల్లోనూ ఆ వర్గాలకే పెద్దపీట వేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా నామినేటెడ్ పనుల్లో, పదవుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు.. మహిళలకు రిజర్వేషన్ చేస్తూ చట్టం చేసి మరీ ఆ వర్గాలకు పదవులు ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలు వెరసి మొత్తం 200 స్థానాలకుగాను వంద స్థానాల్లో అంటే సగం స్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులనే సీఎం జగన్ బరిలోకి దించారు.

ఇదే పాలన కోరుకుంటున్న జనం

ప్రతి ఇంట్లో వైఎస్ జగన్ మార్కు పాలన కనిపిస్తోంది. ప్రజల జీవన ప్రమాణాలు మరింతగా పెరగాలంటే.. రాష్ట్రం ప్రగతి పథంలో మరింతగా దూసుకెళ్లాలంటే విప్లవాత్మక పరిపాలన కొనసాగాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభలు.. ప్రస్తుతం మేమంతా సిద్ధం పేరుతో నిర్వహిస్తున్న బస్సు యాత్రలో సీఎం జగన్‌కు జనం నీరాజనాలు పలకడం ద్వారా తమ తీర్పును ముందే వెల్లడిస్తున్నారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇది వైఎస్సార్‌సీపీ మరో చారిత్రక విజయానికి బాటలు వేస్తుందని స్పష్టం చేస్తున్నారు. టైమ్స్‌నౌ-ఈటీజీ, జీన్యూస్ వంటి దఙనుకుపైగా జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేల్లోనూ వైఎస్సార్‌సీపీ సునామీ సృష్టించడం ఖాయమని వెల్లడైంది.

ప్రగతి పథంలో ఏపీ పయనం

- అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులతో మన పిల్లలు పోటీ పడేలా విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు ఇంగ్లిష్ మీడియంలో బోధనను ప్రవేశపెట్టారు. సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తూనే.. రానున్న రోజుల్లో ఐబీ సిలబస్‌ను అమల్లోకి తెచ్చేందుకు నడుం బిగించారు.
- అమ్మ ఒడి పథకం ద్వారా ఏటా తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నికర నమోదు నిష్పత్తి రేటు 98.73 శాతానికి పెరిగింది.
- జగనన్న విద్యా దీవెన ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనతో నాణ్యమైన ఉన్నత విద్యనందిస్తూ.. నైపుణ్యాభివృద్ధికి శిక్షణ ఇస్తున్నారు. తద్వారా 2022-23లో 1.2 లక్షల మంది క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు పొందారు. నైపుణ్యాలను మరింతగా పెంచేందుకు ఇప్పుడు ఎడెక్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. విద్యా రంగంపై ఉద్యోగుల జీతభత్యాలు కాకుండా రూ.74 వేల కోట్లు ఖర్చు చేశారు.

పారిశ్రామికాభివృద్ధికి ఊతం

- పారిశ్రామికాభివృద్ధికి ఊతమిచ్చేలా పారదర్శక విధానాన్ని సీఎం వైఎస్ జగన్ అమల్లోకి తెచ్చారు. సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో ప్రతి ఏటా రాష్ట్రం దేశంలో అగ్రగామిగా నిలవడమే అందుకు తార్కాణం.
- పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే క్రమంలో.. కొత్తగా నాలుగు పోర్టులతోపాటు పది ఫిషింగ్ హార్బర్‌లు, మూడు ఇండస్ట్రియల్ కారిడార్‌లు, పది ఇండస్ట్రియల్ నోడ్స్‌ను అభివృద్ధి చేస్తున్నారు. దాంతో రాష్ట్రంలో భారీ ఎత్తున పెట్టుబడి పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఉత్సాహం చూపుతున్నారు.
- టీడీపీ హయాంలో రూ.32,803 కోట్లు పెట్టుబడులు వస్తే.. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.1.03 లక్షల కోట్ల పెట్టుబడులు రావడమే అందుకు నిదర్శనం. పారిశ్రామికాభివృద్ధిలో రాష్ట్రం టీడీపీ సర్కార్ హయాంలో 2018-19లో 22వ స్థానంలో నిలిస్తే.. ఇప్పుడు మూడో స్థానంలో నిలిచింది. పారిశ్రామికాభివృద్ధితో ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా పెరిగాయి.

స్టేట్ స్కాన్

ఉత్తరప్రదేశ్. లోక్‌సభ ఎన్నికలనగానే అందరి మదిలో మెదిలే రాష్ట్రం. రాజకీయంగానే కాక జనాభాపరంగా, భౌగోళికంగానూ దేశంలో యూపీది ఎప్పుడూ కీలక పాత్రే. 2024 లోక్‌సభ ఎన్నికల ముంగిట ఇక్కడి రాజకీయ ముఖచిత్రం కూడా కొత్త మలుపులు తిరుగుతోంది. అయోధ్య రామమందిరం కల సాకారం చేసి హిందువుల మనసుల్లో గుడి కట్టుకున్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి మరింత దూకుడు పెంచగా, విపక్ష ఇండియా కూటమి కూడా వ్యూహాలకు పదును పెడుతోంది. యూపీ కుంభస్థలాన్ని కొట్టిన పార్టీ హస్తినలో పాగా వేసినట్లేననేది నానుడి.

యూపీ... హస్తినకు గేట్‌వే

దేశంలోనే అత్యధిక లోక్‌సభ స్థానాలు

యూపీని కొల్లగొట్టే పార్టీదే అధికారం


2014, 2019ల్లో పూర్తిగా బీజేపీ హవాయే

కలిసొస్తున్న మోదీ, యోగి 'డబుల్ ఇంజన్'

ముస్లిం ఓట్లపైనే ఇండియా కూటమి ఆశలు

పూర్తయిన కాంగ్రెస్, ఎస్పీ సీట్ల పంపకం







దేశమంతటా ఐదేళ్లకోసారి జరిగే ప్రజాస్వామిక పండుగకు మరోసారి రంగం సిద్ధమైంది. 18వ లోక్‌సభ ఎన్నికల వేడి పరాకాష్టకు చేరింది. హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి అన్ని అస్త్రాలకూ పదును పెట్టుకుంటోంది. మోదీ మేజిక్‌కు ఈసారైనా అడ్డుకట్ట వేయాలని విపక్షాలన్నీ శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. కాంగ్రెస్ సారథ్యంలో ఇండియా కూటమి పేరుతో ఎన్డీఏను ఢీకొట్టేందుకు సిద్ధమయ్యాయి. ఇరు కూటముల మధ్య నెలన్నరకు పైగా హోరాహోరీ యుద్ధం ఖాయంగా కనిపిస్తోంది. ఈ క్రమంలో ఆయా పార్టీల వ్యూహాలు, ప్రతివ్యూహాలు, ప్రచారాలు, నేతల ప్రసంగాలు, ఎన్నికల పదనిసలు, గత ఎన్నికల తీరుతెన్నులు, ఫలితాలు తదితరాలతో కూడిన లోక్‌సభ ఎన్నికల

సమగ్ర కవరేజీ...
నేటి నుంచే...

దేశ రాజకీయాలకు గుండెకాయ వంటి యూపీలో సత్తా చాటేందుకు పార్టీలన్నీ అస్త్రాలను రెడీ చేసుకుంటున్నాయి. దేశంలోనే అత్యధికంగా ఏకంగా 80 లోక్‌సభ స్థానాలున్న రాష్ట్రం యూపీ. దేశాన్నేలే నాయకులను తీర్చిదిద్దడంలోనూ ఈ రాష్ట్రానిది ఘన చరిత్రే. ఏకంగా 8 మంది ప్రధానులను అందించింది యూపీ. ఈ రికార్డుకు మరే రాష్ట్రమూ దరిదాపుల్లో కూడా లేదు...

ఈ ఎన్నికలు అత్యంత కీలకం...

ఒకప్పుడు కాంగ్రెస్, సమాజ్‌వాదీ, బహుజన సమాజ్ పార్టీ వంటి పార్టీలకు కంచుకోటగా ఉన్న యూపీలో 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పూర్తిస్థాయిలో పాగా వేసింది. అనంతరం అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రత్యర్థులను మట్టి కరిపించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో అత్యధిక సీట్లు గెలుచుకుని తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. యూపీలో క్లీన్ స్వీప్ ద్వారానే బీజేపీ వరుసగా రెండుసార్లు బంపర్ మెజారిటీతో హస్తిన పీఠాన్ని చేజిక్కించుకోగలిగింది. కాంగ్రెస్ గత ఎన్నికల్లో ఒంటరి పోరు చేసి కకావికలమైంది. మాయావతి నేతృత్వంలోని బీఎస్పీ, అఖిలేశ్ యాదవ్ సారథ్యంలోని ఎస్పీ కలిసి పోటీ చేసినా ప్రభావం చూపలేకపోయాయి. బీజేపీ హవాలో చిన్నాచితకా పార్టీలు సోదిలో కూడా లేకుండా పోయాయి. ఈసారి కూడా యూపీలో సత్తా చాటాలని బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. ఎన్నికల షెడ్యూలైనా రాకుండానే తొలి విడతలో అభ్యర్థులను ప్రకటించిన 195 సీట్లలో ఏకంగా 51 స్థానాలు యూపీ నుంచే ఉండటం విశేషం! ఎస్పీ ఈసారి విపక్ష ఇండియా కూటమి భాగస్వామిగా కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేస్తోంది. 2014లో యూపీలో ఏకంగా 71 సీట్లు గెలిచిన బీజేపీ 2019లోనూ 62 స్థానాలు నెగ్గింది. ఎన్డీఏ భాగస్వామి అప్నాదళ్(ఎస్) 2 సీట్లు గెలిచింది. బీఎస్పీ, ఎస్పీ, రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్‌ఎల్‌డీ)తో కూడిన మహా కూటమి 15 సీట్లకే పరిమితమైంది. బీఎస్పీ 38 స్థానాల్లో పోటీ చేసి 10 సీట్లలో విజయం సాధించగా, ఎస్పీ 37 సీట్లలో పోటీ చేసి ఐదే నెగ్గింది. ఆర్‌ఎల్‌డీ 3 సీట్లలోనూ మట్టికరిచింది. 67 సీట్లలో పోటీ చేసిన కాంగ్రెస్ ఒకే ఒక్క స్థానంతో ఘోర పరాజయం మూటగట్టుకుంది. కేవలం సోనియాగాంధీ మాత్రమే రాయ్‌బరేలీలో నెగ్గారు. అతి పెద్ద రాష్ట్రం కావడంతో యూపీలో ఈసారి మొత్తం ఏడు దశల్లోనూ పోలింగ్ జరుగుతోంది.

అయోధ్య.. బీజేపీ బ్రహ్మాస్త్రం

ఈసారి 400 పైగా లోక్‌సభ స్థానాలే లక్ష్యంగా బీజేపీ ముందునుంచే చకచకా పావులు కదిపింది. అయోధ్య రామమందిర కలను సాకారం చేయడం హిందువుల ఓట్లను కొల్లగొట్టడం ఖాయమని నమ్ముతోంది. ప్రధాని మోదీ మరోసారి వారణాసి నుంచి పోటీ చేయడం ఎప్పట్లాగే మరింతగా కలిసొస్తుందని భావిస్తోంది. రాష్ట్రంలోనూ బీజేపీ సర్కారే ఉండటం, మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసి, వేలాది కోట్లతో భారీ ఎత్తున అభివృద్ధి కార్యకలాపాలను చేపడుతుండటమూ బీజేపీకి కలిసొచ్చేదే. యూపీలో రెండుసార్లు బీజేపీ జెండా రెపరెపలాడించిన సీఎం యోగి ఆదిత్యనాథ్ పార్టీకి అదనపు బలం. జాట్ల మద్దతు దండిగా ఉన్న మాజీ ప్రధాని చౌధరి చరణ్ సింగ్ మనుమడు జయంత్ నేతృత్వంలోని ఆర్‌ఎల్‌డీ ఇండియా కూటమికి గుడ్‌బై చెప్పి ఎన్డీఏలో చేరడం కాషాయదళంలో కొత్త జోష్ నింపింది. చరణ్ సింగ్‌కు భారతరత్న ప్రకటనతో జాట్ల ఓట్లు ఎన్డీఏకేనని బీజేపీ భావిస్తోంది. మరో భాగస్వామి అప్నాదళ్ (ఎస్)కు యూపీలో మంచి పట్టుంది. ప్రధాని మోదీ ఇప్పటికే రాష్ట్రంలో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఆయనకు తోడు రాజ్‌నాథ్‌సింగ్, సీఎం యోగితో సహా పలువురు కేంద్ర మంత్రులు కూడా కలియ దిరుగుతున్నారు.

'ఇండియా' కూటమి పోటీనిచ్చేనా?


విపక్ష 'ఇండియా' కూటమి యూపీలో ఇంకా కాలూచేయీ కూడదీసుకునే పనిలోనే ఉంది. కూటమి భాగస్వాముల్లో ఎస్పీ 63 సీట్లలో, కాంగ్రెస్ 17 సీట్లలో పోటీ చేసేలా ఒప్పందం కుదిరింది. సోనియా రాజ్యసభకు వెళ్లడంతో రాయ్‌బరేలీ నుండి ప్రియాంక పోటీ చేసే అవకాశం కన్పిస్తోంది. 2019 పరాజయం నేపథ్యంలో అమేథీలో రాహుల్ గాంధీ ఈసారి బరిలో దిగుతారో, లేదో చూడాలి. ఈ రెండు తప్ప మిగతా 15 స్థానాలకూ కాంగ్రెస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది. వెనకబడ్డ, దళిత, మైనారిటీ వర్గాలపై అఖిలేశ్ బాగా దృష్టి పెట్టారు. కానీ గత ఎన్నికల సరళిని బట్టి చూస్తే, యాదవేతర ఓబీసీలు, జాతవేతర దళిత ఓటర్లను బీజేపీ తనవైపు తిప్పుకునేలా కనిపిస్తోంది. ఇక ఆర్‌ఎల్‌డీ గుడ్‌బై చెప్పడం ఇండియా కూటమికి ఎదురుదెబ్బే. బీఎస్పీ ఈసారి ఒంటరి పోరుకు సిద్ధమైంది. ఇవన్నీ బీజేపీకి మరింత కలిసొచ్చే అవకాశముందని విశ్లేషకుల అంచనా.

సర్వేలు ఏమంటున్నాయి...?

యూపీలో ఎన్డీఏ కూటమికి ఏకంగా 70 నుంచి 72 సీట్లు రావచ్చని పలు ఒపీనియన్ పోల్స్ అంచనా వేస్తున్నాయి. ఇండియా కూటమి ఆరేడు స్థానాలకు మించకపోవచ్చని చెబుతున్నాయి.

ముస్లింల రూటెటు?

యూపీ జనాభాలో 19% ఉన్న ముస్లింల ఓట్లపై విపక్షాలు ప్రధానంగా గురి పెడుతున్నాయి. 24 లోక్‌సభ సీట్లలో వీరు 20 నుంచి ఏకంగా 50 శాతం దాకా ఉన్నారు. దాంతో ఆ స్థానాల్లో వారు కీలకం కానున్నారు. ఈసారి ఎస్పీ, కాంగ్రెస్ జట్టు కట్టేందుకు ముస్లిం ఫ్యాక్టర్ కూడా ప్రధాన కారణమే. 2014, 2019ల్లో అవి విడిగా పోటీ చేయడంతో ముస్లిం ప్రాబల్య స్థానాల్లో బీజేపీ బాగా లాభపడింది. 2019లో ఎస్పీ, బీఎస్పీ నెగ్గిన స్థానాల్లో ముస్లింల ప్రాబల్యమున్నవే ఎక్కువ! రాహుల్ భారత్ జోడో యాత్ర, అఖిలేశ్ పీడీఏ (వెనుకబడిన, దళిత, మైనారిటీ) యాత్రలు యూపీలో ముస్లిం ప్రాబల్య జిల్లాల్లోనే సాగాయి.



- సాక్షి, నేషనల్ డెస్క్

పరిచయం



రాజకీయ కవయిత్రి

కనిమొళి బహుముఖ ప్రజ్ఞాశాలి

కనిమొళి కరుణానిధి.. బహుముఖ ప్రతిభావంతురాలైన రాజకీయవేత్త, కవి, పాత్రికేయురాలు, ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) సభ్యురాలు. తూత్తుక్కుడి నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమె దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు.

చురుకైన విద్యార్థి...

కనిమొళి చిన్నప్పటి నుంచే చురుకైన విద్యార్థి. బాల్యంలో తండ్రితో పెద్దగా గడపలేకపోయినా.. ఆయనకు మాత్రం ప్రియమైన కూతురే. కనిమొళి పుట్టిన తరువాతే ముఖ్యమంత్రి పదవి దక్కడంతో అది ఆమె తెచ్చిన అదృష్టమేనని కరుణానిధి భావించేవారు. తండ్రి తన దగ్గరలేని బాధను కనిమొళి కవిత్వంగా మలిచారు. అది చదివి ఆయన కదిలిపోయారు. అలా తండ్రీకూతుళ్లను సాహిత్యం మరింత దగ్గర చేసింది. కనిమొళి క్రియాశీల రాజకీయాలకు దూరంగా పెరిగారు. 2001లో జయలలిత హయాంలో కరుణానిధిని అరెస్టు చేసినప్పుడు తండ్రి పక్కన నిలబడి తొలిసారి ప్రముఖంగా బయటకు కనిపించారు. నాటినుంచీ ఆయన గళంగా మారిపోయారు. తండ్రి బహుముఖ ప్రజ్ఞకు కనిమొళి అప్రకటిత వారసురాలు. దానికి తోడు ఇంగ్లిష్ బాగా మాట్లాడతారు. దాంతో కరుణానిధి ఢిల్లీలో పెద్దలెవరినీ కలిసినా వెంట కనిమొళి ఉండేవారు. కనిమొళి ఢిల్లీ రాజకీయాల్లో, స్టాలిన్ రాష్ట్ర రాజకీయాల్లో చురుగ్గా ఉండేలా కరుణానిధి ముందుచూపుతో వ్యవహరించారు. 1982లో జయలలిత క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించిన వేదికపైనే 2008 జూన్‌లో కనిమొళితో డీఎంకే తొలి మహిళా సమ్మేళనం నిర్వహించారు. అలా ఆమెను అగ్రనాయకురాలిగా నిలబెట్టే ప్రయత్నాలు చేశారు. కనిమొళిని జయలలితకు కౌంటర్‌గా కరుణానిధి చూశారు. వారిద్దరికీ సారూప్యమూ ఉంది. ఇద్దరూ ఒకే పాఠశాలలో చదువుకున్నారు. జర్నలిస్టులుగా పనిచేశారు. రాజ్యసభ సభ్యులుగానే రాజకీయ జీవితం ప్రారంభించారు.

రాజకీయాల్లో...

కనిమొళి 2007లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ, విదేశీ వ్యవహారాలు, గ్రామీణాభివృద్ధి కమిటీ, హోమ్ వ్యవహారాల వంటి పలు కమిటీల్లో చురుగ్గా పనిచేసి ఆకట్టుకున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ జనరల్ అసెంబ్లీ సభ్యురాలిగా చేశారు. 2013లో రెండోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2018లో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు అందుకున్నారు. 2019లో తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టారు. తూత్తుక్కుడి నుంచి బీజేపీ అభ్యర్థి తమిళిసై సౌందరరాజన్‌పై ఏకంగా 3,47,209 ఓట్ల మెజారిటీతో గెలిచారు.

సక్సెస్‌ఫుల్ జర్నలిస్టు..

కనిమొళి సక్సెస్‌ఫుల్ జర్నలిస్టు కూడా. ప్రముఖ ఆంగ్ల దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా చేశారు. తమిళ వారపత్రిక 'కుంగుమం' సంపాదకురాలిగా వ్యవహరించారు. సింగపూర్‌కు చెందిన 'తమిళ మురసు' వార్తాపత్రికకూ ఫీచర్స్ ఎడిటర్‌గా సేవలందించారు. తమిళంలో కవిత్వం రాశారు. తమిళ కవిత్వాన్ని ఇంగ్లిష్‌లోకి అనువదించారు. ఆమె రచనలు ఇంగ్లిష్, మలయాళం, కన్నడ, తెలుగు భాషల్లోకి అనువాదమయ్యాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

గతం



ఆరంభం అదిరింది

తొలి ఎన్నికల ఫలితాలొచ్చేదాకా భారత్ రాజ్యాంగబద్ధ రాచరిక దేశంగానే కొనసాగింది! లార్డ్ మౌంట్‌బాటెన్ గవర్నర్ జనరల్‌గా కొనసాగారు. నెహ్రూ సారథ్యంలోని రాజ్యాంగ సభే మధ్యంతర పార్లమెంటుగా వ్యవహరించింది. ఎందుకంటే స్వాతంత్ర్యం సిద్ధించిన కొన్నేళ్ల దాకా ఎన్నికలు ఎలా నిర్వహించాలన్న దానిపై ఓ స్పష్టతంటూ లేదు. నియమ నిబంధనలు గానీ విధివిధానాలు గానీ లేవు. అంబేడ్కర్ సారథ్యంలోని డ్రాఫ్టింగ్ కమిటీ రూపొందించిన రాజ్యాంగం 1949లో ఆమోదం పొంది 1950 జనవరి 26న అమల్లోకి వచ్చాకే ప్రజా ప్రాతినిధ్య చట్టం ద్వారా ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓ స్పష్టత ఏర్పడింది. ఆ వెంటనే తొలి ఎన్నికల నిర్వహణకు సుదీర్ఘ కసరత్తు మొదలైంది. ఆ క్రమంలో ఎన్నో సమస్యలు. మరెన్నో సవాళ్లు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలకు పోలింగ్ సిబ్బందిని, సామగ్రిని చేర్చడమైతే పెద్ద యజ్ఞాన్నే తలపించింది. ఇలాంటి అనేకానేక సవాళ్లను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా ముగిసింది.

స్వాతంత్ర్యం వచ్చి అప్పటికి ఐదేళ్లు కూడా దాటలేదు. దేశాన్ని కుదిపేసిన విభజన తాలూకు గాయాల పచ్చి ఇంకా ఆరనే లేదు. ఎటు చూసినా ఇంకా బాలారిష్టాలే. పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న అనేకానేక సమస్యలే. వయోజనుల్లో చదవను, రాయను వచ్చిన వారి సంఖ్య చూస్తే అతి స్వల్పం. ఇలా... ఒకటా, రెండా! 1952లో జరిగిన తొలి సాధారణ ఎన్నికలకు ఎటు చూసినా సవాళ్లే. ఇన్ని పెను సవాళ్లనూ విజయవంతంగా అధిగమిస్తూ ఆ ఎన్నికలు సూపర్‌హిట్‌గా నిలిచాయి. దాంతో... ఇది అయ్యేదా, పొయ్యేదా అంటూ పెదవి విరిచిన ఎంతోమంది పాశ్చాత్య విమర్శకుల నోళ్లు మూతలు పడ్డాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

పార్టీలు, అభ్యర్థులకు గుర్తులు

పార్టీలకు గుర్తులు కేటాయించాలని తొలి సార్వత్రిక ఎన్నికలప్పుడే ఈసీ నిర్ణయించింది. ఆలయం, ఆవు, జాతీయ పతాకం, రాట్నం వంటి సున్నితమైన గుర్తులు కాకుండా సులభంగా గుర్తించే ఇతర గుర్తుల వైపు మొగ్గు చూపింది. కాంగ్రెస్ అనగానే గుర్తుకొచ్చే హస్తం గుర్తు ఆ పార్టీకి 1980లో వచ్చింది. 1952లో కాంగ్రెస్ కాడెద్దుల గుర్తుపై పోటీ చేసింది. విడిపోయిన వేళ్లతో కూడిన హస్తం గుర్తు ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ (రుయ్‌కార్ గ్రూప్)కు దక్కడం విశేషం! సోషలిస్ట్ పార్టీకి చెట్టు, కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీకి గుడిసె, అఖిల భారతీయ రామరాజ్య పరిషత్‌కు ఉదయించే సూర్యుడు వంటి గుర్తులు దక్కాయి.

ఫలితాలిలా...

భారత జాతీయ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)తో పాటు సోషలిస్టు పార్టీ, కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ, అఖిల భారతీయ హిందూ మహాసభ వంటి మొత్తం 53 పార్టీలు తొలి ఎన్నికల్లో పోటీ చేశాయి. అయితే అనూహ్యమేమీ జరగలేదు. ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సారథ్యంలోని కాంగ్రెసే విజయం సాధించింది. 45 శాతానికి పైగా ఓట్లతో 489 స్థానాలకు గాను ఏకంగా 364 చోట్ల నెగ్గింది. దేశ తొలి ఎన్నికైన ప్రధానిగా కూడా నెహ్రూయే నిలిచారు. కమ్యూనిస్టు పార్టీ 16 స్థానాలు నెగ్గి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది.



తాను ఓటేయ్యాల్సిన అభ్యర్థి తాలూకు బ్యాలెట్ బాక్సును వెతుక్కుంటున్న ఓటర్

అంబేడ్కర్‌కు ఓటమి

రాజ్యాంగ రూపశిల్పి బీఆర్ అంబేడ్కర్‌కు తొలి ఎన్నికలు చేదు అనుభవమే మిగిల్చాయి. నార్త్ సెంట్రల్ బోంబే స్థానం నుంచి షెడ్యూల్ట్ క్యాస్ట్ ఫెడరేషన్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన తన సహాయకుడే అయిన కాంగ్రెస్ అభ్యర్థి నారాయణసబోద కజ్రోల్కర్ చేతిలో 15,000 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు! సోషలిస్ట్ పార్టీ మద్దతున్నా సీపీఐ అభ్యర్థి డంగే అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా బలంగా ప్రచారం చేశారు. దీనికి నెహ్రూ గాలి తోడవడంతో కజ్రోల్కర్ నెగ్గారు. 1954లో బండారా లోక్‌సభ స్థానం ఉప ఎన్నికల్లోనూ మరోసారి కాంగ్రెస్ చేతిలో ఓటమి పాలయ్యారు. చివరికి జన్‌సంఘ్ సాయంతో అంబేడ్కర్ రాజ్యసభలో అడుగుపెట్టారు.

ఒకే ఒక్కడు...

తొలి ఎన్నికల క్రతువు దిగ్విజయంగా సాగిందంటే అందుకు ప్రధాన కారకుడు దేశ తొలి ప్రధాన ఎన్నికల కమిషనర్ సుకుమార్ సేన్. ఇండియన్ సివిల్ సర్వీస్ అధికారి అయిన ఆయన 1950లో సీఈసీగా బాధ్యతలు చేపట్టారు. అనేక ప్రతికూలతలను అధిగమిస్తూ దేశాన్ని ఎన్నికలకు సన్నద్ధం చేశారు. ఏకంగా 36 కోట్ల జనాభా, 17 కోట్ల పైచిలుకు అర్హులైన ఓటర్లు! వారందరికీ ఓటరు కార్డుల జారీ, ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్ల వంటి అనేకానేక సవాళ్లను సేన్ విజయవంతంగా ఎదుర్కొన్నారు. 84 శాతానికి పైగా ప్రజలు నిరక్షరాస్యులే కావడంతో వారిని గుర్తించి, ఓటర్లుగా నమోదు చేయించడమే ఓ భారీ యజ్ఞాన్ని తలపించింది. 1951 జనగణన ఆధారంగా లోక్‌సభ స్థానాలను ఖరారు చేశారు. రాజస్తాన్‌లోని జైసల్మేర్, జోధ్‌పూర్ వంటి ప్రాంతాలకైతే ఎన్నికల సామగ్రి తరలింపునకు ఒంటెలను వాడాల్సి వచ్చింది!



1952లో భారత్‌లో తొలి సాధారణ ఎన్నికలు

పెను సవాళ్లను అధిగమిస్తూ దిగ్విజయంగా నిర్వహణ


1952 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు	
మొత్తం లోక్‌సభ స్థానాలు 489	
పార్టీ	స్థానాలు
కాంగ్రెస్	364
సీపీఐ	16
సోషలిస్ట్ పార్టీ	12
కిసాన్ మజ్దూర్ పార్టీ	9
పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్	7
ఇతరులు	44
స్వతంత్రులు	37

- దేశ తొలి ఎన్నికల ప్రక్రియ 1951 అక్టోబర్ 25న మొదలైంది. 1952 ఫిబ్రవరి 21 దాకా ఏకంగా నాలుగు నెలల పాటు కొనసాగింది.
- అప్పట్లో మొత్తం 489 లోక్‌సభ స్థానాలుండేవి.
- 17.3 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారు.
- 53 పార్టీల తరఫున 1,874 మంది బరిలో నిలిచారు.
- అప్పట్లో భారత్‌లో అక్షరాస్యత కేవలం 16.6 శాతమే!
- దేశవ్యాప్తంగా 1,32,560 పోలింగ్ స్టేషన్లు, 1,96,084 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.
- ముందుగా హిమాచల్‌ప్రదేశ్‌లో తొలి దశలో పోలింగ్ జరిగింది.
- మొత్తమ్మీద 51 శాతం పోలింగ్ నమోదైంది. 8,86,12,171 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- అప్పట్లో ఓటరుగా నమోదయ్యేందుకు కనీస వయో పరిమితి 21 ఏళ్లుగా ఉండేది.
- అప్పటికి ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఓటింగ్ ప్రక్రియ 1952 ఎన్నికలు రికార్డులకెక్కాయి. నాటినుంచి నేటిదాకా ఈ రికార్డు భారత్‌పేరిటే కొనసాగుతూ వస్తోంది.

డాటరాఫ్, వైఫాఫ్...!

ఓటర్ల నమోదు సందర్భంగా ఓ సన్నివేశం అప్పట్లో పరిపాటిగా మారింది. ఎన్నికల సిబ్బందికి తమ పేరు చెప్పేందుకు మహిళలు ససేమిరా అనేవారు. అపరిచితులకు తమ పేర్లను చెప్పేందుకు వారు వెనుకాడేవారు. ఫలానా వారి భార్య అనో, కూతురు అనో మాత్రమే చెప్పేవారు. దాంతో విధిలేక ఓటర్ లిస్టులో వారి పేర్లను కూడా అలాగే నమోదు చేయాల్సి వచ్చింది. కానీ ఇలా పేర్లు లేకుండా ఓటరు కార్డులు జారీ చేసేందుకు ఈసీ నిరాకరించింది. అసలు పేర్లతో ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. నాడు 8 కోట్ల మహిళా ఓటర్లు ఉంటే, 20–80 లక్షల మంది తమ అసలు పేర్లను వెల్లడించేందుకు అంగీకరించలేదు. దాంతో వాటిని ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని ఈసీ నిర్ణయించింది. నాడు తీసుకున్న నిర్ణయం కఠినమైనదే అయినా, ఫలితాలను ఇప్పుడు చూస్తున్నామని, పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొంటున్నట్టు ఢిల్లీ మాజీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ చంద్రభూషణ్ కుమార్ పేర్కొనడం గమనార్హం.

అభ్యర్థికో బ్యాలెట్ బాక్సు...!



84 శాతం మంది నిరక్షరాస్యులే. దాంతో ఓటేయాల్సిన అభ్యర్థిని వారు గుర్తించడమెలా అన్నది పెద్ద సమస్యగా నిలిచింది. ఒక్కో అభ్యర్థికీ ఒక్కో రంగు బ్యాలెట్ బాక్సు కేటాయించడం ద్వారా దీన్ని అధిగమించారు. ఆ రంగు పైనే సదరు అభ్యర్థి పేరు, గుర్తు ముద్రించారు. ప్రచార సమయంలో ప్రతి అభ్యర్థీ తన బ్యాలెట్ బాక్సు రంగు ఫలానా అంటూ ప్రముఖంగా ప్రస్తావించేవాడు!

ఎన్నికలు.. విశేషాలు

- 1993లో మొదటిసారి ఓటర్ ఐడీని ప్రవేశపెట్టారు.
- ఈవీఎం మెషిన్లపై అభ్యర్థుల ఫొటోలను 2015 బిహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి మొదలు పెట్టారు.
- నోటా (నన్ ఆఫ్ ద ఎబోవ్/పైన ఎవరూ కాదు) ఆప్షన్‌ను తొలిసారి 2013లో నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నుంచి (ఛత్తీస్‌గఢ్, మిజోరాం, రాజస్తాన్, మధ్యప్రదేశ్) అమల్లోకి తీసుకొచ్చారు. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పీయూసీఎల్) దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా నోటా అమలుకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఎవరికీ ఓటు వేయడం ఇష్టం లేకపోతే నోటాను ఎంపిక చేసుకోవచ్చు.
- దేశ తొలి మహిళా చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఎస్. రమాదేవి 1990 నవంబర్ 26 నుంచి 1990 డిసెంబర్ 11 వరకు పనిచేశారు.
- ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం దేశంలో 7 జాతీయ పార్టీలు, 27 రాష్ట్ర పార్టీలు, 2,301 నమోదు చేసుకున్న గుర్తింపు లేని పార్టీలు ఉన్నాయి.
- 31,83,325 ఓటర్లతో దేశంలోనే అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గంగా మాల్కాజ్‌గిరి ఉంది. 46,909 మంది ఓటర్లతో లక్షద్వీప్ అతి చిన్న లోక్‌సభ స్థానంగా ఉంది.
- విస్తీర్ణపరంగా 1,73,266 చదరపు కిలోమీటర్లతో లద్దాఖ్ అతిపెద్ద లోక్‌సభ స్థానం. 10 కి.మీ. విస్తీర్ణంతో చాందినీ చౌక్ అతి చిన్న నియోజకవర్గంగా ఉంది.
- లోక్‌సభకు యూపీ అత్యధికంగా 80 మంది ఎంపీలను పంపుతోంది. అంతేగాక దేశానికి ఎనిమిది మంది ప్రధానులను కూడా అందించింది.
- 2009లో బిహార్‌లోని హాజీపూర్ లోక్‌సభ స్థానం నుంచి జేడీ (యూ)కు చెందిన రాంసుందర్ దాస్ 88 ఏళ్ల వయసులో గెలిచారు. లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గిన అతి పెద్ద వయస్కునిగా రికార్డు సృష్టించారు.
- 2014లో లోక్‌సభ సభ్యునిగా నెగ్గిన అతి పిన్న వయస్కునిగా (26 ఏళ్లు) దుష్యంత్ చౌతాలా రికార్డులకెక్కారు. హరియాణాలోని హిసార్ నుంచి ఆయన ఎంపీగా గెలిచారు.